సాక్షి

సత్యమేవ జయతే


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 193

మంగళవారం 3-10-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'




ఆసియా క్రీడల్లో అదే జోరు

కొనసాగుతున్న భారత్ పతకాల వేట.. 3 రజతాలు, 4కాంస్యాలు - 14లో



భారత్‌లో క్రోమ్‌బుక్‌ల తయారీ

హెచ్‌పీతో కలిసి భారత్‌లో క్రోమ్‌బుక్స్ ఉత్పత్తిని ప్రారంభించిన గూగుల్ - 15లో



63 శాతం ఓబీసీలు, ఈబీసీలే

బిహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం కుల గణన వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలో 63% ఓబీసీ, ఈబీసీలే ఉన్నట్లు తేల్చింది.

వివరాలు 6లో ▸



ఢిల్లీలో ఐసిస్ ఉగ్రవాది అరెస్ట్

మోస్ట్ వాంటెడ్ ఐసిస్ ఉగ్రవాది మొహమ్మద్ షానవాజ్‌ను ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు. మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.


వివరాలు 6లో ▸



గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుని..

గూగుల్ మ్యాప్‌ను అనుసరిస్తూ డ్రైవర్ కారు నడుపుతుండగా వాహనం అకస్మాత్తుగా నదిలోకి దూసుకెళ్లి ఇద్దరు మరణించారు.

వివరాలు 6లో ▸



విపక్షాలకు విజన్ లేదు

దేశాభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలకు ఒక విజన్ లేదని.. రాజస్తాన్‌లో కాంగ్రెస్ ఓటమి ఖాయమని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸

తోడు దొంగల 'రింగ్'!

ఇన్నర్ రింగు రోడ్డులో నారా - నారాయణ దోపిడీ

అలైన్‌మెంట్ ఖరారులో అక్రమాలు



- తమ భూముల ధరలు పెరిగేలా ప్లానింగ్.. ఇతర లే అవుట్లకు మాత్రం అనుమతుల తిరస్కరణ
- కేంద్ర ప్రభుత్వ సంస్థ భవనానికీ 'నో'
- విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణానికీ మోకాలడ్డు
- బైపాస్ నిర్మిస్తే తమ రింగు రోడ్డు భూములకు విలువ తగ్గుతుందనే..
- సిట్ దర్యాప్తులో బట్టబయలైన చంద్రబాబు, నారాయణ కుట్రలు

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో అమరావతి భూదోపిడీ పర్వంలో కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణంలో కొత్త కోణాలు వెలుగులోకి వస్తున్నాయి. అసలు ఇన్నర్ రింగ్ రోడ్డే లేదు..! మాకేం తెలియదంటూ చంద్రబాబు, నారాయణ, లోకేశ్ బృందం ఎంత బుకాయిస్తున్నా అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ గురించి తమకు ముందుగా ఏమాత్రం తెలియదన్న వారి వాదనలో నిజం లేదని తేలిపోయింది. రైతులు, ఇతరుల ప్రయోజనాలను దెబ్బ తీయడంతోపాటు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టును కూడా అటకెక్కించినట్లు బహిర్గతమైంది.

తమ భూముల ధరలు భారీగా పెరిగేలా..

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలకు పాల్పడటం ద్వారా భారీ లబ్ధికి మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి పి.నారాయణ పక్కా ప్రణాళిక రచించారు. హెరిటేజ్ ఫుడ్స్, లింగమనేని కుటుంబం, తమ బినామీల భూములను ఆనుకుని ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మించేలా అలైన్‌మెంట్‌లో మూడు సార్లు మార్పులు చేసి మరీ ఖరారు చేశారు. అనంతరం ఎస్టీయూపీ అనే కన్సల్టెన్సీని నియమించి తాము ముందస్తుగానే ఖరారు చేసిన

మిగతా 11వ పేజీలో ▶


నారాయణకు సీఐడీ నోటీసులు

నారా లోకేశ్‌తో పాటు 4వ తేదీన విచారణకు హాజరుకావాలన్న సీఐడీ 11 లో

'ఫ్యాన్' ప్రభంజనం!

- ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 25 ఎంపీ సీట్లలోనూ వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయం
- 51.10 శాతం ఓట్లను సాధించనున్న వైఎస్సార్‌సీపీ
- టీడీపీ ఒక్క లోక్‌సభ స్థానంలోనూ నెగ్గ లేదు.. 36.4 శాతం ఓట్లకే పరిమితం
- జనసేనకు దక్కేది 10.1 శాతం ఓట్లే
- చంద్రబాబు అరెస్టు అనంతరం 'టైమ్స్ నౌ' తాజా సర్వేలో వెల్లడి

2 లో



సర్వే ప్రకారం ఏపీలో వివిధ పార్టీలు గెలిచే స్థానాలు

కేంద్రంలో మళ్లీ ఎన్డీయే

6లో

మాజీ మంత్రి బండారు అరెస్టు..

- సీఎం జగన్‌ను, మంత్రి రోజాను దారుణంగా దూషించినందుకు బండారుపై కేసు.. రాయలేని భాషలో అసభ్య వ్యాఖ్యలు.. నోటీసులు ఇచ్చి అరెస్టు చేయడానికి వచ్చిన గుంటూరు పోలీసులు
- ఇంటి లోపల గడియ పెట్టుకున్న బండారు
- ఆరోగ్యం బాగోలేదంటూ కొంతసేపు డ్రామా
- ఇంటి వద్ద పోలీసులను అడ్డుకునేందుకు టీడీపీ యత్నం
- పరామర్శల పేరుతో టీడీపీ నేతల హడావుడి
- సోమవారం రాత్రి అరెస్టు.. గుంటూరుకు తరలింపు

10లో

బండ బూతుల 'బండారు'



టీడీపీ నేత బండారును అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

ఫ్యాక్ట్ చెక్



గాంధీ జయంతి రోజూ

నిజాలకు పాతరేనా!?

- ఉమ్మడి 13 జిల్లాల్లో 24,000 కి.మీ 24ఎఫ్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు.. అందులో నిరుపయోగంగా ఉన్న 524 కి.మీ మేర తొలగింపు
- సబ్‌స్క్రైబర్స్ లేకపోవడంతో కేబుల్ చోరీ కాకుండా ముందస్తు చర్యలు
- విలువైన 24ఎఫ్ కేబుల్స్‌ను భద్రపర్చడం కూడా తప్పేనా రామోజీ?
- మీటరు రూ.8 చొప్పున రూ.11.86 లక్షలు నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెల్లింపు
- నిజానికి.. ఫైబర్‌నెట్ కుంభకోణం నుంచి బాబు ముఠాను కాపాడేందుకు రామోజీ నానాపాట్లు.. వైర్లు పీకేశారు.. గుండెలు బాదుకుంటున్నారు అంటూ గగ్గోలు

10 లో

అవన్నీ మీ 'బాబు'

బ్రాండ్లే

- మీ మైండ్‌సెట్‌లోనే 'నాణ్యత' లోపించింది రామోజీ.. మద్యం నాణ్యతపై దుష్ప్రచారమా?
- రాష్ట్రంలో మద్యం డిస్టిలరీలకు అనుమతిచ్చిందే చంద్రబాబు
- టీడీపీ నేతల చేతుల్లోనే మద్యం డిస్టిలరీలు.. పైగా, మద్యం డాన్ కూడా మీ బాబే రామోజీ
- కొత్తగా ఒక్క అనుమతి కూడా ఇవ్వని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- టీడీపీ హయాంలో యథేచ్ఛగా సాగిన మద్యం సిండికేట్ దోపిడీ
- నిజానికి.. మద్యం మాఫియా ఆట కట్టించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే
- సమర్థంగా దశలవారీ మద్య నియంత్రణ విధానం అమలు

- వివరాలు 16లో

మళ్లీ పల్లకి మోతే!

జెండా కూలీలుగా మిగిలిపోతామంటూ జనసేన శ్రేణుల ఆవేదన

టీడీపీతో పవన్ పొత్తును అంగీకరించని పార్టీ నేతలు



- టీడీపీతో పొత్తుపై అధికారిక ప్రకటన తర్వాత పార్టీకి తగ్గిపోయిన ప్రజా స్పందన
- పవన్ అవనిగడ్డ సభకు భారీగా తగ్గిపోయిన కార్యకర్తల హాజరు
- 15 సీట్లతో ఏం సాధిస్తామని, పవన్ సీఎం ఎలా అవుతారని తీవ్ర అసంతృప్తి.. బాబు అధికారంలో ఉండగా కాపు ఉద్యమంపై ఉక్కుపాదం
- కాపు సామాజికవర్గ నేతలపై బాబు దమనకాండను మరవలేకపోతున్న ఆ వర్గం
- ఇప్పుడు అదే చంద్రబాబుతో పవన్ పొత్తును వ్యతిరేకిస్తున్న కాపు వర్గీయులు
- అవనిగడ్డ సభలో బీజేపీతో పొత్తుపై మాట మాట్లాడని పవన్ కళ్యాణ్
- టీడీపీతో పొత్తుపైనే జనసేన నేత మాట్లాడటంపై పార్టీలో చర్చ

3 లో

'వారాహిగళం' అట్టర్ ఫ్లాప్

- అవినీతి బాబుకు మద్దతు ఇచ్చిన పవన్‌ను కాపులతోపాటు జనం ఛీకొట్టారు
- ప్యాకేజీ తీసుకుని బాబు చెప్పులు మోయడానికీ పవన్ సిద్ధంగా ఉన్నారు

జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు

3 లో

గాంధీజీ సిఫార్సుతో అంబేడ్కర్‌కు పదవి



- ఇద్దరి మధ్య ఎన్నో అభిప్రాయ భేదాలు
- టీడీపీతో పొత్తుపై నాదీ అదే బాట
- జనసేన అధినేత పవన్‌కళ్యాణ్
- గ్రామ స్వరాజ్యాన్ని జగన్ సాధించడం లేదని పవన్ విమర్శ

3 లో

రాష్ట్రంలో 53 చోట్ల ఎన్‌ఐఏ సోదాలు



- పలు సంఘాల నేతల నివాసాల్లో తనిఖీలు
- మావోయిస్టులతో సంబంధాలపై ఆరా
- నాటు తుపాకీ, బుల్లెట్లు, రూ.13 లక్షల నగదు స్వాధీనం
- ఒకరి అరెస్టు, అదుపులోకి పలువురు..

16 లో



కాటలిన్ కరికో | డ్రూ వీజ్‌మన్

కోవిడ్ టీకా పరిశోధనలకు నోబెల్

కోవిడ్ నియంత్రణ కోసం ఎంఆర్ఎన్ఏ (మెసెంజర్ రైబోన్యూక్లియిక్ యాసిడ్) వ్యాక్సిన్ల అభివృద్ధికి తమ పరిశోధనల ద్వారా తోడ్పాటునందించిన ఇద్దరు శాస్త్రవేత్తలకు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది. హంగేరీకి చెందిన కాటలిన్ కరికో, అమెరికన్ డ్రూ వీజ్‌మన్‌కు ఈ ఏడాది వైద్యరంగంలో నోబెల్ ప్రైజ్‌ను కమిటీ ప్రకటించింది. విజేతలకు డిసెంబర్ 10న నోబెల్ బహుమతులు ప్రదానం చేస్తారు.

6 లో



మీరిక పర్మినెంటుగా జైల్లోనే ఉంటారని డిసైడ్ అయ్యాడు సార్!!

క్లుప్తంగా...

జ్యోతి యర్రాజీని అభినందించిన సీఎం జగన్

సాక్షి,అమరావతి: ఆసియా క్రీడల్లో మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో రజత పతకం సాధించిన జ్యోతి యర్రాజీని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అభినందించారు. ఈ విజయం ఏపీకి మరో అద్భుతమైన ఘట్టమని ప్రశంసించారు. జ్యోతి అంకిత భావం, కష్టం దేశాన్ని, రాష్ట్రాన్ని గర్వపడేలా చేశాయన్నారు. ఇదే తరహాలో తెలుగు జెండా రెపరెపలాడుతూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఎక్స్(ట్విటర్)లో పోస్టు చేశారు.

గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేశాం

- లాల్‌బహదూర్‌శాస్త్రి సేవలు చిరస్మరణీయం
- గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి సందర్భంగా సీఎం జగన్ నివాళి



సాక్షి, అమరావతి: జాతిపిత మహాత్మాగాంధీ, భారత మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రిల జయంతి సందర్భంగా వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నివాళులర్పించారు. సోమవారం తన నివాసంలో గాంధీజీ, లాల్‌బహదూర్‌శాస్త్రిల చిత్రపటాలకు సీఎం జగన్ పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం పాల్గొన్నారు. 'మహాత్మా గాంధీ మాటలను ఆదర్శంగా తీసుకొని రాష్ట్ర ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్నాం. గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేశాం. మునుముందు కూడా ఆయన చూపిన మార్గంలోనే నడుస్తాం. నేడు మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నివాళులు' అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు. అలాగే లాల్‌బహదూర్‌శాస్త్రికి నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి మరో ట్వీట్ చేశారు. 'స్వాతంత్ర్య సమరయోధుడిగా, మాజీ ప్రధానిగా లాల్ బహదూర్‌శాస్త్రి దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయం. 'జై జవాన్, జై కిసాన్' అంటూ ఆయన ఇచ్చిన పిలుపు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఆయన తీసుకున్న ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని శిఖరాగ్రాన నిలిపాయి' అని ముఖ్యమంత్రి జగన్ పేర్కొన్నారు.

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు అవార్డు



తమిళనాడు సీఎం స్టాలిన్ నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్ముగం రాజరాజన్

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అవార్డు అందజేశారు. చెన్నైలో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో చంద్రయాన్–3 ప్రయోగంలో పాలుపంచుకున్న ఇస్రో శాస్త్రవేత్తలందరినీ తమిళనాడు ప్రభుత్వం సత్కరించి అవార్డులను అందజేసింది. షార్‌లోని రెండో ప్రయోగవేదిక డైరెక్టర్ రాజరాజన్ ఆధ్వర్యంలో ఎల్‌వీఎం3 ఎం4 రాకెట్ ద్వారా చంద్రయాన్–3 మిషన్‌ను పంపించినందున ఆయనను సత్కరించి అవార్డు అందజేశారు.

7 కొండలపై 6 లక్షల విత్తనాలు



కొండలపై చల్లేందుకు సిద్ధంగా ఉంచిన విత్తన బంతులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): గ్రీన్ విశాఖ కోసం మహానగరంలోని కొండలపై హెలికాప్టర్ల ద్వారా విత్తనబంతులు చల్లుతున్నట్లు నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి చెప్పారు. ఈస్టర్న్ నేవల్ కమాండ్ (ఈఎన్‌సీ), గ్రీన్ క్లైమేట్ సంస్థ సహకారంతో జీవీఎంసీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని సోమవారం ఐఎన్ఎస్ డేగా వద్ద ఈఎన్‌సీ అధిపతి అడ్మిరల్ మనీష్‌శర్మ, డిప్యూటీ మేయర్ శ్రీధర్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణం బాగుంటే మానవాళి మనుగడతోపాటు పశుపక్ష్యాదులు బాగుంటాయని చెప్పారు. అందుకోసం సీఎం వైఎస్ జగన్ ఆదేశాలు, సూచనలతో జిల్లాలోని ఏడుకొండలపై 30 రకాల వృక్షజాతుల విత్తనాలు, 9 రకాల చిరుధాన్యాల విత్తనాలను వెదజల్లుతున్నట్లు తెలిపారు. రైతుల నుంచి సేకరించిన ఆరులక్షల విత్తనాలను బంతులుగా మార్చి నాలుగు హెలికాప్టర్ల ద్వారా విశాఖలోని పావురాల కొండ 1, 2, కాపులుప్పాడ, సింహాచలం, పోర్లుపాలెం కొండ, వేదుల్లనరవ కొండ, యారాడ కొండలపై చల్లుతున్నట్లు వివరించారు. అడ్మిరల్ మనీష్‌శర్మ,డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ శ్రీనివాసరావు, హార్టికల్చర్ డీడీ దామోదర్, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

90 శాతానికిపైగా పింఛన్ల పంపిణీ

- గాంధీజయంతి రోజున రాష్ట్రవ్యాప్తంగా కొనసాగిన కార్యక్రమం
- రెండురోజుల్లో 59.53 లక్షలమంది చేతికి రూ.1,640.42 కోట్లు

సాక్షి, అమరావతి: గాంధీజయంతి కారణంగా సోమవారం సెలవు రోజైనా రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పింఛను డబ్బులు పంపిణీ చేశారు. అక్టోబరు ఒకటి, రెండు తేదీలు సెలవు రోజులైనా.. 90.49 శాతం మందికి పింఛన్ల పంపిణీ పూర్తయింది. సోమవారం సాయంత్రానికి 59,53,427 మంది అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, వివిధ రకాల చేతివృత్తిదారులతోపాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ.1,640.42 కోట్లను వలంటీర్లు పంపిణీ చేశారు. మిగిలిన లబ్ధిదారులకు వలంటీర్ల ఆధ్వర్యంలో మరో మూడురోజులు పింఛన్ల పంపిణీ కొనసాగుతుందని సెర్ప్ అధికారులు తెలిపారు. అక్టోబరు ఒకటి నుంచి 65,78,854 మందికి పింఛన్ల పంపిణీ కోసం ప్రభుత్వం రూ.1,813.60 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే.



విజయనగరం జిల్లా కొనుసువీధిలో సావిత్రికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ లావణ్య



ఒంగోలు విజయనగర్ కాలనీలో ఆర్.నాగలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దివ్య



ఏలూరులో జంగం మంగమ్మకు వృద్ధాప్య పింఛన్ అందిస్తున్న వలంటీర్ పి.ఉషారాణి



నంద్యాల జిల్లా ఆలమూరులో సుబ్బరాయుడుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ దేవలత



వైఎస్సార్ జిల్లా పుల్లూరులో నాగమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శివశంకర్



తిరుపతి జిల్లా కలవకొండకి చెందిన రమణయ్యకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ చంద్రకళ



అనంతపురం ఆసుపత్రిలో గోవిందమ్మకు పింఛన్ అందజేస్తున్న వార్డు వలంటీర్ రేవతి



నెల్లూరు ఆస్పత్రిలో ఉన్న మద్దూరు లక్ష్మమ్మకు వితంతు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ శ్రావణి

92 శాతం కౌలురైతులకు సీసీఆర్‌సీలు

ఈ ఆర్థిక సంవత్సరం 8.81 లక్షలమందికి సీసీఆర్‌సీల జారీ లక్ష్యం

- ఇప్పటికే 8.10 లక్షలమందికి అందిన కార్డులు
- వీటిపై ఇప్పటికి రూ.948.77 కోట్ల రుణాలు
- కౌలురైతులకు రుణాల మంజూరు ఇంకా పెరగాలి
- ఇందుకు బ్యాంకుల వారీగా లక్ష్యాలు
- జిల్లాల్లో బ్యాంకర్ల కమిటీ సమావేశాలు నిర్వహించండి
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం

సాక్షి, అమరావతి: కౌలురైతులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించేందుకు పంట సాగుదారుల హక్కుల కార్డు (సీసీఆర్‌సీ)ల జారీలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2022–23)లో ప్రభుత్వం 92 శాతం లక్ష్యాన్ని సాధించింది. కౌలురైతులకు సీసీఆర్‌సీలు ఇవ్వడంతోపాటు వారికి బ్యాంకుల నుంచి విరివిగా రుణాలు మంజూరు చేయించడంపై ప్రత్యేకదృష్టి సారించింది. భూ యజమానులకు, కౌలురైతులకు మధ్య అవగాహన ఒప్పందాలను కుదిర్చి భూ యజమానులకు నష్టం లేకుండా కౌలురైతులకు మేలుచేసే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టింది. ఇందులో భాగంగానే కౌలురైతులకు సీసీఆర్‌సీలు జారీచేసి వీలైనంతమందికి బ్యాంకుల ద్వారా రుణాలను మంజూరు చేయిస్తోంది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) డాక్టర్ కె.ఎస్. జవహర్‌రెడ్డి ప్రతి వారం కలెక్టర్లతో నిర్వహిస్తున్న వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షిస్తున్నారు. కౌలురైతులకు రుణాలు మంజూరు చేయించడంపై సీఎస్ ఇటీవల రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం ఏర్పాటు చేసి తగిన ఆదేశాలిచ్చారు. ఈ ఆర్థిక సంవత్సరం 8.81 లక్షలమంది కౌలురైతులకు సీసీఆర్‌సీలు ఇవ్వాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 8.10 లక్షలమందికి (92 శాతం) కార్డులు జారీచేశారు. 13 జిల్లాల్లో లక్ష్యానికి మించి ఈ కార్డులు జారీచేశారు. మిగిలిన జిల్లాల్లో కూడా లక్ష్యాలను సాధించాలని సీఎస్ అధికారులను ఆదేశించారు. బ్యాంకుల ద్వారా కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయించడంలో మరిన్ని చర్యలు తీసుకోవాలని ఇటీవల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సూచించారు. కౌలురైతులకు బ్యాంకుల నుంచి రుణాలు మంజూరు చేయించేందుకు వ్యవసాయశాఖ అధికారులు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్డులున్న వారికి రుణాలిచ్చేందుకు బ్యాంకర్ల కోసం లోన్ చార్జ్ క్రియేష్ మాడ్యూల్‌ను రూపొందించినట్లు తెలిపారు. అలాగే ఈ–క్రాప్‌తో కౌలురైతుల రుణ ఖాతాలను అనుసంధానించనున్నట్లు చెప్పారు. బ్యాంకులు ఈ ఏడాది ఇప్పటివరకు రూ.948.77 కోట్ల మేర కౌలురైతులకు రుణాలిచ్చాయని తెలిపారు. మరింతమంది కౌలురైతులకు రుణాలు మంజూరు చేయించడానికి అన్ని జిల్లాల్లో ప్రత్యేకంగా జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. బ్యాంకర్ల వారీగా లక్ష్యాలను నిర్దేశించి, బ్రాంచీల స్థాయిలో మంజూరుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భూ యజమానులకు ఎటువంటి హాని కలగకుండానే కౌలురైతులకు రుణాల మంజూరు కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టం తీసుకొచ్చిందని చెప్పారు. ఈ విషయంపై భూ యజమానులకు అవగాహన కల్పించి కౌలురైతులకు సహకరించేందుకు క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.



2023-24లో జిల్లాల వారీగా సీసీఆర్‌సీల జారీ లక్ష్యం, ఇప్పటివరకు ఇచ్చిన కార్డుల వివరాలు

జిల్లా	ఇవ్వాలనుకున్న కార్డులు	ఇచ్చిన కార్డులు
కర్నూలు	13,739	18,291
ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు	22,950	30,382
బాపట్ల	68,455	88,466
అనంతపురం	6,170	6,763
చిత్తూరు	2,676	2,923
తూర్పుగోదావరి	88,075	95,641
అన్నమయ్య	3,875	4,080
పశ్చిమగోదావరి	84,185	88,557
ఏలూరు	56,433	58,792
వైఎస్సార్	7,035	7,327
నంద్యాల	21,465	22,289
తిరుపతి	7,199	7,449
కాకినాడ	53,999	55,414
ప్రకాశం	35,118	34,502
పల్నాడు	56,613	50,966
ఎన్టీఆర్	55,888	45,418
అంబేద్కర్ కోనసీమ	77,770	62,548
కృష్ణా	83,348	57,164
గుంటూరు	54,057	36,105
శ్రీ సత్యసాయి	1,863	1,152
పార్వతీపురం మన్యం	16,972	9,709
విజయనగరం	24,528	12,604
అనకాపల్లి	9,173	4,309
శ్రీకాకుళం	16,540	7,661
విశాఖపట్నం	2,244	718
అల్లూరి	11,084	314
మొత్తం	8,81,454	8,09,544

మరింత సులభంగా ఆదాయ ధ్రువీకరణ పత్రాలు

- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు రెవెన్యూ శాఖే సర్టిఫికెట్లు జారీ చేస్తుంది
- సంక్షేమ పథకాలకు ప్రత్యేకంగా ధ్రువీకరణ అవసరం లేదు
- గ్రామ సచివాలయాల్లో 6 దశల ధ్రువీకరణ సరిపోతుంది.. స్కాలర్‌షిప్‌లకూ ఇదే
- ఉత్తర్వులు జారీ చేసిన రెవెన్యూ శాఖ

సాక్షి, అమరావతి: ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీని రాష్ట్ర ప్రభుత్వం మరింత సులభతరం చేసింది. విద్యా సంస్థల్లోకి ప్రవేశాలు, స్కాలర్‌షిప్‌లు, ప్రభుత్వ ఉద్యోగాల కోసం రాసే పరీక్షల్లో ఫీజు మినహాయింపు, సంక్షేమ పథకాల కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి కావడంతో వాటన్నింటికీ గ్రామ, వార్డు సచివాలయాల్లో చేసే ఆరు దశల ధృవీకరణ సరిపోతుందని స్పష్టం చేసింది. ఈమేరకు తాజాగా రెవెన్యూ శాఖ జీవో జారీ చేసింది. పేద కుటుంబాల ఆదాయన్ని బియ్యం కార్డు ద్వారా నిర్ధారించవచ్చని, ఆ కార్డును చూపించినప్పుడు ప్రభుత్వ సంస్థలు ఆదాయ ధృవీకరణ పత్రాలు అడగకూడదని గతంలోనే ప్రభుత్వం స్పష్టం చేసింది. అయినా పలు శాఖలు ప్రత్యేకంగా వీటిని అడుగుతున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆరు దశల ధ్రువీకరణ అమలవుతున్న నేపథ్యంలో దరఖాస్తుదారులు మళ్లీ ప్రత్యేకంగా సర్టిఫికెట్ సమర్పించాల్సిన అవసరం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ సమస్య పరిష్కారానికి రెవెన్యూ శాఖ అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో వచ్చిన అభిప్రాయాల మేరకు తాజా ఆదేశాలు జారీ చేసింది.

ఆదాయ ధృవీకరణ పత్రాలు లేని పదో తరగతి, ఇంటర్ విద్యార్థులందరికీ రెవెన్యూ శాఖ వాటిని ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లకు సంబంధిత శాఖలు ఇకపై ఆదాయ ధ్రువీకరణ పత్రాలు అడగకూడదు. గ్రామ, వార్డు సచివాలయాలు జారీ చేసే ధృవీకరణ పత్రం వీటికి సరిపోతుంది. ఆ శాఖలు సచివాలయాల ద్వారా ధ్రువీకరణ పత్రాలను తెప్పించుకుని పని పూర్తి చేయాలి. ఇందుకోసం మూడు రోజుల సమయాన్ని నిర్దేశించారు. పోస్ట్ మెట్రిక్యులేషన్ స్కాలర్‌షిప్‌లకు కూడా ఆరు దశల ధ్రువీకరణ పత్రాన్నే తీసుకుంటారని తెలిపింది. ఆరు దశల ధ్రువీకరణ ప్రక్రియను రియల్ టైమ్‌లో పూర్తి చేయడానికి గ్రామ, వార్డు సచివాలయాల శాఖ సాఫ్ట్‌వేర్‌ను ఆయా సంక్షేమ పథకాలు, సిటిజన్ సర్వీసుల సాఫ్ట్‌వేర్లతో అనుసంధానం చేసుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు.

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఈడబ్ల్యూఎస్ సర్టిఫికేషన్, ఇతర కేంద్ర ప్రభుత్వ సంబంధిత వినియోగం, జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం వంటి నిర్దిష్ట కేసులకు మాత్రం ఆదాయ ధృవీకరణ పత్రాలను జారీకి ప్రస్తుత విధానం కొనసాగుతుంది. ఏ అవసరం కోసం ఆదాయ ధ్రువీకరణ పత్రం కోరుతున్నారో, అందుకోసం మాత్రమే పత్రాలను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ జారీ చేస్తుంది.

ఆరు దశల ధ్రువీకరణ ఇలా..

ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయడానికి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా ఆరు దశల్లో దరఖాస్తుదారు ఆర్థిక స్థితిని అంచనా వేస్తారు. ఆధార్ కార్డు, ఇతర వివరాల ద్వారా ఆ వ్యక్తికి ఉన్న భూమి, మున్సిపల్ ఆస్తి, 4 చక్రాల వాహనం ఉందా? ప్రభుత్వ ఉద్యోగమా? ఆదాయపు పన్ను వివరాలు, వారు వినియోగించే విద్యుత్ యూనిట్లను పరిశీలిస్తారు. వీటి ద్వారా వారి ఆర్థిక స్థితిని నిర్ధారిస్తారు.

'ఫ్యాన్' ప్రభంజనం!

- ఇప్పటి కిప్పుడు ఎన్నికలు జరిగితే 25 ఎంపీ సీట్లలోనూ వైఎస్సార్‌సీపీ ఘనవిజయం ఖాయం
- 51.10 శాతం ఓట్లను సాధించనున్న వైఎస్సార్ సీపీ
- టీడీపీ ఒక్క లోక్‌సభ స్థానంలోనూ నెగ్గలేదు.. 36.4 శాతం ఓట్లకే పరిమితం
- జనసేనకు దక్కేది 10.1 శాతం ఓట్లే
- బీజేపీకి 1.30 శాతం, ఇతర పక్షాలకు 1.10 శాతం ఓట్లు
- చంద్రబాబు అరెస్టు అనంతరం 'టైమ్స్ నౌ' తాజా సర్వేలో వెల్లడి
- సర్వే ఫలితాలను సోమవారం ప్రసారం చేసిన ఛానల్.. ప్రత్యేకంగా చర్చ
- అవినీతి కేసులోనే చంద్రబాబు జైలుకు వెళ్లారని ప్రజలు విశ్వసిస్తున్నారన్న ప్రముఖ జర్నలిస్ట్ అశుతోష్
- అందువల్లే ప్రజల్లో ఆయన పట్ల సానుభూతి లేదని విశ్లేషణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో తాజాగా మారిన రాజకీయ పరిస్థితులు, కొత్త సమీకరణాల నేపథ్యంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించడం ఖాయమని ప్రముఖ జాతీయ మీడియా సంస్థ 'టైమ్స్ నౌ' తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 51.10 శాతం ఓట్లను సాధించి 25కిగానూ 25 లోక్‌సభ స్థానాలనూ దక్కించుకోవడం ద్వారా వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేస్తుందని తేల్చింది. ఫ్యాన్ తుపాన్‌లో టీడీపీ, జనసేన, ఎన్డీయే, ఇతర పక్షాలు గల్లంతు కావడం ఖాయమని స్పష్టం చేసింది. అవినీతి కేసులో మాజీ సీఎం చంద్రబాబు అరెస్టై జైలులో ఉన్న నేపథ్యంలో టీడీపీ 36.40 శాతం ఓట్లకే పరిమితం అవుతుందని తేల్చింది. ప్రజల్లో సానుభూతి పొందేందుకు చంద్రబాబు చేసిన యత్నాలు ఫలించలేదని, టీడీపీ ఒక్క లోక్‌సభ స్థానంలోనూ విజయం సాధించే అవకాశం లేదని.. ఒక ఎంపీ స్థానంలో మాత్రమే ఒకింత ఉనికి చాటుకునే అవకాశం ఉందని పేర్కొంది. ఇక పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని జనసేన 10.1 శాతం ఓట్లతో సరిపెట్టుకుంటుందని, ఒక్క లోక్‌సభ స్థానంలో కూడా కనీసం పోటీని ఇవ్వలేదని సర్వే వెల్లడించింది. రాష్ట్రంలో బీజేపీ 1.30 శాతం ఓట్లకు పరిమితం కాగా సీపీఐ, సీపీఎం సహా వామపక్షాలు 1.10 శాతం ఓట్లకు పరిమితం అవుతాయని పేర్కొంది.

అధికార పార్టీకి మరింత పెరిగిన ఆదరణ

దేశంలో అన్ని రాష్ట్రాలతోపాటు ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల అభిప్రాయంపై టైమ్స్ నౌ సంస్థ తాజాగా విస్తృతంగా సర్వే చేసింది. సర్వేకు సంబంధించిన ఫలితాలను సోమవారం రాత్రి టైమ్స్ నౌ చానల్ ప్రసారం చేసింది. విశ్లేషకులతో చర్చ నిర్వహించింది. ఆంధ్రప్రదేశ్‌లో 2019 ఎన్నికల్లో 22 లోక్‌సభ స్థానాల్లో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే 24–25 ఎంపీ స్థానాల్లో విజయభేరీ మోగిస్తుందని సర్వేలో వెల్లడైందని వ్యాఖ్యాత పద్మజాజోషి వెల్లడించారు. గత 52 నెలలుగా సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమాభివృద్ధి పథకాలు, సుపరిపాలనతో వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ మరింత పెరిగిందని విశ్లేషించారు. అందుకే అధికార పార్టీ 22 లోక్‌సభ స్థానాల నుంచి 25 ఎంపీ సీట్లలో క్లీన్ స్వీప్ చేసి తిరుగులేని విజయం సాధించే స్థాయికి చేరుకుందని తెలిపారు.

విశ్వసనీయతకు పట్టం..

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేసే స్థాయికి దారితీసిన పరిస్థితులపై టైమ్స్ నౌ ఛానల్ చర్చ నిర్వహించింది. సర్వే ఫలితాలు ఆంధ్రప్రదేశ్‌లో తాజా రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టాయని చర్చలో పాల్గొన్న విశ్లేషకులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు పేర్కొన్నారు. గత ఎన్నికలతో పోల్చితే ఇప్పుడు వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా అవతరించడానికి ప్రధాన కారణమేంటని చర్చలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరిని వ్యాఖ్యాత పద్మజా జోషి ప్రశ్నించారు. ఎన్నికల హామీల్లో 99.5 శాతం హామీలను సీఎం వైఎస్ జగన్ అమలు చేశారని అబ్బయ్య చౌదరి గుర్తు చేశారు. సీఎం జగన్ ఏదైనా చెప్పారంటే చేస్తారనేది ప్రజల్లో బలంగా నాటుకుపోయిందన్నారు. వికేంద్రీకరణ ద్వారా సుపరిపాలన.. అవినీతికి తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాల ఫలాలను లబ్ధిదారులకు అందిస్తుండటం.. విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో సంస్కరణల ద్వారా అభివృద్ధిలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడాన్ని ప్రజలు చూస్తున్నారన్నారు. దీన్ని చంద్రబాబు పాలనతో పోల్చుకుంటున్న ప్రజలు సీఎం జగన్‌తోనే రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధ్యమని బలంగా నమ్ముతున్నారని, అందుకే 25కుగానూ 25 లోక్‌సభ స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందన్నది సర్వే ద్వారా తేలిందన్నారు.

టైమ్స్ నౌ సర్వే ఫలితాలు: పార్టీ	గెలిచే లోక్‌సభ స్థానాలు
వైఎస్సార్‌సీపీ	24-25
టీడీపీ	0-1
జనసేన	0
బీజేపీ	0
ఇతరపక్షాలు	0

ఫలించని సానుభూతి డ్రామా

స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో మాజీ సీఎం చంద్రబాబును జైలుకు పంపడం వల్ల ఆయనపై ప్రజల్లో సానుభూతి ఏమైనా కనిపిస్తోందా? అని చర్చలో పాల్గొన్న ప్రముఖ జర్నలిస్ట్, కాలమిస్ట్ అశుతోష్‌ను వ్యాఖ్యాత పద్మజా జోషి ప్రశ్నించారు. దీనిపై అశుతోష్ స్పందిస్తూ.. అవినీతి కేసులో రిమాండ్‌పై జైలులో ఉన్న చంద్రబాబు పట్ల ప్రజల్లో ఏమాత్రం సానుభూతి కనిపించడం లేదని తెలిపారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు భారీ ఎత్తున అవినీతికి పాల్పడటం వల్లే ఇప్పుడు ప్రజల్లో ఆయన పట్ల సానుకూల అభిప్రాయం లేదని విశ్లేషించారు. రాజకీయంగా కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే చంద్రబాబును అక్రమ కేసులో జైలుకు పంపారని నారా లోకేష్‌తోపాటు టీడీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని ప్రజలు విశ్వసించడం లేదని స్పష్టం చేశారు. చంద్రబాబులో ఇప్పటికైనా మార్పు రావాలని, ఆయన వైఖరిపై పునరాలోచించుకోవాలని సూచించారు.

2019 కంటే మిన్నగా..

2019 సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం ఓట్లు సాధించి 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాల్లో విజయకేతనం ఎగురవేయడం ద్వారా వైఎస్సార్‌సీపీ రికార్డు సృష్టించింది. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే మేనిఫెస్టోలోని 95 శాతం హామీలను అమలు చేయడం ద్వారా సీఎం జగన్ దేశం దృష్టిని ఆకర్షించారు. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథాన అగ్రభాగాన నిలబెట్టారు. అర్హతే ప్రామాణికంగా, ఎలాంటి వివక్ష, లంచాలకు తావు లేకుండా సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తున్నారు. గత 52 నెలల్లో సంక్షేమ పథకాల కింద డీబీటీ ద్వారా పేదల ఖాతాల్లో రూ.2.36 లక్షల కోట్లను జమ చేశారు. వ్యవసాయ, విద్య, వైద్య రంగాలలో విప్లవాత్మక సంస్కరణలను తెచ్చారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి ప్రజల ఇంటి గుమ్మం వద్దకే ప్రభుత్వ సేవలను అందిస్తూ సుపరిపాలన అందిస్తున్నారు. దీంతో సీఎం వైఎస్ జగన్‌కు ప్రజల్లో ఆదరణ నానాటికీ పెరుగుతోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాలు సాధించడమే అందుకు తార్కాణం. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే 2019 ఎన్నికల కంటే మిన్నగా అంటే 51.10 శాతం ఓట్లతో 24 నుంచి 25 లోక్‌సభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమని టైమ్స్ నౌ తాజాగా నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 'వైనాట్ 175..?' అని ముఖ్యమంత్రి జగన్ పదే పదే చెబుతున్న అంశాలకు ఈ సర్వే ఫలితాలు దగ్గరగా ఉండటం గమనార్హం.

బంజరు భూముల్లో సాగుకు కృషి

- అమూల్ ద్వారా సేంద్రియ వ్యవసాయోత్పత్తుల కొనుగోలు
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి



ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న సీఎస్

మడకశిర: రాష్ట్రంలోని బంజరు భూములను సాగులోకి తీసుకురావడానికి కృషిచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం శ్రీ సత్యసాయి జిల్లాలోని రొళ్ల, మడకశిర మండలాల్లో పర్యటించారు. వజ్రహట్టి, నీలకంఠాపురం, గోవిందాపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో రైతులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. మడకశిరలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో ప్రకృతి వ్యవసాయ విధానంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. అనంతరం మాట్లాడుతూ బంజరు భూములను సాగులోకి తీసుకురావడం ద్వారా రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. బంజరు భూముల్లో సేంద్రియ పద్ధతుల ద్వారా పంటలు సాగుచేసే విధంగా రైతు సాధికారిక సంస్థ ద్వారా అవగాహన కల్పిస్తామని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుఖర్చు తగ్గుతుందని, అధిక దిగుబడి సాధించడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 500 ఎకరాల బంజరు భూమిని సాగులోకి తీసుకొచ్చామన్నారు. ఇందులో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగుచేయడంతో వర్షాభావ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడి పొందడానికి అవకాశం ఏర్పడిందని చెప్పారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన పంటలకు ప్రభుత్వపరంగా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని ఈ మేరకు అమూల్ సంస్థతో ఎంఓయూ చేసుకోనున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గజదొంగ దీక్ష చేయడమేంటి?

చంద్రబాబుపై మంత్రి మేరుగు ఫైర్



సాక్షి, అమరావతి: అనేక కుంభకోణాల్లో జనం సొమ్మును నొక్కేసి అడ్డంగా దొరికిపోయిన గజదొంగ చంద్రబాబు జైలులో గాంధీ జయంతి సందర్భంగా దీక్ష చేయడమేంటి? అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున మండిపడ్డారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ మాజీ సీఎం చంద్రబాబు దీక్ష, ఆయనకు మద్దతుగా కుటుంబ సభ్యులు చేస్తున్న దీక్షతో మహాత్మా గాంధీ ఆత్మ క్షోభిస్తుందన్నారు. ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి 1995లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు... 1996 లోక్‌సభ ఎన్నికల నుంచి ఓట్ల కొనుగోలుకు డబ్బులు వెదజల్లి రాజకీయాలను అవినీతిమయం చేశారని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చేందుకు వేలాది కోట్లను వెదజల్లడం.. అధికారంలోకి వచ్చాక కుంభకోణాలతో వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని కొల్లగొట్టడాన్ని చంద్రబాబు అలవాటుగా మార్చుకున్నారని మండిపడ్డారు.

ఒక రోజు దీక్ష చేసిన లోకేశ్

చట్టాలు కాపాడతాయని వ్యాఖ్య

సాక్షి, న్యూఢిల్లీ: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఢిల్లీలో ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ నివాసంలో ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సోమవారం ఒక రోజు దీక్ష చేశారు. సంబంధం లేని అంశాల్లో తనపై కేసులు పెట్టారని, చట్టాలే తమను కాపాడతాయని ఈ సందర్భంగా లోకేశ్ అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఫైబర్ గ్రిడ్‌కు తన శాఖలకు సంబంధం లేదన్నారు. లోకేశ్, బ్రాహ్మణి, భువనేశ్వరిని జైలుకు పంపిస్తామని వైఎస్సార్‌సీపీ వారు మాట్లాడటం కక్ష సాధింపేనన్నారు. చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ పెద్ద ఎత్తున పోరాటం కొనసాగిస్తామని, తగ్గేదేలేదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేరు మార్చి పిచ్చి జగన్ అని పెట్టామన్నారు. చంద్రబాబు పిటిషన్‌పై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరుగుతుందని, కోర్టు నిర్ణయాలను అనుసరించి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని లోకేశ్ చెప్పారు.

తప్పుడు కేసులతో చంద్రబాబు అరెస్ట్

టీడీపీ నేత అచ్చెన్నాయుడు

మంగళగిరి: టీడీపీ అధినేత చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి అరెస్ట్ చేశారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు, నాయకులు వర్ల రామయ్య, కొమ్మారెడ్డి పట్టాభి విమర్శించారు. మంగళగిరిలోని పాతబస్టాండ్ సెంటర్‌లో సోమవారం 'సత్యమేవ జయతే' పేరిట నిర్వహించిన దీక్షలో వారు పాల్గొన్నారు. తొలుత గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని చంద్రబాబును అక్రమంగా నిర్బంధించడం దుర్మార్గమన్నారు. పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులను సంతృప్తి పరచడానికి అదుపు తప్పుతున్నారన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే వారికి తప్పక శిక్ష ఉంటుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నియోజకవర్గంలోని కొండలు, చెరువులను తవ్వి గ్రావెల్‌ను దోచుకుంటున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులు పోతినేని శ్రీనివాసరావు, ఆకుల జయసత్య పాల్గొన్నారు.

కాపు ఎమ్మెల్యేలే టార్గెట్‌గా పవన్ సభలు

కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు



సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీలోని కాపులు తనని టార్గెట్ చేస్తున్నారని ఆరోపిస్తున్న పవన్‌కళ్యాణ్.. కాపు ఎమ్మెల్యేలను టార్గెట్ చేస్తూ వారు గెలిచిన నియోజకవర్గాల్లోనే ఎందుకు తిరుగుతున్నారని ఆంధ్రప్రదేశ్ కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి ప్రశ్నించారు. ఆయన సోమవారం తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కాపులు రాజకీయంగా ఎదగకూడదని చంద్రబాబు పన్నిన కుట్రలో పవన్ పావుగా మారారన్నారు. బాబు డైరెక్షన్‌లోనే కాపులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో సభలు పెడుతున్నారని మండిపడ్డారు. పొత్తు తర్వాత తొలిసారిగా టీడీపీ, జనసేన రెండు పార్టీలు సర్వశక్తులూ ఒడ్డి అవనిగడ్డలో పెట్టిన సభ జనం లేక అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. రాష్ట్రంలో అన్ని కులాలు, మతాలను చంద్రబాబు ఇబ్బంది పెట్టారని, ఇప్పుడు బాబు అరెస్టుతో ప్రజలు సంతోషిస్తున్నారని చెప్పారు.

పవన్‌కు పేదల చీత్కారం తప్పదు: మారేష్

సాక్షి, అమరావతి: పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని కూలుస్తానంటూ అహంకార పూరితంగా మాట్లాడుతున్న జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ తప్పకుండా పేదల చీత్కారానికి గురవుతారని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ మండిపడ్డారు. పలు కుల సంఘాల నాయకులతో సోమవారం విజయవాడలో నిర్వహించిన సమావేశంలో మారేష్ మాట్లాడుతూ పవన్ కళ్యాణ్‌కు సామాజిక స్పృహ ఉంటే సీఎం వైఎస్ జగన్‌కు మద్దతు పలకాలన్నారు. ఎందుకంటే రాష్ట్రంలో సామాజికన్యాయం అనేది ఒక నినాదంలా కాకుండా... ఒక విధానంలా సీఎం జగన్ అమలు చేస్తున్నారని చెప్పారు.

మళ్లీ పల్లకి మోతే..!



సాక్షి, అమరావతి: జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడాన్ని జనసైనికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఏవో కొన్ని సీట్లకు కక్కుర్తిపడటం, కాపులను వేధించి, అవినీతిలో కూరుకుపోయిన టీడీపీతో పొత్తు పెట్టుకోవడం తలవంపుల పని అని వారు భావిస్తున్నారు. ఎవరైనా పార్టీ అధినేత ముఖ్యమంత్రి కావాలనుకుంటారని, కానీ జనసేనకు తెలుగుదేశం పార్టీ విదిలించే పదిహేను సీట్లతో ఏమి సాధించగలమని జనసైనికులు అసంతృప్తితో ఉన్నట్లు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఒకవేళ పవన్ కోరుతున్నట్లుగా 25 సీట్లు ఇచ్చినా, పవన్ సీఎం ఎట్లా అవుతారని నేతలు ప్రశ్నిస్తున్నారు. ఈ కారణాలతోనే ఆదివారం కృష్ణా జిల్లా అవనిగడ్డలో జరిగిన పవన్ వారాహి బహిరంగ సభకు జనసేన కార్యకర్తలు అతి తక్కువగా హాజరయ్యారని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. చంద్రబాబుతో పొత్తును అధికశాతం జన సైనికులు వ్యతిరేకిస్తారని, పార్టీకి తీరని నష్టమని జనసేన పార్టీలోని ఓ వర్గం మొదటి నుంచీ చెబుతోంది. ఇప్పుడు అదే నిజమైందని అంటున్నారు. టీడీపీతో పొత్తు ప్రకటన తర్వాత తొలిసారిగా పవన్ వారాహి సభ అవనిగడ్డలో జరిగింది. ఈ వారాహి యాత్రలో తెలుగుదేశం పార్టీ శ్రేణులందరూ పాల్గొనాలంటూ బాలకృష్ణ, ఇతర టీడీపీ నేతలు పిలుపునిచ్చినప్పటికీ ఉపయోగం లేకుండాపోయింది. గత మూడు విడతల వారాహి యాత్రలకంటే చాలా తక్కువగా అవనిగడ్డలో జనసేన పార్టీ అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారని, వారి అసంతృప్తిని ఇది తేటతెల్లం చేస్తోందని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

ఇది కచ్చితంగా ప్యాకేజీనే అంటున్న పార్టీ నేతలు

రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న చంద్రబాబును కలిసి బయటకు వచ్చిన అనంతరం పవన్ టీడీపీతో పొత్తు పెట్టుకుంటున్నట్లు ప్రకటన చేశారు. ఈ ప్రకటన పట్ల అప్పట్లోనే జనసేన పార్టీలో అంతర్గతంగా పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమైంది. జనసేనకు తెలుగుదేశం పార్టీ 15 సీట్లు ఇస్తామని చెప్పినట్లుగా పార్టీలో చర్చ జరిగింది. అయితే, పవన్ అడుగుతున్నదే 25 సీట్లు అని, వాటికీ టీడీపీ అంగీకరించడంలేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. ఏ పార్టీ అయినా అధికారంలోకి వచ్చి, ఆ పార్టీ నేత ముఖ్యమంత్రి కావాలంటే మెజారిటీ సీట్లను గెల్చుకోవాలి. 175 అసెంబ్లీ స్థానాలున్న ఏపీలో పవన్ సీఎం కావాలంటే కనీసం 88 సీట్లలో విజయం సాధించాలి. కానీ టీడీపీ విదిలించే 15 సీట్లతో జనసేనకేమిటి లాభమన్న చర్చ ఆ పార్టీలో జోరుగా సాగుతోంది. ఈ విషయం పార్టీ పెద్దలకు కూడా తెలిసినప్పటికీ, టీడీపీతో పొత్తుకు అంగీకరించారంటే ఇది కచ్చితంగా ప్యాకేజీయేనని ఆ పార్టీ నేతలే విమర్శిస్తున్నారు. దీంతో కార్యకర్తల్లోనూ పార్టీ పట్ల, నాయకుని పట్ల నిరాసక్తత ఏర్పడింది.

కాపు ఉద్యమంపై చంద్రబాబు ఉక్కుపాదమూ కారణమే?

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉండగా కాపు రిజర్వేషన్ల ఉద్యమంపై ఉక్కుపాదం మోపింది. కాపు సామాజిక వర్గం నేతలు, వారి కుటుంబాల పట్ల అమానుషంగా వ్యవహరించింది. కాపు రిజర్వేషన్ల ఉద్యమం అంశంలో పవన్ తగిన స్థాయిలో స్పందించకపోయినా, సొంత సామాజికవర్గం నాయకుడిగా వారు జనసేనకు మద్దతిచ్చారు. అయితే, కాపు రిజర్వేషన్ల ఉద్యమాన్ని చంద్రబాబు సర్కారు అణచివేయడం, ఉద్యమంలో పాల్గొన్న తమ వర్గం నేతలను అవమానించిన తీరును వారు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. వీటన్నింటినీ పట్టించుకోకుండా.. ఇప్పుడు అవినీతి కేసులో జైల్లో ఉన్న చంద్రబాబుకు పవన్ మద్దతు తెలపడాన్ని వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఇటీవలి కాలంలో చంద్రబాబుకు, టీడీపీకి మద్దతుగా పవన్ ప్రకటనలు చేసిన ప్రతిసారీ ఆ సామాజికవర్గంలోనే పలువురు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు. అవనిగడ్డలో పవన్ సభ విఫలమవడానికి ఇదీ ఒక కారణమని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

బీజేపీతో పొత్తుకు మంగళమేనా?

అవనిగడ్డ సభలో పవన్ కేవలం తెలుగుదేశం పార్టీ పొత్తు అంశాన్ని మాత్రమే ప్రస్తావించారు. గత మూడున్నరేళ్లుగా బీజేపీతో ఉన్న పొత్తుపై ఒక్క మాటా మాట్లాడపోవడం జనసేనలోనే పెద్ద చర్చకు దారితీసింది. బీజేపీతో పొత్తుకు పవన్ మంగళం పాడినట్లేనని ఆ పార్టీ నేతలు అంటున్నారు. గత నెల 14న రాజమండ్రి సెంట్రల్ జైలులో చంద్రబాబును కలిసి బయటకు వచ్చాక అప్పటికప్పుడే టీడీపీతో పొత్తుపై పవన్ ప్రకటన చేశారు. బీజేపీ కలిసి వచ్చినా, రాకపోయినా టీడీపీ, జనసేన పొత్తు మాత్రం కొనసాగుతుందని ప్రకటించారు. ఆ తర్వాత మంగళగిరిలో జరిగిన పార్టీ సమావేశంలో బీజేపీతో జనసేన పొత్తు కొనసాగుతుందని, టీడీపీతో పొత్తు ప్రకటన ఎందుకు చేయాల్సి వచ్చిందో కూడా ఢిల్లీ వెళ్లి బీజేపీ జాతీయ పెద్దలకు వివరిస్తానని చెప్పారు. అయితే, ఇప్పటికీ పవన్ ఢిల్లీ వెళ్లలేదు. బీజేపీ జాతీయ పెద్దలను కలవలేదు. ఇప్పుడు అవనిగడ్డ సభలో బీజేపీ ప్రస్తావన లేకుండా టీడీపీ పొత్తుపైనే పవన్ మాట్లాడడం ద్వారా పార్టీ శ్రేణులకు స్పష్టమైన సంకేతాలు ఇచ్చినట్టు జనసేనలో చర్చ సాగుతోంది.

త్వరలో రెండు, మూడు ముక్కలుగా టీడీపీ

వైఎస్సార్‌సీపీ కో–ఆర్డినేటర్, ఎంపీ విజయసాయిరెడ్డి



సాక్షి, అమరావతి: టీడీపీ త్వరలోనే రెండు, మూడు ముక్కలుగా చీలిపోవచ్చంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, పార్టీ కో–ఆర్డినేటర్, ఎంపీ వి.విజయసాయిరెడ్డి సోమవారం చేసిన ఒక ప్రకటన రాజకీయవర్గాల్లో, ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. 'అధినాయకుడు అవినీతి కేసులో జైలుపాలైనా పార్టీ శ్రేణులు పెద్దగా పట్టించుకోకపోవడమే టీడీపీ దయనీయస్థితికి అద్దం పడుతోంది. త్వరలోనే ఆ పార్టీ రెండు, మూడు ముక్కలుగా చీలిపోవచ్చు. 40 ఏళ్లుగా ఆ పార్టీకి మద్దతిస్తున్న బలమైన వ్యాపారవర్గంలో పునరాలోచన మొదలైంది. ఆయన దోపిడీలను తామెందుకు సమర్థించాలన్న ఆలోచనలో వారు ఉన్నారు..' అని విజయసాయిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'రెండెకరాల ఆసామి.. హెరిటేజ్ ఎలా స్థాపించారో ప్రజలందరికీ తెలుసు. ఇప్పుడు మా కంపెనీలో రెండు శాతం షేర్లు అమ్మితే రూ.400 కోట్లు వస్తాయి.. అవినీతికి పాల్పడే ఖర్మ మాకేమిటి? అని చెబితే నమ్మేదెవరు? చంద్రబాబు మానిప్యులేటివ్ స్కిల్స్, తన మనుషులను వ్యవస్థల్లోకి జొరబెట్టింది ప్రజాసేవ కోసమే అంటారు' అంటూ సెటైర్లు వేశారు.

'వారాహిగళం' అట్టర్ ఫ్లాప్

- అవనిగడ్డలో వారాహి సభ విఫలం కావడమే ఇందుకు నిదర్శనం
- అవినీతి బాబుకు మద్దతు ఇచ్చిన పవన్‌ను కాపులతోపాటు జనం ఛీకొట్టారు
- సైకిల్ సైనికులుగా జనసేన కార్యకర్తలు మారొద్దు
- ఈసారి ప్రజలు వేసే వ్యాక్సిన్‌తో టీడీపీ–జనసేన మాయం ఖాయం
- మంత్రి అంబటి రాంబాబు



సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన పొత్తు ఘోరంగా విఫలమైందని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. పవన్ కళ్యాణ్ తాజాగా అవనిగడ్డలో నిర్వహించిన సభే ఇందుకు నిదర్శమన్నారు. అత్యంత అవినీతిపరుడైన చంద్రబాబుకు మద్దతు ఇచ్చిన పవన్‌ను కాపులతోపాటు ప్రజలు ఛీకొట్టారని చెప్పారు. బాబు తర్వాత రాజకీయాల్లో అత్యంత అనైతిక వ్యక్తి పవనేనని దుయ్యబట్టారు. చంద్రబాబుతో ప్యాకేజీ కుదిరింది కాబట్టే టీడీపీకి పవన్ మద్దతు ప్రకటించారని ఆరోపించారు. చంద్రబాబుకు మద్దతు ఇవ్వడం ద్వారా రాజకీయంగా ఆయన గంగలో దూకబోతున్నారని తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మంత్రి అంబటి మీడియాతో మాట్లాడారు. కాపులను తనకు అనుకూలంగా మార్చుకోవడానికి నక్కజిత్తుల చంద్రబాబు సూచనల మేరకు ఆ సామాజిక వర్గం ఎక్కువ ఉన్నచోట పవన్ సభలు నిర్వహిస్తున్నారని ధ్వజమెత్తారు. అవనిగడ్డ నియోజకవర్గంలో రెండు లక్షలకుపైగా ఓటర్లు ఉంటే.. అందులో 70 వేల మంది కాపులేనన్నారు. అక్కడ పవన్ సభ నిర్వహిస్తే అద్భుతమైన ఆదరణ వస్తుందనేది చంద్రబాబు ఆలోచనేనన్నారు. ఈ సభకు టీడీపీ శ్రేణులు తరలివెళ్లాలని లోకేశ్, అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారని గుర్తు చేశారు. అయినా టీడీపీ–జనసేన రెండూ కలిసి నిర్వహించిన సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ నిర్వహిస్తామని ప్రకటించినా జనం రాలేదని చెప్పారు. నాగబాబు తదితర నేతలు టీడీపీ నేతలకు ఫోన్లు చేసి జనాలను పంపాలని కోరడంతో సాయంత్రం 6 గంటలకు కొంత మంది వచ్చారని తెలిపారు. సభ అట్టర్ ఫ్లాప్ కావడంతో పవన్‌లో భయాందోళన మొదలైందన్నారు. అవినీతిపరుడైన చంద్రబాబుతో పవన్ కలిసిపోతున్నాడని కాపులతోపాటు అన్ని వర్గాల ప్రజలు అనుకున్నారు కాబట్టే.. వారిద్దరినీ జనం ఛీకొట్టారని తేల్చిచెప్పారు. ఇంకా మంత్రి అంబటి ఏమన్నారంటే..

వ్యక్తిగత జీవితంలోనూ అత్యంత అనైతిక వ్యక్తి

బీజేపీతో పొత్తులో ఉన్నానంటూనే టీడీపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించిన పవన్‌కు సిగ్గుందా.. నైతికత ఉందా? రాజకీయ జీవితంలోనే కాకుండా వ్యక్తిగత జీవితంలోనూ అత్యంత అనైతిక వ్యక్తి.. పవన్. రాజకీయాలకు ఏమాత్రం పనికిరాని ఆయనను జనసేన కార్యకర్తలు నమ్మి సైకిల్ సైనికులుగా మారొద్దు. లోకేశ్ తన అమ్మను తిట్టాడని విమర్శించిన పవన్.. ప్యాకేజీ తీసుకోకపోతే చంద్రబాబుకు ఎందుకు మద్దతు ఇస్తున్నారు? చంద్రబాబు దగ్గర డబ్బులు తీసుకుని.. చివరికి ఆయన చెప్పులు మోయడానికి కూడా సిద్ధంగా ఉన్నారు. వారాహి వ్యాన్‌కి కొట్టించే ఆయిల్ కూడా బాబు అవినీతి డబ్బులే. చంద్రబాబు అవినీతి, అక్రమాలతో భూస్థాపితమవుతున్న టీడీపీని బతికించాలన్న తాపత్రయం తప్ప పవన్‌లో మరేమీ కనిపించడం లేదు.

ఎక్కడ పోటీ చేసినా మళ్లీ ఓటమే..

గత ఎన్నికల్లో ప్రజలు వేసిన వ్యాక్సిన్‌కు పవన్ పోటీ చేసిన రెండు చోట్లా ఓడిపోయారు. టీడీపీ 23 సీట్లకే పరిమితమైంది. ఇప్పుడు టీడీపీ, జనసేన కలిసి మ్యుటేషన్ అయి కొత్త వైరస్‌లా తయారై వస్తోంది.. అయితే అది బలహీనమైన వైరస్. ఈసారి ప్రజలు వేసే వ్యాక్సిన్‌కు పవన్, చంద్రబాబు ఎక్కడ పోటీ చేసినా ఓటమి ఖాయం. వైఎస్సార్‌సీపీని 175 స్థానాల్లో ప్రజలు గెలిపించడం పక్కా. టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తే.. ఈసారి తప్పు జరగనీయనను అని పవన్ చెప్పడం హాస్యాస్పదం. 2014లో టీడీపీ అధికారంలో ఉన్నా ప్రభుత్వ తప్పులను పవన్ ప్రశ్నించలేదు. ఈసారి తప్పులు చేస్తే ఊరుకోబోనని అడుక్కునే దశకు దిగజారిపోవటానికి పవన్‌కు సిగ్గనిపించడం లేదా? అనేక దుర్మార్గాలు చేసి, దేశ రాజకీయాలను విషపూరితం చేసిన చంద్రబాబు.. గాంధీ జయంతి రోజు జైలులో నిరాహార దీక్ష చేస్తుంటే ఆ మహాత్ముడి ఆత్మ క్షోభిస్తోంది.

గాంధీజీ సిఫార్సుతో అంబేడ్కర్‌కు పదవి

- ఇద్దరి మధ్య ఎన్నో అభిప్రాయభేదాలు: పవన్‌కళ్యాణ్
- టీడీపీతో పొత్తుపై నాదీ అదే బాట
- 1920 నుంచి జగన్‌ను అబ్జర్వ్ చేశానంటూ జనసేనాని వ్యాఖ్యలు

మచిలీపట్నంటౌన్/చిలకలపూడి: జనసేన నేత పవన్ కళ్యాణ్ టీడీపీతో పొత్తును మరోసారి సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఇందుకు ఏకంగా జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ పేర్లను వాడుకోవటం చర్చనీయాంశమైంది. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను జనసేన ఆధ్వర్యంలో సోమవారం ఉదయం మచిలీపట్నంలోని సువర్ణ కళ్యాణ మండపంలో నిర్వహించారు. సాయంత్రం జనసేన నాయకులు, కార్యకర్తలతో సమావేశం జరిగింది. పవన్‌తోపాటు పార్టీ నేత నాదెండ్ల మనోహర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ పుణెలో జరిగిన సమావేశంలో మహాత్మాగాంధీ, అంబేడ్కర్ మధ్య అనేక అభిప్రాయభేదాలు వ్యక్తమయ్యాయని పేర్కొన్నారు. అయినప్పటికీ దేశ ప్రయోజనాల కోసం మేధావి అయిన అంబేడ్కర్‌ను రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్‌గా నియమించాలని గాంధీజీ ప్రతిపాదించారన్నారు. దీంతో అంబేడ్కర్ రాజ్యాంగ నిర్మాతగా అవకాశం పొందారన్నారు. దేశ ప్రయోజనాల కోసం ఎవరితోనైనా కలిసేందుకు గాంధీజీ నిర్ణయం తీసుకోగా, ప్రజా సంక్షేమం కోసం టీడీపీతో తాను పొత్తు పెట్టుకున్నానంటూ సమర్థించుకున్నారు. సీఎం జగన్ గ్రామాలకు ఉన్న విశిష్ట అధికారాలను తీసేస్తున్నారని, గ్రామ స్వరాజ్యాన్ని సాధించడం లేదని, హింసా మార్గంలో పయనిస్తున్నారని ఆరోపించారు. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ఏర్పాటు చేసిన ఆంధ్ర జాతీయ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. దేశంలో ఎంతో మంది రాజకీయ నాయకులు అవినీతికి పాల్పడి ఆ సొమ్మును స్విస్ బ్యాంకుల్లో దాస్తున్నారని... ఆ సొమ్ము తిరిగి వస్తుందో రాదో చెప్పలేనన్నారు.

1920 నుంచి జగన్‌ను చూశా..

పార్టీని స్థాపించిన వెంటనే అధికారంలోకి రాదని పవన్ వ్యాఖ్యానించారు. అది ఎన్టీఆర్‌కే సాధ్యమైందన్నారు. నాలుగు ఎన్నికల్లో కష్టపడితే బీఎస్పీ అధికారంలోకి వచ్చిందన్నారు. కీలకమైన పదవులన్నీ ఒక కులంతో నింపేస్తే వ్యవస్థలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. కాపులు పెద్దన్న పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. మున్ముందు జనసేన భావజాలం దేశమంతా వ్యాపిస్తుందన్నారు. 'నా టీనేజ్‌లో 1920 సంవత్సరం నుంచి జగన్‌ను చూశా... నేను ఎవరినో ఆయనకు తెలియకపోయినా అబ్జర్వ్ చేశా..' అంటూ పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించటంతో సమావేశానికి హాజరైన జనసైనికులు తెల్లబోయి మొహాలు చూసుకోవడం గమనార్హం.

ప్రజల కోసమే దీక్ష

- నా తండ్రి సీఎం.. భర్త సీఎం
- అయినా ఏనాడూ అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు
- చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి




సాక్షి, రాజమహేంద్రవరం: 'నేను ఈ రోజు దీక్ష చేపట్టింది నా భర్త కోసం కాదు. మా కుటుంబ కోసం కాదు. ప్రజల కోసం. న్యాయం కోసం. నా తండ్రి సీఎం, నా భర్త ముఖ్యమంత్రి. అయినా ఎప్పుడూ అధికారాన్ని దుర్వినియోగం చేయలేదు' అని చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్ వద్ద భువనేశ్వరి సోమవారం ఒక రోజు నిరాహార దీక్ష చేశారు. తొలుత గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఉదయం 10 గంటలకు దీక్ష చేపట్టి సాయంత్రం 5.10 వరకూ కొనసాగించారు. భువనేశ్వరి మాట్లాడుతూ కుటుంబానికి కొంత సమయం కేటాయించాలని చంద్రబాబును కోరితే వినకుండా ఎప్పుడూ ప్రజల బాగు కోసం పరితపించేవారని, అలాంటి వ్యక్తిని జైల్లో పెట్టారని అన్నారు. ప్రజాధనంపై తమకు ఆశ లేదన్నారు. తమ కుటుంబంపై ఒక్క కేసు లేదని, ప్రస్తుతం నలుగురం నాలుగు దిక్కులయ్యామని అన్నారు. 14 ఏళ్లు సీఎంగా పని చేశారని చెప్పారు. ప్రజలు ఆలోచించి చంద్రబాబును గెలిపించాలని కోరారు. చంద్రబాబు అరెస్ట్ నేపథ్యంలో 105 మంది మృతి చెందారని, వారి కుటుంబాలను తానే స్వయంగా పలకరిస్తానని భువనేశ్వరి చెప్పారు. కాగా.. భువనేశ్వరి దీక్షకు స్పందన కరువైంది. అనుకున్న రీతిలో ప్రజలు హాజరు కాలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి కార్యకర్తలను తీసుకువచ్చారు.

ఒక్క పూట బాబు ఉపవాసం

స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసుతో అరెస్టయి రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో జ్యుడిషియల్ రిమాండ్‌లో ఉన్న చంద్రబాబు ఒక రోజు దీక్ష కాస్తా ఒక్క పూట ఉపవాసంగా మారింది. యథావిధిగా ఉదయం అల్పాహారం, సాయంత్రం భోజనం తీసుకున్న బాబు.. మధ్యాహ్నం భోజనం మాత్రమే మినహాయించారు. కేవలం దీనిని ఫాస్టింగ్(ఉపవాసం)గా పరిగణిస్తామని జైలు అధికారులు వెల్లడించారు. జైలులో దీక్ష చేసేందుకు నిబంధనలు అనుమతించవని చెప్పారు.

చంద్రబాబు, లోకేశ్ నాశనానికి భువనేశ్వరే కారణం

- తప్పు చేసిన భర్తను వెనకేసుకు రావడం సిగ్గుచేటు
- కన్న తండ్రిపై చెప్పులేసినప్పుడు కనీసం కన్నీరు కార్చలేదు
- ఏపీ ఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని



సాక్షి, అమరావతి: చంద్రబాబు, లోకేశ్ నాశనమవడానికి భువనేశ్వరే ప్రధాన కారణమని ఏపీ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీ ఎఫ్‌డీసీ) చైర్మన్ పోసాని కృష్ణ మురళి విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ తప్పు చేసిన భర్తను వెనకేసుకు రావడం సిగ్గు చేటన్నారు. కుల మీడియా డైరెక్షన్‌లో చేసే సెంటిమెంట్ డ్రామాలకు ప్రజలు పడిపోరన్నారు. 'చంద్రబాబును జైలుకు పంపించింది జడ్జి. సీఎం జగన్ కాదు. అవినీతి కేసులో సాక్ష్యాలతో సహా అడ్డంగా దొరికిపోయారు కాబట్టే జైలుకు వెళ్లారు. చట్టం, న్యాయాన్ని పక్కనపెట్టి అన్యాయంగా జైలుకు పంపించే ఆలోచన ఉంటే సీఎం జగన్ నాలుగేళ్ల ముందే ఆ పని చేసేవారు. మీ భర్తను చెడగొట్టారు కాబట్టి ఇప్పుడు సమర్థించుకోవాల్సిన దుస్థితి వచ్చింద'ని ఎద్దేవా చేశారు.

ఎన్టీఆర్‌పై చెప్పులేస్తే భువనేశ్వరిలో ఆనందం

భువనేశ్వరి తండ్రి సెంటిమెంట్‌ను అడ్డుపెట్టుకుని చంద్రబాబును టీడీపీలోకి పంపించారని పోసాని పేర్కొన్నారు. పార్టీ నాయకులు వద్దని వారించినా ఎన్టీఆర్ తన కూతురు కోసం చంద్రబాబును టీడీపీలో చేర్చుకున్నారని గుర్తుచేశారు. అనంతరం చంద్రబాబు కుట్ర చేసి ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచారని.. ఎన్టీఆర్ నుంచి కుర్చీ లాక్కోవడాన్ని దూరం నుంచి చూస్తూ భువనేశ్వరి ఎంజాయ్ చేశారని విమర్శించారు. తండ్రిపై చెప్పులేస్తే కన్నీరు కార్చని వ్యక్తి ఇప్పుడొచ్చి అవినీతి కేసులో జైలులో ఉన్న భర్త కోసం దొంగ దీక్షలు చేస్తున్నారని మండిపడ్డారు. భువనేశ్వరి అప్పుడే నిజాయితీగా వ్యవహరించి ఉంటే.. చంద్రబాబు చేసిన దారుణాన్ని నిలదీసేవారన్నారు. అంతకుముందు రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌ను వీడాల్సిన ఖర్మ మనకెందుకంటూ తన భర్తను నిలువరించేవారన్నారు. అప్పుడు తెరవెనుక వెన్నుపోటు డ్రామాను రక్తి కట్టించి.. ఇప్పుడు మోసాలు చేస్తూ సత్యమేవ జయతే అని నినాదాలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో పార్టీలో చేరిన జయప్రద వంటి ఎందరో మహిళా నాయకుల జీవితాలను చంద్రబాబు నాశనం చేసినప్పుడు, గతంలో ప్రతిపక్షానికి చెందిన 23 మంది ఎమ్మెల్యేలను లాగేసుకున్నప్పుడు భువనేశ్వరి ఎక్కడున్నారని నిలదీశారు.

భర్తలను మించిన రాజకీయం అత్తాకోడళ్లది

అత్తాకోడళ్లు భువనేశ్వరి, బ్రాహ్మణి తమ భర్తలను మించిన రాజకీయ నాయకురాళ్లని పోసాని విమర్శించారు. గతంలో చంద్రబాబు, లోకేశ్‌లను అవినీతిపరులంటూ పవన్ కళ్యాణ్ తమ భర్తలను తిట్టిన విషయాన్ని మర్చిపోయి అదే వేదిక సమీపంలో వచ్చే ఎన్నికలకు మద్దతు కోరడం సిగ్గు చేటన్నారు. చంద్రబాబు, లోకేశ్ పెద్ద మోసగాళ్లన్న సంగతి వారికి స్పష్టంగా తెలుసన్నారు. సినీ పరిశ్రమలో ఓ ప్రముఖ వ్యక్తి హెరిటేజ్ పెడితే.. అది ఇప్పుడు భువనేశ్వరి కబ్జాలో ఉందన్నారు. పవన్ కళ్యాణ్ ఆ అత్తాకోడళ్ల అమాయక ముఖాలు చూసి అభయాలు ఇవ్వొద్దని హితవు పలికారు. కాపులు పవన్‌ను నమ్ముకుని చంద్రబాబుకు ఓటు వేస్తే ఆ సామాజికవర్గం జీవితం చిన్నాభిన్నం అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఒక మనిషి వేటికి విలువ ఇస్తాడనేదాన్ని బట్టి
ఆ మనిషి విలువను అంచనా గట్టవచ్చు.
– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 3 అక్టోబర్ 2023

దిక్సూచి బిహార్!

గాంధీ మహాత్ముడి జయంతి రోజైన సోమవారం బిహార్ ప్రభుత్వం చరిత్ర సృష్టించింది. గత తొమ్మిది నెలల్లో రెండు దఫాలుగా నిర్వహించిన కులగణనలో వెల్లడైన గణాంకాలను ప్రజల ముందుంచింది. ఇందులో ఆర్థిక స్థితిగతుల సర్వే కూడా ఉంది. మొన్న జనవరిలోనూ, ఏప్రిల్‌లోనూ నిర్వహించిన ఈ కుల గణన మండల్ రాజకీయాలకు అంకురార్పణ పడిన బిహార్‌లోనే చోటు చేసుకోవటం గమనించదగ్గది. ఈ విషయంలో ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ చొరవను అభినందించాలి. నిజానికి రాజకీయ పక్షాలేవీ బాహాటంగా దీన్ని వ్యతిరేకించలేదు. 2021లో బిహార్ నుంచి వెళ్లి ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన అఖిలపక్ష బృందంలో ఆ రాష్ట్ర బీజేపీ నేతలు కూడా ఉన్నారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేయాలని ఆ ప్రతినిధి బృందం డిమాండు చేసింది. కానీ బీజేపీ కేంద్ర నాయకత్వం దీనిపై మౌనంగానే ఉంది. బిహార్ గణాంకాలు వెల్లడిస్తున్న అంశాలు ఈ సర్వే అవసరాన్ని నొక్కి చెబుతున్నాయి. సంక్షేమ పథకాల అమలు మొదలై దశాబ్దాలు గడుస్తున్నా ఈనాటికీ అనేక వెనకబడిన కులాలు అభివృద్ధికి ఎంతో దూరంలో ఉన్నాయని ఈ గణన రుజువు చేస్తోంది. ఎప్పుడో వలస పాలనలో దేశవ్యాప్తంగా 1931లో తొలిసారి కులగణన నిర్వహించగా తొమ్మిది దశాబ్దాల అనంతరం ఇన్నాళ్లకు నితీష్‌కుమార్ ఈ సాహసం చేశారు. 2011లో అప్పటి యూపీఏ ప్రభుత్వం సామాజిక ఆర్థిక కుల గణన పేరిట ఒక ప్రయత్నం చేయకపోలేదు. 130 కోట్లమంది ప్రజానీకం నుంచి వివరాలు కూడా సేకరించారు. కానీ దాని నిర్దుష్టతపై సందేహాలున్నాయంటూ నాటి పాలకులు ఆ గణాంకాలను అటకెక్కించారు. దీని వెనకున్న నిజానిజాలేమిటో ఎవరికీ తెలియదు.

విమర్శల మాటెలావున్నా, ఎదుర్కొన్న అవరోధాలు ఎలాంటివైనా బిహార్ గణాంకాలు వెల్లడిస్తున్న వాస్తవాలు మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. ఏ కులానికి ఆ కులం తమ జనాభా ఎక్కువని చెప్పుకోవటం ఎన్నికల సమయంలో రివాజే అయినా మొత్తంగా చూసుకుంటే దేశ జనాభాలో ఓబీసీల శాతం అత్యధికమన్నది అందరూ ఎప్పటినుంచో అంగీకరిస్తున్న సత్యం. బిహార్ గణాంకాలు ఆ సంగతినే ధ్రువీకరించాయి. అయితే అభివృద్ధి ఫలాలు ఈనాటికీ అందుకోలేని అశక్తతలో అనేక కులాలున్నాయని ఈ గణన వెల్లడిస్తోంది. ఇది ఆందోళన కలిగించే అంశం. బిహార్‌లోని 13.07 కోట్ల జనాభాలో ఇతర వెనకబడిన వర్గాల (ఓబీసీ) సంఖ్య మూడున్నర కోట్లు (27 శాతం) కాగా, అత్యంత వెనకబడిన వర్గాలు 4.70 కోట్లు (36 శాతం) అని నివేదిక వెల్లడిస్తోంది. అంటే మొత్తంగా వెనకబడిన వర్గాల జనాభా 63 శాతం! రాష్ట్ర జనాభాలో 2.6 కోట్లమంది (20 శాతం) ఎస్సీలు, 22 లక్షలమంది (1.6 శాతం) ఎస్టీలు. జనరల్ క్యాటగిరీలో ఉన్న ఆధిపత్య కులాలు 15.5 శాతం అని కుల గణన చెబుతోంది. జనాభాలో హిందువులు 81.99 శాతం కాగా, ముస్లింలు 17.7 శాతం, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, ఇతర మతాలవారూ ఒక శాతంలోపేనని నివేదిక తెలిపింది. దేశంలో ఆర్థిక సంస్కరణలు అమలు చేసిన పర్యవసానంగా దేశవ్యాప్తంగా కుల వృత్తులు తీవ్ర సంక్షోభంలో పడి నిరసనల వెల్లువెత్తాక అట్టడుగు వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాలు కొత్త విధానాలు రూపొందించాయి. కానీ ఈ మొత్తం వ్యవహారం చీకట్లో తడుములాటగానే ఉంటున్నదన్న విమర్శలు ఆనాటినుంచీ ఉన్నాయి. ఎందుకంటే సాధికారకమైన గణాంకాలు లేకపోవటంతో 1979లో కేంద్రంలోని అప్పటి జనతాపార్టీ ప్రభుత్వం నియమించిన మండల్ కమిషన్ నివేదిక అంచనాలనే అన్ని ప్రభుత్వాలూ అనుసరిస్తున్నాయి. ఓబీసీలు 52 శాతం ఉంటారని ఆ నివేదిక అంచనా వేసింది. అయితే ఈ శాతం మరింత ఎక్కువుండొచ్చని పలువురు సామాజిక శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతూ వచ్చారు. ఇప్పుడు బిహార్ గణాంకాలు ఆ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. బహుశా దేశవ్యాప్తంగా కుల గణన చేస్తే ఇదే రుజువయ్యే అవకాశం ఉంది.

కుల గణనకు పూనుకొని నితీష్ సర్కారు కొత్త ఆలోచనలు రేకెత్తించింది. దీనివల్ల ఆయన పార్టీకీ లేదా అక్కడి సామాజిక న్యాయ రాజకీయాలకూ వెనువెంటనే కలిగే ప్రయోజనం ఏమిటో చెప్పలేం. ఓబీసీల హక్కుల కోసం మాట్లాడే పార్టీలు ఎటూ కొత్త ఆలోచనలు చేయక తప్పదు. ఆ కులాల్లో సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా ఇన్ని వ్యత్యాసాలున్నాయని గ్రహించాక వాటికి తమ దగ్గరున్న పరిష్కారాలేమిటన్నది పార్టీలు తేల్చుకుంటాయి. వీటన్నిటికన్నా ప్రధానమైనదేమంటే... ఓబీసీ కులాల్లో కొన్ని మాత్రమే అభివృద్ధి ఫలాలు అందుకుంటున్నాయనీ, ఇప్పటికీ అందుకు దూరంగావుంటున్న కులాలు అనేకం ఉన్నాయనీ, వాటి జనాభాయే ఎక్కువనీ నివేదిక వెల్లడించిన వాస్తవం పాలనావ్యవస్థ కళ్లు తెరిపిస్తుంది. ఇప్పుడు అమలు చేస్తున్న విధానాల, పథకాల లోపాలను సరిదిద్ది, వాటిని పదునెక్కించటంతోపాటు కొత్తగా చేయాల్సిందేమిటన్న అంశంపై దృష్టి సారిస్తుంది. బహుశా రిజర్వేషన్ల శాతం 50 శాతం మించరాదన్న నిబంధనపై సైతం న్యాయస్థానాలు పునరాలోచన చేయవచ్చు. శతాబ్దాలుగా మన దేశంలో వేళ్లూనుకున్న నిచ్చెనమెట్ల కుల వ్యవస్థ వల్ల సామాజిక అభివృద్ధికి మెజారిటీ వర్గాలు దూరంగా ఉండిపోయాయని బ్రిటిష్ వలస పాలనలోనే గుర్తించారు. కానీ అట్టడుగు వర్గాల అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలు అరకొరగానే ఉంటూ వచ్చాయి. స్వాతంత్య్రం వచ్చి ఏడున్నర దశాబ్దాలు గడిచాక కూడా అత్యంత వెనకబడిన కులాలున్నాయంటే అది మన పాలనా వ్యవస్థ లోపాన్ని పట్టి చూపుతోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తదితర రాష్ట్రాలు సైతం కులగణనకు అనుకూలంగా ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వమే ఈ విషయంలో చొరవ తీసుకుని జనగణనతోపాటు కుల గణనకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తే అట్టడుగు వర్గాలవారిని ఉద్ధరించటానికి ఆ చర్య దోహదపడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు
భాద్రపద మాసం, **తిథి:** బ.చవితి ఉ.9.35 వరకు, తదుపరి పంచమి,
నక్షత్రం: కృత్తిక రా.10.24 వరకు, తదుపరి రోహిణి,
వర్జ్యం: ఉ.10.28 నుండి 12.03 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.05 వరకు, తదుపరి రా.10.36 నుండి 11.27 వరకు,
అమృతఘడియలు: రా.8.02 నుండి 9.34 వరకు.

సూర్యోదయం: 5.54
సూర్యాస్తమయం: 5.47
రాహుకాలం: ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం: ఉ.9.00 నుండి 10.30 వరకు

తాత్సారంలో ఆంతర్యమేమిటి?

అభిప్రాయం



డా. కత్తి పద్మారావు

చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నూతన పార్లమెంట్ భవనంలో అట్టహాసంగా తెచ్చిన తొలి బిల్లుకు తాజాగా రాష్ట్రపతి ఆమోదం తెలపడంతో చట్టరూపం దాల్చింది. 'నారీ శక్తి వందన్ యాక్ట్–2023'గా పిలుస్తున్న దీన్ని సెప్టెంబర్ 19న లోక్‌సభ, సెప్టెంబర్ 21న రాజ్యసభ ఆమోదించాయి. అయితే దీన్ని నియోజక వర్గాల పునర్విభజన తర్వాత, అంటే 2029 ఎన్నికల వరకు గానీ అమలుచేయకపోవడం గమనార్హం. కాబట్టి, ఈ రిజర్వేషన్లను జాప్యం చేయాలన్న ఉద్దేశం ఇందులో కనబడుతోంది. స్త్రీలు పార్లమెంట్‌లోకి వెళ్తే సమాజ భవితవ్యమే మారిపోతుంది. వీరు కుటుంబాన్ని తీర్చిదిద్దినట్లే సమాజాన్ని తీర్చిదిద్దగలరు. స్త్రీలనూ, బీసీలనూ, దళితులనూ నిర్లక్ష్యం చేసినంతకాలం ఆ పార్లమెంటుకు అర్థంలేదు.

నూతన పార్లమెంటు భవనంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టడం ఒక చారిత్రాత్మకమైన విషయంగా చెప్పవచ్చు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం తెచ్చింది. కేంద్ర కేబినెట్ ఆమోదించిన ఈ బిల్లును కొత్త పార్లమెంటు భవనాన్ని ప్రారంభించిన రోజున తొలి బిల్లుగా ప్రవేశపెట్టడం విశేషం. ఈ బిల్లు ప్రకారం రాజ్యసభ, పార్లమెంటు, అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం కోటాను అమలు చేస్తారు. 33 శాతంలో ఎస్సీ, ఎస్టీ మహిళలకు వారి రిజర్వేషన్ల కోటా ఆధారంగా కేటాయిస్తారు.

15 ఏళ్ల పాటు అమల్లో ఉండే ఈ రిజర్వేషన్లను వెంటనే కాకుండా నియో జకవర్గాల పునర్విభజన (డీ లిమిటేషన్) తర్వాత అమల్లోకి తేవాలని నిర్ణయించడం గమనార్హం. 2026లో డీలిమిటేషన్ చేపట్టాల్సి ఉంది. అది పూర్తయ్యి రిజర్వేషన్లు అమల్లోకి రావడానికి కొంత సమయం పట్టడం ఖాయం. అంటే 2024 ఎన్నికల నాటికి రిజర్వేషన్లు అమల్లోకి రావు. 2029 లోనే ఈ కోటా అమలయ్యే అవకాశముంది.

ఆశ్చర్యకరమైన బిల్లు

ఈ రిజర్వేషన్ల బిల్లు చాలాసార్లు సభల ముందుకు వచ్చింది. ప్రతిసారీ ఏకాభిప్రాయం కుదరక ఆమోదం పొందలేదు. దాదాపుగా 27 ఏళ్లుగా అది పెండింగ్‌లోనే ఉండిపోయింది. కనీసం 50 శాతం రాష్ట్రాలు ఈ బిల్లును ర్యాటిఫై చేయాల్సి ఉంటుంది. ఇకపోతే ఈ బిల్లులో చాలా లొసుగులు వున్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీ సీనియర్ నేత ఆతిషి మహిళా రిజర్వేషన్ బిల్లును 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మహిళలను మోసం చేసేందుకు తెచ్చిన బిల్లు అని ఆరోపించారు. నిజానికి ఈ బిల్లులో పితృస్వామిక ఆధిపత్యం ఉంది. దళిత బహుజన వివక్ష ఉంది. ముఖ్యంగా బీసీలను అధికారం లోనికి రాకుండా చేసే కుట్ర దాగి ఉంది. డీలిమిటేషన్ అయిన తర్వాత ఎప్పుడో 2029లో రిజర్వేషన్లు అమలు చేయబడతాయి అనడంలోనే వీటిని జాప్యం చేయాలనే ఆలోచన వుంది.

నిజానికి హిందుత్వవాదులు మనుస్మృతి అనుచరులు. మనుస్మృతిని క్రీ.పూ. రెండవ శతాబ్దంలో రాసివుంటారని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ పేర్కొన్నారు. బౌద్ధయుగం అంతరించి హిందూ రాజ్యాలు ఆవిర్భవించే క్రమములో పుష్యమిత్రులు ఈ మనుస్మృతిని బ్రాహ్మణ రాజ్య నిర్మాణానికి సాధనంగా వాడుకున్నారు. వర్ణవ్యవస్థ పునరుద్ధరణ, స్త్రీ అణచివేత యిందులో ప్రధానమైన అంశాలుగా ముందుకు వచ్చాయి. 'పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే రక్షంతి స్థావిరే పుత్రా న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి' అని చెబుతుంది మనుస్మృతి. బాల్యమున తండ్రి స్త్రీలను రక్షించును. యౌవనమున మగడు రక్షించును. ముసలితనమున పుత్రుడు రక్షించును. కావున స్త్రీ స్వతంత్రురాలిగా నుండటానికి వీల్లేదు. (భర్త, కుమారులు లేనప్పుడు బంధువులు రక్షింతురు). దీన్నిబట్టి మనకేమి అర్థమౌతుందంటే హిందూ పురుషుడు స్త్రీకి భయపడ్డాడు. ఈ భావజాలానికి ప్రతీకగా వున్న పార్టీ మహిళా బిల్లు ప్రవేశపెట్టిందంటే, నమ్మశక్యంగా లేదు.



రాజకీయాల్లోకి స్త్రీలను అసలు రాకుండా అడ్డుకోవడం జరుగుతూనే ఉంది. ఆయా పార్టీలు స్త్రీలకు సీట్లు ఇవ్వడమే తక్కువ. ఆ రాజకీయ ప్రాతినిధ్యం కూడా అగ్రకులాల స్త్రీలకే లభ్యం అయ్యింది. భారతదేశంలో ఇప్పుడు 5 శాతం కంటే తక్కువ స్త్రీలు పార్లమెంట్‌లో ఉన్నారు. జెకోస్లేవేకియా, సోవియట్ రష్యాల చట్టసభలలో 27 నుండి 28 శాతం వరకు స్త్రీలకు ప్రాతినిధ్యం ఉంది. పశ్చిమ యూరప్‌లో, యూఎస్ఏలో 3 నుండి 4 శాతం స్త్రీల ప్రాతినిధ్యం మాత్రమే చట్టసభలలో ఉంది. పార్టీలు 10 నుండి 15 శాతం సీట్లు కేటాయించినట్లు ప్రకటించినా, భారతదేశంలో స్త్రీలకు 7 శాతం కంటే సీట్లు మించలేదు. వారిలోనూ ఎన్నికైన స్త్రీల అభ్యర్థుల సంఖ్య ఇంకా తక్కువగా ఉంటోంది.

నామమాత్ర రిజర్వేషన్లు

పట్టణీకరణ ప్రభావం స్త్రీల రాజకీయ ప్రవేశానికి ఏ మాత్రం ఉపయోగపడటం లేదు. స్టేటస్ ఆఫ్ వుమెన్ కమిటీ 1977లో చేసిన సర్వే ప్రకారం, గ్రామీణ స్త్రీలే ఎక్కువ రాజకీయ చైతన్యంతో తమ ఓటు హక్కును వినియోగిస్తున్నారు. స్త్రీల రిజర్వేషన్‌కు సంబంధించిన విషయాలే ఇలా ఉంటే, ఇక స్త్రీలు ఓపెన్ కాంపిటీషన్‌లో సీట్లు గెలవడం కష్టంగా ఉంది. గ్రామ పంచాయితీల్లో పురుషుల ప్రాతినిధ్యం ఎక్కువ ఉండడం వలన ఎన్నికైన స్త్రీలు కూడా నామమాత్రంగానే తమ ప్రాతినిధ్య విలువను వ్యక్తీకరించగలుగుతున్నారు. మొత్తం రాజకీయ పెత్తనం అగ్రకులాల పురుషులదైనపుడు దళితులకు, స్త్రీలకు ఇస్తున్న రాజకీయ రిజర్వేషన్లు నామమాత్రం అవుతున్నాయి. దళిత స్త్రీలకు దాదాపు రాజకీయాధికారంలో భాగస్వామ్యం లేదు.

భారత ఉపఖండంలో ప్రజాస్వామ్య బద్ధంగా జరుగుతున్న ఎన్నికలు కూడా ఒక పెద్ద ఫార్సుగా తయారయ్యాయి. డబ్బు, మత్తు మందులు, హైటెక్ ప్రచారం, గూండాయిజం ఉన్నవాళ్ళకే పార్టీలు సీట్లు ఇస్తున్నాయి. ఎవరికైనా స్త్రీలకు సీట్లు ఇస్తే పితృస్వామ్యాన్ని పోషించగలిగిన స్త్రీలకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారు. ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా పెక్కు సంవత్సరాలు భారతదేశాన్ని పరిపా లించారు. ఆమె కాలంలో కాంగ్రెస్ పార్టీలో స్త్రీలకు ఎక్కువ ప్రాతినిధ్యం కల్పించడం కానీ, ఏ విధమైన స్త్రీల సంస్కరణలు కానీ జరగలేదు. కొందరు స్త్రీలు పురుష పెత్తందారితనాన్ని అనుకరించ డమే స్త్రీవాదం అనుకుంటారు.

దళితులు, స్త్రీలు రాజకీయ భాగస్వామ్యాన్ని పొందకపోవడంతో సమంగా నష్టపోతున్నారు. ఈ విషయాన్ని చెబుతూ డాక్టర్ మణి పి. కమేర్‌కర్ ఇలా అన్నారు: 'స్త్రీలను ఒక అల్ప సంఖ్యాక వర్గంగా లెక్కించి, దళితులను నిర్లక్ష్యం చేసినట్లే రాజకీయాల్లో స్త్రీలను కూడా నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వం తన ప్రచార సాధనాల ద్వారా స్త్రీలను వస్తువులు, అలంకారాలు, ఫ్యాషన్ల మోజులో పడేలా చేసి, సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాల పట్ల వారి చైతన్యాన్ని దిగజార్చడానికి ప్రయత్నాలు చేస్తోంది. పురుష సమాజం చేస్తున్న కుట్రలతో స్త్రీలలో కూడా రాజకీయేతర జీవనం ఎక్కువైంది. భారతదేశంలోనే కాదు అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా స్త్రీల రాజకీయ చైతన్యం చాలా తక్కువ స్థాయిలో ఉంది.'

నాయకత్వ స్థానంలోకి వచ్చినప్పుడే...

రాజకీయ చైతన్యానికి ముందు భారత ఉపఖండంలో స్త్రీలలో ఇంకా బలంగా, సామాజిక ఆర్థిక, సాంస్కృతిక పోరాటాలు జరగాలి. ఉద్యమాల నుండి వచ్చిన కార్యకర్తలు గ్రామస్థాయిలో రాజకీయ నాయకులుగా ఎదగాలి. సమాజ పునర్నిర్మాణానికి, పితృస్వామ్యానికి భిన్నంగా వారు కృషి చేయాలి. ఇతర దేశాలలో కూడా సమాజ ఉపరితలానికి సంబంధించిన స్త్రీలే నాయకత్వ స్థానాలలో ఉన్నారు. సమాజ పునాదిని నిర్మించిన దళిత స్త్రీలు రాజకీయ చైతన్యాన్ని, నాయకత్వాన్ని పొందగలిగినపుడే స్త్రీ స్వామ్యం సాధ్యమౌతుంది.

జనాభా నిష్పత్తిని బట్టి అందరికీ సమాన అవకాశాలు వచ్చినప్పుడే భారతదేశంలో నూత్న విప్లవం వస్తుందని అంబేడ్కర్ చెప్పారు. స్త్రీ ఒక ఉజ్వల శక్తి. వీరు పార్లమెట్‌లోకి వెళ్తే సమాజ భవితవ్యమే మారి పోతుంది. కుటుంబాన్ని తీర్చిదిద్దినట్లే సమాజాన్ని తీర్చిదిద్దగలరు. స్త్రీలను, బీసీలను, దళితులను నిర్లక్ష్యం చేసినంతకాలం ఆ పార్లమెంటుకు అర్థంలేదు. శ్రామిక శక్తులు, ఉత్పత్తి శక్తులు, దళిత బహుజన స్త్రీ నారీ మణులు, ఈ పార్లమెంట్‌ను అలంకరించే రోజు రావాలి.

వ్యాసకర్త దళితోద్యమనేత । 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సానుకూల కోణం



మన మానసిక శాంతిని కాపాడుకోవడానికి సహనం అవసరం. క్షమాగుణం లాగే సహనం కూడా మన రక్షణలో భాగం. శత్రువులు, తంటాలమారులు... సహనాన్నీ, క్షమనూ అలవర్చుకునే మన సాధనకు సాయపడతారు.

– దలై లామా, బౌద్ధగురువు

నమ్మడం కష్టం



గుడ్డిగా సామాజిక మాధ్యమాలను నమ్మే పని అయితే, లష్కర్–ఎ–తొయిబా తీవ్రవాద గ్రూపునకు చెందిన సగం మంది నాయకులను పాకిస్తాన్‌లో గత వారంలో చంపేశారు. వాస్తవాలను కల్పన నుంచి వేరు చేసుకోవాల్సి ఉంటుంది.

– ఆదిత్య రాజ్ కౌల్, జర్నలిస్ట్

ప్రపంచానికి ఆశాదీపం



మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా, ఆయన శాశ్వత వారసత్వం నన్ను కదిలించింది. సమానత్వం, న్యాయాలకు ఆయన అహింసా సందేశం ప్రపంచవ్యాప్తంగా ఒక ఆశాదీపం. మార్టిన్ లూథర్ కింగ్‌పై, అమెరికా పౌర హక్కుల ఉద్యమంపై గాంధీ చూపిన లోతైన ప్రభావం ఆయన ఆదర్శాల శక్తిని గుర్తు చేస్తోంది.

– ఎరిక్ గార్సెటీ, భారత్‌లో అమెరికా రాయబారి

ఏం మాట్లాడుతారు?



గత రెండేళ్లలో బెంగళూరుకు నేను ఎన్నోసార్లు వెళ్లొచ్చాను. ఆటోలో గానీ, కారులో గానీ పోయినంతసేపూ ఎవరితోనో ఫోన్లో మాట్లాడకుండా ఉండని డ్రైవర్ లేడు. గంటల తరబడి వాళ్లతో ఇలా మాట్లాడేవాళ్లు ఎవరన్నది ఆశ్చర్యం!

– లిజ్ మాథ్యూ, జర్నలిస్ట్

ఎలా సాధ్యం?



ఉన్నత విద్యాసంస్థల్లోని ఒక జూనియర్ గనక చెత్త పుస్తకం రాస్తే, తప్పక నిష్ఠురమైన సమీక్షకు అర్హుడే. కాకపోతే సమస్య ఎక్కడంటే, స్కాలర్లుగా మారిన సీనియర్లు, ప్రత్యేకించి కులీన సంస్థల్లో పనిచేసేవారు నిజంగా చెత్త పుస్తకం రాసినా మంచి సమీక్షలు వస్తాయి. ఈ సంగతి అందరికీ తెలుసు.

– మోహిక్ తెమ్‌కిన్, హిస్టారియన్

మళ్లీ నిలబెట్టాలి!



ఇండియాలోని ముఖ్యమైన సమస్యల్లో ఒకటి– ప్రభుత్వ పాఠశాల వ్యవస్థ ధ్వంసం కావడం. దీని ఫలితంగా, ప్రాథమిక విద్యా స్థాయిలో కూడా భారతీయులు తమ ఆదాయంలోని పెద్ద మొత్తాన్ని పిల్లల కోసం వెచ్చించాల్సి వస్తోంది. నిజానికి ఈ సొమ్మును పొదుపు చేసుకోగలిగి, వాళ్లు పై చదువులకు వాడుకోగలగాలి.

– శరణ్ షణ్ముగం, ఆంట్రప్రెన్యూర్

కొత్త పాఠం




విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా వారిని పగటి పూట విశ్రాంతి, కునుకు తీసుకునేలా చైనా పాఠశాలలు ప్రోత్సహిస్తున్నాయి. నాణ్యమైన నిద్ర కోసం టెంట్లు, నవరించుకోగలిగే డెస్కు కుర్చీల లాంటి సరికొత్త ఆలోచనలతో సుఖకరమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. దీనివల్ల పిల్లలు మరింత ఉత్సాహంగా ఉండగలుగుతున్నారు.

– ఎడిసన్ ఆడే, బిజినెస్ కన్సల్టెంట్

ఇది డిజిటలీకరణ తెచ్చిన విప్లవం

సందర్భం



వి.వి. రమణ

గ్లోబలైజేషన్... పాఠశాల విద్యార్థులందరికీ టెక్నాలజీని మరింత చేరువ చేసింది రాష్ట్ర ప్రభుత్వం. కోవిడ్ –19 సమయంలో వాట్సాప్ గ్రూపులు, ఆన్‌లైన్ తరగతులతో డిజిటల్ విద్యకు అంకు రార్పణ జరిగింది. ప్రస్తుతం తరగతి గదులలో స్మార్ట్ టీవీలూ, ట్యాబ్‌లనూ ఉపయోగించి విద్యా బోధన చేసే స్థాయికి మన పాఠశాలలు చేరుకొన్నాయి. అతి తక్కువ సమయంలో తర గతి గదిలో బ్లాక్ బోర్డులు, సుద్ద ముక్కలు, గ్రీన్ బోర్డు, వైట్ బోర్డులు ఉపయోగించే స్థాయి నుంచి టెక్నాలజీలను ఉపయోగించుకుంటూ ఆన్‌లైన్‌లో ఐఎఫ్‌పీలతో తరగతులను నిర్వహించుకునే స్థాయికి మన ప్రభుత్వ బడులు రావడం ముదావహం.

'జాతీయ నూతన విద్యా విధానం –2020' ప్రణాళిక సైతం అత్యున్నత నాణ్యత గల విద్య 'అందరికీ సమానంగా' అందుబాటులో ఉండేందుకు పలు విప్లవాత్మక సంస్కరణలు ఆవిష్కరించాలన్నది. దీనికి ముందే మన రాష్ట్రంలో విద్య డిజిటలైజేషన్‌కు బీజం పడింది. గతంలో మన ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ తరగతులు నిర్వహించడం ఉన్నప్పటికీ నామమాత్రంగా కొన్ని స్కూళ్లకే పరిమితమై ఉండేది. ఇప్పుడు అన్ని పాఠశాలలనూ ఆధునీకీకరించి అంతా డిజిటలైజ్ చేయడం శుభ పరిణామం.

డిజిటలైజేషన్‌లో భాగంగా మారుమూల ప్రాంతంలో ఉన్న చిన్న పాఠశాలలకు సైతం డిజిటల్ తరగతులను అందించేందుకు సుమారుగా 45 వేల పాఠశాలలకు ఫైబర్ నెట్ కనెక్షన్ అందించింది ప్రభుత్వం. ఫైబర్ కనెక్టివిటీ, ఇంటర్నెట్, ఉపగ్రహాల ద్వారా, డీటీహెచ్ విస్తరణ సహాయంతో మన విద్యారంగం నవ్యపథంలో పయనిస్తోంది.

కోవిడ్–19 మహమ్మారి సమయంలో విద్యార్థుల అభ్యసనం పూర్తిగా మరుగున పడుతున్న వేళ పట్టణ, గ్రామీణ విద్యార్థులకు



తేడాను గమనించగలిగాం. పట్టణవాసుల విద్యార్థుల చేతిలో సెల్ గాని, ట్యాబ్ గాని, ల్యాప్‌టాప్ గాని ఉండి అంతో ఇంతో వారు చదువులకు దగ్గరగా ఉన్నారు. ఆ సమయంలో పేద విద్యార్థులు, గ్రామీణ విద్యార్థుల విద్యార్జన పూర్తిగా పడకేసింది. ఈ స్థితిలో సుమారుగా 5.18 లక్షల ట్యాబ్స్‌ను ఉపాధ్యాయులకూ, విద్యార్థులకూ పంపిణీ చేసి ఆన్‌లైన్ విద్యను అందించి ఈ వర్గాల పిల్లల చదువును కాపాడింది రాష్ట్ర ప్రభుత్వం.

డిజిటల్ విద్యాబోధనలో దూసుకుపోతున్న మన ఏపీ విద్యా విధానం ప్రతి తరగతి గదిలో 'ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్' ఉండేందుకు కృషి చేస్తోంది. పాఠశాలల్లోని తరగతి గదుల్లో ఆన్‌లైన్ మాత్రమే కాకుండా ఆఫ్‌లైన్‌లో సైతం పనిచేసే విధంగా కంటెంట్ బోధించేందుకు అనుగుణంగా సుమారుగా 62 వేల ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేయబోతున్నారు. అలానే ప్రైమరీ పాఠశాలల్లో సుమారుగా 10 వేల స్మార్ట్ టీవీల ద్వారా బోధనకు ఉపక్రమిస్తున్నారు.

ప్రభావవంతమైన బోధన, అభ్యాసం కోసం ఉపాధ్యాయులకు శిక్షణ అత్యంత కీలకము. అందుకే దాదాపు 1.34 లక్షల మంది ఉపాధ్యాయులకు తరగతి గదిలో టెక్నాలజీని ఉపయోగించే విధానంపై శిక్షణ ఇచ్చారు. అంతే కాకుండా అన్ని తరగతులకు సంబంధించిన ఉపాధ్యాయులకు సైతం ఆన్‌లైన్ ద్వారానూ, దీక్ష యాప్ ద్వారానూ కొన్ని రకాల కంటెంట్‌కు సంబంధించిన ట్రైనింగ్ ఇస్తూనే ఉన్నారు.

మొత్తంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశపెట్టడం, విద్యావ్యవస్థను డిజిటలైజ్ చేయడం వంటి విప్లవాత్మక చర్యలు ఇప్పటికే అద్భుతమైన ఫలితాలు ఇవ్వడం ప్రారంభించాయి. మన ప్రభుత్వ పాఠశాలలో చదివిన పేద విద్యార్థులు ఈరోజు ఐక్య రాజ్యసమితి కార్యాలయంలో అడుగుపెట్టే స్థాయికి ఎదగడం ఆ ఫలితాల్లో ఒకటి మాత్రమే.

వ్యాసకర్త ఉపాధ్యాయుడు । 89198 62019

విద్యార్థుల ఆత్మహత్యలు ఆగేదెలా?

విశ్లేషణ




నూతలపాటి రవికాంత్

దేశ వ్యాప్తంగా విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకోవడం ఆందోళన కలిగించే అంశం. ఈ ఏడాది గడచిన ఏడు నెలల్లో కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదువుతున్న 20 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ప్రభుత్వం దృష్టికి రాని మరణాలు ఎన్ని ఉన్నాయో! కేవలం 2021 సంవత్సరంలోనే దేశంలో 13,089 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకొన్నారని ఒక నివేదిక చెబుతోంది. వీరిలో ఎక్కువగా మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా రాష్ట్రాలకు చెందినవారున్నారు.

శృంగార సంబంధాలు, ప్రేమ వైఫల్యాలు, చదువుకు మధ్యలో అంతరాయం కలగటం, పరీక్షల్లో తప్పడం, కార్పొరేట్ చదువు ఒత్తిడి, ఒంటరితనం, మానసిక ఒత్తిడి, ఆరోగ్య సమస్యలు, ప్రాణ స్నేహితుల మరణం, సైబర్ బెదిరింపులు – నేరాలు, కుటుంబ సభ్యుల సరైన మద్దతు లేకపోవటం, చెడు స్నేహాలు, డ్రగ్స్, ఆల్కహాల్, ఆర్థిక సమస్యలు వంటివి ఆత్మహత్యలకు కారణాలుగా నిలుస్తున్నాయి. సరైన సమయంలో 'కౌన్సెలింగ్', 'మార్గదర్శకత్వం' లభించి ఉంటే ఇందులో చాలామంది ఆత్మహత్య చేసుకొనేవారు కాదు.

విద్యార్థులకు వారి దైనందిన జీవితంలో చాలా సమస్యలు ఎదురవుతుంటాయి. ఆ సమస్యలను ఎదుర్కోవటానికి వారికి మార్గదర్శకత్వం, కౌన్సెలింగ్ చాలా అవసరం. కుటుంబ సభ్యులు తమ పిల్లల మానసిక ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో ప్రముఖ పాత్ర పోషించాలి. కానీ ఈ ఆధునిక జీవితం సృష్టించిన ఒత్తిడి కారణంగా విద్యార్థులకు వారి కుటుంబాల నుండి కౌన్సెలింగ్ పొందడం చాలా కష్టంగా ఉంది. ఆధునిక జీవిత ప్రయాణంలో తల్లిదండ్రులు పిల్లల్ని అంతగా పట్టించుకునే పరిస్థితులూ కొరవడటం ఈ సందర్భంగా గమనార్హం.

విద్యార్థులు ఎదుర్కొనే వివిధ సమస్యలకు వారు చేస్తోన్న చెడు స్నేహాలు కారణం కావచ్చు. విద్యార్థులు చదువుకునే సంస్థలలో మానసిక ఆరోగ్యంపై శిక్షణా కార్యక్రమాలు ఉండాలి. ఆధ్యాత్మిక విషయాలు,



యోగా, మెడిటేషన్ లాంటి వాటిపై అవగాహన కల్పించాలి. సామాజిక, ఆర్థిక సమస్యలపై గురించి సరైన దృక్పథం అలవడేలా శిక్షణ నివ్వాలి. సైబర్ నేరాలు జరిగే విధానం, వాటి బారిన పడకుండా ఎలా వ్యవహరించాలి అనే సంగతులను కచ్చితంగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయులు తెలియచేయాలి. సోషల్ మీడియా అవసరం మేరకు మాత్రమే ఉపయోగించేలా చూడాలి. మాదక ద్రవ్యాలు, ఆల్కహాల్ వంటి వాటిపై అవగాహన కల్పించాలి. సాటివారితో ప్రేమ, దయలతో వ్యవహరించేలా శిక్షణ ఇవ్వవలసింది కుటుంబ సభ్యులూ, గురువులే.

అన్ని పాఠశాలలు/సంస్థలు వారి విద్యార్థులు మానసిక ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవడానికి అవసరమైన మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందింప చేయడానికి కృషి చేయాలి. విద్యార్థులకు మానసిక వైద్య నిపుణులతో కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడం, ఆటలు ఆడుకోవడానికి అవసరమైన ఏర్పాట్లు చేయడం ద్వారా పిల్లలను దృఢంగా తీర్చిదిద్దవచ్చు. ఆత్మహత్యలను నిరోధించడానికి 'ప్రపంచ ఆరోగ్య సంస్థ' 2003వ సంవత్సరంలో ఇంటర్నేషనల్ 'అసోసియేషన్ ఫర్ సూసైడ్ ప్రివెన్షన్'ను ఏర్పాటు చేసి ప్రతి ఏడాదీ 'ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవం (సెప్టెంబరు 10), 'ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం' (అక్టోబర్ 10)లను నిర్వహిస్తున్నది. ఈ సందర్భంగా అనేక సలహాలు, సూచనలూ జారీ చేస్తోంది.

భారత ప్రభుత్వం కూడా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా మునుపెన్నడూ లేని విధంగా 'మెంటల్ హెల్త్ చట్టాన్ని (2017) తెచ్చి మానసికంగా బాధపడుతున్న వారికి మానసిక ఆరోగ్య సంరక్షణ సేవలను అందించేందుకు కృషి చేస్తోంది. కేంద్ర 'సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ' ఆందోళన, ఒత్తిడి, నిరాశ, ఆత్మహత్య ఆలోచనలు తదితర మానసిక సమస్యలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు అండగా 'కిరణ్' అనే 24 గంటలూ పనిచేసే హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేసింది. 1800–599–0019 అనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే తగిన పరిష్కారాలను నిపుణులు సూచిస్తుండడం హర్షణీయం.

వ్యాసకర్త సామాజిక, రాజకీయ విశ్లేషకులు
మొబైల్: 97044 44108

క్లుప్తంగా...

దుర్గమ్మకు బంగారు మంగళ సూత్రాల సమర్పణ



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సోదరి పి.పద్మావతి, నాగశ్రీనివాస్ దంపతులు సుమారు రూ.8లక్షల విలువైన బంగారు మంగళ సూత్రాలు సోమవారం సమర్పించారు. వీరు తొలుత కుటుంబ సమేతంగా అమ్మవారి ఖడ్గమాలార్చనలో పాల్గొన్నారు. అనంతరం పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఆయన సోదరి పి.పద్మావతి, నాగ శ్రీనివాస్ దంపతులు సుమారు 156 గ్రాముల బంగారు మంగళసూత్రాలు, బంగారు గొలుసును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు చేతుల మీదుగా ఏఈవో చంద్రశేఖర్‌కు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను దాతలకు అందజేశారు.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల క్షేత్రం సోమవారం జన సంద్రంగా మారింది. వరుస సెలవుల నేపథ్యంలో శ్రీశైల మల్లన్న దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఉభయ తెలుగు రాష్ట్రాలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. వేకువజాము నుంచే భక్తులను మల్లన్న దర్శనానికి అనుమతించారు. మల్లన్న సర్వదర్శనానికి ఆరు గంటలు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనానికి మూడు గంటల సమయం పడుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు పర్యవేక్షించారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి దుర్మరణం

- పల్నాడు జిల్లాలో ఘటన

వినుకొండ(నూజెండ్ల): పల్నాడు జిల్లా వినుకొండ పట్టణ సమీపంలోని పసుపులేరు బ్రిడ్జి సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు మృతిచెందారు. చీకటీగలపాలెం అడ్డరోడ్డు వైపు నుంచి వస్తున్న కారు, చీకటీగలపాలెం వైపు వెళ్తున్న పాల లారీలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో కారులో ఉన్న ఐదుగురిలో ముగ్గురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను వినుకొండ వైద్యశాలకు తరలించారు. మృతదేహాలను ప్రభుత్వాస్పత్రిలో మార్చురీకి తరలించారు. మృతులు శావల్యాపురం మండలం ముండ్రువారిపాలేనికి చెందిన కొమ్మతోటి నవీన్, కనమర్లపూడికి చెందిన కొమ్మతోటి యెహోషువా, వినుకొండ పట్టణానికి చెందిన రాజల శివారెడ్డిగా గుర్తించారు. వీరంతా డాన్స్ ఈవెంట్స్ కార్యక్రమానికి వెళ్లి వస్తున్నట్టు సీఐ సాంబశివరావు తెలిపారు.

తెలంగాణ

హోం వర్క్ చేయలేదని తలపై కొట్టిన టీచర్

- చికిత్స పొందుతూ చిన్నారి మృతి

హైదరాబాద్: హోంవర్క్ చేయలేదని యూకేజీ విద్యార్థి తలపై టీచర్ కొట్టడంతో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన హైదరాబాద్‌లోని రామంతాపూర్‌లో జరిగింది. బాలుడి కుటుంబ సభ్యులు కథనం ప్రకారం.. రామంతాపూర్ భరత్‌నగర్‌లో నివసించే నాగరాజు-రాధ దంపతుల కుమారుడు హేమంత్(5) స్థానిక స్కూల్‌లో యూకేజీ చదువుతున్నాడు. హోంవర్క్ చేయలేదని గత శనివారం టీచర్ పలకతో హేమంత్ తలపై బలంగా కొట్టడంతో అక్కడికక్కడే స్పృహ తప్పి పడిపోయాడు. సమాచారం అందుకున్న నాగరాజు హేమంత్‌ను ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు.

భద్రతపై ప్రత్యేక దృష్టి

విద్యుత్ ప్రమాదాలపై అవగాహనకు ప్రచార రథాలు / అన్ని జిల్లాల్లో ప్రతినెలా 2వ తేదీన అవగాహన కార్యక్రమాలు / వినియోగదారులు, సిబ్బందికి విడివిడిగా భద్రతా సూచనలు

సాక్షి, అమరావతి: విద్యుత్ ప్రమాదాలను నివారించేందుకు విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లు ప్రత్యేక దృష్టి సారించాయి. విద్యుత్ భద్రతపై ఇప్పటికే అనేక సూచనలను ప్రజలకు ఇచ్చినప్పటికీ ఇంకా అక్కడక్కడా విద్యుత్ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సరైన భద్రతా ప్రమాణాలు పాటించని కారణంగా కొంతమంది విద్యుత్ సిబ్బందితోపాటు సామాన్యులు కూడా ప్రాణాలు కోల్పోవడం వల్ల వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ ప్రమాదాలు జరిగిన తరువాత సమీక్షించుకోవడం కాకుండా వాటిని అరికట్టేందుకు పటిష్ట చర్యల్ని అమలు చేయాలని డిస్కంలు నిర్ణయించాయి. ప్రమాదాలను అరికట్టేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాయి. వినియోగదారులకు ప్రత్యేకంగా భద్రతా సూచనల్ని రూపొందించాయి. భవన నిర్మాణ కార్మికులు, కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల యజమానులు, రైతు కూలీలు, ట్రాన్స్‌పోర్ట్ వాహనాల డ్రైవర్లకు ప్రత్యేకంగా సూచనలను రూపొందించాయి. వీటిని అందరికీ తెలియజేసేందుకు 'భద్రతా అవగాహనా రథం' పేరుతో ప్రత్యేక ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్నాయి.



విద్యుత్ సిబ్బందికీ జాగ్రత్తలు

- లైన్ క్లియర్ (ఎల్‌సీ) సరిగ్గా లేకుండా ఏ లైన్ మీద పని చేయరాదు. సమీపంలో వేరే లైన్ ఉంటే దానికి కూడా ఎల్‌సీ తీసుకోవాలి.
- విద్యుత్ లైన్ల నిర్వహణ, బ్రేక్ డౌన్ ఆపరేషన్స్, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ చేసే సమయంలో ఆపరేషన్స్, మెయింటెనెన్స్ సిబ్బంది తప్పనిసరిగా హెల్మెట్, రబ్బర్ గ్లవ్స్, గమ్ బూట్స్, సేఫ్టీ బెల్ట్స్ వంటి భద్రతా పరికరాలు వినియోగించాలి. అలాగే ఒక్కరే ఎప్పుడూ వెళ్లకూడదు. వేరొకరిని తోడు తీసుకువెళ్లాలి.
- పంట పొలాలకు అనధికార విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధం. అటువంటివి లేకుండా సిబ్బంది తరచూ తనిఖీలు చేపట్టాలి.
- సబ్ స్టేషన్ ఆవరణలో గొడుగు వేసుకుని వెళ్లకూడదు. కర్రలు, తీగలు వంటివి తగిన జాగ్రత్తలు లేకుండా తీసుకుపోకూడదు.
- కొత్త సర్వీస్ ఇచ్చేటప్పుడు ఆ ఇల్లు విద్యుత్ లైన్ కింద ప్రమాదకరంగా ఉంటే ఇండియన్ ఎలక్ట్రిసిటీ యాక్ట్ సెక్షన్ 48, క్లాజ్ 63 ఆఫ్ రెగ్యులేషన్స్ 2010 ప్రకారం సర్వీసును తిరస్కరించి లైన్ షిఫ్ట్ చేయాలి.

ప్రచార రథాన్ని అందుబాటులోకి తెచ్చాం



ఏపీ ఈపీడీసీఎల్ ముందుగా ప్రచార రథాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. భద్రత సూచనలకు సంబంధించిన ఆడియోలను తయారుచేసి సంస్థ పరిధిలోని అన్ని సెక్షన్ కార్యాలయాలకు ఇప్పటికే పంపించాం. ఇకనుంచి ప్రతినెలా 2వ తేదీన క్రమం తప్పకుండా విద్యుత్ భద్రతా అవగాహన కార్యక్రమాలను అన్ని జిల్లాల్లోని సెక్షన్ కార్యాలయాల్లో నిర్వహించాలని ఆదేశించాం. వినియోగదారులు అవసరమైతే టోల్ ఫ్రీ నంబరు 1912కు ఫోన్ చేసి సమస్యలను తెలియజేయవచ్చు. – ఐ.పృథ్వీతేజ్, సీఎండీ, ఏపీ ఈపీడీసీఎల్

భవన నిర్మాణ కార్మికులకు ఇవీ సూచనలు

- విద్యుత్ లైన్ల కింద ఎటువంటి నిర్మాణాలు చేయరాదు. విద్యుత్ స్తంభానికి సమీపంలో లేదా స్తంభానికి ఆనుకుని ఇల్లు, ఎలివేషన్, డూములు, మెట్లు నిర్మాణం చేయకూడదు.
- ఇనుప చువ్వలు, లోహ పరికరాలు విద్యుత్ లైన్ల కింద తప్పనిసరి పరిస్థితులలో ఎత్తినపుడు జాగ్రత్తగా చూసుకోవాలి.
- జేసీబీలు, క్రేన్లు ఉపయోగించేటప్పుడు, బోర్లు డ్రిల్ చేస్తున్నప్పుడు వాటి లోహపు తొట్టెలు, పైపులు విద్యుత్ లైన్లకు తగిలి ప్రాణాపాయం సంభవించవచ్చు.
- ధాన్యం, ప్రత్తి, గడ్డి, ఊక, కొబ్బరి చిప్పలు, కలప వంటి వాహనాలు అధిక లోడుతో విద్యుత్ లైన్ల కింద వెళ్లడం ప్రమాదకరం.

సామాన్య ప్రజలకూ హెచ్చరికలు

- విద్యుత్ సిబ్బంది పర్యవేక్షణలో మాత్రమే లైన్ల కింద చెట్టు కొమ్మలు తొలగించాలి.
- తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లను తాకకూడదు.
- ఇల్లు, షాపు మీటర్‌కి పోల్ నుంచి తీసుకొనే సర్వీస్ వైరుకి ఎటువంటి అతుకులు లేకుండా చూసుకోవాలి.
- సర్వీస్ వైరుకి సపోర్ట్ వైరుగా రబ్బరు తొడుగు గల జీఐ తీగలను వాడాలి. ఇంటి ఆవరణలో ఎర్తింగ్ తప్పనిసరి.
- డాబాల మీద విద్యుత్ లైన్లకి దగ్గరగా బట్టలు ఆరవేయరాదు. తడి బట్టలతో, తడి చేతులతో విద్యుత్ పరికరాలను తాకకూడదు.
- వర్షం పడుతున్నప్పుడు విద్యుత్ స్తంభాన్ని, సపోర్ట్ వైర్లను ముట్టుకోకూడదు.
- అనధికారంగా విద్యుత్ స్తంభాలు ఎక్కడం, ఫ్యూజులు వేయడం చట్టవిరుద్ధమే కాదు ప్రాణాలకు ప్రమాదం.
- అధిక సామర్థ్యం గల ఫ్యూజు వైర్లను వాడరాదు. వాటివల్ల షార్ట్ సర్క్యూట్ జరిగి గృహోపకరణాలు కాలిపోతాయి.
- విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన, విద్యుత్ లైన్లు క్రింద తోపుడు బండ్లు, బడ్డీలు పెట్టడం ప్రమాదకరం.

దేశరక్షణకు అధిదేవత రాజశ్యామల

- స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి
- కేంద్ర రక్షణశాఖ మంత్రిని శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించిన శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి



రాజ్‌నాథ్‌సింగ్ చేతికి కంకణం కడుతున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

సాక్షి, న్యూఢిల్లీ/సింహాచలం: దేశరక్షణకు అధిదేవత రాజశ్యామల అమ్మవారేనని విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ స్వామి చెప్పారు. అమ్మవారి ఆరాధనతో రక్షణ విభాగం మరిన్ని విజయాలను సాధించవచ్చని తెలిపారు. ఆయన సోమవారం ఢిల్లీలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలిశారు. విశాఖ శ్రీశారదాపీఠంలో నిర్వహించే రాజశ్యామల అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆహ్వానించారు. అక్టోబరు 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు పీఠంలో అమ్మవారి శరన్నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజశ్యామల అమ్మవారి వైశిష్ట్యాన్ని వివరించడంతోపాటు ఉత్సవ సమయంలో పీఠాన్ని సందర్శించాలని కోరారు. పూర్వకాలంలో రాజులు యుద్ధాలకు వెళ్లేముందు అమ్మవారి యాగాలను చేపట్టి తద్వారా విజయాలను సాధించిన తీరును వివరించారు. ఇస్రో, డీఆర్‌డీవో వంటి సంస్థలు ప్రయోగాలు చేపట్టేముందు రాజశ్యామల అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించడం ద్వారా మరిన్ని సత్ఫలితాలను సాధించవచ్చని చెప్పారు. రాజశ్యామల అమ్మవారి విగ్రహారాధన విశాఖ శ్రీశారదాపీఠంలో మాత్రమే జరుగుతోందని తెలిపారు. రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడుతూ విశాఖ శ్రీశారదాపీఠం విశిష్టత గురించి తెలుసుకున్నట్లు చెప్పారు. స్వాత్మానందేంద్ర సరస్వతీస్వామి వెంట కేంద్ర రక్షణశాఖ సలహాదారు సతీశ్‌రెడ్డి, నీతి ఆయోగ్ సభ్యులు సరస్వతి తదితరులున్నారు.

అమ్మవారి సేవలో ఏపీ హైకోర్టు న్యాయమూర్తి



తిరుచానూరు ఆలయం వెలుపల రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య

చంద్రగిరి(తిరుపతి జిల్లా)/యాదమరి(చిత్తూరు జిల్లా): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని తమిళనాడు హైకోర్టు సీజే జస్టిస్ సంజయ్ విజయ్‌కుమార్ గంగాపూర్ వాలా, ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య వేర్వేరుగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వీరికి ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో రమేష్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కాగా, అమ్మవారిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తదితరులు ఉన్నారు. కాగా, కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

సత్యదేవుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరం శ్రీవీర వేంకట సత్యన్నారాయణ స్వామి వారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.గోపాలకృష్ణారావు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించి, స్వామివారికి పూజలు చేశారు. వీరికి ఆలయం వద్ద దేవస్థానం ఈవో చంద్రశేఖర్ ఆజాద్ ఘన స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పండితులు వేదాశీస్సులు, అధికారులు సత్యదేవుని లడ్డూ ప్రసాదాలను జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులకు అందజేశారు.



సత్యదేవుని వ్రతమాచరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు దంపతులు

అటవీశాఖ క్లియరెన్స్ ఇస్తేనే ఆంక్షల సడలింపు

- అప్పటి వరకు 12 ఏళ్లలోపు చిన్నారులపై ఆంక్షలు
- మధ్యాహ్నం 2 గంటల వరకే నడకదారుల్లో అనుమతి
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

తిరుమల: అలిపిరి నుంచి తిరుమలకు నడచి వచ్చే మార్గంలో వన్య మృగాల నుంచి ఎలాంటి ముప్పు లేదని అటవీశాఖ అధికారులు ధ్రువీకరిస్తేనే 12 ఏళ్ల లోపు పిల్లల విషయంలో ఆంక్షలు సడలిస్తామని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి స్పష్టంచేశారు. అప్పటి వరకు చిన్నారులపై ఆంక్షలు కొనసాగుతాయని చెప్పారు. మధ్యాహ్నం 2 గంటల వరకే నడకదారుల్లో చిన్నారులకు అనుమతి ఉంటుందని, భక్తుల భద్రతే తమకు ముఖ్యమని తెలిపారు. తిరుమలలో భక్తుల రద్దీ నేపథ్యంలో సోమవారం చైర్మన్ క్యూలైన్‌లను పరిశీలించారు. భక్తులకు ఆహారం, తాగునీరు, కాఫీ, టీ, మజ్జిగ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గోగర్భం సర్కిల్ నుంచి కృష్ణతేజ సర్కిల్ వరకు క్యూలను తనిఖీ చేశారు. అనంతరం చైర్మన్ కరుణాకర రెడ్డి మీడియాతో మాట్లాడుతూ పెరటాశి మాసం, సెలవుల కారణంగా నాలుగు రోజులుగా తిరుమలలో భక్తుల సంఖ్య అనూహ్యంగా పెరిగిందన్నారు. క్యూలు నాలుగు నుంచి ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లాయని, ఇలాంటి భక్తులకు త్వరితగతిన స్వామి వారి దర్శనం చేయించాలనే సంకల్పంతో వీఐపీ బ్రేక్, సుపథం, స్లాటెడ్ దర్శనం టోకెన్ల జారీ కూడా రద్దు చేసినట్లు చెప్పారు. క్యూల్లో ఉండే భక్తులు ఎక్కడా అసహనానికి లోను కాకుండా అవసరమైన తగిన వసతులు కల్పించామని తెలిపారు. ఈ నెల 15 నుంచి జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరవుతారనే అంచనాతో అవసరమైన ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు.



క్యూలో ఉన్న భక్తులతో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి

అధికారుల పనితీరు బ్రహ్మాండం

తిరుమలకు భక్తులు పోటెత్తడంతో ఈవో, జేఈవో, సీవీఎస్వో ఇతర అధికారులందరూ ప్రత్యక్షంగా ఏర్పాట్లు పరిశీలిస్తూ బ్రహ్మాండంగా పని చేస్తున్నారని చైర్మన్ అభినందించారు. భక్తులకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా చూస్తున్నారని వివరించారు. కాగా, ఆదివారం అర్ధరాత్రి వరకు తిరుమల శ్రీవారిని 88,623 మంది దర్శించుకున్నారు. హుండీలో రూ. 4.67 కోట్లు వేశారు. శ్రీవారి దర్శనానికి 24 గంటలు సమయం పడుతుంది. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, ఆరోగ్యాధికారి డాక్టర్ శ్రీదేవి, డీఎఫ్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

దళితుడిపై పోలీసుల దాడి

ఎస్‌ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

పద్మనాభం(విశాఖ): కోడి పుంజు దొంగిలించారని విచారణ నిమిత్తం పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి ఓ దళితుడిని చితకబాది కాలు విరగ్గొట్టిన ఘటనలో ఇద్దరు క్రైం కానిస్టేబుళ్లు, క్రైం ఎస్‌ఐను పోలీస్ కమిషనర్ రవిశంకర్ సస్పెండ్ చేశారు. బాందేవపురానికి చెందిన ఇందుకూరు రాజాబాబుకు చెందిన కోడి పుంజు గత నెల 29వ తేదీన దొంగతనానికి గురైంది. దీనిపై రాజాబాబు పాపు, గాలి వీరుబాబులపై అనుమానం వ్యక్తం చేస్తూ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో మూడు రోజుల నుంచి పాపు, వీరుబాబులను పోలీస్ స్టేషన్‌కు పిలిపించి విచారించి విడిచి పెడుతున్నారు. ఆదివారం రాత్రి కూడా విచారణకు పిలిచారు. అర్ధరాత్రి దాటాక పాపు, వీరుబాబులను క్రైం పోలీసులు కె.సతీష్, కె.శ్రీనివాసరావు చితకబాదారు. ఆ సమయంలో కానిస్టేబుళ్లు ఇద్దరు మద్యం సేవించి ఉన్నట్టు తెలిసింది. గతంలో ఆటో ప్రమాదంలో పాపు కుడి కాలు దెబ్బతింది. ఇదే కాలుపై పోలీసులు విచక్షణ రహితంగా కొట్టడంతో కాలు విరిగిపోయింది. పాపును చికిత్స కోసం విజయనగరం మహారాజా ఆస్పత్రిలో చేర్పించారు. దీనిపై బాందేవపురం దళిత కుటుంబాలు అర్ధరాత్రి పోలీసు స్టేషన్ వద్ద ధర్నాకు దిగాయి. విషయం తెలుసుకున్న క్రైం డీసీపీ నాగన్న పోలీసు స్టేషన్‌కు చేరుకుని పాపునకు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఘటనను పోలీసు ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకుని క్రైం పోలీసులు సతీష్, శ్రీనివాసరావులపై 325, 34(అట్రాసిటీ కేసు) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వీరితో పాటు క్రైం ఎస్‌ఐ మల్లేశ్వరరావును కూడా సస్పెండ్ చేశారు.

యువకుడి చేతిలో దాడికి గురైన కానిస్టేబుల్ మృతి

కానిస్టేబుల్ కుటుంబంలో విషాదం • భౌతికకాయం వద్ద ఎమ్మెల్యే, డీఐజీ, ఎస్పీ నివాళి

నూజివీడు : వినాయక నిమజ్జనాల సందర్భంగా విధులు నిర్వహిస్తూ ఓ యువకుడి దాడిలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ గంధం నరేంద్ర(32) ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో శనివారం రాత్రి డీజే ఆపమని చెప్పిన కానిస్టేబుల్ నరేంద్రపై ఉలాస రామకృష్ణ అనే యువకుడు తలపై దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నరేంద్రను విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మరింత మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. దీంతో మృతదేహాన్ని సోమవారం తెల్లవారుజామున నూజివీడు ఏరియా ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. దీంతో ఏరియా ఆస్పత్రి వద్దకు నూజివీడు సర్కిల్ పరిధిలోని పోలీసు సిబ్బంది, అధికారులు, మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు, మిత్రులు చేరుకున్నారు. ఆస్పత్రి ఆవరణలో మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు కానిస్టేబుల్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ కొద్దిసేపు ఆందోళన చేశారు. కాగా, ఏరియా ఆస్పత్రిలో ఉన్న నరేంద్ర భౌతికకాయాన్ని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఏలూరు డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా ఎస్పీ దాసరి మేరీ ప్రశాంతి కూడా నివాళులర్పించారు.



కానిస్టేబుల్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఏలూరు డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్

అనంతరం నరేంద్ర స్వగ్రామమైన ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు మండలం పోలిశెట్టిపాడులో పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

క్లుప్తంగా...

ఐదు పేజీల తీర్పుపై... 60 పేజీల సారాంశమా!

- పిటిషనర్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రూ.25 వేల జరిమానా

న్యూఢిల్లీ: ముందస్తు బెయిల్ నిరాకరిస్తూ అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన ఐదు పేజీల తీర్పును సవాలు చేసేందుకు అనుమతి కోరుతూ దరఖాస్తు రూపంలో సుప్రీంకోర్టులో ఏకంగా 60 పేజీల సినాప్సిస్ (సారాంశం) సమర్పించాడో వ్యక్తి! దీనిపై విస్మయం వ్యక్తం చేయడం న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్ ధర్మాసనం వంతయింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేయడమే గాక పిటిషన్‌దారుకు రూ.25 వేల జరిమానా కూడా విధించింది! ఆ మొత్తాన్ని ఏదన్నా స్వచ్ఛంద సేవా సంస్థకు విరాళంగా ఇవ్వాలని ఆదేశించింది. అయితే ఆరోగ్య కారణాలతో అతనికి మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. ఇలాంటి సుదీర్ఘ దరఖాస్తులపై సుప్రీంకోర్టు గతేడాది అసహనం వ్యక్తం చేసింది. వాటిలో పేజీల సంఖ్యపై తక్షణం పరిమితి విధించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది.

భారతీయ విస్కీ.. ప్రపంచంలో అత్యుత్తమం

న్యూఢిల్లీ: భారతదేశంలో మధువు తయారీ ప్రాచీన కాలం నుంచి కొనసాగుతోంది. పురాణాల్లోనూ సురాపానం ప్రస్తావన ఉంది. తాజాగా భారత విస్కీ ప్రపంచంలోనే ఉత్తమ మద్యంగా గుర్తింపు సాధించింది. 2023వ సంవత్సరానికి గాను విస్కీస్ ఆఫ్ ద వరల్డ్ అవార్డ్స్‌లో 'ఇంద్రి సింగిల్ మాల్ట్ ఇండియన్ విస్కీ-లిమిటెడ్ దివాళీ కలెక్టర్స్ ఎడిషన్-2023'కి ప్రపంచంలో బెస్ట్ విస్కీగా 'డబుల్ గోల్డ్, బెస్ట్ ఇన్ షో' అవార్డు లభించింది. ఈ అవార్డు కోసం ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల నుంచి ఎంతగానో పేరుప్రఖ్యాతులు పొందిన విస్కీలు పోటీపడ్డాయి. స్కాచ్, బార్బన్, కెనడియన్, ఆస్ట్రేలియన్, బ్రిటిష్ సింగిల్ మాల్ట్ విస్కీలను వెనక్కి నెట్టి భారతీయ సింగిల్ మాల్ట్ విస్కీ అరుదైన ఘనత దక్కించుకుంది. ఇంద్రి విస్కీని పికాడిల్లీ డిస్టిల్లరీస్ కంపెనీ ఉత్పత్తి చేస్తోంది. రాజస్తాన్‌లోని ప్రత్యేకంగా పండించే బార్లీ, యమునా నది నీటితో ఈ విస్కీని తయారు చేస్తున్నారు.

మెనోపాజ్‌పై బాస్ ఛీప్ కామెంట్లు..!

మహిళకు రూ.37 లక్షల పరిహారం

లండన్: మెనోపాజ్‌ను సాకుగా చూపుతూ సరిగా పని చేయడం లేదని కించపరిచే వ్యాఖ్యలు చేసిన బాస్ మీద కేసు పెట్టి రూ.37 లక్షల పరిహారం పొందిందో మహిళ. ఈ ఉదంతం స్కాట్లాండ్‌లో జరిగింది. కరెన్ ఫర్కార్సన్ అనే 49 ఏళ్ల మహిళ ఒక స్థానిక ఇంజనీరింగ్ సంస్థలో 1995 నుంచీ పని చేస్తోంది. మెనోపాజ్ దశ కారణంగా ఆందోళన, మెదడు ఉన్నట్టుండి మొద్దుబారడం వంటివాటి లక్షణాలతో బాధ పడుతున్నట్టు బాస్‌కు చెప్పింది. విపరీతంగా బహిష్టు స్రావం అవుతుండటం, బయట విపరీతంగా మంచు కురుస్తుండటంతో రెండు రోజులు ఇంటి నుంచి పని చేసింది. మర్నాడు ఆఫీస్‌కు వెళ్లగానే, 'పర్లేదే, వచ్చావు' అంటూ బాస్ వ్యంగ్యంగా అన్నాడు. తన సమస్య గురించి మరోసారి వివరించినా, 'నొప్పులు, బాధలు అందరికీ ఉండేవే' అంటూ కొట్టిపారేశాడు. దాంతో ఆమె రాజీనామా చేసి కంపెనీపై కేసు పెట్టింది. తన వ్యాఖ్యల వెనుక దురుద్దేశం లేదన్న బాస్ వాదనను ట్రిబ్యునల్ కొట్టిపారేసింది. అతనిలో ఏ మాత్రమూ పశ్చాత్తాపం కనిపించడం లేదంటూ ఆక్షేపించి పరిహారం చెల్లించాలని కంపెనీని ఆదేశించింది.

భారత హైకమిషన్‌కు ఖలిస్తాన్ నిరసన సెగ

లండన్: బ్రిటన్‌లో ఖలిస్తానీ వేర్పాటువాద మద్దతుదారులు మరోసారి పేట్రేగిపోయారు. లండన్‌లోని భారత హైకమిషన్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఇటీవల బ్రిటన్‌లోని గ్లాస్గో పట్టణంలో గురుద్వారాలోకి భారత రాయబారి విక్రమ్ దొరైస్వామి వెళ్లకుండా ఖలిస్తానీవాదులు అడ్డుకున్న ఘటనను మరవకముందే మళ్లీ అలాంటి నిరసన కార్యక్రమానికి బ్రిటన్ వేదికగా మారింది. సోమవారం లండన్‌లో ఈ ఘటన జరిగింది. హై కమిషన్ కార్యాలయం ముందే ఆందోళన చేశారు. దీంతో భద్రతా సిబ్బంది రంగంలోకి దిగి వారిని నియంత్రించారు. మరోవైపు, దొరైస్వామిని అడ్డుకోవడాన్ని ఖండిస్తూ సదరు గురుద్వారా ప్రకటన విడుదల చేసింది.

నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృత్యు ఘోష

24 గంటల్లో 24 మంది మృతి

ముంబై: మహారాష్ట్రలోని నాందేడ్ ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటల వ్యవధి 12 మంది శిశువులు సహా 24 మరణాలు నమోదయ్యాయి. 12 మంది శిశువులూ స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులు రిఫర్ చేసినవేనని అధికారులు చెప్పారు. మిగతా 12 మంది వేర్వేరు సమస్యలతో చనిపోయారన్నారు. ఈ ఘటనలపై ముగ్గురు సభ్యుల నిపుణులతో విచారణ కమిటీని ఏర్పాటు చేశామని, మంగళవారం మధ్యాహ్నానికి నివేదిక అందనుందని వైద్యవిద్య కార్యదర్శి దిలీప్ తెలిపారు.

జింబాబ్వేలో విమాన ప్రమాదం

భారత్ బిలియనీర్ దుర్మరణం

జొహాన్నెస్‌బర్గ్: జింబాబ్వేలో జరిగిన విమాన ప్రమాదంలో హర్‌పాల్ రణ్‌ధావా అనే భారత మైనింగ్ కుబేరుడు, ఆయన కుమారునితో సహా మరో నలుగురు దుర్మరణం పాలయ్యారు. సెప్టెంబర్ 29వ తేదీన వారు సొంత ప్రైవేట్ విమానంలో హరారే నుంచి ఒక వజ్రాల గని ప్రాంతానికి వెళ్తుండగా సాంకేతిక లోపంతో గాల్లోనే పేలిపోయి మషావా సమీపంలో కుప్పకూలింది.

కోవిడ్–19 టీకా పరిశోధనలకు నోబెల్

వైద్య శాస్త్రంలో కాటలిన్ కరికో, డ్రూ వీజ్‌మన్‌కు ప్రతిష్టాత్మక బహుమతి

ప్రకటించిన నోబెల్ కమిటీ

స్టాక్‌హోమ్: కోవిడ్–19 మహమ్మారి నియంత్రణ కోసం ఎంఆర్ఎన్ఏ (మెసెంజర్ రైబోన్యూక్లియిక్ యాసిడ్) వ్యాక్సిన్ల అభివృద్ధికి తమ పరిశోధనల ద్వారా తోడ్పాటునందించిన ఇద్దరు శాస్త్రవేత్తలకు ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి లభించింది. హంగేరీకి చెందిన కాటలిన్ కరికో, అమెరికన్ డ్రూ వీజ్‌మన్‌కు ఈ ఏడాది వైద్యరంగంలో నోబెల్ ప్రైజ్‌ను స్వీడన్‌లోని నోబెల్ కమిటీ సోమవారం ప్రకటించింది. న్యూక్లియోసైడ్ బేస్ మాడిఫికేషన్లలో వీరిద్దరూ చేసిన నూతన ఆవిష్కరణలు ఎంఆర్ఎన్ఏ టీకాల అభివృద్ధికి దోహదపడ్డాయి. కాటలిన్ కరికో, డ్రూ వీజ్‌మన్ పరిశోధనలతో రెండు ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లకు ఆమోదం లభించిందని, ఈ వ్యాక్సిన్లు కోట్లాది మంది ప్రాణాలను కాపాడాయని నోబెల్ కమిటీ వెల్లడించింది. మన శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ పట్ల ఎంఆర్ఎన్ఏ ఎలా ప్రతిస్పందిస్తున్న దానిపై వీరిద్దరి పరిశోధన మన అవగాహనను పూర్తిగా మార్చివేసిందని పేర్కొంది. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి గాను ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్ల అభివృద్ధి చేయడానికి సహాయపడే న్యూక్లియోసైడ్ బేస్‌కు సంబంధించిన ఆవిష్కరణలకు వీరిని నోబెల్‌తో సత్కరించనున్నట్లు తెలియజేసింది. ఇదిలా ఉండగా, భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతిని మంగళవారం, బుధవారం రసాయన శాస్త్రంలో, గురువారం సాహిత్యంలో నోబెల్ బహుమతి విజేతల పేర్లను ప్రకటిస్తారు. శుక్రవారం నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించనున్నారు. ఈ నెల 9న అర్థశాస్త్రంలో ఈ బహుమతి గ్రహీత పేరును వెల్లడిస్తారు. విజేతలకు డిసెంబర్ 10న నోబెల్ బహుమతులు ప్రదానం చేస్తారు. గత ఏడాది నోబెల్ గ్రహీతలకు 10 మిలియన్ల స్వీడిష్ క్రోనర్లు అందజేశారు. ఈసారి 11 మిలియన్ల క్రోనర్లు ఇవ్వనున్నారు.

ఎంఆర్ఎన్ఏ బేస్‌లు మార్చారు.. టీకా సిద్ధం చేశారు!



కాటలిన్ కరికో, డ్రూ వీజ్‌మన్

2019లో మొదలై నెలల వ్యవధిలోనే ప్రపంచాన్ని చుట్టేసిన కోవిడ్ మహమ్మారి గురించి ఇప్పుడు కొత్తగా చెప్పుకునేందుకు ఏమీ లేదు. తొలి నాళ్లలో ఈ వ్యాధిని కట్టడి చేసేందుకు కావాల్సిన టీకా అంత తొందరగా తయారవుతుందా? తయారయ్యేలోపు ఎన్ని ప్రాణాలు పోవాలో అన్న ఆందోళన అందరిలోనూ వ్యక్తమైంది. కానీ.. మానవ సంకల్పం, ఆధునిక టెక్నాలజీల పుణ్యమా అని తక్కువ సమయంలోనే రికార్డు స్థాయిలో టీకాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రపంచం పెను విపత్తు నుంచి చివరి క్షణంలో తప్పించుకుంది. అంతేకాదు, ఈ టీకాల్లో ఒక రకం (ఎంఆర్ఎన్ఏ) మనకు అందుబాటులోకి రావడానికి ఈ సంవత్సరం వైద్యశాస్త్ర నోబెల్ బహుమతి గ్రహీతలైన కాటలిన్ కరికో, డ్రూ వీజ్‌మన్‌ల పరిశోధనలు కీలకమయ్యాయి! ఎందుకు? ఏమిటి? ఎలా?

30 ఏళ్లుగా పరిశోధనలు

టీకాల తయారీకి శాస్త్రవేత్తలు వందేళ్లుగా నాలుగు రకాల పద్ధతులను ఉపయోగిస్తున్నారు. వ్యాధికారక సూక్ష్మజీవిని నిర్వీర్యం చేసి వాడేది ఒక రకమైతే.. ఆ సూక్ష్మజీవి భాగాన్ని ఉపయోగించుకోవడం ఇంకో పద్ధతి. వీటితోపాటు మరికొన్ని పద్ధతులను కూడా ఉపయోగిస్తారు. కానీ.. సుమారు 30 ఏళ్ల క్రితం శరీర కణాల్లోని అతి సూక్ష్మ భాగమైన ఎంఆర్ఎన్(మెసెంజర్ రైబో న్యూక్లియిక్ యాసిడ్)ను కూడా వాడుకోవచ్చని కొంతమంది శాస్త్రవేత్తలు ప్రతిపాదించారు. అప్పటి నుంచి ఇప్పటివరకూ ఈ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లపై పరిశోధనలైతే జరిగాయి గానీ సాధించిన ఫలితాలు అంతంతమాత్రంగానే ఉండేవి. కోవిడ్ వ్యాధి ప్రపంచంపై పంజా విసిరిన సందర్భంలో మాత్రం పరిస్థితి వేగంగా మారిపోయింది. వ్యాధి నియంత్రణకు ఎంఆర్ఎన్ఏ టీకా సిద్ధమైంది.

ఎన్నో వ్యాధుల నియంత్రణకు ఉపయోగకరం?

ఎంఆర్ఎన్ఏ టీకాలనేవి ప్రస్తుతం మనం కోవిడ్ నియంత్రణకు వాడుకున్నాం కానీ.. భవిష్యత్తులో ఈ టెక్నాలజీ చాలా వ్యాధుల కట్టడికి ఉపయోగపడుతుందని, కొన్నింటికి చికిత్సగానూ పనికొస్తుందని శాస్త్రవేత్తల అంచనా. కోవిడ్ తరువాత జంతువుల నుంచి మనుషులకు వైరస్ సంబంధిత వ్యాధులు సోకే అవకాశాలు పెరిగినట్లు ప్రపంచం గుర్తించింది. అయితే, ఇప్పటికీ గుర్తించని వైరస్ రకాలు చాలా ఉన్నాయి. ఒకవేళ భవిష్యత్తులో గుర్తు తెలియని వైరస్ ఏదైనా మనిషిపై దాడి చేస్తే ఎంఆర్ఎన్ఏ టెక్నాలజీతో సులువుగా టీకా తయారు చేసేందుకు అవకాశం ఏర్పడింది. 2000లో ఏర్పాటైన క్యూర్‌వ్యాక్, 2008లో ఏర్పాటైన బయో ఎన్‌టెక్, 2010 ఏర్పాటైన మోడెర్నా కంపెనీలు ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లపై పరిశోధనలను ముమ్మరం చేశాయి. ఈ మూడు కంపెనీల శాస్త్రవేత్తలు యూనివర్సిటీలతో కలిసి పనిచేయడం ద్వారా ఈ టెక్నాలజీ సాకారమయ్యేలా చేయగలిగారు. జీకా వైరస్ విరుగుడుకు ఇప్పటికే ఎంఆర్ఎన్ఏ వైరస్ ఒకటి అందుబాటులో ఉండగా హెచ్10ఎన్8, హెచ్7ఎన్9 ఇన్‌ఫ్లుయెంజా వైరస్‌ల కట్టడికీ ప్రయోగాలు జరుగుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

సంకల్పానికి తోడైన కృషి



1997లో యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో పనిచేస్తున్న సమయంలో కాటలిన్ కరికో, డ్రూ వీజ్‌మన్ ఎంఆర్ఎన్ఏ వ్యాక్సిన్లపై ఉమ్మడి పరిశోధనలు మొదలుపెట్టారు. వీజ్‌మన్ ఇమ్యునాలజీ, మైక్రోబయాలజీలలో బోస్టన్ యూనివర్సిటీ నుంచి 1987లో పీహెచ్‌డీ పట్టా పొందారు. అమెరికా ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ హెల్త్‌లో హెచ్ఐవీ వైరస్‌పై పరిశోధనలు చేశారు. ఆ తరువాతి కాలంలో పెన్సిల్వేనియా యూనివర్సిటీలో వ్యాక్సిన్లపై పరిశోధనలకు శాస్త్రవేత్తల బృందం ఒకదాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు కాటలిన్ కరికో ఎంఆర్ఎన్ఏ బయోకెమిస్ట్రీలో నిపుణులు. ఎంఆర్ఎన్ఏను వైద్యానికి ఉపయోగించాలన్న సంకల్పం ఇరువురిలోనూ మెండు. వేర్వేరు ఆర్ఎన్ఏ రకాలపై వీరు పరిశోధనలు చేపట్టగా 2005లో న్యూక్లియోటైడ్ బేసెస్‌లో మార్పులకు, దుష్ప్రభావాలకు మధ్య సంబంధం స్పష్టమైంది. దీని ఆధారంగానే వారు ఆ బేస్‌లను మారిస్తే అప్పటివరకూ ఉన్న పరిమితులు తొలగిపోతాయని ప్రతిపాదించారు. తదుపరి పరిశోధనలతో దాన్ని రుజువు చేశారు.

ఏమిటీ ఎంఆర్ఎన్ఏ?

మన కణాల్లోపల కణ కేంద్రకం.. అందులోపల మైటోకాండ్రియా, ఉండచుట్టుకుని క్రోమోజోములు ఉంటాయని చిన్నప్పుడు చదువుకుని ఉంటాం. ఈ క్రోమోజోముల మెలికలను విడదీస్తే అది... మెలితిరిగిన నిచ్చెన ఆకారంలోని డీఎన్ఏ అని కూడా మనకు తెలుస్తుంది. దీంట్లో రెండు పోగులుంటాయి. ఈ డీఎన్ఏలో అక్కడక్కడ కొంత భాగంలో శరీర క్రియలకు అవసరమైన ప్రొటీన్లను తయారు చేసేందుకు కావాల్సిన సమాచారం ఉంటుంది. కొన్ని రసాయన ప్రక్రియల కారణంగా ప్రొటీన్ల తయారీ సమాచారమున్న డీఎన్ఏ భాగాలు పోగు నుంచి విడిపోతుంటాయి. ఇలా విడిపోయిన భాగాన్నే ఎంఆర్ఎన్ఏ అని పిలుస్తారు. ముందుగా చెప్పుకున్నట్లు ఈ ఎంఆర్ఎన్ఏలను టీకాలుగా వాడుకునేందుకు 30 ఏళ్లుగా పరిశోధనలైతే జరుగుతున్నాయి. అయితే దుష్ప్రభావాలు కనిపిస్తున్న నేపథ్యంలో వీటిని వాడటం అసాధ్యమైంది. అలాగే ఎంఆర్ఎన్ఏలు తగినంత మోతాదులో ప్రొటీన్లు ఉత్పత్తి చేయగలిగేవి కాదు. ఈ నేపథ్యంలో కాటలిన్ కరికో, డ్రూ వీజ్‌మన్‌లు చేసిన పరిశోధనలకు ప్రాముఖ్యత ఏర్పడింది. ఎంఆర్ఎన్ఏ పోగులోని న్యూక్లియోటైడ్ బేసెస్(అడినైన్, థయామీన్, సైటోసైన్, గ్వానైన్ అని నాలుగు బేస్‌లు ఉంటాయి. రెండు పోగుల డీఎన్ఏ మెలితిరిగిన నిచ్చెన మాదిరిగా ఉంటే.. నిచ్చెన మెట్లకు రెండువైపుల ఉండే ఆధారం ఈ బేస్‌లు)మారితే రోగ నిరోధక వ్యవస్థ దాన్ని గుర్తించలేదని, తద్వారా ప్రొటీన్ ఉత్పత్తి పెరగడమే కాకుండా దుష్ప్రభావాలూ ఉండవని వీరు తమ పరిశోధనల ద్వారా నిరూపించారు. ఈ పరిశోధనలకు మరికొన్ని ఇతర పరిశోధనలూ తోడు కావడం వల్లనే కోవిడ్–19 విరుగుడుకు రికార్డు సమయంలో రెండు వ్యాక్సిన్లు అందుబాటులోకి వచ్చాయి.



నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ముర్ము

గాంధీజీ బోధనలు నేటికీ మార్గదర్శకాలు

మహాత్మునికి నివాళులర్పించిన ముర్ము, మోదీ

న్యూఢిల్లీ: మహాత్మాగాంధీ, మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి 154వ జయంతి వేడుకలను దేశవ్యాప్తంగా జరుపుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని మోదీ సోమవారం వారికి ఘనంగా నివాళులర్పించారు. గాంధీ స్మృతి మ్యూజియంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ పాల్గొన్నారు. భజన్ సంధ్య కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐరాస సెక్రటరీ జనరల్ గుటెర్రస్ పంపిన సందేశాన్ని చదివి వినిపించారు. అక్టోబర్ 2వ తేదీని అంతర్జాతీయ అహింసా దినంగా ఏటా పాటిస్తున్నారు. గతంలో బిర్లా భవన్‌గా పేరున్న ఈ భవనంలోనే 1948 జనవరి 30వ తేదీన గాంధీజీ హత్యకు గురయ్యారు. ప్రధాని మోదీ సోమవారం రాజ్‌ఘాట్‌లో గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ప్రధానమంత్రి లాల్ బహదూర్ శాస్త్రి సమాధి విజయ్ ఘాట్‌ను కూడా ప్రధాని మోదీ సందర్శించి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ప్రధాని మోదీ 'ఎక్స్'లో..'గాంధీజీ బోధనలు నిత్య బోధనలు మన మార్గాన్ని చూపిస్తున్నాయి. మహాత్ముని ప్రభావం ప్రపంచవ్యాప్తంగా ఉంది. ఐక్యత, కరుణా స్ఫూర్తితో మరింత ముందుకు సాగేందుకు మానవాళిని ప్రేరేపిస్తోంది'అని పేర్కొన్నారు. జర్మనీ గాయని కాసాండ్రా మే ఆలపించిన 'వైష్ణవ జన తో..'గీతాన్ని షేర్ చేశారు. అదేవిధంగా, లండన్‌లోని టవిస్టాక్ స్క్వేర్‌లోని గాంధీజీ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మహాత్మునికి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న ప్రధాని మోదీ

కేంద్రంలో మళ్లీ ఎన్డీయే ప్రభంజనం

- బీజేపీ కూటమికి 307 లోక్‌సభ స్థానాలు
- విపక్ష ఇండియా కూటమికి 175 సీట్లు
- ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్సార్‌సీపీకి 24–25 స్థానాలు
- తెలంగాణలో 9 నుంచి 11 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు
- జాతీయ మీడియా సంస్థ 'టైమ్స్ నౌ' సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: దేశంలో రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కేంద్రంలో అధికార ఎన్డీయే మరోసారి ఘన విజయం సాధిస్తుందని జాతీయ వార్తా సంస్థ 'టైమ్స్ నౌ' తాజా సర్వేలో వెల్లడయ్యింది. మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు గాను బీజేపీ కూటమి ఏకంగా 307 స్థానాలు గెలుచుకుంటుందని తెలియజేసింది. మెజార్టీ మార్కును సులువుగా అధిగమించి, కేంద్రంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని తేల్చిచెప్పింది. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని విపక్ష 'ఇండియా' కూటమి 175 స్థానాలకే పరిమితం అవుతుందని వివరించింది. ఇతరులు 61 సీట్లలో విజయం సాధించే అవకాశం ఉందని పేర్కొంది. ఇక 25 లోక్‌సభ స్థానాలున్న ఆంధ్రప్రదేశ్‌లో అధికార వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దాదాపు క్లీన్ స్వీప్ చేస్తుందని టైమ్స్ నౌ సర్వే ఉద్ఘాటించింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ కుంభకోణంలో అరెస్టయిన తర్వాత ఈ సర్వే జరిగింది. సర్వే ఫలితాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లో అధికార పార్టీ 24 నుంచి 25 స్థానాల్లో జయకేతనం ఎగురవేస్తుంది. గత ఎన్నికల్లో 22 సీట్లు గెలుచుకున్న వైఎస్సార్‌సీపీ ఈసారి దాదాపు మొత్తం సీట్లను కైవసం చేసుకుంటుంది. అంతేకాదు 51.10 శాతం ఓట్లు దక్కించుకుంటుంది. ప్రతిపక్ష టీడీపీకి ఒక స్థానం లభించే అవకాశం ఉంది. ఆ పార్టీకి 36.40 శాతం ఓట్లు లభిస్తాయి. జనసేన పార్టీ కనీసం ఒక్క స్థానంలోనూ గెలిచే పరిస్థితి లేదు. కేవలం 10.10 శాతం ఓట్లు సాధించనుంది. బీజేపీకి కనాకష్టంగా 1.30 శాతం ఓట్లు పడతాయని అంచనా. ఇతరులు 1.10 శాతం ఓట్లు సాధించనున్నారు.

తెలంగాణలో పెరిగిన బీఆర్ఎస్ బలం

17 లోక్‌సభ స్థానాలున్న తెలంగాణలో అధికార భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) గత ఎన్నికల్లో 9 సీట్లు గెలిచింది. ఈసారి ఎన్నికల్లో 9 నుంచి 11 సీట్లు తన ఖాతాలో వేసుకోనుంది. బీజేపీకి 2 నుంచి 3, కాంగ్రెస్‌కు 3 నుంచి 4 సీట్లు లభిస్తాయి. ఇతరులు మరో స్థానం దక్కించుకోబోతున్నారు. 80 లోక్‌సభ సీట్లున్న అతిపెద్ద రాష్ట్రం ఉత్తరప్రదేశ్‌లో ఎన్డీయేకు 70 నుంచి 74 సీట్లు లభిస్తాయని సర్వే బహిర్గతం చేసింది. ఇండియా కూటమికి 4 నుంచి 8, బహుజన సమాజ్ పార్టీకి ఒకటి, ఇతరులకు ఒకటి నుంచి మూడు సీట్లు వచ్చే అవకాశం ఉందని వెల్లడించింది.

ఆంధ్రప్రదేశ్ (మొత్తం స్థానాలు 25)

పార్టీ	2019	2024
వైఎస్సార్‌సీపీ	22	24-25
టీడీపీ	3	0-1
జనసేన	0	0
బీజేపీ	0	0
ఇతరులు	0	0

తెలంగాణ (మొత్తం స్థానాలు 17)

పార్టీ	2019	2024
బీఆర్ఎస్	9	9-11
బీజేపీ	4	2-3
కాంగ్రెస్	3	3-4
ఇతరులు	1	1

కేంద్రంలో (మొత్తం స్థానాలు 543)

కూటమి	సీట్లు
ఎన్డీయే	307
ఇండియా	175
ఇతరులు	61

63 శాతం ఓబీసీలు, ఈబీసీలే

- రాష్ట్రంలో కులగణన వివరాలు వెల్లడించిన బిహార్ ప్రభుత్వం
- ఓబీసీల్లోని యాదవులు అత్యధికంగా 14.27%
- మొత్తం 13.07 కోట్ల జనాభాలో హిందువులు 81.99%

పట్నా: బిహార్‌లోని నితీశ్ కుమార్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన కులగణన వివరాలను వెల్లడించింది. రాష్ట్రంలోని మొత్తం జనాభాలో 63 శాతం వరకు ఓబీసీ, ఈబీసీలే ఉన్నట్లు తేల్చింది. ఈ గణాంకాల వివరాలను సోమవారం రాష్ట్ర డెవలప్‌మెంట్ కమిషనర్ వివేక్ సింగ్ విడుదల చేశారు. రాష్ట్ర జనాభా 13.07 కోట్లు కాగా, వీరిని 215 సామాజిక గ్రూపులుగా విభజించారు.

- ఈబీసీ(అత్యంత వెనుకబడిన కులాలు) జనాభా 36 శాతం, ఓబీసీ(ఇతర వెనుకబడిన కులాలు) జనాభా 27.13 శాతం వరకు ఉన్నట్లు వెల్లడైంది.
- ఓబీసీ గ్రూపులోని యాదవులు 1.86 కోట్ల మంది కాగా, వీరి వాటా రాష్ట్ర జనాభాలోనే అత్యధికంగా 14.27% ఉండటం గమనార్హం. రాష్ట్ర డిప్యూటీ సీఎం తేజస్వీ యాదవ్ కులం ఇదే.
- ఆ తర్వాత అత్యధికంగా 69.43 లక్షల జనాభా ఉన్న దుసాద్‌లు 5.31%, 68.69 లక్షలున్న చమర్ కులస్తులు 5.25%, 47.81 లక్షలున్న బ్రాహ్మణులు 3.65%, 37.62 లక్షల జనాభా కలిగిన కుర్మీలు 2.87% తదితరులున్నారు.
- రాష్ట్ర జనాభాలో దళితు(ఎస్సీ)లు 19.65% మంది ఉన్నారు. రాష్ట్రంలోని 22 లక్షల మంది గిరిజనులు మొత్తం జనాభాలో 1.68% మంది ఉన్నారు.
- 1990ల్లో మండల్ ఉద్యమం సమయం వరకు రాష్ట్ర రాజకీయాలను శాసించిన 'అన్ రిజర్వుడ్ కేటగిరీ'గా పిలిచే అగ్ర కులాల వారు మొత్తం జనాభాలో 15.52% మంది ఉన్నారు.
- రాష్ట్ర జనాభాలో అత్యధికంగా హిందువులు 81.99% మంది ఉన్నట్లు వెల్లడైంది. ఆ తర్వాతి స్థానంలో ముస్లింలు 17.70% మంది ఉన్నారు. వీరితోపాటు క్రైస్తవులు, సిక్కులు, జైనులు తదితరులు కలిసి మొత్తం జనాభాలో ఒక శాతం కంటే తక్కువ మందే ఉన్నారని సర్వే తేల్చింది.



కులగణనను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను సీఎం నితీశ్ కుమార్ అభినందించారు. రాష్ట్ర శాసనసభలో ప్రాతినిధ్యం ఉన్న తొమ్మిది పార్టీల నేతలతో త్వరలోనే ఒక సమావేశం ఏర్పాటు చేసి, సర్వేలో వెల్లడైన అంశాలపై చర్చిస్తామని సీఎం నితీశ్ కుమార్ చెప్పారు. కాగా, కులగణనపై ప్రతిపక్ష బీజేపీ పెదవి విరిచింది. రాష్ట్రంలో మారిన సామాజిక, ఆర్థిక పరమైన వాస్తవాలను ఈ సర్వే ప్రతిబింబించలేదని పేర్కొంది. గత ఏడాది జూన్‌లో మొదలైన ఈ సర్వే కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించింది. రాష్ట్రంలో చివరిసారిగా 1931లో కులగణన చేపట్టారు.

విపక్షాలకు విజన్ లేదు, రోడ్‌మ్యాప్ లేదు

- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా
- రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో ప్రధాని పర్యటన

జైపూర్/గ్వాలియర్: దేశ అభివృద్ధి విషయంలో ప్రతిపక్షాలకు ఒక విజన్ లేదని, రోడ్‌మ్యాప్ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎద్దేవా చేశారు. ఆయన సోమవారం రాజస్తాన్, మధ్యప్రదేశ్‌లో పర్యటించారు. రాజస్తాన్‌లో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ పరాజయం ఖాయమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ ఓటమిని ముందే అంగీకరించారని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను బీజేపీ అధికారంలోకి వచ్చాక రద్దు చేయొద్దని, ఎప్పటిలాగే కొనసాగించాలని, ఆ మేరకు గ్యారంటీ ఇవ్వాలని గహ్లోత్ ఇటీవల కోరారని గుర్తుచేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైందన్న సంగతి గహ్లోత్‌కు తెలిసిపోయిందని అన్నారు. మోదీ రాజస్తాన్‌లో రూ.7,200 కోట్ల విలువైన పలు ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. శాన్‌వాలియా శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిత్తోర్‌గఢ్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. ప్రజలకు మేలు చేకూర్చే ఏ పథకాన్నీ తాము రద్దు చేయబోమని, పథకాలను మరింత మెరుగ్గా అమలు చేస్తామని, ఇది మోదీ ఇస్తున్న గ్యారంటీ అని తేల్చిచెప్పారు.

భారత్ విజయాలను విపక్షాలు ఓర్వలేకపోతున్నాయి

ప్రతిపక్షాలు అభివృద్ధి వ్యతిరేక రాజకీయాలు చేస్తున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ విమర్శించారు. దేశ అభివృద్ధిపై ప్రతిపక్షాలకు ఒక విజన్ గానీ, రోడ్‌మ్యాప్ గానీ లేదని అన్నారు. ఎన్డీయే ప్రభుత్వ హయాంలో వివిధ రంగాల్లో భారత్ సాధిస్తున్న విజయాలను చూసి విపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఆరోపించారు. మోదీ మధ్యప్రదేశ్‌లో రూ.19,260 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభించారు. కొన్ని ప్రాజెక్టులకు పునాదిరాయి వేశారు. గ్వాలియర్‌లో బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అంతర్జాతీయ వేదికలపై భారత్‌కు ప్రశంసలు దక్కుతున్నాయని, ఈ నిజాన్ని ప్రతిపక్షాలు జీర్ణించుకోలేకపోతున్నాయని చెప్పారు. ప్రతిపక్షాలకు కేవలం అధికారం తప్ప ఇంకేమీ కనిపించడం లేదని ప్రధానమంత్రి దుయ్యబట్టారు.



స్వర్ణ దేవాలయంలో రాహుల్

అమృత్‌సర్: కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం అమృత్‌సర్‌లోని స్వర్ణ దేవాలయాన్ని సందర్శించారు. గర్భాలయంలో పూజలు చేశాక సిక్కుల అత్యున్నత పీఠం అకల్‌తక్త్‌ను సందర్శించారు. భక్తులు వాడిన నీటి పాత్రలను ఆయన శుభ్రం చేశారు. మంగళవారం ఆయన పల్లకీ సేవలో పాల్గొననున్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే సుఖ్‌పాల్ సింగ్ ఖైరా ఇటీవల అరెస్ట్ అయ్యారు. దీంతో ఆప్ సర్కార్‌పై పంజాబ్ కాంగ్రెస్ ఆగ్రహంతో ఉంది. ఈ సమయంలో రాహుల్ రాష్ట్రంలో పర్యటించడంపై చర్చ నెలకొంది.

గూగుల్ మ్యాప్‌ను నమ్ముకుని.. కారును నదిలోకి డ్రైవ్ చేశారు..

- ఇద్దరు యువ డాక్టర్లు మృత్యువాత, మరో ముగ్గురికి గాయాలు
- కేరళలోని త్రిసూర్‌లో ఘటన

కొచ్చి: అర్ధరాత్రి వేళ..ఒక వైపు భారీ వర్షం..గూగుల్ మ్యాప్‌లో సూచనల ఆధారంగా ఓ వ్యక్తి కారును నడుపుతున్నాడు..అయితే, కారు చీకట్లో ఆ కారు ఏకంగా నదిలోకి దూసుకెళ్లి పడిపోయింది. ఈ ఘటనలో ఇద్దరు యువ వైద్యులు మృత్యువాతపడగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. కేరళలోని త్రిసూర్‌లో ఆదివారం అర్ధరాత్రి దాటాక ఈ విషాదం చోటుచేసుకుంది. ఘటన నేపథ్యంలో కేరళ పోలీసులు గూగుల్ మ్యాప్స్ ఆధారంగా కార్లు వంటి వాహనాల్లో వెళ్లేప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు హెచ్చరికలు చేశారు. అద్వైత్(29), అజ్మల్(29) అనే యువ వైద్యులు మంచి మిత్రులు. త్రిసూర్ జిల్లాలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. త్వరలోనే విదేశాలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. శనివారం అద్వైత్ పుట్టిన రోజు వేడుక కొచ్చిలో జరిగింది. అనంతరం వీరిద్దరూ మరో ముగ్గురు కలిసి కారులో త్రిసూర్‌కు బయలుదేరారు. అర్ధరాత్రి సమయంలో వర్షం జోరుగా పడుతోంది. గూగుల్ మ్యాప్ సూచనలను అనుసరిస్తూ డ్రైవర్ కారును నడుపుతున్నాడు. గోతురుత్ వద్ద అకస్మాత్తుగా పెరియార్ నదిలోకి దూసుకెళ్లింది. ఓ వ్యక్తి ప్రమాదం పసిగట్టి దగ్గర్లోని గ్రామస్తుల సాయంతో కారులోని వారిని రక్షించేందుకు ప్రయత్నించాడు. పోలీసులకూ సమాచారం అందించాడు. కారులో ఉన్న ఒక మహిళ సహా గాయపడిన ముగ్గురిని రక్షించి ఆస్పత్రికి తరలించారు. అద్వైత్, అజ్మల్ మృతదేహాలను స్కూబా డైవర్ల సాయంతో వెలికి తీశారు. ఘటన నేపథ్యంలో జీపీఎస్‌ను బట్టి వాహనాలు నడిపే వారు జాగ్రత్తగా ఉండాలని కేరళ పోలీసులు హెచ్చరికలు చేశారు. ప్రమాద సమయంలో భారీ వర్షం పడుతుండటంతో దారి కూడా సరిగ్గా కనిపించలేదు. మ్యాప్స్‌ను బట్టి అయితే వారు ఎడమ వైపునకు వెళ్లాల్సి ఉంది. కానీ, పొరపాటున కారు నేరుగా ముందుకే వెళ్లి నదిలో పడిపోయినట్లు కనిపిస్తోంది'అని పోలీసులు ఆదివారం ఫేస్‌బుక్‌లో తెలిపారు.

మోస్ట్ వాంటెడ్ ఐసిస్ ఉగ్రవాది ఢిల్లీలో అరెస్ట్


న్యూఢిల్లీ: జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) ఎంతగానో అన్వేషిస్తున్న మోస్ట్ వాంటెడ్ ఐసిస్ ఉగ్రవాది మొహమ్మద్ షానవాజ్‌ను ఢిల్లీ పోలీసులు సోమవారం అరెస్ట్‌చేశారు. ఇతనితోపాటు మరో ఇద్దరు సహాయకులనూ అదుపులోకి తీసుకున్నారు. ఐఈడీ బాంబుల తయారీలో వినియోగించే రసాయనాలు, ఉపకరణాలను వీరి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షానవాజ్‌ను ఢిల్లీలోని జయిత్‌పూర్‌లో, రిజ్వాన్ అష్రాఫ్‌ను లక్నోలో, అర్షాద్ వార్సీని మొరాదాబాద్‌లో పట్టుకుని పోలీసులు ఏడు రోజులు తమ కస్టడీలోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు ఉగ్రవాదులూ ఇంజనీరింగ్ పట్టభద్రులే. దాడుల కోసం పశ్చిమ, దక్షిణ భారతదేశాల్లోని పలు చోట్ల ఇప్పటికే రెక్కీలు నిర్వహించామని పోలీసు విచారణలో వాళ్లు ఒప్పుకున్నారు. పశ్చిమ కనుమల్లో స్థావరాన్ని ఏర్పాటుచేసుకోవడంపై దృష్టిపెట్టామని వెల్లడించారు. గతంలో పుణే పోలీసులు షానవాజ్‌ను అరెస్ట్‌చేయగా కస్టడీ నుంచి తప్పించుకుని వచ్చి ఢిల్లీలో మకాం పెట్టాడు. ఇతనిపై రూ.3 లక్షల రివార్డ్ ఉంది. షానవాజ్ వద్ద సూక్ష్మ ప్లాస్టిక్ ట్యూబ్‌లు, ఇనుప గొట్టాలు, వివిధ రకాల రసాయనాలు, టైమింగ్ డివైజ్ తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితోపాటు పిస్టల్, మందుగుండు ఇతని వద్ద లభించాయి. సరిహద్దుల ఆవల నుంచి హ్యాండ్లర్ల ద్వారా వీరి వద్దకు చేరిన బాంబుల తయారీ విజ్ఞానం తాలూకు పుస్తకాలు, డిజిటల్ డేటాను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 3 । అక్టోబర్ । 2023



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి: దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి విజయనగరం జిల్లా పూసపాటి రేగకు చెందిన పులప కాశీబాబు, నాగమణి కుటుంబం సోమవారం రూ.1,01,116 విరాళం అందజేసింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 525.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



సుబ్బారాయుడికి వెండి కానుకలు

మోపిదేవి: శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళగిరికి చెందిన గీతికా బాంధవ్య కుటుంబ సభ్యులు సోమవారం రూ. 57 వేల విలువైన వెండి ప్లేట్, వెండి చెంబు సమర్పించారు.

న్యూస్‌రీల్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం



చిలకలపూడి(మచిలీపట్నం): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణసారిక సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో సోమవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ దివస్ అంశాలకు అనుగుణంగా పరిసరాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి అరుణసారిక మాట్లాడుతూ.. పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంటే ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందన్నారు. రోగాలు కూడా దూరమవుతాయన్నారు. జడ్జీలు చిన్నంశెట్టి రాజు, ఎ.నరసింహమూర్తి, పి.రామకృష్ణ, కె.వి. రామకృష్ణయ్య, చినబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర డాక్టర్ల విభాగంలో నలుగురికి చోటు

కంకిపాడు(పెనమలూరు): వైఎస్సార్ సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర కమిటీలో కృష్ణా జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ అధినేత, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రాష్ట్ర డాక్టర్ల విభాగ కమిటీ నియామకం చేపడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో విడుదల చేసింది. పార్టీ అనుబంధ డాక్టర్ల విభాగం రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ జె.శివలక్ష్మీపూర్ణిమ, సహాయ కార్యదర్శులుగా డాక్టర్ ఎం.వరప్రసాద్, డాక్టర్ బొర్రా హేమేశ్వరరావు, డాక్టర్ కాగిత కృష్ణచంద్ నియమితులయ్యారు.

ఓపెన్ కరాటే చాంపియన్‌లో ఇద్దరికి ప్రథమ స్థానం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆల్ ఇండియా ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్–2023లో విజయవాడ నగరానికి చెందిన ఇద్దరికి ప్రథమ స్థానం లభించింది. పటమట చెన్నుపాటి రామకోటయ్య మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో గొల్లపూడిలోని జేకే గోజూరా కరాటే అకాడమీ సత్యనారాయణపురం బ్రాంచికి చెందిన కె.భవితరెడ్డి అండర్–7 విభాగంలో, జి.షణ్ముఖ్ అండర్ 11 విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. బాలికల అండర్–10లో బి.అక్షయ మూడో స్థానం దక్కించుకుంది. విజేతలను అకాడమీ కేఏఐ చైర్మన్ డాక్టర్ యు. బ్రహ్మానందం, సెక్రటరీ జె.శ్రీనివాసులు, హెడ్ కోచ్ జె.హరినాథ్, సత్యనారాయణపురం బ్రాంచి కోచ్ పి.వి.కె.ఎస్.హర్ష, ట్రెజరర్ సీహెచ్ మహేష్‌బాబు, టోర్నమెంట్ ఆర్గనైజర్లు జె.దినేష్, జె.విజయకుమార్ అభినందించారు.

వరుస సెలవులతో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): వరస సెలవుల నేపథ్యంలో ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ సోమవారం కూడా కొనసాగింది. రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు, కర్నాటక నుంచి భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు తమ వాహనాలను సీతమ్మవారి పాదాలు, కుమ్మరిపాలెం, పున్నమి ఘాట్, వీఎంసీ కార్యాలయాల వద్ద నిలుపుకొని దేవస్థాన బస్సుల్లో కొండపైకి చేరుకున్నారు. పలువురు భక్తులు కనకదుర్గనగర్ మీదుగా మహా మండపం లిఫ్టు, మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్నారు. అమ్మవారి దర్శనానికి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణంలో రద్దీ కనిపించింది. దుర్గామల్లేశ్వర స్వామి వార్లకు నిర్వహించిన ఆర్జిత సేవల్లో ఉభయదాతలు, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. సర్వ దర్శనానికి రెండు గంటలు, రూ.100, రూ.300, రూ.500 టికెట్ల క్యూలైన్‌లో గంటకు పైగా సమయం పట్టింది. అమ్మవారికి మహా నివేదన సమర్పించేందుకు అర్ధగంట పాటు అన్ని దర్శనాలు నిలిపివేయడంతో రద్దీ మరింత పెరిగింది. మధ్యాహ్నం మూడు గంటల వరకు అన్ని క్యూలైన్లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

పర్యాటక జలహాసం

- పర్యాటక ప్రాంతాలుగా బందరు, ఏలూరు, రైవస్ కాలువలు
- జలవనరుల శాఖ అనుమతి కోసం వీఎంసీ ప్రతిపాదనలు
- ఇప్పటికే పూర్తిస్థాయిలో మూడు కాలువల ప్రక్షాళన
- మూడు కాలువల్లో 6 టన్నుల వ్యర్థాల తొలగింపు
- గట్ల శుభ్రతకు 300 మంది కార్మికుల నియామకం



ప్రక్షాళన అనంతరం రైవస్ కాలువ



కేరళను తలపిస్తున్న కాలువ గట్టు



పచ్చందాలతో బందరు కాలువ గట్టు

పటమట(విజయవాడతూర్పు): ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా నదీ జలాలను సాగు అవసరాలకు విడుదల చేసే లెఫ్ట్ కెనాల్ బందరు, ఏలూరు, రైవస్ కాలువలకు కేంద్ర బిందువు. ఈ మూడు ప్రధాన కాలువలు విజయవాడ నగరం మీదుగా ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు ప్రవహిస్తాయి. ఈ కాలువలతో విజయవాడ ప్యారిస్ నగరం తరహాలో కనువిందు చేస్తోంది. వందల గ్రామాలకు తాగు, సాగు నీటిని అందించే ప్రధాన నీటి వనరులు ఇవి. బ్రిటీష్ హయాంలో, స్వాతంత్ర్యం వచ్చాక ఈ కాలువల ద్వారా ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రైతులు తమ పంట ఉత్పత్తులు, సరుకులను విజయవాడకు రవాణా చేసేవారు. అయితే ఈ కాలువలు కొన్ని దశాబ్దాలుగా ఆక్రమణలకు గురవడంతోపాటు వ్యర్థాల నిల్వతో మురికి కూపాలుగా మారాయి. ఇటీవల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హెలికాప్టర్‌లో వెళ్లే సమయంలో మూడు కాలువల్లో వ్యర్థాలు పేరుకుపోవడాన్ని గమనించి నగరపాలక సంస్థ (వీఎంసీ) అధికారులకు పలు సూచనలు చేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన చెత్త రహిత కాలువలుగా మార్చటంతోపాటు, కాలువ గట్లను సుందరీకరించి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దే చర్యలు చేపట్టారు. నగర పరిధిలో సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరం ప్రయాణించే ఈ కాలువలు ఇకపై పర్యాటక ప్రాంతాలుగా మారనున్నాయి. దీనికి సంబంధించి జలవనరుల శాఖ అధికారులతో వీఎంసీ అధికారులు సంప్రదింపులు జరిపారు. అతి త్వరలోనే ఇవన్నీ పర్యాటక ప్రదేశాలుగా మారనున్నాయి. ఇటీవలే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావుతోపాటు ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు కాలువల్లో వ్యర్థాల తొలగింపుపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.

300 మంది కార్మికుల నియామకం

బందరు, ఏలూరు, రైవస్ కాలువల గట్లు వెంబడి ఉండే చెత్త, వ్యర్థాలు, పిచ్చిమొక్కలు తొలగింపునకు వీఎంసీ చర్యలు చేపట్టింది. ఒక్కొక్క కాలువకు 100 మంది చొప్పున 300 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించింది. ఒక్కొక్క గట్టుకు 50 మంది చొప్పున నిరంతరం కాలువల వెంబడి వ్యర్థాలను సేకరించి, అక్కడి నుంచి తరలించటం వారి విధి. ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు కాలువల్లో నీటి పారుదలకు అవరోధంగా ఉండటంతో వీఎంసీ మూడు పడవలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. మూడు నెలల క్రితం ఇవి ప్రారంభమయ్యాయి. ఈ ప్రక్రియ ద్వారా ఇప్పటి వరకు సుమారు ఆరు టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలను కాలువల నుంచి వెలికితీశారు.

కాలువల్లో చెత్త వేయకుండా మెస్‌ల ఏర్పాటు

బందరు, ఏలూరు, రైవస్ కాలువల్లో నగర ప్రజలు చెత్త, వ్యర్థాలు వేయకుండా వీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మూడు కాలువలపై నగర పరిధిలో 18 వంతెనలు ఉన్నాయి. ఈ వంతెనల వద్ద ఇరువైపులా రైలింగ్‌లకు 15 అడుగుల ఎత్తున మెస్‌లు ఏర్పాటు చేశారు. నేతాజీ బ్రిడ్జి వద్ద సుందరంగా వర్టువల్ గార్డెన్ కూడా ఏర్పాటు చేశారు. మరో బ్రిడ్జి వద్ద కూడా ఈ విధంగా తీర్చిదిద్దేందుకు వీఎంసీ అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

అనుమతుల కోసం అర్జీ



నగరం మీదుగా ప్రవహిస్తున్న బందరు, ఏలూరు, రైవస్ కాలువలను పూర్తిస్థాయిలో సుందరీకరిస్తున్నాం. ఈ కాలువలపై నిరంతరం పర్యవేక్షణ, నిర్వహణకు చర్యలు తీసుకున్నాం. కాలువలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు జలవనరుల శాఖ అనుమతుల కోసం ఆ శాఖ అధికారులకు అర్జీ సమర్పించాం. త్వరలోనే పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ రత్నావళి, సీఎంఓహెచ్, విజయవాడ నగరపాలక సంస్థ

తగ్గిన దోమల ఉధృతి

కాలువల్లో చెత్త, వ్యర్థాలు తొలగించడంతోపాటు నీటి ప్రవాహానికి మార్గం సుగమం చేయటంతో నగరంలో దోమల ఉధృతి కూడా తగ్గింది. డ్రోన్‌ల సహాయంతో కాలువల్లో దోమల మందును పిచికారీ చేయటం, గట్ల వెంబడి ఉండే పిచ్చిమొక్కలు తొలగించటంతో మరింత ఫలితం వచ్చిందని వీఎంసీ అధికారులు తెలిపారు. గతంలో కాలువ గట్లపై చెట్లు గుబుర్లు ఉండటంతో అవి అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి. ఇప్పుడు వాటిని తొలగించటంతో అలాంటి చర్యలకు చెక్ పెట్టినట్లయిందని అధికారులు తెలిపారు.

మహాత్మా మనసాస్మరామి



మహాత్మాగాంధీ జయంతిని ఉమ్మడి కృష్ణా జిల్లాలో వాడవాడలా సోమవారం ఘనంగా నిర్వహించారు. గాంధీజీ విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సాధనలో మహాత్ముడి త్యాగాలను కొనియాడారు. గాంధీజీ జీవితం ప్రపంచానికి ఆదర్శమని పేర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

అమరావతి గుడికి బస్సు సర్వీసు

అమరావతి: భక్తులు, పర్యాటకుల సౌకర్యార్థం గుంటూరు నుంచి అమరావతి అమరేశ్వరస్వామి గుడి వరకు ఆర్టీసీ బస్సు సర్వీసులను పునరుద్ధరించినట్లు గుంటూరు–1 డిపో మేనేజర్ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం అమరావతి గుడి వద్ద నుంచి గుంటూరుకు ప్రతి అరగంటకు, దుర్గావిలాస్‌సెంటర్ నుంచి గుంటూరుకు ప్రతి 15 నిమిషాలకు ఓ సర్వీసు నడుపుతున్నామని తెలిపారు. అమరావతి గుడి నుంచి ఏడు సర్వీసులు, క్రోసూరు నుంచి మరో 10 సర్వీసులతో పాటు అచ్చంపేటకు ఒక సర్వీసు కలిపి మొత్తం 18 సర్వీసులు నడుపుతున్నామని పేర్కొన్నారు.

రైతుల సేవలో అగ్రి ల్యాబ్‌లు

- డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో రైతులకు ఉచిత పరీక్షలు
- కృష్ణా జిల్లాలో ఆరు, ఎన్టీఆర్ జిల్లాలో మూడు ల్యాబ్‌ల ఏర్పాటు
- విత్తనాల నుంచి ఎరువుల నాణ్యత వరకూ ఉచితంగా పరీక్షలు



పెడనలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్



ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న ఏఓ, ఏఈఓ

పెడన: వ్యవసాయంలో రైతులు ఆర్థిక పురోభివృద్ధి సాధించాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించాలి. అందు కోసం నాణ్యతా ప్రమాణాలతో కూడిన మేలు రకం విత్తనాలు, ఎరువులను వాడాలి. విత్తనాల నుంచి ఎరువుల వరకు నాణ్యమైనవి మాత్రమే రైతులకు అందించాలనే ఉన్నత లక్ష్యంతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు ప్రతి నియోజకవర్గంలో డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ఈ ల్యాబ్‌ల కోసం ప్రతి నియోజకవర్గంలో రూ.66.50 లక్షలతో భవనాలు నిర్మించింది. రూ.లక్షలు వెచ్చించి, కావాల్సిన పరీక్ష సామగ్రితో ప్రయోగశాలను ఏర్పాటు చేసింది. భూసారం, విత్తనాల స్వచ్ఛత, మొలక శాతం, ఎరువుల నాణ్యత తెలుసుకునేందుకు గతంలో దూర ప్రాంతాలకు పరుగులు తీసిన రైతులు ఇప్పుడు తమ సమీపంలోని డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఆశ్రయిస్తున్నారు.

ఐదు ల్యాబ్‌ల ఏర్పాటు

డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ కృష్ణా జిల్లాలో ఆరు, ఎన్టీఆర్ జిల్లాలో మూడు ఇప్పటికే అందుబాటులోకి వచ్చి, రైతులకు సేవలు అందిస్తున్నాయి. కృష్ణాజిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పెడన, మచిలీపట్నం, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో గన్నవరం మినహా మిగిలిన ఆరు చోట్ల అందుబాటులోకి వచ్చాయి. పెనమలూరు నియోజకవర్గంలోని కంకిపాడులో ల్యాబ్ ఏర్పాటు చేశారు. పెడన, అవనిగడ్డ, పామర్రులోని ల్యాబ్‌ల్లో విత్తనాల నాణ్యతను పరీక్షిస్తున్నారు. మచిలీపట్నం, గుడివాడ, కంకిపాడులో ఎరువులను పరీక్షిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో ఈ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి.

రైతులకు ఉచితంగా పరీక్షలు

డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో ఉచితంగా పరీక్షలు చేయనున్నారు. అయితే రైతులు తాము కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు ఉండాలి. ఈ బిల్లులతో పాటు రైతు ఆధార్ కార్డు తీసుకెళ్తే ఉచితంగా పరీక్షలు చేసి నివేదిక అందిస్తారు. ఈ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతోంది. గతంలో ఎరువులు, విత్తనాలు పరీక్షల కోసం జిల్లా కేంద్రాలకు, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. దీంతో వ్యయం, సమయం వృథా అయ్యేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు.

నాణ్యత పరీక్షలు ఇలా...

వరి, మొక్కజొన్న, వేరుశనగ, పెసర, పిల్లి పెసర, జనుము, రాగులు, సజ్జలు, కంది తదితర పంటలతో పాటు కూరగాయల విత్తనాల నాణ్యతను కూడా డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లలో పరీక్షలు చేస్తున్నారు. పరీక్షించే విత్తనాలను నాలుగు తరాలుగా విభజిస్తారు. యాక్ట్, ఫార్మర్స్, ఆర్‌బీకే, ట్రేడ్ శ్యాంపిల్స్‌గా విభజిస్తారు. యాక్ట్ శాంపిల్స్ రీజినల్ కోడింగ్ సెంటర్లు నుంచి వచ్చిన వాటిని పరీక్షిస్తారు. అమరావతి, తిరుపతి, విశాఖ, తాడేపల్లిగూడెంలోని ల్యాబ్‌ల నుంచి కోడింగ్ ద్వారా వచ్చే శ్యాంపిల్స్‌ను పరీక్షించి మళ్లీ అక్కడికే పంపిస్తారు. ఫార్మర్స్ ద్వారా వచ్చే వాటిని విత్తనాల రకాలను బట్టి వారం లేదా రెండు వారాల్లో పరీక్షల ఫలితాలను రైతులకు తెలుపుతారు. ఆర్‌బీకేలలో వీఏఏలు, ఎంపీఈఓలు ద్వారా వచ్చే వాటిని పరీక్షిస్తారు. ట్రేడ్ శ్యాంపిల్స్ విషయంలో కొంత రుసుం చెల్లించి సదరు డీలర్లు ఆయా విత్తనాలను, ఎరువులను పరీక్షించుకునే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పించింది. వెరసి రైతులకు మంచి నాణ్యత కలిగిన ఎరువులు, విత్తనాలు ఇవ్వాలనే ఆలోచనతో ఈ దిశగా అడుగులు వేసింది.

అధునాతన పరికరాలతో పరీక్షలు



అధునాతన పరికరాలతో కచ్చితమైన ఫలితాలను ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసింది. ప్రతి రైతూ వీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల నాణ్యతను పరీక్షించుకోవచ్చు. దీని వలన మంచి విత్తనాలు నాటి మెరుగైన దిగుబడులు సాధించుకోవచ్చు. నెలకు 20 పరీక్షలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. నెల రోజుల నుంచి పెడన ల్యాబ్ అందుబాటులోకి వచ్చింది.

– గుడిసేవ గీతాదేవి, ఏఓ, అగ్రిటెస్టింగ్ ల్యాబ్, పెడన

రైతులకు ఎంతో మేలు



డాక్టర్ వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్‌లతో రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. మట్టి నమూనా నుంచి విత్తు, ఎరువులు నాణ్యత వరకూ ఈ ల్యాబ్‌లలో పరీక్షలు చేస్తారు. సాగు ఆరంభం నుంచి ఏ పంట వేస్తే బాగుంటుంది, ఎటువంటి విత్తనాలు వాడాలి, ఎటువంటి ఎరువులు ఎంత మోతాదులో వాడాలనే విషయాలు తెలుస్తాయి. గతంలో ఈ పరీక్షలు చేయించాలంటే రైతులకు ఖర్చులు అధికంగా ఉండేవి. ఆ పరిస్థితులను అధిగమించడానికి ఈ ల్యాబ్‌లు ఉపకరిస్తాయి. దిగుబడులు పెంచుకునేలా రైతులకు మేలు జరుగుతోంది.

– జన్ను నాగమల్లేశ్వరరావు, నందిగామ, పెడన మండలం

నేటి నుంచి ఫార్మేటివ్–2 పరీక్షలు

- ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఏర్పాట్లు పూర్తి
- పరీక్షలు రాయనున్న ఐదున్నర లక్షల మంది విద్యార్థులు



పాఠశాల విద్యార్థులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను వెలికితీసేందుకు ఫార్మేటివ్–2 పరీక్షల నిర్వహణకు ఉమ్మడి కృష్ణాజిల్లాలోని విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం నుంచి ఈ పరీక్షలు జరగనున్నాయి. ఫార్మేటివ్–1 పరీక్షలను క్లాస్‌రూమ్ బెస్ట్ విధానంలో ఓఎంఆర్‌లతో నిర్వహించారు. ఫార్మేటివ్–2 (ఎఫ్ఏ–2) పరీక్షలు పాత విధానంలోనే జరుగుతాయి. ఒకటి నుంచి పదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) రూపొందించిన ఉమ్మడి పరీక్ష పత్రాలతో ఫార్మేటివ్–2 పరీక్షలు జరిపేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రశ్న పత్రాలను బ్లాక్ బోర్డుపై ఉపాధ్యాయులు రాస్తారు. విద్యార్థులు వాటిని పేపర్‌లో నమోదు చేసుకుని సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఎఫ్ఏ–2 పరీక్షకు ప్రింటెడ్ పేపర్ల సరఫరా లేదు. అన్ని మేనేజ్‌మెంట్ల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశ్న పత్రాలను మెయిల్‌లో పంపిస్తారు. వాటిని ప్రధానోపాధ్యాయులు డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్ష నిర్వహించాలి.

5.50 లక్షల మంది సన్నద్ధం

కృష్ణాజిల్లాలోని ఎయిడెడ్, ప్రభుత్వ, జెడ్పీ స్కూళ్లలో 1,01,097 మంది, ప్రైవేట్ యాజమాన్యాల్లో 1,10,622 మంది చొప్పున 2,11,719 మంది విద్యార్థులు ఎఫ్ఏ–2 పరీక్షలు రాస్తారు. ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, జెడ్పీ యాజమాన్యాల్లో 1,11,661 మంది, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని 2,33,092 మంది చొప్పున 3,44,753 మంది పరీక్షలకు హాజరవుతారు. ఉమ్మడి జిల్లాలో 5,56,472 మంది హాజరవుతున్నారు. రెండు జిల్లాల్లో సుమారు 3,300 ప్రైవేట్, ప్రభుత్వ స్కూళ్లు ఉన్నాయి.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఈ నెల మూడో తేదీ నుంచి జరిగే ఫార్మేటివ్–2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశాం. పొరపాట్లకు తావులేకుండా ఫార్మేటివ్–1 పరీక్ష నిర్వహించాం. అలానే ఫార్మేటివ్–2 పరీక్షను కూడా సక్రమంగా నిర్వహిస్తాం. అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలి.

– ఉమర్‌అలీ, కార్యదర్శి, సీఈబీ, ఎన్టీఆర్ జిల్లా



విజయవాడ పున్నమ్మతోటలో ఆర్యోగమణికి వృద్ధాప్య పింఛన్ అందజేస్తున్న వలంటీర్ భువన్ ప్రకాష్‌రెడ్డి

80.40 శాతం మందికి పింఛన్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ జిల్లాలో ముమ్మరంగా జరుగుతోంది. రెండో రోజైన సోమవారం సాయంత్రానికి 80.40 శాతం మందికి పింఛన్ కానుక అందింది. జిల్లాలో వివిధ పింఛన్ల లబ్ధిదారులు 2,37,888 మంది ఉన్నారు. రెండో రోజు సాయంత్రానికి 1,91,266 మందికి పింఛన్లు అందాయి. జిల్లాలో అత్యధికంగా జి.కొండూరు మండలంలో 96.69 శాతం, తిరువూరులో 93.12 శాతం, ఇబ్రహీంపట్నంలో 92.18 శాతం, వీరులపాడు మండలంలో 91.95 శాతం, కంచికచర్లలో 91.73 శాతం మందికి పింఛన్ కానుక అందింది.

నేటి నుంచి సర్టిఫికెట్ల పరిశీలన

పెడన: ఉమ్మడి కృష్ణా జిల్లాలో సమగ్ర శిక్ష ద్వారా ఐఈఆర్‌పీకి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన అభ్యర్థుల్లో ఎంపికైన వారి జాబితాలను ఆన్‌లైన్‌లో ఉంచామని సమగ్ర శిక్ష ఏపీసీ ముదిగొండ ఫణిదూర్జటీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ జాబితా ప్రకారం అభ్యర్థుల సర్టిఫికెట్లను మంగళవారం నుంచి పరిశీలిస్తామని పేర్కొన్నారు. ఎంఆర్ కేటగిరీలోని 96 మంది సర్టిఫికెట్లను మంగళవారం, హెచ్ఐ/వీఐ కేటగిరీలో 77 మందివి బుధవారం మచిలీపట్నం డీఈఓ కార్యాలయంలో పరిశీలిస్తామని తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం పది గంటల నుంచి జరిగే ఈ సర్టిఫికెట్ల పరిశీలనకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్లు జిరాక్స్ అటెస్టెడ్ చేయించినవి తీసుకురావాలని సూచించారు.

క్లుప్తంగా

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మనుషులు శాకాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని నేషనల్ వెజిటేరియన్ మూవ్‌మెంట్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీనివాస్ చెప్పారు. అంతర్జాతీయ అహింసా దినోత్సవం సందర్భంగా సోమవారం సాయంత్రం సిద్ధార్థ ఆడిటోరియంలో విజయవాడ వెజిటేరియన్ క్లబ్ ప్రారంభోత్సవం జరిగింది. ముందుగా క్లబ్ సభ్యులు శాకాహారం ప్రాధాన్యం తెలిసేలా సిద్ధార్థ ఆడిటోరియం నుంచి పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రోడ్లల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు, కరపత్రాల పంపిణీతో పాటుగా మైక్ ద్వారా ప్రచారం చేశారు. అనంతరం సిద్ధార్థ ఆడిటోరియంలో క్లబ్ ప్రారంభ సభ నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రాణుల పట్ల దయ చూపడమే ధర్మమని, వాటిని చంపడం మహా పాపమని గౌతమ బుద్ధుడు చెప్పాడన్నారు. మనిషి శరీర నిర్మాణానికి ముఖ్యంగా ప్రొటీన్‌లు, కార్బోహైడ్రేట్‌లు, కొవ్వు పదార్థాలు, లవణాలు అవసరమని శాస్త్రవేత్తలు నిర్ధారించారని తెలిపారు. అవి మాంసాహారంలో కంటే శాకాహారంలో ఎక్కువ శాతంలో ఉంటాయని పేర్కొన్నారు. శాకాహారులుగా మారి ఆరోగ్యంగా జీవించాలని సూచించారు.

హోటల్ మేనేజ్‌మెంట్, కార్ డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్‌లో ఈ నెల 5 నుంచి హోటల్ మేనేజ్‌మెంట్, కార్ డ్రైవింగ్‌లో శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు డైరెక్టర్ పరదేశి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుకు రెండు నెలలు, కార్ డ్రైవింగ్ నెల రోజులు ఉచితంగా శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు వివరించారు. కార్ డ్రైవింగ్ సిమ్యులేటర్ సహాయంతో నేర్పిస్తారని చెప్పారు. వివరాలకు 9347897922 ఫోన్ నంబరును సంప్రదించాలని సూచించారు.

ఓ వర్గం మీడియా తమ విధానాలు పునఃసమీక్షించుకోవాలి

మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



సభలో మాట్లాడుతున్న మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాత్ముడి స్మృతికి నివాళిగా రాష్ట్రంలోని ఒక వర్గం మీడియా తమ విధానాలు పునః సమీక్షించుకోవాలని సి. ఆర్. మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సూచించారు. ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొమ్మినేని మహాత్ముడు పాత్రికేయునిగా నిర్వహించిన సేవలను కొనియాడారు. మార్కెట్ శక్తుల ప్రధాన పాత్ర కారణంగా మీడియా రంగం కల్లోలంగా మారిన ప్రస్తుత తరుణంలో, మహాత్మా గాంధీ 'జర్నలిజం సిద్ధాంతాన్ని' మననం చేసుకోవడం అవసరమని పేర్కొన్నారు. వార్తాపత్రికను జీవనోపాధిగా ఉపయోగించడం తప్పని, ఒక వార్తాపత్రికను లాభాలను ఆర్జించే సాధనంగా పరిగణించినప్పుడు, ఫలితం తీవ్రమైన దుష్ప్రవర్తనకు దారితీసే అవకాశం ఉందని మహాత్ముడు అభిప్రాయం వ్యక్తం చేశారన్నారు. దేశ రాజధానితో పాటు, ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా పత్రికా స్వేచ్ఛ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉందన్నారు. అందువల్ల కొన్ని వర్గాల మీడియా సాక్షాత్తూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి పై దిగజారుడు భాషను ప్రయోగిస్తున్నాయని తెలిపారు. ఈ వర్గాల మీడియాకు దమ్ముంటే పక్క రాష్ట్రాలు, దేశ రాజధానిలో పాలకులపై ఇదే విధంగా రాయాలని సవాల్ విసిరారు. కక్ష, ప్రతి అంశం పై దుమ్మెత్తి పోయడం, విషం చిమ్మడం ఆ వర్గ మీడియాకు అలవాటైపోయిందని చెప్పారు. అత్యంత ప్రజాదరణ పొందిన 'సచివాలయాల' పై కూడా ఈ మీడియా వర్గాలు విషం చిమ్మడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఇలా జర్నలిజం కట్టు తప్పి ప్రవర్తించడం సరికాదని మహాత్ముడు భావించారన్నారు. వార్తాపత్రిక ఒక గొప్ప శక్తి, కానీ నియంత్రణ లేని పెన్ను నాశనం చేయడానికి ఉపయోగపడుతుందని గాంధీజీ తన అభిప్రాయంగా 'ఆత్మకథ' లో రాసుకున్నారని గుర్తు చేశారు. అదేవిధంగా తప్పుడు కథనాలు రాయడం పై కూడా గాంధీజీ తన అభిప్రాయాలు నిర్మొహమాటంగా వ్యక్తపరిచారన్నారు. ఏదైనా నివేదిక (రిపోర్ట్) ను ప్రచురించే ముందు నిజనిజాలు అన్ని పక్షాల నుంచి నిర్ధారించుకోవాలని, అసత్యం నుంచి నిజాన్ని జల్లెడ పట్టి వాస్తవాన్ని మాత్రమే ఊహించగలగాలని, అప్పుడు కూడా దానిని ధ్రువీకరించడం సాధ్యం కాకపోతే, నివేదికను అస్సలు ప్రచురించకపోవడమే మంచిదని గాంధీజీ చెప్పారన్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి. విజయబాబు మాట్లాడుతూ గాంధీజీ విలువైన లక్ష్యాలుగా భావించిన సహనం, సత్యాగ్రహం వంటి లక్షణాలు అన్నీ నేటి సమాజం లో మృగ్యమైపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీజీ ప్రతిపాదించిన విలువలు ఆచరించడమే ఆయనకు ఇవ్వగలిగిన నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. రచయిత కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సభలో డాక్టర్ నందమూరి లక్ష్మీపార్వతి, అకాడమీ సెక్రటరీ బాల గంగాధర తిలక్, ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పి. గౌతం రెడ్డి, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాస రావు, డాక్టర్ అద్దంకి రాజా తదితరులు పాల్గొన్నారు.

శోకసంద్రమైన పోలిశెట్టిపాడు


కానిస్టేబుల్ నరేంద్ర మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి, అధికారులు


అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

- కానిస్టేబుల్ నరేంద్ర మృతితో విషాదం
- అధికార లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళులర్పించిన ఎమ్మెల్యే రక్షణనిధి, పోలీసు అధికారులు

ఏకొండూరు: గణేష్ నిమజ్జనం సందర్భంగా శనివారం రాత్రి ఆగిరిపల్లిలో ఓ వ్యక్తి చేతిలో దాడికి గురైన కానిస్టేబుల్ గంథం నరేంద్ర మృతితో ఆయన స్వగ్రామమైన పోలిశెట్టిపాడులో విషాదఛాయలు అలముకున్నాయి. నూజివీడు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం నరేంద్ర మృతదేహాన్ని పోలిశెట్టిపాడు తరలించారు. మృతుడికి భార్య, మూడేళ్ల కుమారుడు, ఏడు నెలల కుమార్తె ఉన్నారు. వివాదరహితుడిగా, మృదు స్వభావిగా పేరొందిన నరేంద్ర విధి నిర్వహణలో మృతి చెందినట్లు తెలుసుకున్న స్నేహితులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్రంగా విలపించారు. తిరువూరు ఎమ్మెల్యే కె.రక్షణనిధి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ డీసీపీ వేజెండ్ల రజిత, మైలవరం ఏసీపీ రమేష్, నూజివీడు డీఎస్పీ అశోక్‌కుమార్, తిరువూరు సీఐ భీమరాజు, 8 మండలాల ఎస్‌ఐలు, సిబ్బంది నరేంద్ర మృతదేహానికి నివాళులర్పించారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

నరేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం : ఎమ్మెల్యే రక్షణనిధి

విధి నిర్వహణలో మృతి చెందిన నరేంద్ర కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే కె.రక్షణనిధి అన్నారు. వినాయక నిమజ్జనం విధుల్లో నరేంద్ర దాడికి గురై మృతి చెందడం విచారకరమన్నారు. మృతుడి భార్యకు ప్రభుత్వోద్యోగం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని, పిల్లలకు అయ్యే చదువుల ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని వెల్లడించారు.

టీడీపీతో పొత్తు కారణంగానే జనం రాలేదు

- అవనిగడ్డ నియోజకవర్గంలో 70 వేల మంది కాపులున్నారు
- స్టార్‌డమ్ ఉన్న హీరో సభ జనం లేక వెలవెలబోయింది
- పొత్తులపై పవన్ పునఃపరిశీలన చేసుకోవాలి
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

అవనిగడ్డ: టీడీపీతో జనసేన పొత్తు కారణంగానే కృష్ణా జిల్లా అవనిగడ్డలో ఆదివారం నాటి పవన్‌కళ్యాణ్ సభకు జనం రాలేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో 70 వేల మంది కాపులున్నారని, టీడీపీతో పొత్తు వల్లనే చాలామంది పవన్‌కళ్యాణ్ వారాహి సభకు రాలేదన్నారు. ఒక స్టార్‌డం ఉన్న హీరో సభ జనం లేక వెలవెలబోయిందని, ఎందుకు జనం రాలేదో పవన్‌కళ్యాణ్ ఆలోచించుకోవాలన్నారు. టీడీపీ, జనసేన పొత్తు ప్రకటన అనంతరం తొలిసారి జరిగిన వారాహియాత్ర అట్టర్ ఫెయిల్ అన్నారు. రెండు పార్టీలు కలిసినా జనం రాలేదంటే ఆ కూటమి పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవాలని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని అందువల్లనే పవన్‌కళ్యాణ్ సభవైపు చూడలేదన్నారు. వారం రోజుల నుంచి పవన్‌కళ్యాణ్ సభ గురించి విస్తృతంగా ప్రచారం చేసినా ఇతర జిల్లాల నుంచి జనాలను తరలించినా, రెండు పార్టీలు కలసి వచ్చినా పవన్‌సభకు స్పందన కరువైందంటే ఆ కూటమిని జనం తిరస్కరించడమే కారణమన్నారు. ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు. వచ్చేది సంకీర్ణ ప్రభుత్వం కాదని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే కచ్చితంగా అధికారం చేపడుతుందన్నారు. కురుక్షేత్ర సంగ్రామంలో పాండవులదే విజయమని, కౌరవుల్లా ఎన్ని కూటములు కట్టుకున్నా మరోసారి భంగపాటు తప్పదన్నారు. జగన్ చరిష్మాని తట్టుకునే శక్తిలేకనే కూటములు కడుతున్నారని ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల తరువాత కూటమి కట్టిన రెండు పార్టీలు కనుమరుగవడం ఖాయమని తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, పులిగడ్డ సర్పంచ్ దాసరి విజయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, ఎంపీటీసీలు గోళ్ళ కృష్ణకుమారి, మెరుగుమాల ఝాన్సీరాణి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌బాషా, ఉపసర్పంచ్ కోడూరు సత్యనారాయణ, లంకమ్మ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, యూత్ నాయకులు బాలభాస్కర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పిల్లలు పుట్టడం లేదని మానసికంగా కుంగిపోయిన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జక్కంపూడి వైఎస్సార్ కాలనీలోని బ్లాక్ నెం 105లో కొండపల్లి పద్మ, రామకృష్ణ నివాసం ఉంటున్నారు. వీరికి వివాహమై 8 సంవత్సరాలు అవుతుంది. భర్త టైలరింగ్ పని చేస్తుంటాడు. పద్మ ఇంటి వద్దే ఉంటుంది. వీరికి పిల్లలు లేకపోవడంతో తరచూ పద్మ మానసికంగా కుంగిపోతుంది. కొత్త రాజరాజేశ్వరిపేటలో నివాసం ఉంటున్న పద్మ అక్క లక్ష్మీకి స్థానికంగా ఉన్న వారు ఫోన్ చేసి మీ చెల్లెలు ఇంట్లో ఉరి వేసుకుందని చెప్పారు. దీంతో హుటాహుటిన చెల్లెలు వద్దకు వచ్చిన లక్ష్మీ ఇంటి లోపలకు వెళ్లి చూడగా పద్మ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని కన్పించింది. ఘటనపై మృతురాలి అక్క ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతిపై కేసు నమోదు

పెడన: గుడివాడ రోడ్డులోని డంపింగ్ యార్డు వద్ద ఒక వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండల పరిధిలోని కొంకేపూడి గ్రామానికి చెందిన మాడెం శ్రీనివాస్ (42) ఆదివారం ఉదయం నుంచి మద్యం తాగుతూ ఉన్నాడు. రాత్రి కూడా పెడన వచ్చి మద్యం విపరీతంగా తాగి తిరిగి కొంకేపూడి బయలుదేరాడు. మార్గం మధ్యలోని డంపింగ్ యార్డు వద్ద పడిపోయాడు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో అటుగా వెళ్తున్న వారు గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు హుటాహుటిన మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే శ్రీనివాసరావు మృతి చెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. మృతుడి భార్య భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ టి.సురేష్ కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామ స్వరాజ్యం నిజం చేసిన వ్యక్తి జగనన్న


గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, కలెక్టర్ ఢిల్లీరావు, కమిషనర్ స్వప్నిల్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం జగనన్న నిజం చేసి చూపిస్తున్నారని ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పాతబస్తీలోని పార్క్‌లో గాంధీ విగ్రహం వద్ద సోమవారం గాంధీ జయంతి నిర్వహించారు. కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఏపీడీఐసీ చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, కార్పొరేటర్ మండేపూడి ఛటర్జీ తదితరులు గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ మహాత్ముడిని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అహింసా సిద్ధాంతాన్ని ఆయుధంగా మలచుకొని దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చారని చెప్పారు. కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ గ్రామ సచివాలయాల వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేశారన్నారు. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన వ్యక్తి గాంధీజీ అని, ఆమహనీయుడు మన దేశంలో జన్మించడం మనకు గర్వ కారణమని వివరించారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ స్వాతంత్రం కావాలా పరిశుభ్రత కావాలా అని ఆనాడు గాంధీజీని అడిగిన సందర్భంలో పరిశుభ్రత వైపే ఆయన మొగ్గు చూపారన్నారు. అదే స్ఫూర్తితో మన స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ప్రతి ఏడాది అక్టోబర్ రెండో తేదీన శానిటేషన్‌కు సంబంధించి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి, గాంధీజీ వాకర్స్ అసోసియేషన్ నాయకులు శ్రీనివాసరావు, అన్వర్ ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనాలు చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

రూ. 6 లక్షల విలువ చేసే 10 వాహనాలు స్వాధీనం


నిందితుడితో పాటు స్వాధీనం చేసుకున్న వాహనాలు చూపిస్తున్న ఏసీపీ భాస్కరరావు

పటమట(విజయవాడతూర్పు): ఆయన పాత కార్లు విక్రయించే బ్రోకర్.. వ్యాపారం అంతగా లేకపోవటంతో ద్విచక్ర వాహనాలు దొంగిలించి సొమ్ము చేసుకోవటం అలవాటు చేసుకున్నాడు. పార్కింగ్ చేసిన వాహనాల్లో హ్యాండ్ లాక్ వేయని వాటిని లక్ష్యంగా చేసుకుని చాకచక్యంగా చోరీ చేస్తాడు. ఐదో నంబరు రోడ్డులో ద్విచక్రవాహనాల స్పేర్‌పార్ట్స్ అమ్మే దుకాణాల వద్ద కంపెనీ లాక్‌సెట్ తీసేసి కొత్తవి వేసి.. గతంలో తాను అమ్మిన కార్ల నంబర్లను దొంగిలించిన ద్విచక్రవాహనాలకు వేసి తెలిసిన వారికి మాత్రమే అమ్ముతాడు. ఇలాంటి ఘరానా మోసగాడిని పటమట పోలీసులు అరెస్ట్ చేసి 10 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై సెంట్రల్ ఏసీపీ భాస్కరరావు సోమవారం పటమట పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. రామలింగేశ్వరనగర్‌కు చెందిన అబ్దుల్ రహీమ్ ఏడో తరగతి వరకు చదువుకొని కొంతకాలం ఓ కార్‌షెడ్‌లో పనిచేశాడు. తర్వాత సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మే బ్రోకర్‌గా అవతారమెత్తాడు. ఏడు నెలలుగా నిందితుడు పటమట, మాచవరం, గవర్నర్‌పేట, సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాలు చోరీ చేస్తున్నాడు. తక్కువ రేటుకే వాహనాలు ఇప్పిస్తానని నమ్మించి పెద్ద మొత్తంలో అడ్వాన్ తీసుకుంటాడు. సీబుక్ కోసం ఆర్టీవో కార్యాలయం వరకు తీసుకెళ్లేవాడు. అక్కడ టెక్నికల్ సమస్యల వల్ల ట్రాన్స్‌ఫర్ అవ్వటం లేదని కొనుగోలుదారులను నమిస్తాడు. వచ్చిన సొమ్ముతో జల్సాలు చేస్తాడు. ఇటీవల కాలంలో ద్విచక్రవాహనాల చోరీలపై ఫిర్యాదులు ఎక్కువగా రావటంతో దృష్టి సారించిన పోలీసులు పార్కింగ్‌ల వద్ద నిఘా ఏర్పాటు చేయగా పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనం చోరీ చేయడం సీసీ కెమెరాల్లో రికార్డయింది. దీంతో అనుమానం వచ్చి నిందితుడిని వెంబడించగా కామినేని నగర్‌లో ఓ వ్యక్తికి వాహనం అమ్మే ప్రయత్నంలో పోలీసులు పట్టుకున్నారు. రూ.6 లక్షల విలువ చేసే 10 ద్విచక్రవాహనాలు చోరీ చేసినట్లు విచారణలో ఒప్పుకున్నాడు. పటమట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఐదు, మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు, గవర్నర్‌పేట, సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒక్కో ద్విచక్రవాహనాన్ని దొంగిలించాడు. రద్దీ ప్రదేశాల్లో, పార్కింగ్ ప్రాంతాల్లో వాహనాలను తప్పనిసరిగా హ్యాండ్‌లాక్ వేయాలని, వాహనాల భద్రతపై యజమానులు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ సూచించారు. ఈ సమావేశంలో పటమట సీఐ కాశీవిశ్వనాథ్, క్రైం ఎస్‌ఐ పవన్ పవన్‌కుమార్, కానిస్టేబుళ్లు ఆరిఫ్, ప్రతాప్ కుమార్ పాల్గొన్నారు.

బాలికపై లైంగికదాడికి యత్నం

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): ఆరేళ్ల బాలికపై 50 ఏళ్ల వ్యక్తి లైంగికి దాడికి యత్నించిన ఘటన మండలంలోని కొటికలపూడిలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. భర్త మృతితో ఓ మహిళ ఇద్దరు పిల్లలను పెట్టుకుని పుట్టింట్లో ఉంటుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి పక్కన ఉంటున్న 50 ఏళ్ల బోళ్ల కోటేశ్వరరావు (పెద్దోడు) ఒకటో తరగతి చదువుతున్న చిన్న కుమార్తెపై అత్యాచార యత్నం చేశాడు. బాలిక అమ్మమ్మ ఇంటికి రావడం గమనించిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక ఏడుపును గమనించిన కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించి ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో నిందితుడిపై ఫిర్యాదు చేశారు. గ్రామానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చేపట్టారు.

ఊబిలో కూరుకుపోయి వీఆర్వో మృతి


వీఆర్వో ఇమ్రాన్ (ఫైల్)

కంచికచర్ల(వీరులపాడు): ప్రమాదవశాత్తు వరద ఉధృతికి కొట్టుకుపోయి వీఆర్వో మృతి చెందిన ఘటన కీసర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ సుబ్రహ్మణ్యం తెలిపిన సమాచారం మేరకు.. గంపలగూడెం వీఆర్‌ఓ గా పని చేస్తున్న షేక్ ఇమ్రాన్ (27) వరుసకు బావ అయిన వ్యక్తితో కలిసి కేసర మునేటి వద్దకు వచ్చాడు. లోతు తెలియకపోవడంతో మునేటిలో దిగిన ఇమ్రాన్ వరద ఉధృతికి కొట్టుకుపోయాడు. పక్కనే ఉన్న వ్యక్తి కేకలు వేయడంతో సమీపంలో ఉన్న కొంతమంది వచ్చి వరదకు కొట్టుకుపోయిన ఇమ్రాన్ కోసం వెతికారు. కొంత దూరంలో ఊబిలో ఇరుక్కొని మృతి చెందాడు. మృతుడికి రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు.

లారీ దూసుకెళ్లి వ్యక్తి మృతి


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఉప్పలూరి శేషగిరి

జూపూడి(ఇబ్రహీంపట్నం): గేద అడ్డు రావడంతో ప్రమాదవశాత్తూ రోడ్డుపై పడిన వ్యక్తి కాళ్ల మీదుగా వెనుక వైపు నుంచి వచ్చిన లారీ దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి ఒక కాలు పూర్తిగా తెగిరోడ్డుపై పడిపోగా మరో కాలు కూడా విరిగిపోయింది. తీవ్ర రక్తస్రావానికి గురైన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని 65వ నెంబర్ జాతీయ రహదారిపై జూపూడి వద్ద సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. కంచికచర్ల మండలం పరిటాల గ్రామానికి చెందిన ఉప్పులూరి శేషగిరి గుంటూరులో చదువుతున్న తన కుమార్తె వద్దకు బైక్‌పై వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జూపూడి వద్దకు రాగానే గేద మృత్యువు రూపంలో అడ్డు వచ్చింది. తప్పించబోయి కింద పడిన ఆయనపై వెనుక నుంచి వచ్చిన లారీ దూసుకుపోవడంతో రెండు కాళ్లు విరిగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. 108 వాహన సిబ్బంది బాధితుడిని గొల్లపూడిలో ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. లారీని స్టేషన్‌కు తరలించిన పోలీసులు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

పోస్టల్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చీటింగ్

హనుమాన్‌జంక్షన్ రూరల్: పోస్టల్ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి మోసం చేసిన ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాపులపాడు మండలం బొమ్ములూరుకు చెందిన ఇద్దరు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఒంగోలుకు చెందిన శాంతి స్వరూప్, విజయవాడలోని గొల్లపూడికి చెందిన చైతన్య, నూజివీడుకు చెందిన ప్రదీప్‌తో పాటు మరికొందరు ఓ ముఠాగా ఏర్పడి నిరుద్యోగులకు గాలం వేసి రూ.లక్షల్లో సొమ్ములు కాజేస్తున్నట్లుగా గుర్తించారు. ఇటీవల తపాలా శాఖలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వెలువడటంతో ఈ ముఠా సభ్యులు కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, ప్రకాశం జిల్లాలో పలువురికి గాలం వేశారు. ఒక్కొక్కరి నుంచి రూ. ఐదు లక్షల చొప్పున వసూలు చేశారు. అలానే అభ్యర్థులను నమ్మించి, వారి విద్యార్హత సర్టిఫికెట్లు సైతం తీసుకున్నారు. ఆ తర్వాత ఉద్యోగుల నియామకంపై పలుమార్లు ప్రశ్నించినా ముఠా సభ్యులు ఏమాత్రం స్పందించకపోవటంతో వీరికి అనుమానం బలపడింది. దీంతో బొమ్ములూరుకు చెందిన బాధితులు మోసపోయామంటూ పోలీసులను ఆశ్రయించారు. విచారణ చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. గతంలోనూ ఈ ముఠా సభ్యులు హోం గార్డు, వైద్య, ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి పలువురిని మోసగించినట్లుగా తెలిసింది.

క్షేమంగా ఇంటికి చేర్చారు...

- రెండు రోజుల కిందట అదృశ్యమైన ముగ్గురు వ్యక్తుల ఆచూకీ గుర్తింపు
- ప్రత్యేక చర్యలు తీసుకున్న పటమట పోలీసులు


విద్యార్థి నందకుమార్‌ను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పటమట సీఐ కాశీవిశ్వనాథ్

పటమట(విజయవాడతూర్పు): హోం వర్క్ చేయలేదని ఓ విద్యార్థి కళాశాలకని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లి పోయాడు.. ప్రార్థనకు వెవెళ్లిన ఓ వృద్ధురాలు ఇంటికి తిరిగిరాలేదు.. భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ గృహిణి ఆచూకీ తెలియలేదు.. ఆయా కారణాలతో ఇంటి నుంచి వెళ్లిన తమ కుటుంబ సభ్యులు తిరిగి రాలేదని పటమట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై సీరియస్‌గా తీసుకున్న పటమట పోలీసులు మిస్సింగ్ కేసుల పై ఓ బృందాన్ని ఏసీపీ భాస్కర్ ఆధ్వర్యంలో నియమించారు. రెండు రోజుల క్రితం నమోదయిన ఈ కేసుల్లో వారందరినీ వారి కుటుంబ సభ్యులకు అప్పగించామని సెంట్రల్ ఏసీపీ భాస్కర్ తెలిపారు. సోమవారం పటమట పోలీస్‌స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. పటమటకు చెందిన నందకుమార్ బెంజిసర్కిల్ వద్ద ఓ కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాడు. హోం వర్క్ చేయలేదని, కళాశాలలో తనను కోప్పడతారని శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయిన నందకుమార్ కనబడటం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు విద్యార్థి కోసం గాలింపు చేపట్టగా పండిట్ నెహ్రూ బస్టాండ్‌లో కనబడ్డాడు. తీసుకుచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. పటమట దర్శిపేటకు చెందిన చిప్పల వెంకటేశ్వరమ్మకు కొంతకాలంగా మతిస్థిమితం అంతగా లేదు.. ఆదివారం ప్రార్థనకని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. సాయంత్రమైనా రాలేదని బంధువులు పటమట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆమె కోసం గాలింపు చేయగా పటమట మీసేవ కేంద్రం వద్ద తచ్చాడుతుండగా పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పటమటలంకకు చెందిన మురికిపూడి మరియమ్మ భర్తతో విభేదాలతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు మరియమ్మ వినుకొండలో ఉన్నట్లు తెలిసింది. వెంటనే అక్కడికి వెళ్లి ఆమెను స్టేషన్‌కు తీసుకొచ్చి భర్తకు కౌన్సెలింగ్ ఇచ్చారు. మిస్సింగ్ కేసుల్లో సీపీ టీకే రాణా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని, స్టేషన్‌కో ప్రత్యేక బృందాన్ని నియమించి వారి ఆచూకీ రోజుల వ్యవధిలోనే తెలుసుకునేలా శిక్షణ ఇచ్చారన్నారు. ఈ సమావేశంలో సీఐ కాశీవిశ్వనాథ్, పటమట సెక్టార్ ఎస్‌ఐ శాతకర్ణి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోడ్రైవర్లకు యూనిఫాం పంపిణీ అభినందనీయం



లబ్బీపేట(విజయవాడతూర్పు): గాంధీ జయంతిని పురస్కరించుకుని నగరంలోని ఆటోడ్రైవర్లకు లక్కీ షాపింగ్‌మాల్ ఆధ్వర్యంలో యూనిఫాం పంపిణీ చేయడం అభినందనీయమని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. ఎంజీ రోడ్డులోని లక్కీ షాపింగ్ మాల్ వద్ద సోమవారం జరిగిన ఆటోడ్రైవర్లకు యూనిఫాం పంపిణీ కార్యక్రమంలో అవినాష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన పలువురు ఆటోడ్రైవర్లకు యూనిఫాం అందజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ వెంకట నారాయణ, మాచవరం సీఐ గుణరామ్, షాపింగ్‌మాల్ మేనేజింగ్ పార్టనర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే జేవీవీ ఆశయం

కృష్ణలంక(విజయవాడతూర్పు): శాస్త్రీయ విజ్ఞానాన్ని ప్రజల్లోకి వ్యాప్తి చేయడమే జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ప్రధాన ఆశయమని సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ్ భవన్‌లో సోమవారం జేవీవీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరిత విప్లవ పితామహుడు ఎం.ఎస్.స్వామినాథన్‌కు సంతాపం తెలిపారు. అనంతరం గేయానంద్ మాట్లాడుతూ సైన్స్‌పై దాడి జరుగుతున్న ప్రస్తుత తరుణంలో మేధావులు, విద్యావంతులు సమర్థంగా ఎదుర్కోవాలన్నారు. సమావేశంలో శాస్త్ర విజ్ఞానాన్ని రాష్ట్రంలో నలుమూలలా వ్యాప్తి చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా 12 విభాగాలకు సబ్ కమిటీ కన్వీనర్లను నియమించారు. కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, పూర్వ అధ్యక్షుడు రాజశేఖర్ రాహుల్, మాజీ ప్రధాన కార్యదర్శులు గొంటి మురళీధర్, కె.శ్రీనివాస్, ఎస్.ఎన్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితే ఉన్నత శిఖరాలు



ఉయ్యూరు: లక్ష్య నిర్దేశంలో కష్టపడితే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ వల్లవరపు జాన్ వెస్లీ అన్నారు. పట్టణంలోని ఇమ్మానుయేలు ప్రార్థనా మందిరంలో హెబ్రోను యూత్ రిట్రీట్ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జాన్‌వెస్లీ ఈ సందర్భంగా నిర్వహించిన ప్రార్థనాగీతాల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ప్రార్థనా గీతాలు ఆలపించే వారిలో ప్రతిభను వెలికితీయటమే యూత్ రిట్రీట్ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జీవితంలో గెలుపోటములు సహజమన్నారు. లక్ష్యం లేకుండా జీవితంలో ప్రయాణం చేసే వారు విజయాన్ని చేరుకోలేరన్నారు. కార్యక్రమంలో హోప్ ఆసుపత్రి అధినేత, ఫాదర్ జాన్‌డేవిడ్, డాక్టర్ జ్యోతి, సంఘ ప్రతినిధులు సాంబశివరావు, నిరీక్షణరావు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

పెనమలూరు: వివాహితను వేధిస్తున్న వ్యక్తిపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు సనత్‌నగర్‌కు చెందిన వివాహిత షేక్ మస్తాన్‌బి పది రోజుల క్రితం సనత్‌నగర్‌కు వచ్చి కుటుంబ సభ్యులతో ఉంటుంది. అయితే ఆమె గతంలో గోసాల వైకుంఠపురంలో ఉన్న సమయంలో తాపీమేస్త్రీగా పని చేస్తున్న అబ్దుల్లా ఆమె వెంటపడేవాడు. మస్తాన్‌బి సనత్‌నగర్‌కు వచ్చిన తరువాత కూడా ఆమె ఇంటి వద్దకు వచ్చి ఆమెను వేధిస్తూ ఫోన్‌లు చేయసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సోమవారం సంకట హర చతుర్థి సందర్భంగా వినాయకునికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ అర్చకులు స్వామివారికి పంచామృతాభిషేకం, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమాలను మందిర కమిటీ కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పర్యవేక్షించారు. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో సోమవారం సాయంత్రం సంకటహర చతుర్థి సందర్భంగా పూజలు అభిషేకాలు జరిగాయి. విజయ గణపతికి అన్నాభిషేకం జరిగింది. పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమ సుందర వరప్రసాద్ పర్యవేక్షించారు.

జాతిపిత మార్గం అనుసరణీయం



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అవినాష్ తదితరులు

గుణదల (విజయవాడ తూర్పు): జాతిపిత మహాత్మాగాంధీ మార్గం అనుసరణీయమని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. గుణదలలోని ఆయన కార్యాలయంలో సోమవారం గాంధీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ సిద్ధాంతాలను అనుసరించాలన్నారు. ఆంగ్లేయులను ఎదిరించి శాంతి మార్గంలో ఆయన దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ వంటి నిరసనల ద్వారా భారతీయుల్లో చైతన్యం నింపారని వివరించారు. విలువలు కలిగిన వ్యక్తిగా జీవితాన్ని గడిపిన గాంధీ జాతిపితగా ఎదిగారని పేర్కొన్నారు. ఆయన చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని చెప్పారు. అనంతరం గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, కలపాల అంబేద్కర్, స్థానిక నాయకులు చిత్రం లోకేష్, డేవిడ్, పి.రమేష్, రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): సత్యం పలకడాన్ని విద్యార్థి దశ నుంచే అలవాటు చేసుకోవాలని సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అధ్యక్షుడు జి.భవానీప్రసాద్ చెప్పారు. గాంధీ స్మారక నిధి ఆధ్వర్యాన సిద్ధార్థ ఆడిటోరియంలో గాంధీ జయంతి కార్యక్రమం సోమవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ గాంధీజీ అడుగుజాడల్లో విద్యార్థులు పయనించాలన్నారు. గాంధీ స్మారక నిధి అధ్యక్షుడు డాక్టర్ గాంధీ కాజా మాట్లాడుతూ వందేళ్లయినా గాంధీజీని ప్రపంచం మర్చిపోదు అన్నారు. గాంధీ స్మారక నిధి కార్యదర్శి వై.రామచంద్రరావు, ఉపాధ్యక్షుడు చక్రపాణి, మాజీ మేయర్ జంధ్యాల శంకర్, డాక్టర్ సమరం, శారద తదితరులు పాల్గొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పాఠశాల, కళాశాల స్థాయిలో నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులను అందజేశారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): గాంధీ చూపిన సహనం, సత్యం అనే మార్గాన్ని అనుసరిస్తే కష్టతరమైన పోరాటాల్లోనూ విజయం సాధించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో సోమవారం మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీపీఎంఓ నవీన్, డాక్టర్లు కార్తీక్, సమీర, విద్యాసాగర్, లీల తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ కమిషనరేట్‌లో..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లో గాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి వేడుకలు నిర్వహించారు. వారి చిత్రపటానికి సీపీ టీకే రాణా పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతీయులందరూ గౌరవించే గొప్ప వ్యక్తి జాతిపిత గాంధీ అన్నారు. అలాంటి మహానుభావుల ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో డీసీపీ విశాల్ గున్ని, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని



నివాళులర్పిస్తున్న సీపీ టీకే రాణా

కృష్ణలంక(విజయవాడతూర్పు): సోమవారం గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో సర్వోదయ ట్రస్ట్, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సంస్థ, ఎం.బి.విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో 77 ఏళ్ల స్వాతంత్ర్యంలో గాంధీజీ కన్న కలలు నెరవేరాయా అంశంపై సదస్సు నిర్వహించారు. సత్యశోధన, అహింసా సిద్ధాంతమే గాంధీ మార్గమని అభ్యుదయ సినీ నటుడు, మాటల రచయిత వై.ఎస్.కృష్ణేశ్వరరావు అన్నారు. చరిత్ర విశ్లేషకుడు మొవ్వా శ్రీనివాసరెడ్డి, సర్వోదయ ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు ప్రసంగించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు.సదస్సులో ఎస్.పి.రామరాజు, వేమూరు బాబురావు, గాంధీ వేషధారి నాగరాజన్, టి.క్రాంతికిరణ్, గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

పటమట(విజయవాడతూర్పు): పటమట మీసేవ కేంద్రం వద్ద కృష్ణా జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి జరిగింది. సీపీఎం నగర అధ్యక్షుడు గురుమూర్తి, ఎస్కే మస్తాన్, తూర్పు నియోజకవర్గ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు రాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ జీవితం ఆదర్శప్రాయం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గాంధీ జీవితం ప్రపంచానికి ఆదర్శప్రాయమని గాంధీ దీక్షల వ్యవస్థాపకుడు, గాంధీజీ ఆలయ వ్యవస్థాపకుడు రాంపిళ్ల జయప్రకాష్ పేర్కొన్నారు. పాల ప్రాజెక్టు సమీపంలోని సయ్యద్ అప్పలస్వామి కళాశాల ఆవరణలోని గాంధీజీ ఆలయంలో సోమవారం గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. పలువురు విద్యార్థులు గాంధీ దీక్షలను విరమించారు. తొలుత గాంధీ విగ్రహానికి పాలాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. గాంధీ ఆశయాలను విశ్వవ్యాప్తం చేయడానికి దీక్షలను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అజ్మీరా రాంపండు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ సెక్రటరీ గోళ్ల నారాయణరావు, ముక్కామల పెద్దబాబు, కోడూరి రామ్మోహనరావు, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా విశ్వ మానవాళి కోసం గాంధీ హోమం చేశారు రాంపిళ్ల జయప్రకాష్ ఆధ్వర్యంలో ఉప్పలూరి లక్ష్మీ నారాయణ హోమాన్ని నిర్వహించారు. గాంధీజీ నిత్య పూజ విధానం పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఎస్ఏఎస్ కాలేజీలో గాంధీ దీక్షలను విరమిస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులను అందజేస్తున్న అతిథులు



సదస్సులో మాట్లాడుతున్న అభ్యుదయ సినీ నటుడు, మాటల రచయిత కృష్ణేశ్వరరావు



నివాళులర్పిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రభుత్వ సేవలు చేరువ చేసిన సీఎం జగన్



కేక్ కట్ చేస్తున్న సంఘం నాయకులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల సేవలను సకాలంలో ప్రజలకు చేరేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని డెమోక్రటిక్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసఫ్ కిషోర్ అన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం నగరంలోని సంఘం కార్యాలయంలో సంబరాలు నిర్వహించారు. సచివాలయంలోని ఉద్యోగులు కేక్ కట్ చేశారు. జోసఫ్ కిషోర్ మాట్లాడుతూ అవినీతి రహితంగా ప్రజలకు సేవలు చేరాలనే ఉద్దేశంతో జగన్‌మోహన్‌రెడ్డి వార్డు, గ్రామ సచివాలయాలను ప్రారంభించి నేటితో నాలుగు సంవత్సరాలు పూర్తవుతుందన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్రంలోని లక్షా ముప్పై వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.రాజ్యలక్ష్మి, కోశాధికారి టి.దుర్గాప్రసాద్, సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.నూతన్‌కుమార్‌రెడ్డి, సత్యనారాయణ, పి.శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ బిల్లును ఆమోదించాలి

నున్న(విజయవాడరూరల్): ఎస్సీ వర్గీకరణ బిల్లును శీతాకాలంలో జరగబోయే చివరి పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని కోరుతూ నవంబర్ 4వ తేదీన హైదరాబాద్‌లో జరిగే మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయాలని గన్నవరం నియోజకవర్గం మహాజన సోషలిస్టు పార్టీ ఇంచార్జ్ మంద వేణుబాబు అన్నారు. సోమవారం నున్న గ్రామంలో ఎంఎస్పీ, ఎమ్మార్పీఎస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో జరిగే ఈ కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి మాదిగలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఎస్పీ రూరల్ మండల నాయకులు చిల్లిముంత కోటేశ్వరావు మాదిగ, తగరం విజయ్‌కుమార్ మాదిగ, ప్రత్తిపాటి దావీదు మాదిగ, తగరం శిఖామణి, తగరం రమేష్, జాన్‌రవి పాల్గొన్నారు.

టెన్‌పిన్‌బాల్ క్రీడాకారుడికి సత్కారం

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ ఆటో మొబైల్ ఇంజినీరింగ్ వర్క్స్ ఫౌండ్రీ కార్మికుడు ఎస్కే అబ్దుల్ ముజీబ్ టెన్‌పిన్ బాల్ పోటీల్లో జాతీయ స్థాయిలో సత్తాచాటారు. సోమవారం డిస్పోజల్ రోడ్డులోని రెండో క్రాస్ లోని ఇంజినీరింగ్ వర్క్స్ షెడ్‌లో అబ్దుల్ ముజీబ్‌ను పలు కార్మిక సంఘాల నాయకులు శాలువా కప్పి సన్మానించారు. అమరావతి కార్‌మెకానిక్ అసోసియేషన్ అధ్యక్షులు టీఎస్ దివాకర్, అమరావతి ఏసీ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్‌సమీతో పాటు పలువురి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం జరిగింది. అబ్దుల్ ముజీబ్ మాట్లాడుతూ సెప్టెంబరు 25 నుంచి 30 వరకు జాతీయ నేషనల్స్ చాలెంజ్ టోర్నమెంట్ బెంగళూరులో జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఇండియా నుంచి 120 మంది క్రీడాకారులు పాల్గొన్నట్టు చెప్పారు. ఏపీ నుంచి నేషనల్స్ చాలెంజ్ టెన్‌పిన్ బాల్ చాంపియన్ షిప్‌నకు ఏడుగురు ఎంపిక అయ్యారన్నారు. సెమీఫైనల్‌లో సెకండ్ రౌండ్ టాప్ 40 మంది క్రీడాకారులు ఎంపికవ్వగా ఇందులో ఆటోనగర్‌కు చెందిన అబ్దుల్ ముజీబ్ 21వ స్థానంలో ఉన్నట్టు చెప్పారు. ఏపీలో నేషనల్ చాలెంజ్ టోర్నమెంట్‌కు ఏడుగురు ఎంపికవ్వగా అందులో మొదటి స్థానంలో ముజీబ్ ర్యాంకర్‌గా నిలిచినట్టు చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ ట్రైనింగ్ ఆఫీసర్ శ్రీధర్, రవి, ఫౌండ్రీ అసోసియేషన్ అధ్యక్షులు తోట సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

టెన్‌పిన్ బౌలింగ్ చాంప్ రన్నరప్‌గా సుమతి

లబ్బీపేట(విజయవాడతూర్పు): బెంగళూరులో సెప్టెంబరు 25 నుంచి 30 వరకు జరిగిన 32వ నేషనల్ టెన్‌పిన్ బౌలింగ్ చాంపియన్‌షిప్(టీబీఎస్ఐ)కు ఏపీ నుంచి మహిళ సహా 8 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వారిలో రాష్ట్రానికి చెందిన సుమతీ నల్లబంటు టెన్‌పిన్ బౌలింగ్‌లో నాకౌట్ గేమ్‌లో రన్నరప్‌గా నిలిచిందని తెలిపారు. ఈ సందర్భంగా విజేతలను కర్ణాటక క్రీడల శాఖ మంత్రి బి.నాగేంద్ర, కర్ణాటక ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గోవిందరాజ్‌లు మెమెంటోలు అందజేసి అభినందించారు.



అబ్దుల్ ముజీబ్‌ను సన్మానిస్తున్న వివిధ కార్మిక సంఘాల నాయకులు



రన్నరప్ సుమతి(చివర ఉన్న కటింగ్ హెయిర్)

రక్తదానం ప్రాణదానంతో సమానం



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని క్యాపో సొసైటీ అధ్యక్షుడు, 5వ వార్డు కౌన్సిలర్ దయాసాగర్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా క్యాపో సొసైటీ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ సహకారంతో రక్తదాన శిబిరం సోమవారం నిర్వహించారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



గన్నవరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లి, గన్నవరం గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న 106 మంది పారిశుద్ధ్య కార్మికులకు సోమవారం రోటరీక్లబ్ ద్వారా దుస్తులను సర్పంచ్‌లు చేబ్రోలు లక్ష్మీమౌనిక, నిడమర్తి సౌజన్య చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా జాస్తి మాట్లాడుతూ.. కోవిడ్ విపత్కర సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పారిశుద్ధ్య విధులు నిర్వర్తించిన తీరు మరువలేవమన్నారు. సేవలకు గుర్తుగా సాయం అందిస్తున్నట్లు తెలిపారు. రోటరీ కార్యదర్శి నర్రా సీతారామారావు, రోటేరియన్లు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

పటమట(విజయవాడతూర్పు): పరిసరాలను శుభ్రంగా ఉంచడం అందరి బాధ్యతని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. సోమవారం వీఎంసీ ఆధ్వర్యాన డాక్టర్ అంబేద్కర్ పార్క్‌లో స్వచ్ఛతా హీ సేవ ముగింపు కార్యక్రమం జరిగింది. రాష్ట్ర ప్రణాళికా బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, ఎ.పి.డి.ఐ.సి చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, డెప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బందరు కాలువ వెంబడి ఉన్న ఈ పార్క్‌ను తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో తీసుకురావటం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ స్వచ్ఛ భారత్‌లో భాగంగా 15 రోజులుగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవను ప్రణాళిక ప్రకారం దిగ్విజయంగా నిర్వహించారని ఇందులో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములుగా చేయటం హర్షణీయమన్నారు. కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ నగరంలోని కృష్ణా నది పరివాహక ప్రాంతంలో, గాంధీ హిల్, కెనాల్ బండ్స్ తదితర ప్రాంతాలలో 15 రోజుల నుంచి ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. శనివారం గంట శ్రమదానంతో బస్‌స్టాండ్ ప్రాంతంలో శుభ్రం చేశామన్నారు. అనంతరం పలువురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను, క్లాప్ సిబ్బందిని సన్మానించారు. అనంతరం సోషల్ మీడియా ద్వారా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందించి, పారిశుద్ధ్య సిబ్బందికి రెయిన్ కోటులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో 21, 22 డివిజన్ల కార్పొరేటర్లు తాడిపర్తి కొండారెడ్డి, పుప్పల నరసకుమారి, వీఎంసీ చీఫ్ ఇంజినీర్ ప్రభాకర్, అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, అదనపు కమిషనర్ (జనరల్) కె.వి.సత్యవతి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యు) వెంకటలక్ష్మి, ఎస్టేట్ ఆఫీస్ శ్రీనివాస్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి తదితరులు పాల్గొన్నారు.



శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సన్మానిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, కమిషనర్ స్వప్నిల్ దినకర్

పర్యావరణ పరిరక్షణకు శ్రమదానం

బీబీఏ అధ్యక్షుడు సుందర్

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని బెజవాడ బార్ అసోసియేషన్ (బీబీఏ) అధ్యక్షుడు కేబీ సుందర్ తెలిపారు. మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం విజయవాడ కోర్టు ప్రాంగణంలోని బీబీఏ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మహాత్మాగాంధీ, లాల్‌బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు న్యాయవాదులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బీబీఏ గవర్నింగ్ బాడీ సభ్యులు కోర్టు కాంప్లెక్స్‌లో శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రపరిచారు. ఈ సందర్భంగా సుందర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో ప్రతి నెలా మొదటి శనివారం కోర్టు పరిసరాల్లో పర్యావరణ పరిరక్షణలో భాగంగా శ్రమదానం చేయనున్నట్లు తెలిపారు. బీబీఏ వైస్ ప్రెసిడెంట్ పుప్పాల శ్రీనివాసరావు, జనరల్ సెక్రటరీ జన్ను శ్రీధర్, జాయింట్ సెక్రటరీ నరహరశెట్టి జ్యోతి, ఆకుల పాండురంగ విఠల్, బత్తుల వెంకటేశ్వర్లు, పి.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కోర్టు ప్రాంగణంలో పరిసరాలను శుభ్రపరుస్తున్న న్యాయవాదులు

పి.నైనవరం గ్రామంలో ఎన్ఐఏ తనిఖీలు

విజయవాడరూరల్: నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ) అధికారులు సోమవారం తెల్లవారు జాము నుంచి విజయవాడ రూరల్ మండలం పి.నైనవరం గ్రామంలో తనిఖీలు నిర్వహించారు. గతంలో నక్సలైట్ల కార్యకలాపాలతో సంబంధాలు కలిగివున్న అమ్మిశెట్టి రంగా, అమ్మిశెట్టి రాధ భార్యభర్తలు జనజీవన స్రవంతిలో కలిశారు. ప్రస్తుతం రంగా పాలకేంద్రాన్ని నిర్వహిస్తుండగా, రాధ చైతన్య మహిళా సంఘాన్ని నడుపుతున్నారు. అయితే నక్సలైట్లతో సంబంధాలున్నాయనే అనుమానంతో ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించి వెళ్లారు.

రౌడీషీటర్‌పై బైండోవర్ కేసు

పెనమలూరు: రౌడీషీటర్ పై పోలీసులు సోమవారం బైండోవర్ కేసు నమోదు చేశారు. చోడవరం గ్రామానికి చెందిన గవిరినేని అనిల్‌కుమార్‌పై పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీటు ఉంది. పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న సమయంలో రౌడీషీటర్ పోరంకి సెంటర్‌లో సంచరిస్తుండటంతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

271 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు

కంకిపాడు: పట్టణంలో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పోరంకికి చెందిన అమృత హెల్త్ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యులు శిబిరాన్ని ఏర్పాటుచేశారు. శిబిరంలో 271 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కృపాలిన్, సిబ్బంది వైద్య సేవలు అందించారు. మందులను సోషల్ వర్కర్ రాము అందించారు. శిబిరాన్ని ఆక్యుపంక్చర్ వైద్యులు సత్యనారాయణ, భగవాన్, వీరకుమారి పర్యవేక్షించారు.

వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారి పై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. సీఐ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. పెదపులిపాక గ్రామానికి చెందిన బండారు పద్మ విజయవాడ వన్‌టౌన్‌కు చెందిన రంగారావును 2008 సంవత్సరంలో కట్నకానుకలు ఇచ్చి పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలు. కాగా పెళ్లి సమయంలో ఇచ్చిన కట్నకానుకలు సరిపోలేదని, అదనపు కట్నం తీసుకురమ్మని భర్త రంగారావు, అత్త పైడమ్మ, ఆడపడుచు రమణ, ఆమె భర్త నారాయణరావు వేధించ సాగారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రధాని నరేంద్రమోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని మహిళలకు సోమవారం కుట్టుమిషన్లు, పేదలకు దుస్తులు, విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. చిట్టినగర్ సొరంగం రోడ్డులోని విశ్వబ్రాహ్మణ కల్యాణ మండపంలో గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ముఖ్య అతిథిగా విచ్చేశారు. కుట్టుశిక్షణ పొందిన పేద మహిళలకు మిషన్లు అందచేయడం అభినందనీయమని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షిస్తున్నానని పురందేశ్వరి పేర్కొన్నారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న గొలగాని రవికృష్ణ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్‌బాజీ, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి నాగభూషణం, మిట్ట వంశీ తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న పురందేశ్వరి

క్లుప్తంగా...

మహాత్మా గాంధీ బాటలో సీఎం వైఎస్ జగన్

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



సాక్షి, అమరావతి: మహాత్మా గాంధీ చూపిన మార్గంలో సీఎం వైఎస్ జగన్ ముందుకు సాగుతున్నారని, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ చెప్పారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ నాయకుల చేష్టలు, కార్యక్రమాలు చూస్తుంటే వినాయకుడిని నిమజ్జనం చేసిన తరహాలోనే... చంద్రబాబు రాజకీయ జీవితాన్ని నిమజ్జనం చేయాలని చూస్తున్నట్లు ఉన్నాయని ఎద్దేవా చేశారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం

కొమ్మినేని, పి.విజయబాబు



ఎమ్మెల్యే వెలంపల్లిని సన్మానిస్తున్న నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో మళ్లీ అధికారం చేపట్టేది వైఎస్సార్‌సీపీనే అని సీఆర్ ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు ధీమా వ్యక్తంచేశారు. విజయవాడ భవానీపురంలోని వైఎస్సార్‌సీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యాలయంలో సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అభినందన సభ జరిగింది. ఇటీవల పశ్చిమ నియోజకవర్గంలో సీఎం జగన్ చేతుల మీదుగా వైఎస్సార్ వాహన మిత్ర ఆర్థిక సాయం విడుదల కార్యక్రమాన్ని విజయవంతం చేయడంతోపాటు పలు అభివృద్ధి పనులకు సీఎం గ్రీన్ సిగ్నల్ ఇచ్చేలా చూసిన వెలంపల్లిని కాపు, రెల్లి, మైనార్టీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు తోలేటి శ్రీకాంత్, బండి పుణ్యశీల, మనోజ్ కొఠారి తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ స్ఫూర్తితో హక్కుల సాధన

1,100వ రోజు దీక్షల్లో బహుజన నేతలు



రిలే దీక్షలలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: మహాత్ముడి స్ఫూర్తితో అహింసాయుతంగా పోరాటం చేసి తమ హక్కులను సాధిస్తామని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి 1,100వ రోజుకు చేరాయి. పలువురు మాట్లాడుతూ.. చంద్రబాబు చేసిన అవినీతిలో భాగస్వామ్యం ఉన్న మంత్రులు, బినామీలు, ఎన్‌ఆర్‌ఐలను అరెస్టు చేసి సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పేదల నోళ్లు కొట్టి అవినీతితో జైలుకెళ్లిన చంద్రబాబు కోసం నిరాహార దీక్షల పేరుతో తెలుగుదేశం పార్టీ ఆడుతున్న డ్రామాలను చూసి ప్రజలు మండిపడుతున్నారన్నారు. తన సీటు తాను గెలవలేని పవన్‌కళ్యాణ్ ముఖ్యమంత్రిని అవుతానని చెప్పడం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు. పులి దాసు, పల్లె బాబు, బొలిమేర శ్యామ్యూల్, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్, బేతపూడి సాంబయ్య, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ మద్యపాన నిషేధం అమలుపై చర్చించుకోలేదు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి,అమరావతి: తాము అధికారంలోకి వస్తే సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు అంశంపై బీజేపీలో ఎలాంటి చర్చ జరగలేదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగిన గాంధీ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె పార్టీ నాయకులను ఉద్దేశించి మాట్లాడారు. 'రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధం అంశాన్ని మా పార్టీ మ్యానిఫెస్టోలో చేర్చే అంశంపై పార్టీలో అంతర్గతంగా చర్చించాకే నిర్ణయం తీసుకుంటామన్నారు.

బీజేపీ రాష్ట్ర కమిటీలో 102 మంది

సాక్షి, అమరావతి: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర పదాధికారుల కమిటీలో 102 మందిని కార్యవర్గసభ్యులుగా నియమితులయ్యారు. రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా 60 మంది, ప్రత్యేక ఆహ్వానితులుగా 20 మంది, శాశ్వత ఆహ్వానితులుగా 13 మందితో పాటు వివిధ రంగాల్లోని నిపుణుల విభాగంలో తొమ్మిదిమందిని ఆహ్వానితులుగా పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి నియమించినట్లు పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

గాంధీ జయంతి రోజూ నిజాలకు పాతరేనా!?

ఉమ్మడి 13 జిల్లాల్లో 24,000 కి.మీ 24ఎఫ్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు

- అందులో నిరుపయోగంగా ఉన్న 524 కి.మీ మేర తొలగింపు
- సబ్‌స్క్రైబర్స్ లేకపోవడంతో కేబుల్ చోరీ కాకుండా ముందస్తు చర్యలు
- విలువైన 24కేఎఫ్ కేబుల్స్‌ను భద్రపర్చడం కూడా తప్పేనా రామోజీ?
- మీటరు రూ.8 చొప్పున రూ.11.86 లక్షలు నెటాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెల్లింపు
- నిజానికి.. ఫైబర్‌నెట్ కుంభకోణం నుంచి బాబు ముఠాను కాపాడేందుకు రామోజీ నానాపాట్లు
- వైర్లు పీకేశారు.. గుండెలు బాదుకుంటున్నారు అంటూ గగ్గోలు

వైర్లు పీకేశారు.. గుండెలు బాదుకుంటున్నారు



సాక్షి, అమరావతి : తన మనిషి సీఎం కుర్చీలో లేడన్న అక్కసుతో నిత్యం అబద్ధాలనే అచ్చేస్తూ ప్రజలెనుకున్న ప్రభుత్వాన్ని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరువును తీస్తూ అసత్య కథనాలు ప్రచురిస్తున్న ఈనాడు పత్రిక గాంధీ జయంతి రోజున కూడా నిస్సిగ్గుగా నిజాలకు పాతరేసింది. ఫైబర్‌నెట్ స్కాంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు నాయుడిని కాపాడేందుకు రామోజీరావు ''వైర్లు పీకేశారు.. గుండెలు బాదుకుంటున్నారు'' అంటూ విషం కక్కారు. ఉపయోగంలేని చోట్ల ఉన్న ఫైబర్ కేబుల్‌ను తొలగించి వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తే అదో పెద్ద నేరం అంటూ గగ్గోలు పెడుతున్నారు. 2019 నవంబర్‌లో జరిగిన మెయిల్స్‌ను చూపిస్తూ వైర్లు పీకేశారంటూ అసత్యాలతో కూడిన కథనాన్ని ప్రచురించారు. ఇదంతా అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఎండీగా నియమించిన ఐఏఎస్ అధికారి ఎ. సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో టెరాసాఫ్ట్‌కు అనుబంధంగా పనిచేసిన నెటాప్స్ సంస్థలే ఈ తొలగింపు ప్రక్రియలో పాల్గొన్న విషయాన్ని వ్యూహాత్మకంగా ఎక్కడా పేర్కొనలేదు.

చోరీ జరగక్కుండా ఉండేందుకు తొలగిస్తే..

ఫైబర్‌గ్రిడ్ ఫేజ్–1 ప్రాజెక్టు కింద అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఫైబర్ కేబుల్ కాంట్రాక్టును టెరాసాఫ్ట్ సంస్థ కాంట్రాక్టు దక్కించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి 13 జిల్లాల్లో 24,000 కి.మీ మేర 24ఎఫ్ ఫైబర్ కేబుల్, దానికి కావాల్సిన స్తంభాలు ఇతర పరికరాలతో సమకూర్చారు. అందులోని 524 కి.మీ పరిధిలో సబ్‌స్క్రైబర్స్ లేకపోవడంవల్ల అక్కడ కేబుల్‌ను చోరీచేసే అవకాశం ఉండటంతో వీటిని ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ నిర్ణయించింది. 12 జిల్లాల్లో ఉపయోగంలేని చోట్ల మొత్తం 524 కి.మీ పరిధిలోని కేబుల్‌ను ఇతరచోట్ల బిగించుకునేందుకు వీలుగా తొలగించాలని ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ ఉద్యోగి రాజేశ్‌రాయ్ తన ఈ–మెయిల్స్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. అంతేకాదు.. అప్పటి ప్రభుత్వంలో ఫైబర్‌నెట్ కేబుల్ బిగించడంలో పాలుపంచుకున్న నెటాప్స్ సంస్థకే ఈ తొలగింపు కాంట్రాకును ఇచ్చారు. దీంతో ఆ సంస్థ మీటరుకు రూ.12 ఇవ్వాలని కోరగా ఏపీఎస్‌ఎఫ్‌ఎల్ రూ.8 మాత్రమే చెల్లించింది. మొత్తం 1,25,677 మీటర్ల 24ఎఫ్ ఫైబర్ కేబుల్‌ను తొలగించినందుకు రూ.11,86,391 చెల్లించారు. ఈ తొలగించిన కేబుల్‌ను వైర్లు కట్ అయ్యి ప్రసారాలు ఆగిపోయిన చోట్ల తిరిగి బిగించడానికి వినియోగిస్తున్నారు.

వక్రీకరించి విషప్రచారం..

ఇలా వృథాగా ఉన్న విలువైన వైరును తిరిగి ఉపయోగిస్తుంటే దాన్ని అభినందించాల్సింది పోయి చంద్రబాబు తప్పేం చేయలేదు.. వీళ్లే కేబుల్స్ తొలగించి గుండెలు బాదేసుకుంటున్నారంటూ ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఈనాడు వక్రీకరించి విషప్రచారం చేయడాన్ని అధికారులు ఖండిస్తున్నారు. అసలు ఫైబర్‌నెట్ కుంభకోణానికి ఈ వైర్ల తొలగింపునకు ఎలాంటి సంబంధం లేకపోయినా బోడిగుండుకు మోకాలుకు ముడిపెడుతూ చంద్రబాబుని ఈ కుంభకోణం నుంచి తప్పించడానికి రామోజీ పడుతున్న పాట్లు చూసి అందరూ ముక్కున వేలేసుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీలోకి 50మంది టీడీపీ నాయకులు

పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి పెద్దిరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు

తిరుపతి మంగళం: అవినీతిపరుడు చంద్రబాబు పార్టీలో ఉండలేమంటూ పుంగనూరు నియోజకవర్గం ఖాన్‌సాబ్‌మిట్ట గ్రామానికి చెందిన 50మంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసానికి వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మంత్రి పెద్దిరెడ్డి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఏళ్ల తరబడి టీడీపీలో ఉంటూ జెండా మోశామని, ఏనాడు ప్రజలకు చిన్న మేలు చేయలేకపోయామని వారు తెలిపారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ప్రశంసించారు. పేదల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్ పాటుపడుతుంటే, ప్రజల సొమ్ము దోచుకున్న ద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు. కార్యక్రమంలో చింతమాకులపల్లి పంచాయతీ సర్పంచ్ హైమావతి రవికుమార్‌రెడ్డి, ఎంపీపీ గాజుల రామ్మూర్తి, వైస్ ఎంపీపీ నర్సింహులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిబాబు పాల్గొన్నారు.

సత్యాగ్రహాలు చెయ్యాలంటే ఓ అర్హత ఉండాలి

స్పీకర్ తమ్మినేని, మంత్రి రోజా





చంద్రగిరి (తిరుపతి జిల్లా): గాంధీ జయంతి రోజు సత్యాగ్రహం చేయాలంటే తమకున్న అర్హత ఏంటో.. చూసుకోవాలని చంద్రబాబుకు రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తమ్మినేని సీతారాం హితవు పలికారు. గాంధీ జయంతి సందర్భంగా సోమవారం తిరుపతిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని.. అనంతరం మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు చేసిన అవినీతిని కప్పిపుచ్చాలనే ప్రయత్నంతో ఆయన సతీమణి నారా భువనేశ్వరి బస్సుయాత్ర చేయదలుచుకున్నారని, వాళ్ల పార్టీ బస్సు యాత్ర కాకపోతే హెలికాప్టర్ యాత్ర చేసుకున్నా తమకు అభ్యంతరం లేదన్నారు. పవన్‌కళ్యాణ్ విజ్ఞత కలిగిన నాయకుడు కాదన్నారు.

నిరాహార దీక్ష చేయడం జాతిపితను అవమానించినట్లే..

గొడ్డుకంటే హీనం, గాడ్సే కంటే ఘోరం అని ఆనాడు ఎన్టీఆర్ అన్నారని మంత్రి రోజా గుర్తుచేశారు. తాను తప్పు చేసి డబ్బులు దోచుకుని, జైల్లో కూర్చుని తానేదో త్యాగం చేసినట్లు నిరాహార దీక్ష చేయడం జాతిపితను అవమానించినట్లేనని అభిప్రాయం వ్యక్తం చేశారు. చంద్రబాబు జీవితమంతా హింసా మార్గమేనని, పిల్లనిచ్చిన మామకు వెన్నుపోటు నుంచి వంగవీటి రంగా హత్య, ముద్రగడ పద్మనాభం కుటుంబాన్ని వేధించడం చూస్తే చంద్రబాబు గుణగణాలు తెలుస్తాయన్నారు. టీడీపీ, జనసేన కలిసి పోటీ చేస్తే సన్నాసీ సన్నాసీ రాసుకుంటే బూడిద రాలినట్లేనన్నారు. బండారు సత్యనారాయణ తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని, చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని తెలిపారు. మహిళలు గౌరవంగా బతికేలా న్యాయస్థానాలు తీర్పులివ్వాలని కోరారు.

బండ బూతుల 'బండారు'

మంత్రి రోజాపై నోరుపారేసుకున్న వైనం

సాక్షి, విశాఖపట్నం : టీడీపీ మాజీ మంత్రి బండారు సత్యనారాయణ అంటే ఆ పార్టీలోనే ఓ విధమైన వణుకు, జంకు. ఆయన నోరు అలాంటిది. ఎవరినైనా వినలేని, రాయలేని అత్యంత భాషలో తిట్టడం ఆయన నైజం. ఆయనకు వచ్చిన ఒకే ఒక్క విద్య బూతులే అని టీడీపీ నేతలే అంటుంటారు. బండారు బూతు పురాణం ఆయన కుటుంబ సభ్యులే సిగ్గుతో తలదించుకునేలా ఉంటుంది. ముఖ్యమంత్రి, మంత్రి, ఎమ్మెల్యే.. ఎవరినైనా కనీస విచక్షణ లేకుండా జుగుప్సాకరంగా మాట్లాడతారు. బాధ్యత గల ప్రజాప్రతినిధిని అనే ఇంగిత జ్ఞానం కూడా లేకుండా, సభ్యత, విచక్షణ మరిచి ఆయన లక్ష్యంగా చేసుకున్న వారిపై బూతులతో విరుచుకుపడుతుంటారు. తన తప్పుల్ని ఎత్తిచూపిన ప్రతి వారిపైనా బూతులు లంకించుకుంటారు. అందుకే ఆయన్ను ఇతర పార్టీల నేతలతో పాటు సొంత పార్టీ నేతలు కూడా బూతుల సత్యనారాయణ అని అంటుంటారు. మంత్రిగా వెలగబెట్టిన సమయంలో ప్రతిపక్షంలో ఉన్న వైఎస్సార్‌సీపీ నేతలపై నోటికొచ్చినట్లు మాట్లాడారు. అదే రీతిలో ఆయన ముఖ్యమంత్రి, మంత్రి రోజాపైనా ఇటీవల నోరు పారేసుకున్నారు. రోజాపై బండారు చేసిన వ్యాఖ్యలు సభ్య సమాజం తలదించుకొనేలా చేశాయి. ఈ వ్యాఖ్యలపై మహిళా కమిషన్, యావత్ మహిళాలోకం మండిపడ్డాయి. పలువురు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన్ను అరెస్ట్ చేశారు.

మంత్రి రోజాపై తీవ్ర వ్యాఖ్యలు

ఇటీవల బండారు సత్యనారాయణ మాట్లాడుతూ మంత్రి రోజాపై రాయలేని వీలు లేని భాషలో జుగుప్సాకరమైన పదాలను ఉపయోగిస్తూ అసభ్యకరంగా మాట్లాడారు. రోజా బతుకు ఎవరికి తెలీదని అన్నారు. బ్లూ ఫిల్మ్‌లో యాక్ట్ చేశారని, అవన్నీ తమ దగ్గర ఉన్నాయని, ఆమె బతుకు బయటపెట్టకూడదని వాటిని రిలీజ్ చేయలేదన్నారు. బజారు మనిషని నోరు పారేసుకున్నారు. అదే సమయంలో ముఖ్యమంత్రిపై కూడా తీవ్రస్థాయిలో దుర్భాషలాడారు.

బండారు అరెస్ట్‌పై హెబియస్ కార్పస్.. హైకోర్టు తిరస్కరణ

సాక్షి, అమరావతి: మంత్రి రోజానుద్దేశించి అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో బండారు సత్యనారాయణమూర్తిని పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ ఆయన సోదరుడు సింహాద్రిరావు దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణకు హైకోర్టు నిరాకరించింది. బండారు వ్యాఖ్యల వ్యవహారంపై గుంటూరు అరండల్‌పేట, నగరపాలెం పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. ఈ కేసులో సీఆర్‌పీసీ కింద నోటీసులిచ్చి అరెస్ట్ చేసేందుకు విశాఖ జిల్లా వెన్నలపాలెంలోని బండారు ఇంటికి గుంటూరు పోలీసులు వెళ్లారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తితో పాటు టీడీపీ హంగామా సృష్టించారు. పోలీసులను ఇంట్లోకి రాకుండా అడ్డుకున్నారు. ఇదే సమయంలో బండారు సోదరుడు సింహాద్రిరావు హైకోర్టును ఆశ్రయించారు. హౌస్‌మోషన్ ద్వారా అత్యవసర విచారణ జరపాలని కోరారు. ఈలోపు పోలీసులు బండారుకు నోటీసులిచ్చారు. చట్టప్రకారం అనుసరించాల్సిన విధివిధానాలను పూర్తిచేశారు. పిటిషన్‌పై విచారణ జరిపేందుకు హైకోర్టు సిద్ధమవుతున్న దశలో హైకోర్టు రిజిస్ట్రీకి ఓ సమాచారం అందింది. సత్యనారాయణమూర్తి విషయంలో పోలీసులు సీఆర్‌పీసీ చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నట్లు తెలిసింది. దీంతో పిటిషన్‌పై విచారణకు హైకోర్టు ధర్మాసనం నిరాకరించి, ఆ విషయాన్ని పిటిషనర్ న్యాయవాదికి తెలిపినట్లు సమాచారం.

మాజీ మంత్రి బండారు అరెస్టు

సీఎం వైఎస్ జగన్‌ను, మంత్రి రోజాను దూషించినందుకు బండారుపై కేసు



బండారు ఇంటివద్ద మోహరించిన పోలీసు బలగాలు

పరవాడ (పెందుర్తి)/ గుంటూరు ఈస్ట్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, మహిళా మంత్రి రోజాపైన అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగుదేశం పార్టీ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిని సోమవారం రాత్రి పోలీసులు విశాఖ సమీపంలోని వెన్నలపాలెంలో ఉన్న ఆయన ఇంట్లో అరెస్టు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేతలు, కార్యకర్తలు హైడ్రామా సృష్టించారు. అరెస్టు నుంచి తప్పించుకోవడానికి బండారు ఇంటి లోపల గడియ పెట్టుకొని కొంత సేపు, ఆరోగ్యం బాగోలేదని కొంత సేపు ఎత్తులు వేశారు. అయినప్పటికీ అనకాపల్లి అదనపు ఎస్పీ విజయభాస్కర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి 7.59 గంటలకు అరెస్టు చేసి గుంటూరుకు తీసుకువెళ్లారు.

బండారు సత్యనారాయణమూర్తి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్, మంత్రి రోజాపై ఇటీవల తీవ్ర పదజాలంతో అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీనిపై గుంటూరు జిల్లాలో కేసులు నమోదయ్యాయి. రోజాపై వ్యాఖ్యలు చేసినందుకు బండారుపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మహిళా కమిషన్ పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. బండారు వ్యాఖ్యలపై గుంటూరు నగరంపాలెం పోలీసు స్టేషన్‌లో కొందరు న్యాయవాదులు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన గుంటూరు పోలీసులు బండారుకు నోటీసులు ఇచ్చి, అరెస్టు చేయడానికి పోలీసులు విశాఖకు వెళ్లారు. అనకాపల్లి, పరవాడ డీఎస్పీలు పి.శ్రీనివాసరావు, ఎస్‌వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి 11 గంటలకు భారీ పోలీసు బలగాలతో విశాఖ సమీపంలోని అనకాపల్లి జిల్లా వెన్నలపాలెంలో ఉన్న బండారు నివాసానికి వచ్చారు. అరెస్టు నుంచి తప్పించుకోవడానికి బండారు సత్యనారాయణ ఇంటి లోపల గడియ పెట్టుకున్నారు. దీంతో పోలీసులు బయటే ఉండిపోయారు. ఆరోగ్యం బాగోలేదంటూ కొంతసేపు మంచంపై పడుకొన్నారు. అయితే తన పరామర్శకు వచ్చిన టీడీపీ నేతలతో మాత్రం ఆయన కులాసాగా మాట్లాడారు. తన భర్త షుగరు, బీపీతో బాధపడుతున్నారని, వైద్య పరీక్షలకు పోలీసులు ఆటంకం కలిగిస్తున్నారంటూ బండారు భార్య మాధవీలత పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ శ్రేణుల కవ్వింపు చర్యలు

బండారును అరెస్టు చేస్తున్నట్లు వార్తలు రావడంతో పోలీసులను అడ్డుకోడానికి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఆయన ఇంటి వద్దకు వచ్చారు. ఇంటి లోపలకు వెళ్లకుండా పోలీసులను అడ్డుకోడానికి ప్రయత్నించారు. అయితే పోలీసు అధికారులు భారీ సంఖ్యలో పోలీసులను మోహరించారు. వెన్నలపాలెం నాలుగు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేశారు. మరోవైపు టీడీపీ సీనియర్ నేతలు చింతకాయల అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, గండి బాబ్జి, పెతకంశెట్టి గణబాబు, వెలగపూడి రామకృష్ణబాబు, పల్లా శ్రీనివాసరావు ఒకరి తర్వాత ఒకరుగా వెన్నలపాలెం చేరుకున్నారు. బండారును పరామర్శించే పేరుతో కొంతసేపు హడావుడి చేశారు. బండారు అరెస్టుకు కారణాలు చూపించాలని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు ఈ డ్రామా నడిచింది. సోమవారం సాయంత్రం 4 గంటలకు అనకాపల్లి అదనపు ఎస్పీ విజయభాస్కర్ బండారు ఇంటికి రావడంతో అరెస్టు అనివార్యమని టీడీపీ శ్రేణులు భావించాయి. బండారు అరెస్టును అడ్డుకోవడానికి ప్రయత్నిస్తూ కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. అయినప్పటికీ పోలీసులు శాంతంగా వారిని నిలువరించారు. అరెస్టును అడ్డుకోవడానికి టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, నాయకులు గండి బాబ్జీ, పీలా శ్రీనివాసరావు, ఇతర నేతలు బండారు ఇంటి గేట్లు దూకి లోపలికి ప్రవేశించారు. ఏఎస్పీ విజయభాస్కర్ వారితో మాట్లాడారు. పోలీసులకు సహకరించాలని కోరారు. చివరకు సాయంత్రం 7.59 గంటల సమయంలో బండారు సత్యనారాయణమూర్తిని అరెస్టు చేసి గుంటూరుకు తరలించారు.

'బండారు'పై మరో కేసు నమోదు

గుంటూరు ఈస్ట్ : ముఖ్యమంత్రిని, పోలీసు ఉన్నతాధికారులను దూషించి సోషల్ మీడియాలో పోస్టు చేసిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తిపై గుంటూరు నగరం అరండల్‌పేట పోలీసులు మరో కేసు నమోదు చేశారు. ఎస్‌హెచ్‌వో రామానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. బండారు సత్యనారాయణమూర్తి విశాఖపట్నంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నిందాపూర్వకంగా వ్యాఖ్యలు చేశారు. సీఐడీ అధికారులపై దిగజారి వ్యాఖ్యలు చేశారు. దీనివల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతున్నదని, దీన్ని అనుసరించి మరికొంత మంది రాష్ట్రంలో అలజడి సృష్టిస్తారని పోలీసులు భావించారు. సోషల్ మీడియాలో వచ్చిన వాటిని సుమోటోగా తీసుకొని, బండారు సత్యనారాయణమూర్తిపై కేసు నమోదు చేశారు.

ప్రజాధనాన్ని దోచుకుని సత్యాగ్రహ దీక్షలా?

- గాంధీని అవమానించే రీతిలో బాబు నిరసన
- ఆధారాలు దొరికినందునే కోర్టు ఆయనకు రిమాండ్ విధించింది
- ఒక అవినీతిపరుడు అడ్డంగా బుక్కై బరితెగింపుతో దీక్షలా?
- గాంధీజీ బాటలో ఏపీలో సీఎం జగన్ పాలన
- తన పాలనలో ఆయన నిశ్శబ్ద విప్లవం తీసుకొచ్చారు
- జైలులో చంద్రబాబు దీక్షలపై 'సజ్జల' ఫైర్



బాపూజీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడుతున్న సజ్జల, మంత్రులు, నేతలు

సాక్షి, అమరావతి : మహాత్మాగాంధీని అవమానించే రీతిలో చంద్రబాబు దీక్షలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఫైర్ అయ్యారు. పవిత్ర ఉద్దేశ్యంతో దీక్షలు చేస్తే బాగుంటుంది కానీ, అవినీతి కేసులో అరెస్టయిన చంద్రబాబు గురించి టీడీపీ నేతలు దీక్షలు చేయటం సిగ్గుచేటన్నారు. దోపిడీ చేసి జైలుకెళ్లి బాబు దీక్షలు చేయటమేమిటని ఆయన ప్రశ్నించారు. మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వారిద్దరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య పోరాట సాధనలో ఆ మహనీయుల త్యాగాలను, పోరాటాలను సజ్జల గుర్తుచేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో అడ్డంగా దొరికి జైలు ఊచలు లెక్కపెడుతున్న చంద్రబాబు సిగ్గులేకుండా గాంధీ జయంతి రోజున నిరాహారదీక్ష చేయడమేమిటి? మహాత్మాగాంధీని అవమానించే రీతిలో ఆయన దీక్షలున్నాయి. బాబు ఆధారసహితంగా దొరికిపోవడంవల్లే ఏసీబీ కోర్టు రిమాండ్ విధించింది. ప్రజాధనాన్ని దోపిడీ చేసి జైలులో దీక్షలు చేయడం హాస్యాస్పదం. ప్రజల కోసం పోరాటం చేసి జైలుకెళ్తే వేరు. ప్రజాధనాన్ని నిస్సిగ్గుగా దోచుకుని సత్యాగ్రహదీక్షలు ఎలా చేస్తారు. గాంధీ జయంతి రోజున ఉదాత్తమైన లక్ష్యాల కోసం దీక్షలు చెయ్యొచ్చు. కానీ ఒక అవినీతిపరుడు అడ్డంగా బుక్కై బరితెగింపుతో దీక్షలేంటి?

గాంధీ, శాస్త్రిల ఆశయాలతో జగన్ ముందుకు..

అహింస, సహనం వంటివి ఉదాత్తమైన లక్షణాలు. వాటిని చెప్పే ముందు మనం ఆచరించాలి. వాస్తవరూపంలో అది ఆచరించి చూపించటంవల్లే మన జాతిపిత మహనీయుడయ్యారు. లాల్‌బహదూర్ శాస్త్రి స్వాతంత్ర్య పోరాటంలో త్యాగాలు చేయడంతో పాటు విలువలతో కూడిన జీవితం గడిపారు. రాజకీయాల్లో ఆయన ఎందరికో మార్గదర్శకులు. వీరి వారి ఆశయాలను, ఆలోచనలను, స్ఫూర్తిని సీఎం జగన్ ముందుకు తీసుకెళ్తున్నారు. కిందిస్థాయి నుంచి ఆయన మార్పులు తీసుకొస్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా క్షేత్రస్థాయిలో పరిపాలనను ఎలా అందిస్తున్నారో వాటి ఫలితాలెలా ఉన్నాయో మనకు అర్థమవుతున్నాయి. అలాగే, గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సీఎం జగన్ పాలనలో కనిపిస్తోంది. ప్రభుత్వ పథకాలన్నీ గ్రామ, వార్డు సచివాలయాలవల్లే సాధ్యమవుతోంది. మరోవైపు.. రాష్ట్రంలోని ప్రజలందరి హెల్త్ ప్రొఫైల్ తయారవుతుంది. ప్రజలకు సంబంధించిన ఆరోగ్యసేవలు మరింతగా అందుబాటులోకి వస్తాయి. విద్యా, వైద్యరంగాలలో కార్పొరేట్ సంస్థలకు దీటుగా మార్పులు తెచ్చిన ఘనత సీఎం జగన్‌దే.

ప్రజల చేతుల్లోనే పాలన..

ఇక పేరుకు వైఎస్సార్‌సీపీ పాలన అయినా సీఎం జగన్ ప్రజల చేతుల్లోనే పాలన పెట్టారు. వ్యవసాయరంగంలో కూడా రైతులకు మేలు చేసే విధానాలు అమలుచేస్తున్నాం. సీఎం జగన్ తన పరిపాలనతో నిశ్శబ్ద విప్లవాన్ని తీసుకొచ్చారు. అందుకే తన పాలనవల్ల మేలు జరిగితేనే తనకు మద్దతు ఇవ్వమని సీఎం జగన్ ధైర్యంగా చెప్పగలుగుతున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, మేరుగు నాగార్జున, శాసన మండలి చీఫ్‌విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎంపీ నందిగం సురేష్, మాజీమంత్రి వెలంపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, ఎండీ రుహుల్లా, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాజీ మంత్రులు శిద్దా రాఘవరావు, డొక్కా మాణిక్యవరప్రసాద్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాతలు మహాత్మా గాంధీ, శాస్త్రి

మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్



సాక్షి, అమరావతి: మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రజలందరికీ స్ఫూర్తిప్రదాతలు అని మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ అన్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'మహోన్నత విలువలు పాటిస్తూ వారు చేసిన అనేక త్యాగాల ఫలితమే నేటి మన స్వేచ్ఛా భారతదేశం. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా వారు చూపిన తెగువ, పోరాటాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమే. ఆ మహనీయులు ఏదైతే కోరుకున్నారో వాటిని సీఎం వైఎస్ జగన్ తప్పకుండా అమలు చేస్తూ రాష్ట్రంలో బడుగు, బలహీన, మైనారిటీ, పేద వర్గాలను ఉన్నత స్థానంలోకి తీసుకువచ్చే దిశగా పనిచేస్తున్నారు. ప్రజల డబ్బు దోచుకుని ఆధారాలతో సహా పట్టుబడి రాజమండ్రి సెంట్రల్ జైలుకు వెళ్లిన తండ్రి చంద్రబాబును కాపాడాలనే తాపత్రయంలో లోకేశ్ ఢిల్లీ వెళ్లారు. ఆయన నిన్నటిదాకా ఏమని ప్రగల్భాలు పలికారో అందరూ చూశారు. తోలుతీస్తాం.. తాటతీస్తాం.. ఎర్రబుక్కు.. నిప్పు... అన్నారు. తీరా ఆయనొక పప్పు.. తుప్పుగా తేలింది. ఢిల్లీ నుంచి ఏపీలో అడుగుపెట్టడానికి గజగజ వణికిపోతున్నారు. ఎందుకంటే అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్ అలైన్‌మెంట్ స్కామ్‌లో లోకేశ్ నిందితుడు కదా?.. అందుకే పారిపోయి దాక్కున్నారు. సీఐడీ ఢిల్లీకి వెళ్లి నోటీసులు ఇస్తే చచ్చినట్లు ఏపీకి వస్తున్నారు...' అని అన్నారు.

తండ్రిని మించిన తనయుడు వైఎస్ జగన్

ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య చైర్మన్ వెంకట్రామిరెడ్డి



భవానీపురం (విజయవాడ పశ్చిమ): కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయటంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి రాజశేఖరరెడ్డికి మించిన తనయుడిగా నిలిచారని ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏపీ జీఈఎఫ్) చైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి అన్నారు. వైఎస్సార్ గురుకుల ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.నజరుల్లా, ఏపీ కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయ ఉపాధ్యాయినుల (కేజీబీవీ) సంఘం అధ్యక్షురాలు దేవి ఆధ్వర్యంలో సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన 'విద్యా సదస్సు–ఉపాధ్యాయుల ఆత్మీయ కలయిక' సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాలల కాంట్రాక్ట్ ఉపాధ్యాయులను రెగ్యులరైజ్ చేయిస్తామని తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు. గురుకుల పాఠశాలల పార్ట్ టైమ్ టీచర్స్‌ను కాంట్రాక్ట్ టీచర్స్‌గా చేయించే బాధ్యత తీసుకుంటామని చెప్పారు. మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం 2014కు ముందు నుంచి కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తున్న సుమారు 11 వేల మందిని సీఎం జగన్ రెగ్యులరైజ్ చేశారని చెప్పారు. అంతమందిని రెగ్యులరైజ్ చేసిన సీఎం జగన్‌కు కేజీబీవీలోని మరో వెయ్యి మందిని చెయ్యటం పెద్ద కష్టమేమీ కాదన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మెడికల్ లీవ్, హెల్త్ కార్డ్, రూ.ఐదు లక్షలలోపు జీతాలు ఉన్నవారికి ఆరోగ్యశ్రీ కార్డులు ఇప్పిస్తామని చెప్పారు. సమావేశంలో ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డి, టి.కల్పలతారెడ్డి, పీఆర్టీయూ ప్రధాన కార్యదర్శి మల్లు శ్రీధరరెడ్డి, పీఎస్టీయూ అధ్యక్షుడు లెక్కల జమాల్‌రెడ్డి పాల్గొన్నారు.

108 సేవలకు రూ. 725 కోట్లు

నిర్వహణ, కొత్త వాహనాల కొనుగోలుకు భారీగా వ్యయం

సగటున రోజూ మూడు వేల మందికి అత్యవసర సేవలు • నిర్వీర్యమైన వ్యవస్థకు ఊపిరి పోసిన సీఎం జగన్ ప్రభుత్వం

సాక్షి, అమరావతి: అనుకోని ప్రమాదాలు, అనారోగ్య సమస్యలకు గురై ప్రాణాపాయంతో కొట్టుమిట్టాడుతున్న వారికి 108 అంబులెన్స్‌లు సంజీవనిలా మారాయి. ఫోన్ చేసిన నిమిషాల వ్యవధిలో ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను వేగంగా ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలను నిలబెడుతున్నాయి. ప్రాణం విలువ తెలిసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం టీడీపీ హయాంలో నిర్వీర్యమైన 108 వ్యవస్థకు ఊపిరి పోసింది. 768 అంబులెన్స్‌ల ద్వారా ప్రజలకు ఉచితంగా సేవలందించేందుకు ఇప్పటి వరకూ రూ.589 కోట్లను ఖర్చు చేయగా కొత్త వాహనాల కొనుగోలుకు మరో రూ.136 కోట్లకుపైగా వ్యయం చేయడం గమనార్హం.



గర్భిణులే అత్యధికం..

ప్రస్తుతం రాష్ట్రంలో రోజుకు సగటున మూడు వేల మందికి అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌లు సేవలందిస్తున్నాయి. 2020 జూలై నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ నెలాఖరు నాటికి 36 లక్షల మంది సేవలు పొందారు. వీరిలో అత్యధికంగా 23 శాతం మంది గర్భిణులుండగా 14 శాతం కిడ్నీ బాధితులు, 11 శాతం మంది రోడ్డు ప్రమాద బాధితులున్నారు.

నిర్వహణకు ఏటా రూ.188 కోట్లకు పైగా

రోడ్డు ప్రమాదాల బాధితులు, గుండె పోటు, బ్రెయిన్ స్ట్రోక్, ఇతర అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారిని ఎంత త్వరగా ఆస్పత్రికి తరలిస్తే ప్రాణ రక్షణకు అంత ఎక్కువ అవకాశాలుంటాయి. ఈ నేపథ్యంలో 108 అంబులెన్స్‌ల నిర్వహణ, ఉచితంగా అత్యవసర రవాణా సేవలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. క్షేత్ర స్థాయిలో అంబులెన్స్ కార్యకలాపాల కోసం 3700 మందికి పైగా విధులు నిర్వహిస్తుండగా ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్‌లో మరో 311 మంది సిబ్బంది పని చేస్తున్నారు. వీరికి వేతనాలతో పాటు అంబులెన్స్‌ల నిర్వహణ కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున ఖర్చు చేస్తోంది. ప్రతి నెలా 108 అంబులెన్సుల నిర్వహణ కోసం రూ.14.39 కోట్లు వెచ్చిస్తోంది. ఏడాదికి రూ.172.68 కోట్లను నిర్వహణ కోసం కేటాయిస్తోంది. దీనికి తోడు ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్ కోసం ఏడాదికి రూ.15.88 కోట్లు చొప్పున ఖర్చు చేస్తోంది. అంటే ఏడాదికి మొత్తం రూ.188 కోట్లకు పైగా వ్యయం చేస్తోంది.

గిరిజన ప్రాంతాలకు ప్రత్యేకంగా వాహనాలు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చే నాటికి 108 అంబులెన్సు సేవలు 336 వాహనాలతో అరకొరగా ఉండేవి. అప్పట్లో 679 మండలాలు (ప్రస్తుతం 686) ఉండగా మండలానికి ఒక అంబులెన్స్ కూడా లేని పరిస్థితి నెలకొంది. ఈ దుస్థితికి తెర దించుతూ సీఎం జగన్ 2020 జూలై 1న ఏకంగా 412 కొత్త 108 అంబులెన్సులను ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా ప్రభుత్వ అంబులెన్సుల సంఖ్య 748కు పెరిగింది. ఇందుకోసం రూ.96.5 కోట్లు ఖర్చు చేశారు. గిరిజన ప్రాంతాల కోసమే ప్రత్యేకంగా 20 కొత్త అంబులెన్స్‌లను రూ.4.76 కోట్లతో 2022 అక్టోబర్‌లో అదనంగా కొనుగోలు చేశారు. దీంతో అంబులెన్సుల సంఖ్య 768కి చేరింది. 2.5 లక్షల కి.మీకిపైగా తిరిగిన పాత వాహనాలను తొలగించి వాటి స్థానంలో ఈ ఏడాది జూలైలో 146 కొత్త అంబులెన్సులను అందుబాటులోకి తెచ్చారు. వీటి కొనుగోలుకు ప్రభుత్వం మరో రూ.34.79 కోట్లు ఖర్చు చేసింది. ఇలా రూ.136.02 కోట్లు అంబులెన్స్ కొనుగోలుకు వెచ్చించారు. తద్వారా నిర్వహణ, కొత్త వాహనాల కొనుగోలు కోసం రూ.725.02 కోట్లు ఖర్చు చేశారు.

తోడు దొంగల 'రింగ్'!

▶ మొదటి పేజీ తరువాయి

అలైన్‌మెంట్‌నే మాస్టర్‌ప్లాన్‌లో పొందుపరచాలని షరతు విధించారు. అప్పటికే తాము ఖరారు చేసిన అలైన్‌మెంట్‌నే ఎస్టీయూపీ కన్సల్టెన్సీ ద్వారా ఆమోదించుకున్నారు. తద్వారా అటు అమరావతి సీడ్ క్యాపిటల్ పరిధిలో ఇటు నదికి అవతల ఉమ్మడి కృష్ణా జిల్లాలోని తమ భూముల ధరలు అమాంతం పెరిగేలా కుట్ర పన్నారు.

నారాయణ హెచ్చరికలతో..

వాస్తవానికి సీఆర్‌డీఏ అధికారులు మొదట రూపొందించిన అలైన్‌మెంట్ ప్రకారం ఇన్నర్‌రింగ్ రోడ్డును గుంటూరు జిల్లాలోని అమరావతి నుంచి కృష్ణా జిల్లాలోని నున్న మీదుగా నిర్మించాల్సి ఉంటుంది. అందుకోసం కృష్ణా నదిపై వంతెన నిర్మించాలి. గుంటూరు జిల్లాలోని నూతక్కి - కృష్ణా జిల్లాలోని పెద్దపులిపర్రు మధ్య కృష్ణా నదిపై వంతెన నిర్మించి అక్కడ నుంచి తాడిగడప నుంచి ఎనికేపాడు మీదుగా నున్న వరకు ఇన్నర్‌రింగ్ రోడ్డు కొనసాగాలి. అయితే అలా నిర్మిస్తే ఆ ప్రాంతంలోని నారాయణ విద్యా సంస్థల భవనాలను భూసేకరణ కింద తొలగించాల్సి వస్తుంది. దీంతో ఈ అలైన్‌మెంట్‌పై సీఆర్‌డీఏ అధికారులపై నారాయణ తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. సీఆర్‌డీఏ సమావేశంలో అధికారులను పరుష పదజాలంతో దూషిస్తూ అలైన్‌మెంట్ మార్చాలని ఆదేశించారు. దీంతో ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను 3 కి.మీ. తూర్పు దిశగా మార్చారు. దాని ప్రకారం గుంటూరు జిల్లాలోని రామచంద్రాపురం - కృష్ణా జిల్లాలోని చోడవరం మధ్య వంతెన నిర్మిస్తారు. అక్కడ నుంచి పెనమలూరు మీదుగా నిడమానూరు నుంచి నున్న వరకు ఇన్నర్ రింగ్ రోడ్డును నిర్మిస్తారు. నారాయణ కుటుంబానికి చెందిన 9 విద్యా సంస్థల భవనాలను ఆనుకుని వెళ్లేలా ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను ఖరారు చేశారు.

ఏడాది ముందుగానే లే అవుట్లకు 'నో'

అసలు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను అధికారికంగా ప్రకటించటానికి ఏడాది ముందు నుంచే ఆ ప్రాంతంలో లే అవుట్లకు సీఆర్‌డీఏ అనుమతులను తిరస్కరించడం గమనార్హం. అంటే అలైన్‌మెంట్ మార్పుపై పక్కా సమాచారంతోనే ఈ వ్యవహారం సాగినట్లు స్పష్టమవుతోంది. అక్కడ ఇన్నర్ రింగ్ రోడ్డు వెళ్తుందని తెలియని సాధారణ వ్యక్తులు, పలువురు ప్రైవేట్ రియల్టర్లు లే అవుట్ల కోసం సీఆర్‌డీఏకు దరఖాస్తు చేసుకున్నారు. అంతేకాకుండా ఆ ప్రాంతంలో ప్రధాన కార్యాలయాల భవనాలను నిర్మించేందుకు కొన్ని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సైతం దరఖాస్తు చేసుకున్నాయి. అయితే ఆ లే అవుట్లు, భవన నిర్మాణాల దరఖాస్తులను సీఆర్‌డీఏ తిరస్కరించింది. అప్పటికి ఆ ప్రాంతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మిస్తామని అధికారికంగా ప్రకటించలేదు. అధికారికంగా అమరావతి మాస్టర్‌ప్లాన్ కూడా ఖరారు లేదు. అయినప్పటికీ ఆ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు, కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు అనుమతులను టీడీపీ సర్కారు తిరస్కరించింది. వ్యవసాయ భూముల వినియోగ మార్పిడి ద్వారా లే అవుట్ల కోసం అందిన 29 దరఖాస్తులతోపాటు ప్రతిపాదిత రింగు రోడ్డుకు చేరువలోని 70 లే అవుట్లకు అనుమతులను తిరస్కరించినట్లు సిట్ దర్యాప్తులో వెలుగులోకి వచ్చింది. దీంతోపాటు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల భవన నిర్మాణ అనుమతులను సైతం తిరస్కరించారు. అంటే మాజీ సీఎం చంద్రబాబు, మాజీ మంత్రి నారాయణకు ఆ ప్రాంతంలో ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణం, అలైన్‌మెంట్‌పై ముందుగానే కచ్చితమైన సమాచారం ఉన్నట్లు స్పష్టమవుతోంది.

'రింగు' కోసం బైపాస్‌కు బైబై..

తమ భూముల ధరలు పెరిగితే చాలు.. ప్రజా ప్రయోజనాలు తమకు ఏమాత్రం పట్టవని చంద్రబాబు, నారాయణ ద్వయం నిరూపించింది. విజయవాడ నగరంపై ట్రాఫిక్ రద్దీని తగ్గిస్తూ చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై ప్రయాణాన్ని మరింత సరళతరం చేసేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఓ ప్రణాళికను ఖరారు చేశారు. గుండుగొలను నుంచి విజయవాడ రూరల్, ఇబ్రహీంపట్నం మండలాల నుంచి కృష్ణా నది మీదుగా గుంటూరు జిల్లా కాజ వరకు విజయవాడ పశ్చిమ బైపాస్‌ను నిర్మించాలని నిర్ణయించారు. కేంద్ర జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) నిర్మించే ఈ రహదారి కోసం భూసేకరణ ప్రక్రియ కూడా పూర్తి చేశారు. వైఎస్సార్ హఠాన్మరణం తరువాత ప్రభుత్వాలు ఆ ప్రాజెక్టు గురించి పట్టించుకోలేదు. రాష్ట్ర విభజన తరువాత ఎన్‌హెచ్ఏఐ పనులు ప్రారంభించినా చంద్రబాబు ప్రభుత్వం అందుకు ఏమాత్రం సహకరించలేదు. విజయవాడ పశ్చిమ బైపాస్ నిర్మాణం పూర్తయితే ఇక ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మించాల్సిన అవసరమే ఉండదు. అదే జరిగితే తమ భూముల ధరలు అడ్డగోలుగా పెంచుకునేందుకు అవకాశం ఉండదని చంద్రబాబు, నారాయణ ఆందోళన చెందారు. దీంతో విజయవాడ పశ్చిమ బైపాస్ రోడ్డు పనులకు అడ్డు పడ్డారు. టీడీపీ ఐదేళ్ల పాలనలో ఆ పనులు ఏమాత్రం ముందుకు సాగకపోవడమే ఇందుకు నిదర్శనం.

చంద్రబాబు, నారాయణ ఆదేశాలతో సీఆర్‌డీఏ తిరస్కరించిన లే అవుట్లలో కొన్ని ఇవీ...

లే అవుట్లకు అనుమతుల తిరస్కరణ

గ్రామం	సర్వే నంబర్	విస్తీర్ణం
నిడమానూరు (విజయవాడ రూరల్ మండలం)	66	8,134.10 చ.మీటర్లు
కొండపల్లి (ఇబ్రహీంపట్నం మండలం)	137	33,209.29 చ.మీటర్లు
నున్న (విజయవాడ రూరల్ మండలం)	305/3	1,375.79 చ.మీటర్లు
కేంద్ర మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయం భవన నిర్మాణానికి అనుమతి నిరాకరణ		
పోరంకి (పెనమలూరు మండలం)	483	695.93 చ.మీటర్లు
పోరంకి (పెనమలూరు మండలం)	483 పి	1,740.00 చ.మీటర్లు

త్వరలో ప్రారంభానికి సన్నాహాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విజయవాడ పశ్చిమ బైపాస్ పనులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాజెక్టు పనులకు అవరోధాలు తొలగిపోయేలా చర్యలు తీసుకున్నారు. భూసేకరణ, ఇతర అంశాలను రాష్ట్ర ప్రభుత్వం సత్వరం పరిష్కరించడంతో రూ.3,200 కోట్ల విలువైన విజయవాడ పశ్చిమ బైపాస్ పనులు తుదిదశలో ఉన్నాయి. ప్రస్తుతం దాదాపు 90 శాతం పనులు పూర్తి కావడం విశేషం. సుమారు 50 కి.మీ పొడవైన ఈ ఆరు లేన్ల బైపాస్‌ను త్వరలోనే ప్రారంభించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ప్రజా ప్రయోజనకరమైన ప్రాజెక్టు నిర్మాణాన్ని స్వార్థ ప్రయోజనాల కోసం చంద్రబాబు సర్కారు అడ్డుకోగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శరవేగంగా పూర్తి చేస్తుండటం గమనార్హం.

నారాయణకు సీఐడీ నోటీసులు

• లోకేశ్‌తో పాటు రేపు విచారణకు హాజరుకావాలన్న సీఐడీ



సాక్షి, అమరావతి: అమరావతిలో ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ కుంభకోణం కేసులో ఏ-2గా ఉన్న పొంగూరు నారాయణకు సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) సోమవారం నోటీసులిచ్చింది. ఈ కేసులో ఏ-14గా ఉన్న లోకేశ్‌తో పాటు ఈ నెల 4న తాడేపల్లిలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. ఈ మేరకు నారాయణకు ఈ-మెయిల్, వాట్సాప్ ద్వారా నోటీసులు పంపింది. వ్యక్తిగతంగా కలసి నోటీసులు ఇచ్చేందుకు ఆయన అందుబాటులో లేకపోవడంతో ఈ విధంగా నోటీసులు జారీ చేసింది. చంద్రబాబు, లింగమనేని, తమ వ్యాపార సంస్థలు, బినామీల భూముల ధరలు అమాంతంగా పెరిగేలా అలైన్‌మెంట్‌లో మార్పులు చేశారని సిట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. లింగమనేనితో క్విడ్ ప్రోకోకు పాల్పడటం ద్వారా చంద్రబాబుకు కరకట్ట బంగ్లా, హెరిటేజ్ ఫుడ్స్‌కు భూములు, రామకృష్ణ హౌసింగ్ లిమిటెడ్ పేరిట భూములు పొందిన విషయం ఆదారాలతో బయటపడింది. దాంతోపాటు నారాయణ విద్యా సంస్థల భూముల ధరలు భారీగా పెరిగేలా చేశారు. సిట్ నోటీసులపై నారాయణ ఇప్పటివరకు స్పందించలేదు. గతంలో ఈ కేసులో సిట్ అధికారులు ఆయన కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లో విచారించారు.

బ్లూ ఫ్లాగ్ రెపరెపలాడేలా..!

రాష్ట్రంలోని 8 బీచ్‌లకు ఎకో లేబుల్ 'బ్లూ ఫ్లాగ్' సాధించేలా కార్యాచరణ

- మంగినపూడి, సూర్యలంక, రామాపురం బీచ్‌లను ఇప్పటికే సందర్శించిన బ్లూ ఫ్లాగ్ ఆర్కిటెక్ట్ బృందం
- 1500 మీటర్ల సముద్రతీర భౌతిక స్థితి, జాలర్ల కనెక్టివిటీ పరిశీలన
- గుర్తింపు లభిస్తే అంతర్జాతీయ వసతులతో పెరగనున్న విదేశీ పర్యాటకుల సంఖ్య


ఇటీవల సూర్యలంక బీచ్‌లో పర్యటించిన బ్లూ ఫ్లాగ్ ఆర్కిటెక్ట్ బృందం

సాక్షి ప్రతినిధి, విజయవాడ: సముద్రతీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇందులో భాగంగానే బీచ్‌లను అభివృద్ధి చేస్తోంది. పర్యాటక శాఖ రాష్ట్రంలో 12 జిల్లాల్లో 373 అభివృద్ధి చేయగల బీచ్‌లను గుర్తించింది. విశాఖలోని ఆర్కే బీచ్, పశ్చిమ గోదావరి జిల్లా పేరుపాలెం, కృష్ణా జిల్లా మంగినపూడి, బాపట్ల జిల్లా సూర్యలంక, ప్రకాశం జిల్లా రామాయపట్నం, నెల్లూరు జిల్లా మైపాడు, కాకినాడ జిల్లాలోని ఉప్పాడ తదితర 8 బీచ్‌లను బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ఇటీవల ఇందులో మంగినపూడి, సూర్యలంక, రామాపురం బీచ్‌లను సుజిత్‌కుమార్ నేతృత్వంలోని బ్లూ ఫ్లాగ్ ఆర్కిటెక్ట్ బృందం పరిశీలించింది. వీరు అక్కడ 1500 మీటర్ల సముద్ర భౌతిక పరిస్థితిని, జాలర్ల కనెక్టివిటీని, మత్స్యకారులకు అనుకూలమైన వ్యాపార వ్యవహారాలను చూశారు. ఫౌండేషన్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ (ఎఫ్ఈఈ) అనే డానిష్ సంస్థ బీచ్‌లకు 'బ్లూఫ్లాగ్' సర్టిఫికెట్‌లు ఇవ్వటం కోసం పనిచేస్తోంది. ఈ సర్టిఫికెట్ ప్రదానం చేయడానికి 33 కఠినమైన ప్రమాణాల అంశాలను పరిశీలించి, వాటికి అనుగుణంగా ఉంటేనే ఈ ట్యాగ్ అందజేస్తారు. ఈ ట్యాగ్ ఉన్న బీచ్‌లను అత్యంత పరిశుభ్రమైనవిగా గుర్తిస్తారు. ఇలాంటి అరుదైన గుర్తింపు రాష్ట్రంలో 2020లో రుషికొండ బీచ్‌కు లభించింది.

సందర్శకుల వినోదానికి..

బీచ్‌లలో సందర్శకుల వినోదానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సురక్షిత బోటు షికారు, ఈత కొలను, వాటర్ స్పోర్ట్స్, రోలింగ్ స్కేటింగ్, చిల్డ్రన్ పార్కు, స్నానపు గదులు, ఓపెన్ జిమ్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. స్థానిక దేవాలయాలను అభివృద్ధి చేస్తారు. వీటికి సంబంధించిన ప్రతిపాదనలను పర్యాటక శాఖ ఇప్పటికే ప్రభుత్వానికి పంపింది.

బ్లూ ఫ్లాగ్ గుర్తింపు లభిస్తే..

బీచ్‌ల అభివృద్ధికి రూ.15 కోట్ల నిధులు మంజూరు అవుతాయి. అనేక అంతర్జాతీయ వసతులతో పాటు, విదేశీ పర్యాటకుల రాక పెరుగుతుంది. దీంతోపాటు స్వదేశీ పర్యాటకులు కూడా సురక్షితమైన బీచ్‌లకు కుటుంబ సభ్యులతో వెళ్లేందుకు వీలు కలుగుతుంది. తద్వారా టూరిజం, ట్రావెల్, హాస్పిటాలిటీ విభాగాల్లో ఉద్యోగ వనరులతోపాటు, ఆదాయ వనరులు పెరుగుతాయి. రాష్ట్రంలో గుర్తించిన ఎనిమిది బీచ్‌లలో పర్యాటక అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలున్నాయి. విదేశీ స్థాయి వనరులతోపాటు, సౌకర్యాలతో ఆహ్లాదకరమైన నీటి ఆటలు, వినోదాల ఏర్పాటుకు రాష్ట్ర పర్యాటక శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. మత్స్యకారుల అభివృద్ధే ధ్యేయంగా బీచ్‌లను విదేశీ స్థాయికి పెంచేలా చర్యలు తీసుకోనున్నారు. ఇందులో భాగంగా మత్స్యకారులకు మార్కెట్ సౌకర్యం కల్పించడం, మత్స్య సంపద ప్రదర్శన క్రమ పద్ధతిలో షాపులను ఏర్పాటు చేస్తారు. పర్యాటకులను ఆకర్షించేలా ముఖద్వారాలు ఏర్పాటు చేస్తారు.

అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



బీచ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. మంగినపూడి, సూర్యలంక, రామాపురం బీచ్‌లను ఇటీవలే బ్లూ ఫ్లాగ్ ఆర్కిటెక్ట్ బృందం పరిశీలించింది. పర్యావరణానికి అనుకూలంగా మత్స్య సంపదకు ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నాం, బ్లూ ఫ్లాగ్ గుర్తింపు లభిస్తే అనేక రకాల అంతర్జాతీయ వసతులు సమకూరడంతో పాటు విదేశీ పర్యాటకుల రాక పెరుగుతుంది. సందర్శకుల వినోదానికి అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు వీలుగా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.

– వాకా శ్రీనివాసులరెడ్డి,
పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్, విజయవాడ

నగరం.. అభివృద్ధి పథం

- గుంటూరు నగరపాలక సంస్థలో అభివృద్ధి పరుగులు
- నగరంలో వేగవంతంగా జరుగుతున్న 537 పనులు
- బిల్లుల చెల్లింపులోనూ...
- ఏడాదిన్నరలో రూ.160 కోట్ల బిల్లుల చెల్లింపు
- వసూళ్లలో కూడా రికార్డులే...



సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు నగర పాలక సంస్థ అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తోంది. వందల కోట్ల రూపాయల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం 537 అభివృద్ధి పనులు నగరంలో జరుగుతున్నాయి. రోడ్ల విస్తరణతో పాటు రోడ్లు, డ్రైయిన్ల నిర్మాణం శరవేగంగా జరుగుతున్నాయి. గత ప్రభుత్వం అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పేరుతో సుమారు 120 కిలోమీటర్ల వరకూ తవ్వి వదిలేశారు. గత ప్రభుత్వ హయాంలో నగరంలోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. గుంటూరు కాస్తా గుంటలూరుగా మారిపోయింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్లను ఒక్కొక్కటిగా పునరుద్ధరించుకుంటూ వస్తున్నారు. గుంటూరు కార్పొరేషన్‌లో వైఎస్సార్ సీపీ పాలక వర్గం వచ్చిన తర్వాత గుంటూరు నగరాభివృద్ధిపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టారు.

జనరల్ ఫండ్స్ నుంచి బిల్లులు..

ముఖ్యంగా ఐఏఎస్‌లు మున్సిపల్ కమిషనర్లుగా వచ్చిన తర్వాత అభివృద్ధి పట్టాలు ఎక్కింది. రోడ్ల పునరుద్ధరణతో పాటు పార్కులు, కూడళ్లు, అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలు వడివడిగా జరుగుతున్నాయి. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తూ వస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బిల్లులు సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లిస్తుండగా యూజీడీ పనుల వల్ల రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నందున వాటిని పునరుద్ధరించుకునేందుకు డబ్బులు నేరుగా చెల్లించాలని కోరడంతో ముఖ్యమంత్రి అంగీకరించారు. దీంతో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా గుంటూరు నగరంలోనే జనరల్ ఫండ్స్ నుంచి బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. సిఫార్సులతో సంబంధం లేకుండా అభివృద్ధి పనులు చేసిన ప్రతి ఒక్క కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లిస్తూ వస్తున్నారు. గుంటూరు నగర పరిధిలోని మూడు నియోజకవర్గాలలో అభివృద్ధి పనులు చేస్తున్న సుమారు 40 మంది కాంట్రాక్టర్లకు ఈ నెలలో రూ. 9.5 కోట్లు చెల్లించగా, గత నెలలో కూడా కాంట్రాక్టర్లకు రూ.10 కోట్లు చెల్లించారు. అధికారులు, కాంట్రాక్టర్ల మధ్య సమన్వయ లోపంతో కొంతమంది కాంట్రాక్టర్లు తమకు అన్యాయం జరుగుతుందంటూ మీడియాకి ఎక్కారు. క్రమ పద్ధతిలో ఇచ్చుకుంటూ వెళ్తే పెద్ద కాంట్రాక్టర్లు నలుగురైదుగురికి మాత్రమే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అన్ని ప్రాంతాల్లో పనులు చేస్తున్న అందరు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించడాన్ని కొందరు తప్పు పట్టడంతో వివాదం మొదలైంది. అయితే నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు కాంట్రాక్టర్లతో సమావేశమై వారికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకూ 475 మందికి రూ.144,46,35,931 చెల్లించారు. గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ రూ.71.05 కోట్ల చెల్లింపులు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ రూ. 53.93 కోట్ల బిల్లులు చెల్లించారు. సీఎఫ్ఎంఎస్ ద్వారా రూ.16 కోట్లు చెల్లించారు. నెలకు రూ.5కోట్ల కన్నా ఎక్కువ బిల్లులు గత ఏడాది నుంచే చెల్లిస్తున్నారు. గత మూడు దశాబ్దాలలో అంత మొత్తంలో బిల్లులు చెల్లింపులు జరిపిన సందర్భాలు లేవు.

త్వరలోనే గాంధీ పార్కు ప్రారంభం..



ఈ ఏడాది ఏప్రిల్ నాటికి ఆస్తి పన్నులను అడ్వాన్స్ ట్యాక్స్ రూపంలో రాష్ట్రంలోనే రికార్డు స్థాయిలో రూ.50 కోట్లకు పైగా వసూలు చేసిన మున్సిపల్ కమిషనర్ చేకూరి కీర్తి ప్రస్తుతం అభివృద్ధి పనులు చేపట్టడంపై దృష్టి పెడుతున్నారు. ఇప్పటికే 60 పనులు పూర్తి కాగా, మరో 150 వరకూ పనులు టెండర్ స్థాయిలో ఉన్నాయి. త్వరలోనే పీవీకే నాయుడు మార్కెట్‌కు టెండర్లు పిలవడం ద్వారా గుంటూరు నగరపాలక సంస్థలో గుర్తుండిపోయే స్థాయి భవనాన్ని నిర్మించడంతో పాటు వేలాదిమందికి అక్కడ ఉపాధి దొరకనుంది. సుమారు రూ.4.5కోట్లతో అభివృద్ధి చేసిన గాంధీపార్కును కూడా వారం రోజుల్లో ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

ముస్లిం రచయితల సంఘం పత్రిక ఆవిష్కరణ


మురసం పత్రికను ఆవిష్కరిస్తున్న కార్యవర్గ సభ్యులు

పాతగుంటూరు: బ్రాడీ పేటలోని ముస్లిం రచయితల సంఘం(మురసం) కార్యాలయంలో సోమవారం సంఘం ప్రథమ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సభకు ప్రముఖ కవి కరిముల్లా అధ్యక్షత వహించారు. పలువురు రచయితలు పాల్గొని, మురసం విధి విధానాలు, నియమాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు. మురసం రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ హకీమ్ మాట్లాడుతూ రచనల ద్వారా సమాజాన్ని మేల్కొలిపే దిశగా రచయితలు ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర మహిళా కార్యదర్శి ఖుర్షీద్ బేగం మాట్లాడుతూ మురసం అభివృద్ధికి రచనలు, వ్యాసాలు, కథలతో పుస్తకాలను ప్రచురించాలన్నారు. అనంతరం ముస్లిం రచయితల సంఘం పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుల్బాం ఖాదర్ బాషా, రాష్ట్ర కార్యదర్శి ఎస్.ఎం.సుభాని, రాష్ట్ర కోశాధికారి గర్తపురి బషీర్, షేక్.మాబు సుభాని, ఖాజావలి పాల్గొన్నారు.

లడ్డూ ధర రూ.ఏడు లక్షలు

పాత గుంటూరు విద్యానగర్‌లోని వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గణనాథుని ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. విశేష పూజలు అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం వినాయకుని లడ్డూ వేలం నిర్వహించగా కొల్లి అరవింద్ కుమార్ రూ. 7.02 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కొల్లి బాలకృష్ణ, పుల్లెల అజయ్‌బాబు, తోట సాంబశివరావు, ఆరుమళ్ల నాగిరెడ్డి, బి.నాగిరెడ్డి, ఆళ్ల వెంకటరెడ్డి, శివకోటిరెడ్డి, బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





రక్తదానం చేస్తున్న చేతన పారిఖ్

న్యూస్‌మేకర్

ఇన్ని కోట్ల మంది ఉన్న మనదేశంలో 100 సార్లు రక్తదానం చేసినవారు కేవలం 125 మంది ఉన్నారు. వీరిలో స్త్రీలు ఇద్దరే ఉండగా మూడవ వ్యక్తిగా అహ్మదాబాద్‌కు చెందిన చేతన పారిఖ్ నిలిచింది. అక్టోబర్ 1న వందోసారి రక్తదానం చేయడం ద్వారా ఆమె ఈ ఘనత సొంతం చేసుకుంది. రక్తదాన అవసరాన్ని ప్రచారం చేయడమే కాక అనితరసాధ్యంగా పాటిస్తున్న చేతన పరిచయం.



రక్తదాతకు వందనం

అక్టోబర్ 1, ఆదివారం, అహ్మదాబాద్‌లోని జె.ఎల్.ఠాకూర్ రెడ్‌క్రాస్ భవన్.

'నేషనల్ వాలంటరీ బ్లడ్ డొనేషన్ డే' సందర్భంగా రెడ్‌క్రాస్ సంస్థ నిర్వహిస్తున్న మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్. అందరూ 58 ఏళ్ల చేతన పారిఖ్ కోసం ఎదురు చూస్తున్నారు. కాసేపటికి ఆమె వచ్చింది. రక్తం ఇవ్వడానికి అలవాటుగా చేతిని ముందుకు సాచింది. మెడికల్ స్టాఫ్ ఆమె చేతిలో సూది గుచ్చారు. ఆమె ఒంటి నుంచి రక్తం సాచెట్ వైపు ప్రవహించసాగింది. అంతే. అందరూ చప్పట్లు హోరెత్తించారు.

ఎందుకంటే ఆ రోజుతో ఆమె అలా రక్తాన్ని ఇవ్వడం వందోసారి. మన దేశంలో దశాబ్దాలుగా రెడ్ క్రాస్ నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో ఇప్పటి వరకు కేవలం ఇద్దరు స్త్రీలే నూరుసార్లు రక్తం ఇచ్చారు. చేతన పారిఖ్ మూడో వ్యక్తి. కాలేజీ రోజుల నుంచి అమ్మమ్మ వయసు వరకూ ఆమె ఎప్పుడూ రక్తదానం చేస్తూనే ఉంది. ఇక మీదట కూడా చేస్తూనే ఉంటాను అంటోంది.

1985లో మొదటిసారి

చేతన పారిఖ్ అహ్మదాబాద్‌లోనే పుట్టి పెరిగింది. నగరంలోని కలుపూర్ కాలేజీలో చదువుకుంది. 'అది 1985వ సంవత్సరం. మా కాలేజీకి రెడ్ క్రాస్ వాళ్లు వచ్చి రక్తం ఇమ్మని అభ్యర్థించారు.



రక్తదానం చేసి చేతులు చూపుతున్న చేతన, భర్త వినీత్, కూతురు మేహా, కొడుకు హన్షిల్

అప్పటికి రక్తదాన ఉద్యమం ఊపందుకోలేదు. చాలా అపోహలు ఉండేవి. కొద్దిమంది అబ్బాయిలు ముందుకొచ్చారు. నేను, ఇంకో అమ్మాయి మాత్రమే రక్తం ఇచ్చాం. మా ఇంటిలో ఇది తెలిసి చాలా ఆందోళన చెందారు. రక్తం ఇవ్వడం వల్ల శరీరానికి నష్టం అనుకునేవారు ఆ రోజుల్లో. కాని రక్తం అందక చాలా మంది మరణిస్తున్నారని అప్పటికే నాకు తెలుసు. ఇది చేయదగ్గ మంచి పని అనిపించింది. అప్పటి నుంచి రక్తం ఇస్తూనే ఉన్నాను' అంటుంది చేతన పారిఖ్.

కుటుంబంతో ఉద్యమం

చేతన భర్త వినిత్ పారిఖ్ సాదాసీదా డాక్టర్. పెళ్లయ్యాక చేతన తన భర్తను రక్తదానం వైపు ప్రోత్సహించింది. ఒక డాక్టర్‌గా రక్తదానం ఎంత అవసరమో తెలియడం వల్ల వినిత్ కూడా భార్య నుంచి స్ఫూర్తి పొందాడు. ఇద్దరూ కలిసి రెడ్ క్రాస్‌లో చేరారు. ఒకరికి చెప్పడమే కాదు తాము క్రమం తప్పకుండా రక్తదానం ఇస్తూ స్ఫూర్తిగా నిలిచారు. 'నా భర్త వినిత్ నా కంటే ముందే నూరుసార్లు రక్తం ఇచ్చినవాళ్ల లిస్ట్‌లోకి ఎక్కారు. నేను తాజాగా ఆ లిస్ట్‌లో చేరాను. మనం చేసి చూపిస్తే మిగిలినవారు అందుకుంటారు. నా కొడుకు హన్షిల్, నా కుమార్తె మేహ ఇద్దరూ డాక్టర్లే. వారు కూడా మాతో కలిసి రక్తదానం చేస్తూనే ఉంటారు. ఇద్దరూ ఇప్పటికి చెరో ముప్పైసార్లు రక్తం ఇచ్చారు. ఇలా మా కుటుంబంలోని నలుగురు సభ్యులం కలిసి మొత్తం 260 సార్లు రక్తం ఇచ్చాం. ఇన్నిసార్లు ఇచ్చిన మరో కుటుంబం లేదేమో మన దేశంలో' అంటుంది చేతన.

పెళ్లిలో వినూత్నం

చేతన రక్తదానం కోసం ప్రతి సందర్భాన్ని ఉపయోగించుకుంటుంది. కూతురు పెళ్లిలో ఆమె రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం విశేషం. అందులో పెళ్లికొడుకు స్వయంగా రక్తం ఇచ్చాడు. పెళ్లికి వచ్చిన బంధుజనుల్లో చాలామంది రక్తం ఇవ్వగా 58 యూనిట్ల సేకరణ జరిగింది. 'రక్తం విలువ సరిగ్గా అది అవసరమైనప్పుడు తెలుస్తుంది. రక్తం ల్యాబ్‌లో తయారు కాదు. మనిషే ఇవ్వాలి. అందుకు మానవత్వం ఉండాలి. మన మానవత్వం నిరూపించుకోవడానికి రక్తదానానికి మించిన మార్గం లేదు' అంటుంది చేతన.

ఒక గృహిణిగా ఉంటూనే ఆమె చేస్తున్న ఈ విశిష్ట ప్రచారం, సేవ ఒక్కరికైనా స్ఫూర్తి కలిగిస్తే అంతే చాలు.

గెలుపు బాట

మంచి మాట....మాటగానే మిగిలిపోదు. ఆ మాటలోని సారాంశం ఇంధనమై ముందుకు నడిపిస్తుంది. విజయం చేతికి అందేలా చేస్తుంది. కెరీర్ కోచ్‌గా ఎంతోమందికి స్టార్టప్‌లపై ఆసక్తి, అవగాహన కలిగిస్తోంది నిష్ఠా త్రిపాఠీ. అమెరికాలో రకరకాల స్టార్టప్‌లతో కలిసి పనిచేసిన త్రిపాఠీ ఇండియాకు తిరిగి వచ్చిన తరువాత ఎడ్-టెక్ స్టార్టప్ '24 నార్త్‌స్టార్'తో విజయం సాధించింది.

కర్తవ్య నిష్ఠ



నిష్ఠా త్రిపాఠీ

మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన నిష్ఠ తండ్రీ, తాతలు ప్రభుత్వ ఉద్యోగులు. 'వ్యాపారం' అనే మాట వారికి అపరిచితం. అయితే కథలు, కవితల పుస్తకాలు ప్రచురించేవారు. పుస్తకాలపై ఆసక్తి తాత, తండ్రి నుంచి నిష్ఠకు వారసత్వంగా వచ్చింది. నిష్ఠ పుస్తకాల పురుగు. చిన్న వయసులోనే స్కూల్ లైబ్రరీలోని పుస్తకాలన్నీ చదివేసింది.

'యూనివర్శిటీ ఆఫ్ ఇల్లినాయిస్'లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన తరువాత ఎన్నో స్టార్టప్‌లతో కలిసిపని చేసింది. ఉద్యోగాల కోత ఉధృతంగా ఉన్న రోజులవి. ఎప్పుడు ఎవరి ఉద్యోగం పోతుందో తెలియని పరిస్థితి. అలాంటి క్లిష్టపరిస్థితుల్లోనూ ఉద్యోగాలలో ప్రమోషన్‌లతో మంచి పేరు తెచ్చుకుంది నిష్ఠ. ఆ సమయంలో తన మీద తనకు నమ్మకం ఏర్పడడంతో ఎంటర్‌ప్రెన్యూర్ కలలు మొదలయ్యాయి.

'ఏ రోజైనా సరే స్టార్టప్ స్టార్ట్ చేస్తాను' అనే నమ్మకంతో ఉన్న నిష్ఠ న్యూయార్క్ యూనివర్శిటీలో ఎంబీఏ ప్రోగ్రామ్‌లో చేరి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ క్లబ్‌లోముఖ్యమైన కార్యక్రమాల్లో పాల్గొనడం ప్రారంభించింది. ఇందులో భాగంగా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సమ్మిట్‌ను నిర్వహించే అవకాశం వచ్చింది. నలుగురితో కలిసి మాట్లాడడానికి ఇబ్బంది పడే స్వభావం ఉన్న నిష్ఠకు ఈ సదస్సు ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది. తన బలహీనతలను అధిగమించే బలాన్ని ఇచ్చింది.

మన దేశానికి తిరిగి వచ్చిన తరువాత...

వైవాహిక జీవితంలో తలెత్తిన సమస్యలతో అశాంతికి గురైన నిష్ఠ త్రిపాఠీకి అక్షరస్నేహం సాంత్వన ఇచ్చింది.

ఎన్నో ఆధ్యాత్మిక పుస్తకాలు, తత్వశాస్త్ర పుస్తకాలు చదివింది.

'సెవెన్ కన్వర్సేషన్స్' పేరుతో మొదటి పుస్తకం రాసింది. ఈ పుస్తకానికి అద్భుతమైన స్పందన వచ్చింది. స్కూలు ఫ్రెండ్స్ నుంచి యూనివర్శిటీ ప్రొఫెసర్‌ల వరకు తనను అభినందించారు. ఆతరువాత...

సంక్లిష్టమైన బిజినెస్ కాన్సెప్ట్‌లను సులభతరం చేసి అందరికీ అర్థమయ్యేలా పుస్తకాలు రాసింది. పుస్తకాలు చదవడానికి ఇష్టపడే వాళ్లతో పాటు పుస్తకం పేరు వినబడగానే పారిపోయే వారు కూడా ఉంటారు. అలాంటి వారిని దృష్టిలో పెట్టుకొని ఎంజాయ్ చేస్తూ హాయిగా చదువుకునేలా పుస్తకాలు రాసింది. 'బిజినెస్ బుక్స్ అనగానే గంభీరమైన భాష వాడాలనే రూల్ లేదు' అని చెబుతుంది నిష్ఠ.

పదిహేనుమంది స్టార్టప్ ఫౌండర్‌లను ఇంటర్వ్యూ చేసి 'నో షార్ట్‌కట్స్' పేరుతో రాసిన పుస్తకానికి కూడా మంచి స్పందన వచ్చింది. అకడమిక్ కౌన్సెలింగ్ పేరుతో ఇస్తున్న కౌన్సెలింగ్ ఆమెను అసంతృప్తికి గురి చేసింది. దీన్ని దృష్టిలో పెట్టుకొని రకరకాల నేపథ్యాల నుంచి వచ్చిన విద్యార్థులకు అత్యవసరమైన లైఫ్‌స్కిల్స్ డెవలప్ చేయడానికి అకడమిక్ కౌన్సెలింగ్ స్పేస్‌లోకి అడుగు పెట్టింది.

'స్కాలర్ స్ట్రాటజీ' పేరుతో ఎడ్యుకేషనల్ స్టార్టప్‌ను ప్రారంభించింది.

> సంప్రదాయ ఆలోచనలకు భిన్నంగా ఉండే వ్యూహాలు స్టార్టప్‌ల విజయానికి కారణం అవుతాయి.
> – నిష్ఠ

'సంప్రదాయ ఆలోచనలకు భిన్నంగా ఉండే వ్యూహాలు స్టార్టప్‌ల విజయానికి కారణం అవుతాయి ' అంటున్న నిష్ఠ ఎడ్-టెక్ స్టార్టప్ '24నార్త్‌స్టార్' అనే స్టార్టప్‌కు శ్రీకారం చుట్టి విజయం సాధించింది.

'డబ్బు బాగా సంపాదించాలనే అత్యాశతో స్టార్టప్‌ను మొదలు పెట్టకండి. స్టార్టప్‌కు తమవైన సవాళ్లు ఉంటాయి. ఆ సవాళ్లు అర్థం చేసుకుంటూ ఓపిగ్గా ప్రయాణం మొదలుపెట్టాలి. ఒక స్టార్టప్ స్టార్ట్ చేసే ముందు కేవలం నా ఆసక్తి వల్లే ఇది మొదలు పెట్టానా? మార్కెట్‌లో విజయం సాధించే అవకాశాలు ఉన్నాయా? అనే కోణంలో సీరియస్‌గా విశ్లేషణ చేసుకోవాలి. నేను మొదట ఫ్యాషన్ స్టార్టప్ మొదలుపెట్టి కొద్ది కాలంలో మూసివేయాల్సి వచ్చింది. దీనికి కారణం ఫ్యాషన్‌పై నాకు అంతగా అవగాహన లేకపోవడమే' అంటుంది నిష్ఠా త్రిపాఠీ.

సాగుబడి

హస్త కార్తె: అక్టోబరు 10 వరకు

అదిరేటి వంగడాలు 'అంతరిక్షం' నుంచి?!

అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఈఏ) ప్లాంట్ బ్రీడింగ్ అండ్ జెనెటిక్స్ విభాగం అధిపతి డా. శోభా శివశంకర్‌తో 'సాక్షి సాగుబడి' ఈ-మెయిల్ ఇంటర్వ్యూ

భూతాపాన్ని, కరువును తట్టుకునే సరికొత్త వంగడాల కోసం అన్వేషణ ఇప్పుడు అంతరిక్షంలోకి చేరింది. అంతరిక్షంలో కాస్మిక్ కిరణాల రేడియేషన్‌లో కొన్ని నెలలు ఉంచిన విత్తనాలతో రూపొందించే (స్పేస్ ఇండ్యూస్డ్ మ్యుటేషన్ బ్రీడింగ్) వంగడాలు భూమ్మీద క్లైమెట్ ఎమర్జెన్సీని దీటుగా తట్టుకోగలుగుతాయని ఎఫ్.ఎ.ఓ. భావిస్తోంది. మొట్టమొదటిగా జొన్న విత్తనాలతో స్పేస్ బ్రీడింగ్ ప్రాజెక్టుకు అంతర్జాతీయ అణు ఇంధన సంస్థతో కలసి ఎఫ్.ఎ.ఓ. శ్రీకారం చుట్టింది. కేరళకు చెందిన శాస్త్రవేత్త డా. శోభా శివశంకర్ ఈ పరిశోధనలకు సారథ్యం వహిస్తుండటం విశేషం. ప్రపంచ అంతరిక్ష వారోత్సవాల (అక్టోబర్ 4-10) సందర్భంగా డా. శోభ 'సాక్షి సాగుబడి'కి ఈ-మెయిల్ ఇంటర్వ్యూ ఇచ్చారు. కరువును తట్టుకొని మంచి దిగుబడులు ఇచ్చే కొత్త వంగడాలు రూపొందించుకోవడానికి ఈ టెక్నాలజీ ఉపయోగపడు తుందని ఆమె ఈ ఇంటర్వ్యూలో చెప్పారు. స్పేస్ బ్రీడింగ్ ద్వారా చైనా ఇప్పటికే 260 వంగడాలను తయారు చేసుకొని వాడుతుండటం విశేషం.

■ **అంతరిక్షంలో రేడియేషన్‌కు గురిచేసిన విత్తనాలతో రూపొందించే (స్పేస్ బ్రీడింగ్) వంగడాల వల్ల కలిగే ప్రయోజనాలేమిటి?**

భూమిపై కరువు, అధిక ఉష్ణోగ్రతలు, నేల లవణీయత వంటి పర్యావరణ సంబంధమైన ఒత్తిళ్లు పంటలను వివిధ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పరిణామాత్మక ఉత్పరివర్తనాలు (ఎవల్యూషనరీ మ్యుటేషన్స్) చెందేందుకు ప్రేరేపిస్తాయి. అయితే, అంతరిక్షంలో కాస్మిక్ రేడియేషన్, మైక్రోగ్రావిటీ, విపరీతమైన ఉష్ణోగ్రతలు వంటి కఠినమైన పరిస్థితులు నెలకొని ఉంటుంది. అందువల్ల, అంతరిక్షం విత్తనాలపై పెను ఒత్తిడిని కలిగిస్తుంది. కఠిన పరిస్థితులను మరింత సమర్థవంతంగా తట్టుకునేలా పంట విత్తనాల్లో సాధారణం కన్నా ఎన్నో రెట్లు ఎక్కువగా అత్యంత వేగవంతంగా సరికొత్త ఉత్పరివర్తనాలను ప్రేరేపించడానికి బహుశా అంతరిక్షం మంచి వాతావరణం కావచ్చు.



అంతరిక్షంలోకి వెళ్లివచ్చిన జొన్న విత్తనాలను పరిశీలిస్తున్న డా. శోభా శివశంకర్

అంతరిక్షంలోకి వెళ్లొచ్చిన విత్తనాలతో సరికొత్త వంగడాలను రూపొందించే ప్రక్రియనే 'స్పేస్ ఇండ్యూస్ మ్యుటేషన్ బ్రీడింగ్ లేదా స్పేస్ బ్రీడింగ్' అంటాం. ప్రస్తుతం, స్పేస్ బ్రీడింగ్ ద్వారా విడుదలైన వంగడాల ద్వారా వచ్చిన ఫలితాలు కొన్ని మాత్రమే. అంతేకాదు, ఉత్పరివర్తనాలను ప్రేరేపించడానికి మొక్కల డిఎన్ఏపై అనంత విశ్వం చూపే ప్రభావాలేమిటో తెలియజెప్పే ప్రచురిత సమాచారం చాలా పరిమితమనే చెప్పాలి.



జొన్నపంటతో శాస్త్రవేత్త డా. అనుపమ

■ **స్పేస్ బ్రీడింగ్‌ను ఇప్పటి వరకు ఎన్ని దేశాలు, ఎన్ని పంటల్లో ఉపయోగిస్తున్నాయి?**

చైనా స్పేస్ బ్రీడింగ్‌లో ముందుంది. వివిధ పంటల విత్తనాలను అంతరిక్షంలోకి పంపి, అక్కడ కొన్నాళ్లు ఉంచి తిరిగి నేల మీదకు తెప్పించిన తర్వాత వాటిని పరీక్షించి, మెరుగైన ఫలితాలు ఉన్నట్లు గుర్తించిన చాలా రకాల పంటల వంగడాలను చైనా తమ దేశంలో రైతులకు అందించింది. ఈ జాబితాలో వరి, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, పత్తి, నువ్వు, మిరప, టమోటో తదితర పంటలున్నాయి.

■ **భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో రైతులు సాగు చేసే వరి, మిరప, పత్తి తదితర పంటలు అధిక ఉష్ణోగ్రతల్ని తట్టుకోవడంలో జన్యుమార్పిడి విత్తనాల కన్నా 'అంతరిక్ష విత్తనాలు' ఎలా మెరుగైనవి?**


పోల్చడం కష్టం. సాధారణంగా జన్యుమార్పిడి చేయడానికి అందుకు అవసరమైన ప్రత్యేక జన్యువును ముందుగా గుర్తించడం అవసరం. గుర్తించిన జన్యువును జన్యుమార్పిడి/జన్యు సవరణ సాంకేతికతలలో ఉపయోగించి తగిన ఫలితం పొందే అవకాశం ఉంది. అయితే, అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ, ఐరాసకు చెందిన ఆహార–వ్యవసాయ సంస్థ వియన్నా (ఆస్ట్రియా)లో సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'సెంటర్ ఆఫ్ న్యూక్లియర్ టెక్నిక్స్ ఇన్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్'లో ప్రత్యేక జన్యువులపై ముందస్తు అవగాహన లేకుండానే.. నేలపై ల్యాబ్‌లో మ్యుటేషన్ బ్రీడింగ్ ద్వారా ప్రత్యేక లక్షణాలను ఆశించి సరికొత్త పంట రకాలను అభివృద్ధి చేస్తుంది. ఎక్స్, గామా కిరణాల రేడియేషన్ ద్వారా జరిగే ఈ ప్రక్రియ విత్తనంలో పెద్ద సంఖ్యలో ఉత్పరివర్తనాలను సృష్టిస్తుంది. ఆ విత్తనాలను సాగు చేసి వాటిలో మనం ఆశించిన మార్పు వచ్చిందో లేదో జాగ్రత్తగా పరీక్షించి చూసుకోవాలి. ఈ స్క్రీనింగ్‌పైనే స్థిరమైన వ్యవసాయక పరిస్థితులకు అనువైన వంగడాల ఎంపిక ఆధారపడి ఉంటుంది. ఇప్పటికి 70కి పైగా దేశాలకు చెందిన 210కి పైగా వృక్ష జాతులతో పాటు అనేక ఆహార పంటలు, అలంకరణ మొక్కలు, చెట్లకు సంబంధించి మ్యుటేషన్ బ్రీడింగ్ జరిగింది. 3,400కి పైగా అధికారికంగా విడుదలైన ఉత్పరివర్తన రకాలు మా డేటాబేస్‌లో వున్నాయి.

■ **'ఆసియాలో విత్తనోత్పత్తిదారులు వైవిధ్యమైన వాతావరణంలో పనిచేసే చాలా మంది చిన్న రైతుల కోసం విత్తనాలను ఉత్పత్తి చేస్తారు. కేవలం ఒకటి లేదా రెండు లక్షణాలను ఆశించి జన్యుమార్పిడి/సవరణ చేయడం వీరి అవసరాలను తీర్చదు. అధిక వేడిని, కరువును తట్టుకోవడం.. నిస్సారమైన/చౌడుబారిన నేలల్లో పెరిగే సామర్థ్యం వంటి మరింత సంక్లిష్టమైన గుణాలు కలిగిన వంగడాలు వారికి అవసరం. ఏదో ఒక జన్యువును మార్పిడి/సవరణ చేసే సాంకేతికతలతో ఇది సాధించలేం..' అని మీరు ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. దయచేసి దీని గురించి వివరిస్తారా?**

ఒక జన్యువు లేదా కొన్ని జన్యువులతో సవరించగలిగే సాధారణ లక్షణాలు జన్యుమార్పిడి మార్పు లేదా జన్యు సవరణకు అనుకూలంగా ఉంటాయి. కరువును తట్టుకోవటం, దిగుబడిని పెంపొందించటం వంటివి అనేక జన్యువులతో సంబంధం ఉండే సంక్లిష్ట లక్షణాలు. ఇవి జన్యుమార్పిడి లేదా జన్యుసవరణతో సాధ్యం కావు. యావత్తు జన్యువ్యవస్థ వ్యాప్త మార్పులు (జీనోమిక్ వైడ్ ఛేంజెస్) అవసరం. ఇవి మ్యుటేషన్ బ్రీడింగ్‌తో లేదా ప్రకృతిలో ఆయా లక్షణాలున్న వంగడాల ఎంపిక (టార్గెటెడ్ సెలక్షన్) ద్వారానే సాధ్యం.

– పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

విరగ్గాసిన దానిమ్మ!



- **ప్రకృతి సేద్యం ద్వారా రెండున్నరేళ్లకే దానిమ్మ దిగుబడి కనువిందు**
- **ఎకరానికి రూ. 25 వేల ఖర్చు.. 7 టన్నుల దిగుబడి**
- **ఎకరానికి ప్రకృతి సేద్యంలో ఖర్చు రూ. 25 వేలు.. రసాయన సేద్యంలో రూ. 1.5 లక్షలు**
- **ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటించటం వల్లే సత్ఫలితాలంటున్న రైతు**

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో నిరంతరం అందిస్తున్న మార్గదర్శకత్వంలో ప్రకృతి సేద్యం చేస్తూ దానిమ్మ తోటలో చక్కని దిగుబడిని పొందుతూ శభాష్ అని ప్రశంసలు అందుకుంటున్నారు రైతు రవి ప్రతాప్ రెడ్డి. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం కొత్తలం గ్రామానికి చెందిన రవి ప్రతాప్ రెడ్డి ప్రకృతి వ్యవసాయ పద్ధతులను తూ.చ. తప్పకుండా పాటిస్తూ 6 ఎకరాల్లో భగువ రకం దానిమ్మ పంటను సాగు చేసి తక్కువ ఖర్చుతోనే అధిక లాభాలు పొందుతున్నారు. 2021 ఫిబ్రవరిలో దానిమ్మ మొక్క రూ.40 చొప్పున కొనుగోలు చేసి, 12×12 అడుగుల దూరంలో ఎకరాకు 350–380 వరకు మొక్కలను నాటి డ్రిప్‌తో సాగు చేస్తున్నారు.

గత ఏడాది మొదటి పంటలో రూ.10 లక్షల వరకు ఆదాయం వచ్చింది. ప్రస్తుతం రెండున్నరేళ్ల వయసులో రెండో పంట కోతకు సిద్ధంగా ఉంది. చెట్ల నిండా కాయలు ఉండటంతో కన్నుల పండువగా ఉంది. రైతులు, వ్యాపారులతో పాటు జాతీయ, అంతర్జాతీయ పాత్రికేయులు, నిపుణులు సైతం ఈ తోటను చూసి ఆశ్చర్యపోతున్నారు. ఆరెకరాల్లో 40–42 టన్నుల దానిమ్మ దిగుబడి వస్తుందని, రూ. 45 లక్షల వరకు ఆదాయం రావచ్చని రవి ప్రతాప్ రెడ్డి ఆశిస్తున్నారు. అదే విధంగా, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో 13 ఎకరాల్లో అల్లనేరేడు పంటను సాగు చేసిన ఆయన రూ.8 లక్షల ఆదాయం పొందారు.

ఎకరానికి ఖర్చు రూ. 25 వేలు!

రసాయనిక వ్యవసాయం చేసే దానిమ్మ తోటను తెగుళ్ల నుంచి రక్షించుకోవడానికి రోజు మార్చి రోజు ఏదో ఒక మందు కొడుతూనే ఉంటారు. దాంతో ఖర్చు ఎకరానికి ఏడాదికి రూ. 1.5 లక్షల నుంచి 2 లక్షల వరకు ఖర్చవుతుంది. కానీ, తన తోటలో జీవామృతం, కషాయాలకు మొత్తంగా రూ. 25 వేలే ఖర్చయ్యిందని రవి ప్రతాప్ రెడ్డి తెలిపారు. చెట్టుకు 2 కేజీల ఘనజీవామృతం వేసిన తర్వాత నామాస్త్రం, సొంఠిపాల కషాయం, జీవామృతం అవసరం మేరకు క్రమం తప్పకుండా శ్రద్ధగా తయారు చేసుకొని అందిస్తున్నారు. నాలుగు నాటు ఆవుల పేడ, మూత్రం వినియోగిస్తున్నారు.

కాయ కుళ్లు తెగులు వచ్చిందంటే రసాయనిక సేద్యం చేసే తోటల్లో కంట్రోల్ కాదు. అయితే, ప్రకృతి సేద్యంలో దీని నివారణకు సొంఠి పాల కషాయం సమర్థవంతంగా పనిచేస్తోందని ఆయన తెలిపారు. ఆరోగ్యంగా పెరగటం వల్లనే చీడపీడల బెడద కూడా లేదని ఆయన అన్నారు. ప్రకృతి వ్యవసాయ విభాగం మాస్టర్ ట్రైనర్ రమేష్, డీపీఎం లక్ష్మానాయక్ ప్రత్యేక శ్రద్ధతో ఎప్పటికప్పుడు అందిస్తున్న సూచనలు, సలహాలను పూర్తిగా పాటించటం వల్ల సత్ఫలితాలు పొందగలుగుతున్నానని రైతు రవి ప్రతాప్ రెడ్డి తెలిపారు. మడకశిర డివిజన్ పరిధిలోని 134 గ్రామాల్లో 16,662 మంది రైతులు 32 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వివిధ రకాల పంటలను సాగు చేస్తున్నారు. గత నెలలో జర్నలిస్టులు ఢిల్లీకి చెందిన సునీతా నారాయణ్, క్రిస్టియన్ గ్రేప్‌తో పాటు జర్మనీకి చెందిన రాజ్ పటేల్, అమెరికాకు చెందిన ప్రణయ్ తదితరుల బృందం తన తోటను సందర్శించి ఆశ్చర్యచకితులయ్యారని ఆయన సంతోషంగా చెప్పారు.

– ఎస్.క్రిష్టారెడ్డి, సాక్షి, మడకశిర రూరల్, శ్రీసత్యసాయి జిల్లా



చెప్పింది చెప్పినట్టు చేసే రైతు!

ప్రకృతి వ్యవసాయంలో మెలకువలను చెప్పింది చెప్పినట్టు వంద శాతం పాటించే నిబద్ధత కలిగిన రైతు రవి ప్రతాప్‌రెడ్డి. దానిమ్మ చెట్ల మధ్య 30 రకాల విత్తనాలను వానకు ముందే విత్తి (పిఎండిఎస్), పెరిగిన తర్వాత కోసి మల్చింగ్ చేస్తే మంచి ఫలితాలు వస్తున్నాయి. మడకశిర ప్రాంతంలో ఈ ఏడాది సగం కన్నా తక్కువ వర్షపాతమే నమోదైంది.




అయినా మంచి పంట దిగుబడి వచ్చింది. రెండున్నర ఏళ్ల దానిమ్మ తోటలో ఎకరానికి 7 టన్నుల దిగుబడిని అతి తక్కువ ఖర్చుతోనే రవిప్రతాప్ రెడ్డి సాధించారు.

– లక్ష్మణ్ నాయక్ (83310 57583), జిల్లా ప్రాజెక్టు మేనేజర్, ప్రకృతి వ్యవసాయ విభాగం, శ్రీసత్యసాయి జిల్లా

ఓపికగా చెయ్యాలి

ప్రకృతి సేద్యాన్ని శ్రద్ధగా, ఓపికగా చేయాలి. ముందుగానే ప్రణాళిక ప్రకారం జీవామృతం, కషాయాలను జాగ్రత్తగా తయారు చేసుకొని వాడాలి. జీవామృతం కలిపిన 8 రోజులు మురగబెట్టి వాడాలి. రోజూ రెండు పూటలు కలియదిప్పాలి. దీనికి వాడే శనగపిండి సొంతంగా మరపట్టించుకొని వాడాలి. మార్కెట్‌లో కొని వాడితే కల్తీ వల్ల ఫలితం సరిగ్గారాదు. నన్ను చూసి పది మంది రైతులైనా మారితే అదే నాకు సంతోషం.



సొంతంగా తయారు చేసుకొని వాడే ద్రావణాలు, కషాయాలు చాలు మంచి దిగుబడులు పొందడానికి. కెమికల్స్, బయో/ఆర్గానిక్ ఉత్పత్తుల కొని వాడటం ప్రమాదకరం.

– రవి ప్రతాప్‌రెడ్డి(93989 80129), దానిమ్మ రైతు, కొత్తలం, మడకశిర మండలం, శ్రీసత్యసాయి జిల్లా



భారత పురుషుల చెస్ జట్టుకు మూడో విజయం

ఆసియా క్రీడల చెస్ ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు మూడో విజయం నమోదు చేసింది. కిర్గిస్తాన్‌తో జరిగిన నాలుగో రౌండ్‌లో భారత్ 3.5–0.5తో గెలిచింది. భారత్ తరఫున ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణతోపాటు గుకేశ్, విదిత్ తమ ప్రత్యర్థులపై గెలుపొందగా... తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ తన గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. నాలుగో రౌండ్ తర్వాత భారత్ ఏడు పాయింట్లతో రెండో స్థానంలో ఉంది. చైనా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0.5–2.5తో ఓడిపోయింది.

జాతీయ జూనియర్ చెస్ చాంపియన్ అర్జున్

జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తెలంగాణ కుర్రాడు ఆదిరెడ్డి అర్జున్ చాంపియన్‌గా అవతరించాడు. అహ్మదాబాద్‌లో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత 11 రౌండ్ల తర్వాత అర్జున్ 10 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. అర్జున్ తొమ్మిది గేముల్లో గెలిచి, రెండు గేమ్‌లను 'డ్రా' చేసుకొని టోర్నీని అజేయంగా ముగించాడు. 9 పాయింట్లతో మనీశ్ (తమిళనాడు) రన్నరప్‌గా నిలువగా, 8.5 పాయింట్లతో యశ్ (రాజస్తాన్) మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు.



అదే జోరు...

- ఆసియా క్రీడల్లో కొనసాగుతున్న భారత్ పతకాల వేట
- మూడు రజతాలు, ఒక కాంస్యం అందించిన అథ్లెట్స్
- రోలర్ స్కేటింగ్, టేబుల్ టెన్నిస్‌లో కాంస్యాలు



ప్రీతి పారుల్ చౌధరీ

వంద పతకాల లక్ష్యంతో చైనా గడ్డపై అడుగుపెట్టిన భారత క్రీడాకారుల బృందం ఆ దిశగా సాగుతోంది. పోటీలు మొదలైన తొలి రోజు నుంచే పతకాల వేట మొదలు పెట్టిన భారత క్రీడాకారులు దానిని వరుసగా తొమ్మిదోరోజూ కొనసాగించారు. ఆదివారం ఈ క్రీడల చరిత్రలోనే ఒకేరోజు అత్యధికంగా 15 పతకాలు సాధించిన భారత క్రీడాకారులు సోమవారం ఏడు పతకాలతో అలరించారు. అంచనాలకు అనుగుణంగా రాణిస్తున్న అథ్లెట్లు మూడు రజతాలు, ఒక కాంస్యం సాధించగా... ఎవరూ ఊహించని విధంగా రోలర్ స్కేటింగ్‌లో రెండు కాంస్య పతకాలు వచ్చాయి. మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్‌లో సుతీర్థ–అహిక ముఖర్జీ సంచలన ప్రదర్శనకు కాంస్య పతకంతో తెరపడింది. ఆర్చరీ, హాకీ, బ్యాడ్మింటన్, స్క్వాష్‌లోనూ భారత ఆటగాళ్లు తమ ఆధిపత్యం చాటుకొని పతకాల రేసులో ముందుకెళ్లారు. తొమ్మిదో రోజు తర్వాత ఓవరాల్‌గా భారత్ 13 స్వర్ణాలు, 24 రజతాలు, 23 కాంస్యాలతో కలిపి 60 పతకాలతో నాలుగో స్థానంలో కొనసాగుతోంది.

హాంగ్జౌ: షూటర్ల పతకాల వేట ముగిసినా వారిని స్ఫూర్తిగా తీసుకొని భారత అథ్లెట్స్ ఆసియా క్రీడల్లో అదరగొడుతున్నారు. సోమవారం భారత్ ఖాతాలో ఏడు పతకాలు చేరాయి. అందులో అథ్లెట్స్ మూడు రజతాలు, ఒక కాంస్యంతో కలిపి నాలుగు అందించారు. రోలర్ స్కేటింగ్‌లో రెండు కాంస్యాలు, టేబుల్ టెన్నిస్‌లో ఒక కాంస్యం దక్కింది.

మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో ఆసియా చాంపియన్, భారత స్టార్ పారుల్ చౌధరీ రజత పతకం నెగ్గగా... భారత్‌కే చెందిన ప్రీతి కాంస్య పతకాన్ని సాధించింది. ప్రపంచ చాంపియన్ యావి విన్‌ఫ్రెడ్ ముతిలె తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకుంది. కెన్యాలో జన్మించిన 23 ఏళ్ల యావి విన్‌ఫ్రెడ్ 2016లో బహ్రెయిన్‌కు వలస వచ్చి అక్కడే స్థిరపడింది. అంతర్జాతీయ ఈవెంట్స్‌లో బహ్రెయిన్ తరఫున పోటీపడుతోంది. 2018 జకార్తా ఆసియా క్రీడల్లోనూ పసిడి పతకం నెగ్గిన యావి విన్‌ఫ్రెడ్ ఈసారీ తన ప్రత్యర్థులకు అవకాశం ఇవ్వలేదు. యావి విన్‌ఫ్రెడ్ 9ని:18.28 సెకన్లలో గమ్యానికి చేరి అగ్రస్థానంలో నిలువగా... పారుల్ 9ని:27.63 సెకన్లతో రెండో స్థానాన్ని... ప్రీతి 9ని:43.32 సెకన్లతో మూడో స్థానాన్ని సంపాదించారు.

ఆన్సీ అదుర్స్...

మహిళల లాంగ్‌జంప్‌లో కేరళకు చెందిన 22 ఏళ్ల ఆన్సీ సోజన్ ఇడపిలి రజత పతకంతో సత్తా చాటుకుంది. తొలిసారి ఆసియా క్రీడల్లో ఆడుతున్న ఆన్సీ సోజన్ 6.63 మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచింది. షికి జియాంగ్ (చైనా; 6.73 మీటర్లు) స్వర్ణం... యాన్ యు ఎన్గా (హాంకాంగ్; 6.50 మీటర్లు) కాంస్యం గెలిచారు. భారత్‌కే చెందిన శైలి సింగ్ (6.48 మీటర్లు) ఐదో స్థానంలో నిలిచింది.

రిలే జట్టుకు రజతం...

4×400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో భారత జట్టుకు రజత పతకం లభించింది. అజ్మల్, విత్యా రామ్‌రాజ్, రాజేశ్, శుభ వెంకటేశ్‌లతో కూడిన భారత జట్టు ఫైనల్ రేసును 3ని:14.34 సెకన్లలో ముగించి మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. శ్రీలంక జట్టు 3ని:14.25 సెకన్లతో రజతం గెలిచింది. అయితే రేసు సందర్భంగా శ్రీలంక అథ్లెట్ నిబంధనలకు విరుద్ధంగా వేరే బృందం పరిగెడుతున్న లైన్‌లోకి వచ్చాడని తేలడంతో నిర్వాహకులు శ్రీలంక జట్టుపై అనర్హత వేటు వేశారు. దాంతో భారత జట్టు పతకం కాంస్యం నుంచి రజతంగా మారిపోయింది. నాలుగో స్థానంలో నిలిచిన కజకిస్తాన్‌కు కాంస్యం లభించింది. ఈ ఈవెంట్‌లో బహ్రెయిన్ జట్టు స్వర్ణం సాధించింది. పురుషుల 200 మీటర్ల ఫైనల్లో భారత అథ్లెట్ అమ్లాన్ బొర్గోహైన్ 20.60 సెకన్లలో గమ్యానికి చేరి ఆరో స్థానంలో నిలిచాడు. మహిళల పోల్‌వాల్ట్‌లో భారత క్రీడాకారిణి పవిత్ర వెంకటేశ్ ఆరో స్థానాన్ని దక్కించుకుంది. పది క్రీడాంశాల సమాహారమైన పురుషుల డెకాథ్లాన్‌లో ఐదు ఈవెంట్‌లు ముగిశాక భారత ప్లేయర్ తేజస్విన్ శంకర్ 4260 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నాడు.



రజత పతకాలతో అజ్మల్, శుభ, రాజేశ్, విత్యా రామ్‌రాజ్



ఆన్సీ సోజన్

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	147	81	42	270
జపాన్	33	44	45	122
దక్షిణ కొరియా	31	39	63	133
భారత్	13	24	23	60
చైనీస్ తైపీ	12	10	17	39
ఉజ్బెకిస్తాన్	11	14	18	43
థాయ్‌లాండ్	10	7	16	33
ఉత్తర కొరియా	7	10	5	22
హాంకాంగ్	6	15	23	44
బహ్రెయిన్	6	1	4	11

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

సుతీర్థ-అహిక జోడీకి కాంస్యం



ఆసియా క్రీడల మహిళల టేబుల్ టెన్నిస్ (టీటీ)లో కాంస్య పతకం నెగ్గిన తొలి భారతీయ జోడీగా సుతీర్థ–అహిక ముఖర్జీ ద్వయం గుర్తింపు పొందింది. సోమవారం జరిగిన సెమీఫైనల్లో సుతీర్థ–అహిక జోడీ 11–7, 8–11, 11–7, 8–11, 9–11, 11–5, 2–11తో సుయోంగ్ చా–సుగ్‌యోంగ్ పక్ (ఉత్తర కొరియా) జంట చేతిలో పోరాడి ఓడిపోయింది.

ఆరతి అదరహో



కాంస్య పతకాలతో కార్తీక, ఆరతి కస్తూరిరాజ్, హీరల్ సాధు

ఎవరూ పెద్దగా అంచనాలు పెట్టుకోని రోలర్ స్కేటింగ్‌లో భారత్‌కు ఒకే రోజు రెండు కాంస్య పతకాలు లభించాయి. మహిళల స్పీడ్ స్కేటింగ్ 3000 మీటర్ల రిలే రేసులో ఆరతి కస్తూరిరాజ్, కార్తీక జగదీశ్వరన్, హీరల్ సాధూలతో కూడిన భారత జట్టు 4ని:34.861 సెకన్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం గెల్చుకుంది. ఈ బృందంలో 29 ఏళ్ల ఆరతి సీనియర్‌కాగా... 15 ఏళ్ల కార్తీక, 17 ఏళ్ల హీరల్ జూనియర్లు. ఎంబీబీఎస్ పూర్తి చేసుకొని తన తల్లికి చెందిన ఆసుపత్రిలో వైద్యురాలిగా పనిచేస్తున్న ఆరతి ఈ ఏడాది మే నెలలో ప్రాక్టీస్ సందర్భంగా తీవ్రంగా గాయపడింది. ఆమె నుదిటిపై 26 కుట్లు పడ్డాయి. అయినా ఆమె ఆందోళన చెందకుండా ఆసియా క్రీడలకు సన్నద్ధమైంది. నెమ్మదిగా కోలుకున్న ఆరతి మళ్లీ ప్రాక్టీస్ మొదలుపెట్టింది. కేరళకు చెందిన రంజీ క్రికెటర్ సందీప్ వారియర్ భార్య అయిన ఆరతి 22 ఏళ్లుగా స్కేటింగ్ క్రీడలో కొనసాగుతోంది. ఇన్నాళ్ల తన శ్రమకు ఆసియా క్రీడల పతకం రూపంలో ఫలితం లభించిందని ఆరతి సంతోషం వ్యక్తం చేసింది. మరోవైపు పురుషుల స్పీడ్ స్కేటింగ్ 3000 మీటర్ల రిలే రేసులో ఆనంద్ కుమార్, సిద్ధాంత్, విక్రమ్‌లతో కూడిన భారత జట్టు 4ని:10.128 సెకన్లలో గమ్యానికి చేరి కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

సెమీస్‌లో భారత్



స్వర్ణ పతకం సాధించి... వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించడమే లక్ష్యంగా ఆసియా క్రీడల్లో బరిలోకి దిగిన భారత పురుషుల హాకీ జట్టు తొలి అడ్డంకిని అధిగమించింది. లీగ్ దశలో ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అజేయంగా నిలిచిన భారత్ పూల్ 'ఎ'లో 15 పాయింట్లతో టాప్ ర్యాంక్‌ను సొంతం చేసుకొని సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. బంగ్లాదేశ్‌తో సోమవారం జరిగిన చివరిదైన ఐదో లీగ్ మ్యాచ్‌లో భారత్ 12–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (2వ, 4వ, 32వ ని.లో), మన్‌దీప్ సింగ్ (18వ, 24వ, 46వ ని.లో) మూడు చొప్పున గోల్స్ సాధించి 'హ్యాట్రిక్'లు నమోదు చేశారు. అభిషేక్ (41వ, 57వ ని.లో) రెండు గోల్స్ సాధించగా... నీలకంఠ శర్మ (47వ ని.లో), గుర్జంత్ సింగ్ (56వ ని.లో), అమిత్ రోహిదాస్ (28వ ని.లో), లలిత్ ఉపాధ్యాయ్ (23వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. పూల్ 'ఎ'లోనే జపాన్ జట్టు 12 పాయింట్లతో రెండో సెమీఫైనల్ బెర్త్‌ను దక్కించుకుంది. తమ చివరి లీగ్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ జపాన్ 3–2తో పాకిస్తాన్‌ను ఓడించింది. ఈ ఓటమితో పాకిస్తాన్ పూల్ 'ఎ'లో మూడో స్థానానికి పరిమితమై సెమీఫైనల్‌కు చేరుకోలేకపోయింది. పూల్ 'బి' నుంచి దక్షిణ కొరియా, చైనా జట్లు టాప్–2లో నిలిచి సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. బుధవారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనాతో భారత్; దక్షిణ కొరియాతో జపాన్ తలపడతాయి.

భారత్, చైనీస్ తైపీ మ్యాచ్ 'డ్రా'

ఆసియా క్రీడల్లో భారత మహిళల కబడ్డీ జట్టుకు తొలి మ్యాచ్‌లోనే ఊహించని ఫలితం ఎదురైంది. గ్రూప్ 'ఎ'లో భాగంగా చైనీస్ తైపీతో సోమవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌ను భారత్ 34–34తో 'డ్రా' చేసుకుంది. చివరి సెకన్లలో ఆఖరి రెయిడ్‌తో చైనీస్ తైపీ బోనస్ పాయింట్ సంపాదించి మ్యాచ్‌ను 'డ్రా'గా ముగించింది. భారత్ ఒకదశలో 26–20తో ముందంజ వేసి ఆరు పాయింట్ల ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే ఈ ఆధిక్యాన్ని భారత జట్టు వృథా చేసుకొని గెలవాల్సిన చోట 'డ్రా'తో సరిపెట్టుకుంది.

క్వార్టర్స్‌లో జ్యోతి సురేఖ



ఆసియా క్రీడల ఆర్చరీ ఈవెంట్‌లో మహిళల కాంపౌండ్, మిక్స్‌డ్ టీమ్ విభాగాల్లో భారత స్టార్ ప్లేయర్, ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. క్వాలిఫయింగ్‌లో 'టాప్' ర్యాంక్‌లో నిలిచి తొలి రౌండ్‌లో 'బై' పొందిన జ్యోతి సురేఖ రెండో రౌండ్‌లో 145–132తో అనురాధ (శ్రీలంక)పై, ప్రిక్వార్టర్ ఫైనల్లో 146–141తో ఫాతిమా (ఇరాక్)పై గెలిచింది. కాంపౌండ్ మిక్స్‌డ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో జ్యోతి సురేఖ–ఓజస్ ప్రవీణ్ దేవ్‌తలే (భారత్) జోడీ 159–151తో బినామైో–అమ్నా (యూఏఈ) జంటను ఓడించి క్వార్టర్ ఫైనల్ చేరింది. రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ బొమ్మదేవర ధీరజ్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టాడు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో ధీరజ్ 6–5తో రూబెల్ (బంగ్లాదేశ్)పై గెలిచాడు.

శ్రీకాంత్ శుభారంభం

ఆసియా క్రీడల బ్యాడ్మింటన్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 29 నిమిషాల్లో 21–10, 21–10తో ఫట్ లె డక్ (వియత్నాం)పై గెలిచాడు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) ద్వయం 21–11, 21–16తో చౌ హిన్ లాంగ్–లుయ్ చున్ వాయ్ (హాంకాంగ్) జంటను ఓడించింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సాయిప్రతీక్–తనీషా క్రాస్టో (భారత్) జోడీ 21–18, 21–14తో లియోంగ్ చోంగ్–వెంగ్ చి (మకావు) జంటపై గెలిచింది. గో సూన్ హువాట్–షెవోన్ లాయ్ (మలేసియా)తో మ్యాచ్‌లో సిక్కి రెడ్డి–రోహన్ కపూర్ జోడీ 0–2తో వెనుకబడిన దశలో గాయం కారణంగా వైదొలిగింది. టకురో హోకి–కొబయాషి (జపాన్)తో పురుషుల డబుల్స్ మ్యాచ్‌లో ధ్రువ్ కపిల–ఎంఆర్ అర్జున్ జంట 3–13తో వెనుకబడిన దశలో గాయం కారణంగా తప్పుకుంది.

'ఆ నాలుగు జట్లు నాకౌట్ దశకు'

కృష్ణమాచారి శ్రీకాంత్

రాబోయే ఏడు వారాలు క్రికెట్ అభిమానులకు అన్ని రకాల వినోదం ఉండబోతుంది. 12 ఏళ్ల తర్వాత వన్డే ప్రపంచకప్ భారత్‌కు తిరిగి వస్తోంది. సుదీర్ఘంగా సాగే ఈ మెగా టోర్నీలో మొత్తం పది జట్లు మిగతా జట్లతో ఒక్కోసారి తలపడతాయి. లీగ్ దశ ముగిశాక ఆతిథ్య భారత్, ఇంగ్లండ్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ జట్లు నాకౌట్ దశ సెమీఫైనల్‌కు చేరుకుంటాయని అంచనా. మాజీ విజేత భారత్, డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ జట్లను కచ్చితమైన టైటిల్ ఫేవరెట్స్‌గా పరిగణిస్తాను. భారత బ్యాటర్లతో పాటు బౌలర్లు కూడా అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. చివరి నిమిషంలో గాయపడ్డ అక్షర్ పటేల్ స్థానంలో వెటరన్ ఆఫ్ స్పిన్నర్ అశ్విన్ జట్టులోకి రావడం భారత్‌కు మరింత మేలు చేసే విషయం. ఇక ఇంగ్లండ్ దూకుడైన ఆటతో తమకంటూ ప్రత్యేక బ్రాండ్‌ను సృష్టించుకుంది. బెన్ స్టోక్స్ కూడా అందుబాటులోకి రావడంతో ఇంగ్లండ్ మరింత పటిష్టంగా మారింది. బౌలింగ్‌లోనూ కెప్టెన్ జోస్ బట్లర్‌కు ఎన్నో ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. పెద్ద టోర్నీల్లో, కీలక సమయాల్లో పైచేయి సాధించడం ఆస్ట్రేలియా జట్టుకు అలవాటు. అందుకే ఆ జట్టు ఐదుసార్లు విశ్వవిజేతగా నిలిచింది. ఎన్నో సీజన్‌ల నుంచి ఐపీఎల్ ఆడటంద్వారా చాలా మంది ఆస్ట్రేలియా ఆటగాళ్లకు ఇక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఏర్పడింది. ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ ప్రదర్శన ఆస్ట్రేలియాకు కీలకం కానుంది. ప్రపంచకప్‌లో అత్యంత నిలకడమైన జట్లలో ఒకటిగా న్యూజిలాండ్‌కు పేరుంది. కేన్ విలియమ్సన్ రూపంలో ఆ జట్టులో సూపర్‌స్టార్ ఉన్నా... మిగతా ఆటగాళ్లు కూడా చివరి వరకు పోరాడేందుకు వెనుకాడరు. ఆల్‌రౌండర్ మైకేల్ బ్రేస్‌వెల్ లేకపోవడం ఆ జట్టుకు లోటుగా ఉన్నా అతడి లేని లోటును భర్తీ చేసే ఆటగాళ్లు న్యూజిలాండ్ జట్టులో చాలా మంది ఉన్నారు.

సినిమా

అన్ని సినిమాలు వేరు.. ఈ సినిమా వేరు

\- సిద్ధు జొన్నలగడ్డ



● సిద్ధు జొన్నలగడ్డ, నవీన్ చంద్ర, స్వాతి

''ఈ మధ్య కాలంలో నేను చూసిన మంచి ట్రైలర్‌లో 'మంత్ ఆఫ్ మధు' చిత్రం బెస్ట్. అన్ని సినిమాలు వేరు.. ఈ సినిమా వేరని ట్రైలర్‌లోనే తెలుస్తోంది. ఈ సినిమా సక్సెస్ అవుతుంది'' అని హీరో సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. నవీన్ చంద్ర, స్వాతీ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మంత్ ఆఫ్ మధు'. శ్రీకాంత్ నాగోతి దర్శకత్వంలో యశ్వంత్ ములుకుట్ల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి సంగీత దర్శకుడు ఎంఎం కీరవాణి, సిద్ధు జొన్నలగడ్డ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ''మంత్ ఆఫ్ మధు' ట్రైలర్ బాగుంది'' అన్నారు కీరవాణి. ''ఇలాంటి సినిమాలు, ఇందులోని పాత్రలు అరుదుగా వస్తుంటాయి'' అన్నారు నవీన్ చంద్ర. ''ఈ మూవీని ప్యాషన్‌తో తీశాం.. ప్రేక్షకులకు నచ్చుతుంది'' అన్నారు శ్రీకాంత్ నాగోతి, యశ్వంత్ ములుకుట్ల.

యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి?

\- ఆర్. నారాయణ మూర్తి



''విద్యార్థులు జాతి సంపద. వాళ్లను రక్షించుకోవాల్సిన బాధ్యత సమాజంపై, ప్రభుత్వాలపై, మన అందరి పైనా ఉంది అని చెప్పే చిత్రమే 'యూనివర్సిటీ'' అని ఆర్. నారాయణ మూర్తి అన్నారు. ఆయన లీడ్ రోల్‌లో నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యూనివర్సిటీ'. స్నేహ చిత్ర పిక్చర్స్ పతాకంపై రూపొందిన ఈ సినిమా ఈ నెల 13న విడుదల కానుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆర్. నారాయణ మూర్తి మాట్లాడుతూ– ''విద్యా వ్యవస్థ చిన్నాభిన్నం అయితే మొత్తం వ్యవస్థే దెబ్బతింటుంది. యూనివర్సిటీల్లో పేపరు లీకేజీలు, గ్రూపు 1, 2 ప్రశ్నా పత్రాల లీకేజీలు... ఇలా అయితే విద్యార్థుల భవిష్యత్ ఏం కావాలి? నిరుద్యోగుల జీవితాలు ఏమైపోవాలి? సంవత్సరానికి 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ప్రధాని నరేంద్ర మోదీగారు దయచేసి ఇవ్వాలి. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ ప్రైవేటీకరణ చేసుకుంటూపోతే యువతకు ఉద్యోగాలు ఎలా వస్తాయి? వంటి విషయాలను మా సినిమాలో ప్రస్తావించాం'' అన్నారు.

800 చూసి ఆశ్చర్యపోతారు

\- శివలెంక కృష్ణ ప్రసాద్



''ముత్తయ్య మురళీధరన్ బయోపిక్‌గా '800' రూపొందింది. బయోపిక్ కాబట్టి కథలో మార్చడానికి ఏం ఉంటుంది? ఆయన జీవితంలో కమర్షియల్ హంగులన్నీ ఉన్నాయి. ఒక మనిషి జీవితం ఇలా ఉంటుందా? అన్ని అవరోధాలు ఎదుర్కొని ముత్తయ్య ఈ స్థాయికి చేరుకున్నారా? అని ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు'' అని నిర్మాత శివలెంక కృష్ణప్రసాద్ అన్నారు. శ్రీలంకన్ ఆఫ్ స్పిన్నర్ ముత్తయ్య మురళీధరన్ జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం '800'. ముత్తయ్యగా మధుర్ మిట్టల్, ఆయన భార్య మది మలర్ పాత్రలో మహిమా నంబియార్ నటించగా ఎంఎస్ శ్రీపతి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమిది. శివలెంక కృష్ణప్రసాద్ సమర్పణలో ఈ నెల 6న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ చిత్రం విడుదలవుతోంది. శివలెంక కృష్ణప్రసాద్ మాట్లాడుతూ– ''శ్రీపతిని మా నిర్మాణ సంస్థలోనే దర్శకుడిగా పరిచయం చేయాలనుకున్నాం. అయితే '800'కి చాన్స్ వచ్చిందని చెబితే ఆ సినిమా చేసి రమ్మని నేనే చెప్పాను. ఈ చిత్రాన్ని ఇండియాలో సుమారు 1100 థియేటర్లలో విడుదల చేస్తున్నాం. శ్రీపతితో ఓ సినిమా, 'యశోద' చిత్రదర్శకులతో మరో సినిమా చేస్తాను. దర్శకుడు పవన్ సాధినేనితో ఓ చిత్రం కోసం చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

టైగర్ కొత్త అనుభూతినిచ్చింది - రామ్-లక్ష్మణ్



''రవితేజగారితో ఎన్నో చిత్రాలు చేశాం. కానీ 'టైగర్ నాగేశ్వర రావు' మాత్రం కొత్త అనుభూతినిచ్చింది. ఇందులో యాక్షన్ ఎపిసోడ్స్‌ని ప్రేక్షకులు నిజంగా జరుగుతున్నట్లు భావిస్తారు'' అన్నారు ఫైట్ మాస్టర్స్ రామ్–లక్ష్మణ్. రవితేజ హీరోగా, నూపుర్ సనన్, గాయత్రీ భరద్వాజ్ హీరోయిన్లుగా వంశీ దర్శకత్వం వహించిన చిత్రం 'టైగర్ నాగేశ్వర రావు'. తేజ్ నారాయణ్ అగర్వాల్ సమర్పణలో అభిషేక్ అగర్వాల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి స్టంట్ మాస్టర్స్‌గా చేసిన రామ్–లక్ష్మణ్ మాట్లాడుతూ– ''మేం స్టువర్ట్‌పురం ప్రాంతంలోనే పుట్టి పెరిగాం. టైగర్ నాగేశ్వరరావు గురించి కథలు కథలుగా విన్నాం. ఆ రకంగా ఈ సినిమా కథ మాకు కొంచెం దగ్గరగా కనెక్ట్ అయింది'' అన్నారు.

ఆ పాట నాకో సవాల్

\- నేహా శెట్టి



''రూల్స్ రంజన్' రొటీన్ అబ్బాయి–అమ్మాయిల కథ కాదు. విభిన్నమైన చిత్రం'' అని నేహా శెట్టి అన్నారు. కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా రత్నం కృష్ణ దర్శకత్వం వహించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 6న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నేహా శెట్టి మాట్లాడుతూ– ''నా ఫస్ట్ సినిమా 'మెహబూబా' సక్సెస్ కాలేదు. ఆ తర్వాత నేను యాక్టింగ్ కోర్స్ కోసం న్యూయార్క్ వెళ్లాను. తిరిగొచ్చాక 'డీజే టిల్లు'కి చాన్స్ వచ్చింది.. ఆ తర్వాత 'బెదురులంక 2012' చేశాను. రెండూ విజయం సాధించాయి. 'రూల్స్ రంజన్'లో సన పాత్ర పోషించాను. ఇందులో 'సమ్మోహనుడా..' పాటకి డ్యాన్స్ చేయడం సవాల్‌గా అనిపించింది. ఈ పాట వాన బ్యాక్‌డ్రాప్‌లోనూ సాగుతుంది. వాన పాటల విషయానికొస్తే.. నాకు శ్రీదేవిగారు గుర్తుకు వస్తారు. చిన్న వయసులో సినీ జీవితాన్ని ప్రారంభించి ఉన్నత స్థాయికి చేరారామె. నటిగా ఆమెలా పేరు తెచ్చుకోవాలనుకుంటున్నాను'' అన్నారు.

నార్మల్‌గా ఎవరి జోలికీ వెళ్లను



● శివ రాజ్‌కుమార్

కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్ హీరోగా శ్రీని దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఘోస్ట్'. సందేశ్ నాగరాజ్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న తెలుగు, తమిళ, హిందీ, మలయాళం భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేశారు. 'నేను నార్మల్‌గా ఎవరి జోలికీ వెళ్లను.. ఓడిపోతాననే భయం కాదు.. నేను వెళితే రణరంగం మారణహోమంగా మారుతుంది' అంటూ శివ రాజ్‌కుమార్ చెప్పిన డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి. ''ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శివ రాజ్‌కుమార్ స్క్రీన్ ప్రెజెన్స్, హీరోయిజమ్, శివ రాజ్‌కుమార్ యంగ్‌గా కనబడే సీన్స్ అన్నీ హైలైట్‌గా ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
మంగళవారం
3-10-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
సెన్సెక్స్	▲ 320	65,828
నిఫ్టీ	▲ 115	19,638

విదేశీ సూచీలు (తొలిరెండు రాత్రి 11.30 ముగింపు)			
నాస్‌డాక్	13,231	▲	12
డోజోన్స్	33,244	▽	264
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,511	▽	97
డాక్స్	15,247	▽	139
షాంఘై (గురువారం ముగింపు)	3,110	▲	3
నికాయ్	31,760	▽	98

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	82.53	84.39
£	బ్రిటన్ పౌండ్	100.34	103.16
€	యూరో	86.56	89.45
¥	జపాన్ ఎన్ (100)	55.67	57.98
AUS	ఆస్ట్రేలియా డాలర్	52.01	55.29
S$	సింగపూర్ డాలర్	60.76	63.69
SAR	సౌదీ రియాల్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	21.71	23.51
¥	చైనా యువాన్	10.25	12.33

'మ్యాట్రిక్స్' ప్రసాద్ రీఎంట్రీ

- 17 ఏళ్ల తర్వాత ఫార్మా రంగంలోకి
- ఐక్వెస్ట్‌కు వియాట్రిస్ భారత ఏపీఐ
- విక్రయించిన కంపెనీ తిరిగి కైవసం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిమ్మగడ్డ ప్రసాద్.. మ్యాట్రిక్స్ ప్రసాద్‌గా తెలుగు ప్రజలకు సుపరిచితమైన ప్రముఖ వ్యాపారవేత్త. ఖాయిలా పడ్డ మ్యాట్రిక్స్ ల్యాబొరేటరీస్‌ను 2000 సంవత్సరంలో ఆయన కొనుగోలు చేశారు. ఆరేళ్లలోనే బిలియన్ డాలర్ కంపెనీగా తీర్చిదిద్దారు. అప్పట్లో స్టాక్‌మార్కెట్‌లో మ్యాట్రిక్స్ ఓ సంచలనం. కంపెనీ షేర్లను కొనుగోలు చేసిన ఇన్వెస్టర్లు తమ పెట్టుబడిపై ఇబ్బడిముబ్బడిగా లాభాలు గడించారు. ఫార్మా దిగ్గజం మైలాన్ ల్యాబ్స్ 2006లో మ్యాట్రిక్స్‌ను 1.1 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసింది. ఈ డీల్ దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ పరిచయం ఎందుకంటే తాను ఏ అమెరికా కంపెనీకి అయితే 17 ఏళ్ల క్రితం మ్యాట్రిక్స్‌ను విక్రయించారో.. ఇప్పుడు అదే మైలాన్ (ప్రస్తుతం వియాట్రిస్) నుంచి నిమ్మగడ్డ ప్రసాద్ తిరిగి ఆ వ్యాపారాన్ని కైవసం చేసుకుంటున్నారు. వియాట్రిస్‌కు చెందిన భారత ఏపీఐ వ్యాపారాన్ని కొనుగోలు చేయడానికి నిమ్మగడ్డ ప్రసాద్ ప్రమోట్ చేస్తున్న ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైసెస్ తాజాగా ఒప్పందం కుదుర్చుకుంది. అంతర్జాతీయంగా పోటీపడి మరీ టెండర్లలో విజయం సాధించి వియాట్రిస్ ప్లాంట్లను ఐక్వెస్ట్ చేజిక్కించుకుంటోంది.

ఏటా రూ.6,000 కోట్లు..

తాజా డీల్ పూర్తి అయితే హైదరాబాద్‌లో మూడు, ఆంధ్రప్రదేశ్‌లోని వైజాగ్‌లో మూడు భారీ స్థాయి యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్ (ఏపీఐ) తయారీ ప్లాంట్లతోపాటు హైదరాబాద్‌లో పరిశోధన, అభివృద్ధి కేంద్రం ఐక్వెస్ట్ చేతికి రానున్నాయి. అలాగే థర్డ్-పార్టీ ఏపీఐ విక్రయాలు కూడా సంస్థపరం కానున్నాయి. ఈ డీల్ పూర్తి కావడానికి ఆరు నెలల సమయం పట్టొచ్చని అంచనా. ఆరు ప్లాంట్ల వార్షికాదాయం సుమారు రూ.6,000 కోట్లు ఉంది. ఈ ప్లాంట్లలో తయారైన ఉత్పత్తులను 10 ఏళ్లపాటు కొనుగోలు చేసేందుకు వియాట్రిస్ అంగీకరించింది. రానున్న రోజుల్లో హైదరాబాద్ కేంద్రంగా పెద్ద ఫార్మా కంపెనీగా ఆవిర్భవించనున్నట్టు ఐక్వెస్ట్ తెలిపింది. కాగా, భారత్‌లో మహిళల ఆరోగ్య సేవల వ్యాపారాన్ని స్పెయిన్‌కు చెందిన ఇన్సడ్ ఫార్మాకు వియాట్రిస్ విక్రయిస్తోంది. ఐక్వెస్ట్, ఇన్సడ్ డీల్స్ ద్వారా వియాట్రిస్‌కు సుమారు రూ.10,000 కోట్లు సమకూరుతున్నాయి. రుణ భారాన్ని తగ్గించుకోవడానికి వియాట్రిస్ అంతర్జాతీయంగా వివిధ విభాగాల్లో వాటాల విక్రయం ద్వారా దాదాపు రూ.29,950 కోట్లు అందుకుంటోంది.



ఇదే అతిపెద్ద పెట్టుబడి..

ఫార్మాస్యూటికల్ రంగంలో తమ కంపెనీ నుంచి ఇదే అతిపెద్ద పెట్టుబడి అని ఐక్వెస్ట్ ఎంటర్‌ప్రైసెస్ ఈడీ, నిమ్మగడ్డ ప్రసాద్ కుమార్తె గునుపాటి స్వాతి రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచ ఔషధ పరిశ్రమలో భారత్ గణనీయంగా దృష్టిని ఆకర్షిస్తున్న సరైన సమయంలో ఈ డీల్ కుదుర్చుకున్నట్టు చెప్పారు. కాగా, ఏఐజీ హాస్పిటల్స్, కేర్ హాస్పిటల్స్, సెలాన్ లేబొరేటరీస్ తదితర సంస్థల్లో ఐక్వెస్ట్ ద్వారా నిమ్మగడ్డ ప్రసాద్ గతంలో పెట్టుబడులు పెట్టి వీటి అభివృద్ధిలో పాలుపంచుకున్నారు. సృజనాత్మక ఆలోచనలను విజయవంతమైన వ్యాపార వ్యూహాలుగా మార్చారు. కంపెనీలను వృద్ధి బాటలో నడిపించడంతోపాటు వాటాదారులకు మెరుగైన విలువను సృష్టించారు. 2012లో కేర్ హాస్పిటల్స్‌లో, 2015లో మా టీవీలో తన కున్న వాటాలను విక్రయించారు. మా టీవీని స్టార్ టీవీ సుమారు రూ.2,350 కోట్లకు కొనుగోలు చేయడం అప్పట్లో మీడియా రంగంలో సంచలనం కలిగించింది.

10 గిగావాట్ల సౌర విద్యుత్ సామర్థ్యం

2027 నాటికి అదానీ గ్రూప్ లక్ష్యం



న్యూఢిల్లీ: 2027 నాటికల్లా 10 గిగావాట్ల స్థాయిలో సమీకృత సౌర విద్యుత్ పరికరాల ఉత్పత్తి సామర్థ్యాలను పెంచుకోవాలని అదానీ గ్రూప్ నిర్దేశించుకున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇది 4 గిగావాట్లుగా ఉంది. గ్రూప్‌లో భాగమైన అదానీ సోలార్‌కు 3,000 మెగావాట్ల విలువ చేసే ఎగుమతి ఆర్డర్లు ఉన్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. కంపెనీ ఇటీవలే 394 మిలియన్ డాలర్లు కూడా సమీకరించినట్లు వివరించాయి. దేశీయంగా 2014లో 2.63 గిగావాట్లుగా ఉన్న సౌర విద్యుదుత్పత్తి 2023 నాటికి 71.10 గిగావాట్లకు పెరిగినప్పటికీ తయారీ వ్యవస్థ వేగంగా విస్తరించలేదు. ఈ నేపథ్యంలో దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకు కేంద్రం పీఎల్ఐ వంటి స్కీములను ప్రవేశపెట్టింది. అదానీ గ్రూప్ వంటి ప్రైవేట్ సంస్థలు సోలార్ తయారీ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'సిల్వర్ ఉత్సవ్'

హైదరాబాద్: జీఆర్‌టీ జ్యువెలర్స్ వెండి వస్తువులు, వెండి ఆభరణాల అతి పెద్ద కలెక్షన్లతో 'సిల్వర్ ఉత్సవ్'ను తీసుకొచ్చింది. పూజా సామగ్రి నుంచి డిన్నర్ సెట్ల వరకూ ప్రతి శ్రేణిలో డిజైన్లను అత్యంత స్వచ్ఛత, నాణ్యతతో తీర్చిదిద్దారు. వెండి వస్తువుల తరుగుపై 25%, వెండి ఆభరణాల మీద 10% తగ్గింపు పొందవచ్చు. 'సిల్వర్ ఉత్సవ్ ద్వారా కస్టమర్లకు ప్రశాంతమైన, మంగళకరమైన అనుభవాన్ని అందించాలని భావిస్తున్నాము. తదనుగుణంగా ప్రతి డిజైన్‌ను రూపొందించాము' అని జీఆర్‌టీ మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ అనంత పద్మనాభన్ అన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
03-10-2023	
విశాఖ	536-00
చిత్తూరు	533-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	536-00
విజయవాడ	536-00
రిటైల్ ధర (డజను)	72.00
02-10-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	507-00
వరంగల్	509-00
రిటైల్ ధర	5.65

భారత్‌లో క్రోమ్‌బుక్‌ల తయారీ షురూ



న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం గూగుల్, పీసీల తయారీ సంస్థ హెచ్‌పీ కలిసి భారత్‌లో క్రోమ్‌బుక్స్ ఉత్పత్తిని ప్రారంభించాయి. భారత్‌లో తొలిసారిగా తయారు చేస్తున్న క్రోమ్‌బుక్స్‌తో దేశీ విద్యార్థులకు చౌకగా, సురక్షితమైన విధంగా కంప్యూటింగ్ అందుబాటులోకి రాగలదని గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ ఎక్స్‌లో (గతంలో ట్విట్టర్) పోస్ట్ చేశారు. చెన్నైకి దగ్గర్లోని ఫ్లెక్స్ ఫెసిలిటీలో హెచ్‌పీ వీటిని తయారు చేస్తోంది. కొత్త క్రోమ్‌బుక్స్ ఆన్‌లైన్‌లో రూ. 15,990 నుంచి లభిస్తాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. 2020 నుంచి హెచ్‌పీ భారత్‌లో తమ తయారీ కార్యకలాపాలను గణనీయంగా విస్తరిస్తోంది. ఎలీట్‌బుక్స్, ప్రోబుక్స్, జీ8 సిరీస్ నోట్‌బుక్స్ వంటి వివిధ ల్యాప్‌టాప్‌లు, ఆల్-ఇన్-వన్ పీసీలు, డెస్క్‌టాప్‌లు మొదలైన వాటిని దేశీయంగా తయారు చేస్తోంది. భారత్‌లో ఐటీ హార్డ్‌వేర్ తయారీని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన రూ. 17,000 కోట్ల ఉత్పాదకత ఆధారిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకానికి కూడా దరఖాస్తు చేసుకుంది.

మెరైన్ బీమాపై శ్రీరామ్ జనరల్ ఫోకస్

చెన్నై: బీమా సంస్థ శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ వాహనయేతర బీమా విభాగాలపై మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా మెరైన్, అగ్ని ప్రమాదాలు మొదలైన వాటికి సంబంధించిన బీమా పాలసీలను ప్రవేశపెడుతోంది. కంపెనీ చీఫ్ అండర్‌రైటింగ్ ఆఫీసర్ శశికాంత్ దహూజా ఈ విషయాలు తెలిపారు. ప్రస్తుతం తమ వ్యాపారంలో మోటార్ ఇన్సూరెన్స్ వాటా సుమారు 92 శాతంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. డైవర్సిఫికేషన్ ప్రణాళికల్లో భాగంగా ఫైర్, మెరైన్, ఇంజినీరింగ్ వంటి విభాగాల్లో కొత్త బీమా పాలసీలను ప్రవేశపెట్టనున్నట్లు శశికాంత్ చెప్పారు. వచ్చే రెండు మూడేళ్లలో వాహనయేతర వ్యాపారాన్ని 15 శాతానికి పెంచుకోవాలని నిర్దేశించుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం ఇది 7-8 శాతంగా ఉంది. కేవలం ఒక విభాగంపై ఎక్కువగా ఆధారపడకూడదనే వ్యాపార వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. జూన్ 30తో ముగిసిన త్రైమాసికంలో శ్రీరామ్ జనరల్ ఇన్సూరెన్స్ నికర లాభం 37% పెరిగి రూ.98 కోట్లకు చేరింది. ఈ ఏడాది వ్యాపారం 30% మేర వృద్ధి చెందగలదని అంచనా వేస్తున్నట్లు శశికాంత్ చెప్పారు. ఎలక్ట్రిక్ వాహనాల బీమా పాలసీల అమ్మకాలు గణనీయంగా పెరుగుతున్నాయని, గత ఆర్థిక సంవత్సరంలో రూ.82 కోట్ల విలువైన పాలసీలను విక్రయించామన్నారు. ఈ ఏడాది వీటి విక్రయాలు రూ.200 కోట్ల వరకు ఉండొచ్చని చెప్పారు. ప్రస్తుతం సంస్థలో 3,780 మంది ఉద్యోగులు ఉన్నారని, ఈ ఆర్థిక సంవత్సరం కొత్తగా 700 మందిని నియమించుకోనున్నామని శశికాంత్ తెలిపారు.

వదంతులపై స్పందించాల్సిందే

లిస్టెడ్ కంపెనీలకు సెబీ గడువు పెంపు



న్యూఢిల్లీ: కంపెనీల వ్యవహారాలపై మార్కెట్లో పుట్టే వదంతుల విషయంలో లిస్టెడ్ కంపెనీలు తప్పనిసరిగా స్పందించాల్సిందేనంటూ క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ స్పష్టం చేసింది. తొలుత మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) రీత్యా టాప్-100 కంపెనీలకు వదంతులపై స్పందించడాన్ని తప్పనిసరి చేసింది. ఇందుకు ఈ ఏడాది అక్టోబర్ 1 గడువుగా పేర్కొంది. అయితే తాజాగా ఈ గడువును వచ్చే ఏడాది (2024) ఫిబ్రవరి 1 వరకూ పొడిగించింది. ఇక టాప్-250 మార్కెట్ క్యాప్ కంపెనీలకు 2024 ఏప్రిల్ 1 నుంచి కాకుండా 2024 ఆగస్ట్ 1 నుంచి నిబంధనలు అమలుకానున్నాయి.

డీజిల్ అమ్మకాల్లో అదే ధోరణి

- సెప్టెంబర్‌లో 3 శాతం క్షీణత
- పెట్రోల్ విక్రయాల్లో 5% వృద్ధి



న్యూఢిల్లీ: డీజిల్ అమ్మకాల్లో క్షీణత కొనసాగుతూనే ఉంది. సెప్టెంబర్ నెలలోనూ 3% తక్కువగా విక్రయాలు నమోదయ్యాయి. ఆగస్టులోనూ డీజిల్ అమ్మకాలు 3.2% తగ్గడం గమనించొచ్చు. ఏటా జూన్ నుంచి మొదలయ్యే నాలుగు నెలల వర్షాకాల సీజన్‌లో డీజిల్ అమ్మకాలు తక్కువగా నమోదవుతుంటాయి. ఇక పెట్రోల్ విక్రయాలు 5.4% పెరిగాయి. ప్రభుత్వరంగ ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు హెచ్‌పీసీఎల్, ఐవోసీఎల్, బీపీసీఎల్ ఉమ్మడి గణాంకాలు ప్రతి నెలా విడుదల అవుతుంటాయి. వీటి ప్రకారం సెప్టెంబర్‌లో డీజిల్ అమ్మకాలు 5.81 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 5.99 మిలియన్ టన్నుల మేర అమ్మకాలు ఉండడం గమనార్హం. ముఖ్యంగా సెప్టెంబర్ నెలలో మొదటి 15 రోజుల్లో డీజిల్ అమ్మకాలు 5 శాతం తగ్గగా, తర్వాతి 15 రోజుల్లో వర్షాలు లేకపోవడంతో పుంజుకున్నాయి. ఇక ఆగస్ట్ నెల విక్రయాలతో పోల్చి చూస్తే డీజిల్ అమ్మకాలు 2.5 శాతం పెరిగాయి. ఆగస్ట్ నెలలో డీజిల్ విక్రయాలు 5.67 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్‌లో 6.7 శాతం, మే నెలలో 9.3 శాతం చొప్పున డీజిల్ అమ్మకాలు పెరిగాయి. జూన్ నుంచి తగ్గుతూ వస్తున్నాయి. పెట్రోల్ విక్రయాలు సెప్టెంబర్ నెలలో 2.8 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చినప్పుడు 5.4 శాతం వృద్ధి కనిపించింది. ఆగస్ట్ నెలలో మాత్రం పెట్రోల్ విక్రయాలు ఫ్లాట్‌గా ఉన్నాయి.

విద్య, ఉద్యోగ సమాచారం

జేఎన్‌టీయూహెచ్‌లో ఎంటెక్, ఎంఫార్మసీ ప్రవేశాలు

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ (జేఎన్‌టీయూహెచ్)-పుల్‌టైమ్ ఎంటెక్, ఎంఫార్మసీ రెగ్యులర్ కోర్సుల్లో స్పాన్సర్డ్ కేటగిరీ సీట్లలో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది. హైదరాబాద్, జగిత్యాల, సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూహెచ్ క్యాంపస్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు.

» మొత్తం సీట్ల సంఖ్య: 228
» విభాగాలు: ఈఈఈ, మెకానికల్, ఎనర్జీ సిస్టమ్స్, బయో టెక్నాలజీ, కెమికల్, మెటలర్జికల్, సీఎస్ఈ, ఐటీ, ఈసీఈ, ఫార్మసీ, నానో టెక్నాలజీ, సివిల్, ఇన్విరాన్‌మెంట్, స్పేషియల్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, వాటర్ రిసోర్సెస్.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్, ఎంసీఏ, బీఫార్మసీ ఉత్తీర్ణతతో పాటు అకడమిక్ సంస్థలు/పరిశ్రమలు/రీసెర్చ్ యూనిట్లలో కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. గేట్/జీప్యాట్/టీఎస్ పీజీఈసెట్-2023లో అర్హత సాధించి ఉండాలి.
» ఎంపిక విధానం: విద్యార్హత, గేట్/జీప్యాట్/టీఎస్ పీజీఈసెట్-2023 ర్యాంకు ఆధారంగా ఎంపికచేస్తారు.
» కౌన్సెలింగ్ షెడ్యూల్ తేదీలు: 04.10.2023, 05.10.2023, 06.10.2023.
» వెబ్‌సైట్: www.jntuh.ac.in

ఎన్‌ఐడీలో బీడిజైన్ ప్రవేశాలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్(ఎన్ఐడీ).. 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి దేశవ్యాప్తంగా ఉన్న ఎన్ఐడీ క్యాంపస్‌లలో బీడిజైన్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» ఎన్ఐడీ క్యాంపస్: ఆంధ్రప్రదేశ్, అహ్మదాబాద్, హర్యానా, మధ్యప్రదేశ్, అసోం.
» కోర్సుల వివరాలు: నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ డిజైన్.
» సీట్ల వివరాలు: అహ్మదాబాద్ క్యాంపస్‌లో 125 సీట్లు; ఏపీ, హర్యానా, మధ్యప్రదేశ్, అసోం క్యాంపస్‌లలో ఒక్కోదానిలో 75 సీట్లు ఉన్నాయి. విదేశీ విద్యార్థులకు అదనంగా సీట్లు కేటాయించారు.
» స్పెషలైజేషన్: యానిమేషన్ ఫిల్మ్ డిజైన్, ఎగ్జిబిషన్ డిజైన్, ఫిల్మ్ అండ్ వీడియో కమ్యూనికేషన్, గ్రాఫిక్ డిజైన్, సిరామిక్ అండ్ గ్లాస్ డిజైన్, ఫర్నీచర్ అండ్ ఇంటీరియర్ డిజైన్, ప్రొడక్ట్ డిజైన్, టెక్స్‌టైల్ డిజైన్ తదితరాలు.
» అర్హత: అభ్యర్థులు 01.07.2003 తర్వాత జన్మించి ఉండాలి. గుర్తింపు పొందిన బోర్డుల నుంచి 2023 మే/ జూన్ నాటికి ఇంటర్ / పన్నెండో తరగతి(సైన్స్, ఆర్ట్స్, కామర్స్, హ్యూమానిటీస్ గ్రూపు) లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: ప్రిలిమ్స్, మెయిన్స్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:01.12.2023.
» దరఖాస్తు సవరణ తేదీలు: 05.12.2023 నుంచి 07.12.2023 వరకు.
» ప్రిలిమ్స్ తేది: 24.12.2023.
» మెయిన్స్ తేది: 27.04.2023.
» వెబ్‌సైట్: https://admissions.nid.edu

నవోదయ విద్యాలయాల్లో 9వ తరగతి లేటరల్ ఎంట్రీ ప్రవేశాలు

కేంద్ర విద్యాశాఖ దేశవ్యాప్తంగా 650 జవహర్ నవోదయ విద్యాలయా(జేఎన్‌వీ)ల్లో తొమ్మిదో తరగతిలో ఖాళీ సీట్ల భర్తీ(లేటరల్ ఎంట్రీ)కి సంబంధించి జేఎన్‌వీ ఎంపిక పరీక్షకు దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: విద్యార్థి జవహర్ నవోదయ విద్యాలయం ఉన్న సంబంధిత జిల్లా నివాసి అయి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ఆయా జిల్లాల్లోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతుండాలి.
» వయసు: 01.05.2009 నుంచి 31.07.2011 మధ్య జన్మించి ఉండాలి.
» ప్రవేశ పరీక్ష: జవహర్ నవోదయ ప్రవేశానికి నిర్వహించే రాతపరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా ఎంపిక జరుగుతుంది. ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రంలో నాలుగు విభాగాలు(ఇంగ్లిష్, హిందీ, సైన్స్, మ్యాథమేటిక్స్) ఉంటాయి. మొత్తం 100 ప్రశ్నలు-100 మార్కులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. పరీక్ష పేపర్ ఇంగ్లిష్, హిందీ భాషలో ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో జేఎన్‌వీ అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొనేందుకు అభ్యర్థులు నిర్ణీత ఫార్మాట్‌లో అభ్యర్థి వివరాలను పేర్కొంటూ.. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరించిన సర్టిఫికేట్ సాఫ్ట్ కాపీని అప్‌లోడ్ చేయడం తప్పనిసరి. దీనితోపాటు అభ్యర్థి ఫోటో, అభ్యర్థి, తల్లిదండ్రుల సంతకాలు, ఆధార్ వివరాలు/నివాస ధ్రువపత్రాల అవసరం ఉంటుంది.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 31.10.2023
» ప్రవేశ పరీక్ష తేది: 10.02.2024.
» వెబ్‌సైట్: navodaya.gov.in

కేంద్రంలో.. జియో సైంటిస్ట్ కొలువు

» కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామ్ నోటిఫికేషన్ విడుదల
» మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహణ
» విజయం సాధిస్తే గ్రూప్-ఎ హోదాలో ఉద్యోగం

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగార్థులకు మరో జాబ్ నోటిఫికేషన్! జియాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్‌లో పీజీ ఉత్తీర్ణులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. కేంద్ర గనులు, జల వనరుల శాఖల్లో.. గ్రూప్-ఎ హోదాలో ఉద్యోగం సొంతం చేసుకునేందుకు మార్గం.. యూపీఎస్సీ కంబైన్డ్ జియో సైంటిస్ట్ పరీక్ష!! యూపీఎస్సీ తాజాగా కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్ -2024 నోటిఫికేషన్ విడుదల చేసింది! ఈ నేపథ్యంలో..కంబైన్డ్ జియో సైంటిస్ట్ పోస్టుల వివరాలు, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు..



మొత్తం 56 పోస్టులు

- యూపీఎస్సీ.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎగ్జామినేషన్ ద్వారా కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ, జల వనరుల మంత్రిత్వ శాఖల్లో స్పెషలైజ్డ్ పోస్ట్‌ల భర్తీ చేపడుతోంది. ఈ పోస్ట్‌లను రెండు కేటగిరీలుగా వర్గీకరించింది. రెండు కేటగిరీలలో కలిపి మొత్తం 56 పోస్ట్‌లకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది.
- కేటగిరీ-1: కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ పరిధిలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో ఉన్న మూడు విభాగాల పోస్ట్‌లను ఈ కేటగిరీలో పేర్కొన్నారు.

అవి.. జియాలజిస్ట్ గ్రూప్-ఎ: 34 పోస్ట్‌లు; జియో ఫిజిసిస్ట్: 1 పోస్ట్; కెమిస్ట్- గ్రూప్-ఎ: 13.

- కేటగిరీ-2: సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, జల్ శక్తి శాఖ, జల వనరుల శాఖ, నదీ అభివృద్ధి-గంగానది పరిశుద్ధి విభాగాల్లో మూడు రకాల పోస్ట్‌లను ఈ కేటగిరీలో పేర్కొన్నారు. అవి.. సైంటిస్ట్-బి(హైడ్రాలజీ) గ్రూప్-ఎ: 4 పోస్ట్‌లు, సైంటిస్ట్-బి(కెమికల్) గ్రూప్-ఎ: 2 పోస్ట్‌లు, సైంటిస్ట్-బి(జియో ఫిజిక్స్) గ్రూప్-ఎ: 2 పోస్ట్‌లు.

పోస్టులు-విద్యార్హతలు

- జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో జియాలజిస్ట్: జియలాజికల్ సైన్స్/ జియాలజీ/అప్లైడ్ జియాలజీ/జియో ఎక్స్‌ప్లొరేషన్/మినరల్ ఎక్స్‌ప్లొరేషన్/ఇంజనీరింగ్ జియాలజీ/మెరైన్ జియాలజీ/ఎర్త్ సైన్సెస్ అండ్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ /ఓషనోగ్రఫీ అండ్ కోస్టల్ ఏరియా స్టడీస్/పెట్రోలియం జియో సైన్సెస్/జియో కెమిస్ట్రీ స్పెషలైజేషన్లలో ఏదో ఒక స్పెషలైజేషన్‌లో పీజీ ఉత్తీర్ణత ఉండాలి.
- కేటగిరీ-1లోని జియో ఫిజిసిస్ట్, కేటగిరీ-2లోని జియోఫిజిక్స్ సైంటిస్ట్-బి: ఫిజిక్స్/అప్లైడ్ ఫిజిక్స్/జియో ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ లేదా ఎక్స్‌ప్లొరేషన్ జియో ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ/ఎమ్మెస్సీ అప్లైడ్ జియో ఫిజిక్స్/ఎమ్మెస్సీ మెరైన్ జియో ఫిజిక్స్/ఎమ్మెస్సీ టెక్(అప్లైడ్ జియో ఫిజిక్స్)లలో ఉత్తీర్ణత సాధించాలి.
- కేటగిరీ-1లోని కెమిస్ట్, కేటగిరీ-2లోని సైంటిస్ట్-బి(కెమికల్): కెమిస్ట్రీ లేదా అప్లైడ్ కెమిస్ట్రీ లేదా అనలిటికల్ కెమిస్ట్రీలలో ఎమ్మెస్సీ ఉత్తీర్ణతను అర్హతగా నిర్దేశించారు.
- కేటగిరీ-2లోని హైడ్రాలజీ సైంటిస్ట్: జియాలజీ/అప్లైడ్ జియాలజీ/మెరైన్ జియాలజీ /హైడ్రో జియాలజీలలో పీజీ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- ఈ కోర్సుల చివరి సంవత్సరం విద్యార్థులు, ఫలితాల కోసం ఎదురు చూస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- వయసు: జనవరి 1, 2024 నాటికి 21-32 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు; ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు ఇస్తారు

మూడు దశల ఎంపిక ప్రక్రియ

కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎంపిక ప్రక్రియ మొత్తం మూడంచెలుగా ఉంటుంది. తొలుత స్టేజ్-1లో ప్రిలిమినరీ పరీక్షను, స్టేజ్-2లో మెయిన్ ఎగ్జామినేషన్‌ను నిర్వహిస్తారు. ఈ రెండింటిలోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి చివరగా పర్సనాలిటీ టెస్ట్(ఇంటర్వ్యూ) ఉంటుంది.

ప్రిలిమినరీ 400 మార్కులు

- ఎంపిక ప్రక్రియలో తొలి దశ ప్రిలిమినరీ పరీక్ష రెండు పేపర్లలో ఉంటుంది. ఇది ఆయా పోస్ట్‌ల అభ్యర్థులకు వేర్వేరుగా నిర్వహిస్తారు. పేపర్-1కు 100 మార్కులు, పేపర్-2కు 300 మార్కులు కేటాయించారు. పేపర్-1 జనరల్ స్టడీస్ కాగా, పేపర్-2 అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న పోస్ట్‌కు సంబంధించినది.
- పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష నిర్వహిస్తారు.నెగెటివ్ మార్కింగ్ నిబంధన అమల్లో ఉంది. పరీక్ష సమయం ఒక్కో పేపర్‌కు రెండు గంటలు.

మెయిన్ డిస్క్రిప్టివ్ విధానం

- ప్రిలిమినరీ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల్లోని పోస్ట్‌ల సంఖ్యను అనుసరించి.. ఒక్కో పోస్ట్‌కు ఆరు లేదా ఏడుగురిని చొప్పున రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్ పరీక్ష పూర్తిగా సబ్జెక్ట్ పేపర్లతో డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఒక్కో సబ్జెక్ట్‌కు సంబంధించి మూడు పేపర్లు ఉంటాయి. ప్రతి పేపర్‌కు 200 మార్కులు చొప్పున మొత్తం 600 మార్కులకు పరీక్ష జరుగుతుంది.
- జియాలజిస్ట్ పోస్ట్‌లకు జియాలజీ నుంచి మూడు పేపర్లు; జియో ఫిజిస్ట్, జియోఫిజిక్స్(సైంటిస్ట్-బి) పోస్ట్‌లకు జియో ఫిజిక్స్‌లో మూడు పేపర్లు; కెమిస్ట్, సైంటిస్ట్-బి(కెమికల్) పోస్ట్‌లకు కెమిస్ట్రీ నుంచి మూడు పేపర్లు; సైంటిస్ట్-బి హైడ్రాలజీ పోస్ట్‌లకు జియాలజీ నుంచి రెండు పేపర్లు(పేపర్-1, పేపర్-2), హైడ్రాలజీ నుంచి ఒక పేపర్(పేపర్-3)గా పరీక్ష నిర్వహిస్తారు. మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది.

పర్సనల్ ఇంటర్వ్యూ

మెయిన్ పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్ట్‌కు ఇద్దరు చొప్పున(1:2 నిష్పత్తిలో) పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. 200 మార్కులకు పర్సనాలిటీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ దశలో..అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నైపుణ్యాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడమే కాకుండా..వ్యక్తిత్వం, నాయకత్వ లక్షణాలు, సామాజిక అంశాలపై అవగాహన, దృక్పథం తదితర అంశాలను పరిశీలిస్తారు.

విజయం సాధించాలంటే

- మూడు దశలుగా నిర్వహించే.. కంబైన్డ్ జియో సైంటిస్ట్ ఎంపిక ప్రక్రియలో రాణించేందుకు అభ్యర్థులు ప్రిలిమినరీ దశ నుంచే పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి.
- ప్రిలిమినరీ పరీక్షలోని జనరల్ స్టడీస్ పేపర్ కోసం జాతీయ,అంతర్జాతీయ ప్రాధాన్యం కలిగిన సమకాలీన అంశాలు,భారత చరిత్ర, స్వాతంత్ర్యోద్యమం, పాలిటీ, పరిపాలన, ఎకానమీ, సామాజిక అభివృద్ధి అంశాలు, పర్యావరణం, జీవ వైవిధ్యం, వాతావరణ మార్పులు, జనరల్ సైన్స్‌లో ప్రాథమిక అంశాలపై దృష్టి పెట్టాలి.
- సబ్జెక్ట్ పేపర్‌గా ఉండే పేపర్-2 కోసం అభ్యర్థులు తాము ఎంచుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించి.. పీజీ స్థాయి పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా వాటిని అప్లికేషన్ ఓరియెంటేషన్, వాస్తవ పరిస్థితులను బేరీజు వేసుకుంటూ అభ్యసిస్తే మరింత మెరుగైన ఫలితం పొందొచ్చు.

మెయిన్‌తో అనుసంధానం

ప్రిలిమినరీ పరీక్షలోని పేపర్-2ని, మెయిన్ ఎగ్జామినేషన్‌తో అనుసంధానం చేసుకునే అవకాశం ఉంది. మెయిన్‌లోని మూడు పేపర్లు కూడా అభ్యర్థి ఎంచుకున్న సబ్జెక్ట్‌కు సంబంధించినవే. దీంతో ప్రిలిమినరీ ప్రిపరేషన్ దశ నుంచే సబ్జెక్ట్ పేపర్‌ను మెయిన్ పరీక్ష కోణంలో విశ్లేషణాత్మకంగా, డిస్క్రిప్టివ్ విధానంలో చదివితే.. ప్రిలిమ్స్ పేపర్-2 (సబ్జెక్ట్ పేపర్), మెయిన్ ఎగ్జామ్ పేపర్లకు సన్నద్ధత లభిస్తుంది. ప్రిలిమినరీ పరీక్ష పూర్తయిన తర్వాత మెయిన్ ఎగ్జామ్‌కు నాలుగు నెలల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా సబ్జెక్ట్ పేపర్లను సిలబస్‌కు అనుగుణంగా వెయిటేజీని గుర్తిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. తద్వారా మెయిన్‌లోనూ ప్రతిభ చూపి.. చివరి దశ ఇంటర్వ్యూకు ఎంపికయ్యే అవకాశాలను మెరుగుపరచుకోవచ్చు.

అరవై శాతం సాధించేలా

ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ.. ఇలా మూడు దశలు కలిపి మొత్తం 1200 మార్కులకు జరిగే ఎంపిక ప్రక్రియలో తుది విజేతలుగా నిలవాలంటే.. 60శాతం మార్కులు సాధించేలా కృషి చేయాల్సి ఉంటుంది. జనరల్ కేటగిరీ అభ్యర్థులు మెయిన్ ఎగ్జామ్‌లో 40 నుంచి 45 శాతం మార్కులు సాధిస్తే.. ఇంటర్వ్యూకు ఎంపికయ్యే అవకాశాలు మెరుగవుతాయి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:అక్టోబర్ 10, 2023
- ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం: అక్టోబర్ 11 - 17 తేదీల్లో
- ప్రిలిమినరీ పరీక్ష తేదీ: ఫిబ్రవరి 18, 2024
- మెయిన్ ఎగ్జామినేషన్ తేదీ: జూన్ 22, 2024
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.upsc.gov.in

క్లుప్తంగా...

వైఎస్సార్‌టీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపీకృష్ణ



సాక్షి, అమరావతి: వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాకినాడ జిల్లాకు చెందిన వీరవల్లి గోపీకృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్‌కుమార్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. గోపీకృష్ణ కాకినాడ రూరల్ మండలం తమ్మవరం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన గతంలో ఏపీ వైఎస్సార్‌టీఎఫ్ ఉమ్మడి తూర్పు గోదావరి, కాకినాడ జిల్లాలకు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు

రేడియేషన్ అంకాలజిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడుగా రాజునాయుడు



గుంటూరు మెడికల్: అసోసియేషన్ ఆఫ్ రేడియేషన్ అంకాలజిస్టస్ ఆఫ్ ఇండియా (ఏఆర్ఐవో) ఆంధ్రప్రదేశ్ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు జీజీహెచ్ మాజీ సూపరింటెండెంట్ డాక్టర్ దేవనబోయిన శౌరి రాజునాయుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజమండ్రిలో శనివారం అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డాక్టర్ రాజునాయుడు జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా నాలుగేళ్లు పనిచేసి ఆయన పరిపాలన కాలంలో రాష్ట్రంలోనే మొట్టమొదటి నాట్కో క్యాన్సర్‌సెంటర్ ఏర్పాటుకు విశేష కృషి చేశారు. డాక్టర్ రాజునాయుడుకు గుంటూరుకు చెందిన పలువురు క్యాన్సర్ వైద్య నిపుణులు అభినందనలు తెలిపారు.

పోలీసులపై దాడి కేసులో ఏడుగురి అరెస్ట్

పుంగనూరు(చిత్తూరు జిల్లా): పుంగనూరులో ఆగస్టు 4న చంద్రబాబు పర్యటనలో పోలీసులపై దాడి చేసిన కేసులో సోమవారం పోలీసులు ఏడుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో పరారీలో ఉన్న వనమలదిన్నెకు చెందిన మధుకుమార్, మునెప్ప, రాజేంద్రలను సీఐ రాఘవరెడ్డి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అలాగే పట్టణానికి చెందిన సయ్యద్, ప్రసాద్, సోమల మండలానికి చెందిన మునిరాజ, సుగాలిమిట్టకు చెందిన రూపేంద్రనాయక్‌లను కూడా అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

కుటుంబాన్ని బలిగొన్న అప్పులు

- రైలు కిందపడి దంపతులు, కుమార్తె ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన కుటుంబం

తుమకూరు: అప్పుల బాధను తట్టుకోలేక రైలు కింద పడి తల్లిదండ్రులు, కూతురు ఆత్మహత్య చేసుకున్న ఘటన కర్ణాటకలోని తుమకూరు జిల్లా పండితనహళ్ళి వద్ద సోమవారం ఉదయం జరిగింది. సిద్ధగంగయ్య (62), భార్య సునందమ్మ (57), కుమార్తె గీత (38) మృతులు. వివరాలు.. తుమకూరు దగ్గర ఉన్న మరళూరునికి చెందిన సిద్ధగంగయ్య విద్యుత్ శాఖలో చిరుద్యోగిగా పనిచేసి రిటైరయ్యాక కుటుంబంతో కలిసి బెంగళూరులోని కేసీ జనరల్ ఆస్పత్రి వద్ద టీ హోటల్ నిర్వహిస్తున్నాడు. కుమార్తె గీత పెళ్లయినా, తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో సిద్ధగంగయ్య పెద్దమొత్తంలో అప్పులు చేశాడు. అప్పు తీర్చాలని రుణదాతలు ఒత్తిడి చేయడంతో, చెల్లించే దారి కనిపించక కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకుని పండితనహళ్లికి వచ్చారు. నిర్మానుష్య ప్రాంతంలో ఓ రైలు కింద పడడంతో వారి శరీర భాగాలు విసిరేసినట్లు పడిపోయాయి.

'నాయీబ్రాహ్మణులను పాలకులుగా మార్చిన జగన్'



యానాదయ్యను సత్కరిస్తున్న న్యూస్ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేవాలయాల్లో సేవకులుగా ఉన్న నాయీ బ్రాహ్మణులను పాలకులుగా మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ సిద్ధవటం యానాదయ్య అన్నారు. 52 ఏళ్ల టీటీడీ పాలకవర్గంలో తొలిసారిగా నాయీబ్రాహ్మణులకు స్థానం లభించిందని చెప్పారు. సోమవారం విజయవాడలోని ఐలాపురం రామ ఫంక్షన్ హాలులో నాయీబ్రాహ్మణ ఎంప్లాయీస్ వెల్ఫేర్ సర్వీస్ (ఎన్ఈడబ్ల్యూఎస్) ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ సామాజికవర్గంలో ఉన్నత పదవులు అలంకరించిన వారి ఆత్మీయ సత్కార కార్యక్రమం జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యుడు సిద్ధవటం యానాదయ్య, ఆంధ్రరత్న అవార్డు గ్రహీత డాక్టర్ ఎం. ప్రభాకర్, హోం మినిస్టర్ మెడల్ గ్రహీత ఉప్పుటూరి రవిచంద్రను ఘనంగా సత్కరించారు.

అవన్నీ మీ 'బాబు' బ్రాండ్లే..

మీ మైండ్‌సెట్‌లోనే 'నాణ్యత' లోపించింది రామోజీ..

రాష్ట్రంలో మద్యం డిస్టిలరీలకు అనుమతిచ్చిందే చంద్రబాబు

సాక్షి, అమరావతి: చంద్రబాబు అధికారం కోల్పోతేనే ఈనాడు రామోజీరావు గంగ వెర్రులెత్తిపోతారు. అలాంటిది ఇక అవినీతి కేసుల్లో ఆధారాలతో సహా అడ్డంగా దొరికి తన ఆత్మబంధువు జైలుకెళ్తే ఇక రామోజీ మామూలుగా ఉంటారా.. కల్లు తాగిన కోతిలా తయారై తన కలంతో విషం కక్కుతారు. ఇప్పుడు అయన పూనకం వచ్చినట్లుగా అదే చేస్తున్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా అమలుచేస్తున్న దశలవారీ మద్య నియంత్రణ విధానంపై తెగ దుష్ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో రోజురోజుకు జనాదరణ పెంచుకుంటున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై అక్కసు వెళ్లగక్కుతున్నారు. అందులో భాగంగానే రాష్ట్రంలో ప్రభుత్వ మద్యం దుకాణాల్లో నాణ్యమైన మద్యం విక్రయించడంలేదని మరో అవాస్తవ కథనాన్ని ప్రచురించి ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు ఈనాడు ఎప్పటిలాగే మరోసారి బరితెగించింది. ఇటువంటి టీడీపీ, ఈనాడు దుష్ప్రచారాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసెంబ్లీ వేదికగానే గతంలో ఎన్నోమార్లు సమర్థంగా తిప్పికొట్టింది. అయినప్పటికీ రామోజీ తన వంకర బుద్ధిని మార్చుకోకుండా రాష్ట్ర ప్రభుత్వంపై విద్వేషాన్ని వెళ్లగక్కుతునే ఉన్నారు. అందుకే మరోసారి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలనే ఉద్దేశంతోనే ఈ ఫ్యాక్ట్‌చెక్..

బాబు హయాంలోనే పచ్చ సిండికేట్ దోపిడీ..

రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సిండికేట్ మొత్తం ఆ పార్టీ నేతల గుప్పెట్లోనే ఉండేది. బడి పక్కన, గుడి పక్కన అనే విచక్షణ కూడా లేకుండా ఎక్కడపడితే అక్కడ మద్యం దుకాణాలకు అనుమతులిచ్చేసి.. పర్మిట్ రూమ్‌ల పేరుతో అనధికారిక బార్లను తెరిచేసి.. మరో 43వేల బెల్ట్ దుకాణాలను ఏర్పాటుచేసి మరీ మద్యాన్ని ఏరులై పారించారు. ఈ మద్యం దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే మద్యం బాటిల్‌పై రూ.10 నుంచి రూ.25 వరకు అధిక ధరకు విక్రయించినా అడిగే నాథుడే లేకుండాపోయారు. ఆనాడు మద్యం దందాపై కిమ్మనకుండా ఈనాడు సహకరించిందన్నది బహిరంగ రహస్యం.

ఆ బ్రాండ్లన్నీ తెచ్చింది చంద్రబాబే..

నిజానికి.. రాష్ట్రంలో మద్యం బ్రాండ్లపై ఈనాడు ఇప్పుడు నీతులు చెబుతుండటం విడ్డూరంగా ఉంది. వివిధ మద్యం బ్రాండ్ల పేర్లను ఉదాహరిస్తూ వాటితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని మొసలి కన్నీరు కారుస్తోంది. కానీ, అవన్నీ చంద్రబాబు బ్రాండ్లనే వాస్తవాన్ని రామోజీరావు ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతున్నారు. అప్పటివరకూ కనిపించని... వినిపించని మద్యం బ్రాండ్లన్నీ కూడా రాష్ట్రంలోకి తీసుకొచ్చింది చంద్రబాబే అన్నది నిఖార్సైన నిజం. సంధి ప్రేలాపనలు పేలుతున్న రామోజీ.. ఆ వివరాలు ఇవిగో..

- ప్రెసిడెంట్ మెడల్, హైదరాబాద్ బ్లూడీలక్స్ బ్రాండ్ల విస్కీకి చంద్రబాబు సీఎంగా ఉండగానే 2017 నవంబరు 22న అనుమతిచ్చారు.
- గవర్నర్ రిజర్వ్, లెఫైర్ నెపోలియన్, ఒక్టోస్ బారెల్ ఏజ్డ్, సెవెన్త్ హెవెన్ బ్లూ బ్రాండ్ల పేరుతో విస్కీ, బ్రాందీ తదితర 15 బ్రాండ్లకు కూడా టీడీపీ ప్రభుత్వమే 2018 అక్టోబరు 26న ఒకేసారి అనుమతులిచ్చింది.
- హైవోల్టేజ్, వోల్టేజ్ గోల్డ్, ఎస్ఎన్‌జీ 10000, బ్రిటీష్ ఎంపైర్ సూపర్ స్ట్రాంగ్ ప్రీమియం బీర్, బ్రిటీష్ ఎంపైర్ అల్ట్రా బ్రాండ్లతో బీరు విక్రయాలు సైతం చంద్రబాబు నిర్వాకమే. ఆ బ్రాండ్లకు టీడీపీ ప్రభుత్వం 2017 జూన్ 7న అనుమతి జారీచేసింది.
- రాయల్ ప్యాలెస్, న్యూకింగ్, సైన్ అవుట్ పేర్లతో విస్కీ, బ్రాందీ బ్రాండ్లకు కూడా రామోజీ పార్ట్‌నర్ చంద్రబాబే 2018 నవంబరు 9న అనుమతిచ్చారు.
- బిరా 91 పేరుతో మూడు రకాల బీర్ బ్రాండ్లకు అనుమతులు ఎప్పుడు ఇచ్చారో తెలుసా రామోజీ.. 2019 మే 14న మీ చంద్రబాబు ప్రభుత్వమే. అప్పటికి ఇంకా రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టలేదు.
- ఆ మర్నాడే టీఐ మ్యాన్షన్ హౌస్, టీఐ కొరియర్ నెపోలియన్ విస్కీ, బ్రాందీ బ్రాండ్లకూ టీడీపీ సర్కారే అనుమతినిచ్చిందన్నది పచ్చి నిజం.

డిస్టిలరీలకు అనుమతులిచ్చింది ఆయనే రామోజీ..

ఇక రాష్ట్రంలో మద్యం తయారుచేస్తున్న డిస్టిలరీలన్నింటికీ అనుమతులిచ్చింది చంద్రబాబు ప్రభుత్వమే. రాష్ట్రంలో 20 మద్యం డిస్టిలరీలు ఉంటే వాటిలో 14 డిస్టిలరీలకు చంద్రబాబు సీఎంగా ఉండగానే అనుమతినిచ్చారు. మిగిలిన 6 డిస్టిలరీలకు అంతకుముందు ప్రభుత్వాలు అనుమతినిచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొత్తగా ఒక్క డిస్టిలరీకి కూడా అనుమతి ఇవ్వలేదు. అంటే టీడీపీ నేతలకు చెందిన కంపెనీలకే చంద్రబాబు అనుమతులిచ్చారు. ప్రస్తుతం చంద్రబాబు సన్నిహితుల కంపెనీలే మద్యాన్ని తయారుచేస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ ప్రస్తుతం కూడా ఆ డిస్టిలరీలు తయారుచేస్తున్న మద్యాన్నే రాష్ట్రంలో విక్రయిస్తున్నారు. అయినా సరే టీడీపీ అధికారంలో ఉంటే మద్యం నాణ్యమైనదీ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉంటే మద్యంలో నాణ్యతలేదని దుష్ప్రచారం చేయడం ఈనాడుకే చెల్లింది.

ప్రతీ డిస్టిలరీకి సమాన అవకాశాలు..

అలాగే, మద్యం తయారీ కూడా అప్పట్లో మాదిరిగా ఒకే డిస్టిలరీకి 50శాతం ఆర్డర్ ఇచ్చేయకుండా ప్రతీ డిస్టిలరీకీ సమానంగా అవకాశం వచ్చేలాగా.. 4–6 శాతం ఉండేలా తయారీ ఆర్డర్లు ఇస్తున్నారు. మరి ఈ పరిస్థితుల్లో మీకు ఎక్కడ తప్పు కనిపిస్తోంది?.. ఎక్కడ నాసిరకం ఉంది రామోజీ?



మద్యం డాన్ చంద్రబాబే..

రాష్ట్రంలో మద్యం డాన్ చంద్రబాబే అన్న వాస్తవాన్ని రామోజీరావు ఉద్దేశపూర్వకంగానే విస్మరిస్తున్నారు. రాష్ట్రంలో 20 డిస్టలరీలు ఉంటే.. అందులో 14 చంద్రబాబు హయాంలోనే అనుమతులిచ్చారు. మరి మద్యం డాన్ చంద్రబాబే కదా రామోజీ. పైగా.. రాష్ట్రంలోని ఈ డిస్టిలరీలన్నీ దాదాపుగా టీడీపీ కీలక నేతల కుటుంబాల చేతుల్లోనే ఉన్నాయి. పీఎంకే డిస్టిలరీ టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేశ్‌కు మార్‌ది. ఆయన టీడీపీ నేత పుట్టా మధుసూదన్ యాదవ్‌కు కుమారుడు కూడా.

- శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజస్ టీడీపీ మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవుల నాయుడు కుటుంబానిది.
- ఎస్పీవై ఆగ్రో ప్రొడక్ట్స్ టీడీపీ నేత, మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుటుంబానిది. వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీగా గెలిచిన ఎస్పీవై రెడ్డిని నిబంధనలకు విరుద్ధంగా టీడీపీలో చేరినందుకు నజరానాగా ఆ డిస్టిలరీకి చంద్రబాబు అనుమతిచ్చారు.
- ఇక బాబు ప్రభుత్వం 2019 ఎన్నికలకు ముందు ఆగమేఘాల మీద 2019, ఫిబ్రవరి 25న అనుమతినిచ్చిన విశాఖ డిస్టిలరీస్‌లో టీడీపీ సీనియర్ నేత అయ్యన్నపాత్రుడు వాటాదారుగా ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో దశలవారీ మద్య నియంత్రణ..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దశల వారీగా మద్య నియంత్రణ విధానాన్ని సమర్థంగా అమలుచేస్తోంది. ఇందుకోసం...

- టీడీపీ హయాంలో ప్రైవేట్ మద్యం దుకాణాలు ఉ.10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు విక్రయాలు సాగించేవి. అనధికారికంగా 24 గంటలూ విక్రయిస్తూ ఉండేవి. కానీ, ఇప్పుడు సమయాన్ని కుదించి కచ్చితంగా అమలుచేస్తున్నారు. ఉ.10 నుంచి రాత్రి 9 గంటల వరకే విక్రయాలకు అనుమతించారు.
- బెల్ట్ షాపులు, పర్మిట్ రూమ్‌లు రద్దుచేశారు.

మద్యం నాణ్యతపై ఈనాడు దుష్ప్రచారం

ఈనాడు కుట్రపూరితంగా సాగిస్తున్న మరో దుష్ప్రచారం ఏమిటంటే...రాష్ట్రంలో మద్యం నాణ్యత లేదని.. విషపు అవశేషాలు ఉన్నాయని చెన్నైలోని ఎస్‌జీఎస్ ల్యాబొరేటరీ పేరిట ఓ అబద్ధపు నివేదికను ప్రచారంలోకి తీసుకొచ్చింది. కానీ, ఈనాడు కుట్ర బెడిసికొట్టింది. తాము అసలు అలాంటి నివేదికే ఇవ్వలేదని ఆ సంస్థ స్పష్టంచేసింది. తాము పరీక్షించిన మద్యం నమూనాల్లో అవశేషాలు పరిమితికి లోబడే ఉన్నాయని, అవి ప్రమాదకరంకాని సహజసిద్ధమైన మొక్కల నుంచి తయారైనవేనని స్పష్టంచేసింది. తమ నివేదికను తప్పుగా అన్వయించారని చెప్పింది. అయినా సరే రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ రాష్ట్రంలో మద్యం నమూనాలను హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ల్యాబ్‌లో పరీక్షించింది. ఆ నమూనాలన్నీ నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే ఉన్నాయని నివేదిక ఇచ్చింది. మద్యం నాణ్యతపై ఆరోపణల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పింది.

చంద్రబాబు హయాంలో ప్రైవేటు మద్యం దుకాణాలకు అనుబంధంగా 43 వేల బెల్ట్ దుకాణాలు ఉండేవి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే వాటన్నింటినీ పూర్తిగా తొలగించింది. అలాగే, గతంలో మద్యం దుకాణాలకు అనుబంధంగా పర్మిట్ రూమ్‌లను అనుమతించారు. అవి అనధికారికంగా బార్లగా చలామణి అయ్యేవి. వాటినీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాగానే రద్దుచేసింది.

- దుకాణాలనూ కుదించారు. టీడీపీ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ఉండగా ఇప్పుడు 2,934కి తగ్గిపోయాయి. ఈ సంఖ్యను ఇంకా తగ్గించే ఉద్దేశంలో ప్రభుత్వం ఉంది. ఇక బార్ల సంఖ్యను పెంచలేదు. 2019లో ఖరారుచేసిన 840 బార్లే ఉన్నాయి. కొత్త బార్లకు లైసెన్సులివ్వలేదు.
- షాక్ కొట్టేలా ధరలు పెంచారు. మద్యం విక్రయాలను నిరుత్సాహపర్చడమే తమ పార్టీ విధానమని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో చాలాసార్లు చెప్పారు. విక్రయాలను ప్రోత్సహించి సొమ్ము చేసుకోవడం తమ లక్ష్యం కాదని స్పష్టం చేశారు. అందుకే అధికారంలోకి వచ్చాక మద్యం ధరలను షాక్ కొట్టేలా పెంచారు. అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ) పన్నునూ విధించారు. దీంతో మద్యం ధరలు పెరిగాయి. మద్యపాన వ్యసనాన్ని నిరుత్సాహ పరిచేందుకు విధించిన ఏఆర్ఈటీ పన్నుతో రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తున్నా వాస్తవానికి మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. ఫలితంగా పేదలు ఈ వ్యసనానికి క్రమంగా దూరమవుతున్నారు.
- మరోవైపు.. అమ్మకాలూ భారీగా తగ్గాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలిస్తున్నాయనడానికి ఇదే ఉదాహరణ. రాష్ట్రంలో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. టీడీపీ హయాంతో పోలిస్తే రాష్ట్రంలో ప్రస్తుతం మద్యం విక్రయాలు సగానికి పడిపోయాయి. అందుకు గణాంకాలే తార్కాణం.

రాష్ట్రంలో మద్యం తయారీకి డిస్టిలరీలు ఎప్పుడెప్పుడు అనుమతులు పొందాయంటే..

1. కాంటినెంటల్ వైన్స్, ఆటోనగర్, విజయవాడ, 1971, ఆగస్టు 9
2. బీఆర్కే స్పిరిట్స్, కంకిపాడు, కృష్ణాజిల్లా, 1998, సెప్టెంబరు 15
3. పెర్ల్ డిస్టిలరీ లిమిటెడ్, సింగరాయకొండ, ప్రకాశం జిల్లా, 1997, ఆగస్టు 14
4. సోరింగ్ స్పిరిట్స్ ప్రైవేట్ లిమిటెడ్, చేబ్రోలు, తూ.గోదావరి జిల్లా, 2007, నవంబరు 7
5. సెంటిని బయో ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, గండేపల్లి, కృష్ణాజిల్లా 2010, జూన్ 9
6. బీవీఎస్ డిస్టిలరీస్, కంకిపాడు, కృష్ణాజిల్లా, 2017, జనవరి 2
7. శ్రావణి ఆల్కో బ్రూ ప్రైవేట్ లిమిటెడ్, గంపలగూడెం, కృష్ణాజిల్లా, 2017, సెప్టెంబరు 29
8. గౌతమి ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్, వంగూరు, ప.గోదావరి జిల్లా, 1997, నవంబరు 17
9. జీఎస్‌బీ అండ్ కో, కశింకోట, విశాఖపట్నం జిల్లా, 2008
10. బీడీహెచ్ ఆగ్రో వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్, కొప్పరం, తూ.గోదావరి జిల్లా, 2017, ఆగస్టు 25
11. విశాఖ డిస్టిలరీస్, కశింకోట, విశాఖపట్నం జిల్లా, 2019, ఫిబ్రవరి 25
12. పీఎంకే డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, కశింకోట, విశాఖపట్నం జిల్లా, 2017, అక్టోబరు 23
13. ఈగిల్ డిస్టిలరీస్, తాడిగొట్ల, కడప, 1974, అక్టోబరు
14. ఎస్వీఆర్ డిస్టిలరీస్, తిరుపతి, 1982
15. శ్రీకృష్ణా ఎంటర్‌ప్రైజెస్, తిమ్మ సముద్రం, చిత్తూరు జిల్లా, 1998, జులై
16. ఎస్ఎన్‌జే సుగర్స్, ప్రొడక్ట్స్, వెంకటాచలం, నెల్లూరు జిల్లా, 2018, మే
17. మోహన్ బేవరేజస్ అండ్ డిస్టిలరీస్ లిమిటెడ్, పల్లూరు, చిత్తూరు జిల్లా, 1978
18. ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్, నంద్యాల, కర్నూలు జిల్లా, 2016, సెప్టెంబరు
19. ఖోడేస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కుప్పం, చిత్తూరు జిల్లా, 1970
20. ప్రాగ్ డిస్టిలరీస్ ప్రైవేట్ లిమిటెడ్, నల్లమిల్లి, తూ.గోదావరి జిల్లా, 1997, మార్చి 31.



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు

గ్రామ స్వరాజ్యానికి నాలుగేళ్లు

సీఎంకు జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగుల కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: గ్రామ, వార్డు సచివాలయ (జీఎస్‌డబ్ల్యూఎస్) వ్యవస్థ ద్వారా సమర్థమైన సేవలను ప్రారంభించి సోమవారానికి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా జీఎస్‌డబ్ల్యూఎస్ ఉద్యోగులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వాతంత్ర భారతావనిలో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని తీసుకొచ్చిన సంక్షేమరాజ్య నిర్మాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే నోటిఫికేషన్ ఇచ్చి.. 1.30 లక్షలకుపైగా యువతకు శాశ్వత ఉద్యోగాలు కల్పించారని కొనియాడారు. పేదలకు సంక్షేమ ఫలాలను పారదర్శకంగా అందించడంలో తమను భాగస్వాముల్ని చేయడంపై జీఎస్‌డబ్ల్యూఎస్ రాష్ట్ర నాయకులు బత్తుల అంకమ్మరావు, నిఖిల్‌కృష్ణ, కిషోర్ సంతోషం వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో 53 చోట్ల ఎన్ఐఏ సోదాలు

- పలు సంఘాల నేతల నివాసాల్లో తనిఖీలు.. మావోయిస్టులతో సంబంధాలపై ఆరా

సాక్షి, అమరావతి: జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు సానుభూతిపరులు, మద్దతుదారులు, పౌరహక్కుల నేతల నివాసాల్లో సోమవారం సోదాలు చేసింది. విప్లవ రచయితల సంఘం (విరసం), మానవహక్కుల సంఘం, రాష్ట్ర పౌరహక్కుల సంఘం, అమరుల బంధుమిత్రుల సంఘం, చైతన్య మహిళా సంఘం, కులనిర్మూలన పోరాట సమితి, పేట్రియాటిక్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్, ప్రగతిశీల కార్మిక సమాఖ్య, ప్రజాకళా మండలి, ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ పీపుల్స్ లాయర్స్ తదితర సంఘాల నేతల నివాసాల్లో విస్తృతంగా సోదాలు నిర్వహించింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే కోణంలో 53 నివాసాల్లో నిర్వహించిన ఈ సోదాల్లో ఒక నాటు తుపాకీ, 14 రౌండ్ల బుల్లెట్లతోపాటు మావోయిస్టు సాహిత్యాన్ని స్వాధీనం చేసుకుంది. శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కూటగల్లులోని రాష్ట్ర ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.చంద్రనర్సింహులు ఇంట్లో నాటు తుపాకీ, 14 రౌండ్ల బుల్లెట్లను ఎన్ఐఏ అధికారులు స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. కడపలోని ఒక ఇంట్లో రూ.13 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టు సానుభూతిపరులుగా పేర్కొంటూ పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మరికొందరిని హైదరాబాద్‌లోని ఎన్ఐఏ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చారు. ఎన్ఐఏ అధికారులు గుంటూరు జిల్లాలో 13 ఇళ్లలోను, శ్రీకాకుళం జిల్లాలో ఎనిమిది, ఎన్టీఆర్ జిల్లాలో ఆరు, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో నాలుగేసి, విశాఖపట్నం, కర్నూలు, నెల్లూరు జిల్లాల్లో మూడేసి, తూర్పుగోదావరి జిల్లాలో రెండు, విజయనగరం, శ్రీసత్యసాయి, ఏలూరు, తిరుపతి, పల్నాడు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, బాపట్ల జిల్లాల్లో ఒక్కో ఇంట్లో సోదాలు నిర్వహించారు. 2020లో అల్లూరి సీతారామరాజు జిల్లాలో పోలీసులు నమోదు చేసిన కేసు ఆధారంగా ఎన్ఐఏ ఓ కేసు నమోదు చేసి 2021 మే నెలలో చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఆ కేసు దర్యాప్తులో భాగంగా ఈ సోదాలు నిర్వహించినట్టు ఎన్ఐఏ సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది.

25 వేల సెల్ఫీలు: స్వచ్ఛతా హీ సేవ

- ఏలూరుకు మూడు రికార్డులు
- ఏషియన్, ఇండియన్, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో నమోదు



రికార్డులను మేయర్ నూర్జహాన్‌కు అందిస్తున్న దృశ్యం

ఏలూరు టౌన్: ఏలూరు నగరం మూడు రికార్డులు సొంతం చేసుకుంది. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా మెగా సెల్ఫీ శిబిరంలో రికార్డులు తిరగరాశారు. ఐదువేల మందితో మెగా సెల్ఫీ లక్ష్యంగా పెట్టుకోగా.. ఏకంగా 25 వేల సెల్ఫీలతో రికార్డులు నమోదయ్యాయి. తద్వారా ఏషియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, ఇండియన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులను ఏలూరు నగరపాలక సంస్థ సొంతం చేసుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నగరాల్లో చేపట్టిన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు చేపట్టాయి. దీనిపై ఏలూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరంలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛతా హీ సేవ మెగా సెల్ఫీ క్యాంపును సోమవారం ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో నిర్వహించారు. మొత్తం 25 వేల సెల్ఫీలతో ఏలూరు నగరపాలక సంస్థ అగ్రభాగాన నిలిచి మూడు రికార్డులను సాధించింది. ఈ అద్భుతమైన రికార్డు నమోదుపై మేయర్ షేక్ నూర్జహాన్ సంతోషం వ్యక్తం చేశారు. ఇది ఏలూరు నగరాభివృద్ధికి విశేషకృషి చేస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని నాయకత్వంలో ప్రతి ఒక్కరి విజయంగా భావిస్తున్నామని తెలిపారు. త్యాగమూర్తి గాంధీజీకి నివాళిగా ఈ రికార్డును నగర ప్రజలకు అంకితం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ సుధీర్‌బాబు, కమిషనర్ వెంకటకృష్ణ, డిప్యూటీ కమిషనర్ ఎన్.రాధ, అసిస్టెంట్ కమిషనర్ బాపిరాజు, ఎంహెచ్‌వో డాక్టర్ మాలతి, కోఆప్షన్ సభ్యులు నీతా జైన్ తదితరులు పాల్గొన్నారు.



ఇండోనేషియాలో ఉన్న సముద్ర ప్రహరీతో నేవీ అధికారులు

జకార్తాలో కాలుష్య నియంత్రణ నౌక సముద్ర ప్రహరీ

సింధియా (విశాఖ పశ్చిమ): సముద్ర కాలుష్య సమస్యలను పరిష్కరించడంలో భారతదేశం నిబద్ధతకు నిదర్శనమైన ఇండియన్ కోస్ట్‌గార్డ్‌కు చెందిన సముద్ర కాలుష్య నియంత్రణ నౌక సముద్ర ప్రహరీ ఇండోనేషియాలోని జకార్తాలో గల తాన్‌జంగ్ ప్రియోక్‌కు చేరుకుంది. ఈ నౌక భాగస్వామ్య దేశాలతో సహకారాన్ని అందిస్తూ పునీత్‌సాగర్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీచ్ క్లీనప్ కార్యకలాపాలపై దృష్టి సారిస్తుంది. సముద్ర ప్రహరీ నౌక జకార్తాలో ఉన్న నాలుగు రోజులు ఐసీజీ షిప్ బకమ్లాతో ప్రొఫెషనల్ ఎక్స్ఛేంజీలు, క్రాస్‌డెక్ విజిట్‌లు, టేబుల్ టాప్ వ్యాయామాలు, పొల్యూషన్ రెస్పాన్స్ ప్రదర్శనలు, జాయింట్ యోగా సెషన్‌లు, కెపాసిటీ బిల్డింగ్ సౌకర్యాల సందర్శనలతో సహా అధికారిక సామాజిక కార్యక్రమాల్లో పాల్గొంటుంది. అంతర్జాతీయ స్థాయిలో కాలుష్య ప్రతిస్పందన సామర్థ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా సముద్ర ప్రహరీ నౌక గతంలో థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో పోర్ట్ కాల్ చేసింది.

'ఎస్కీ'లో మరో కొత్త కోర్సుకు శ్రీకారం

ఈ విద్యా సంవత్సరం నుంచే పీజీడీఎం ఇన్ ఆర్బిట్రేషన్ కోర్సు

రాయదుర్గం (హైదరాబాద్): ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో మరో కొత్త కోర్సును ప్రారంభించనున్నారు. 2023–24 విద్యాసంవత్సరం నుంచే ఈ కొత్త కోర్సును అమలులోకి తీసుకు రావాలని నిర్ణయించారు. ఇటీవల జేఎన్‌టీయూ–హైదరాబాద్‌తో చేసుకున్న ఒప్పందం ఆధారంగా పీజీడీఎం ఇన్ ఆర్బిట్రేషన్ పేరిట కొత్త కోర్సును నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో 60 సీట్లు మాత్రమే ఉంటాయి. కోర్సులో చేరేందుకు బ్యాచిలర్స్ డిగ్రీ లేదా ఇతర సమానమైన డిగ్రీ ఉత్తీర్ణులైనవారికి అవకాశం కల్పిస్తారు. డిగ్రీ ఫైనల్ పరీక్షలు రాసే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కాగా, ఆర్బిట్రేషన్ రంగంలో అపార అవకాశాలుంటాయని 'ఎస్కీ' డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వరరావు తెలిపారు. ఈ రంగంలో నిపుణులను తయారు చేసేందుకు ఈ కోర్సును అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు.

ప్రవాసాంధ్ర భరోసా బీమాతో కుటుంబాలకు ధీమా

- గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఇలియాస్ తదితరులు

కడప కార్పొరేషన్: ప్రవాసాంధ్ర భరోసా బీమాతో విదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రుల కుటుంబాలకు ధీమా అని గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ అన్నారు. సోమవారం యూఏఈలోని దుబాయ్, కారామా ప్రాంతాల్లో ఉన్న ఉభయ గోదావరి జిల్లాలకు చెదిన 150 కుటుంబాల వారికి సామాజిక కార్యకర్త తాడిపట్ల మోహన్, ఏపీఎన్ఆర్‌టీఎస్ ఆధ్వర్యంలో బీమా చేయించారు. ప్రవాసాంధ్రుల సంక్షేమం కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషిని వారికి వివరించారు. ఇలియాస్ మాట్లాడుతూ ఎడారి దేశమైన యూఏఈకి జీవనోపాధి కోసం వచ్చిన తెలుగువారు ఇరుకు గదుల్లో చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. అయినప్పటికీ ప్రతి గదిలో ఏపీ సీఎం వైఎస్ జగన్ ఫొటో ఉండటం గొప్ప విషయమన్నారు. బీమా చేయించుకున్న వారు దురదృష్టం కొద్దీ ప్రమాదంలో మరణించినా, శాశ్వత అంగవైకల్యం కలిగినా ఆ కుటుంబాలకు రూ.10లక్షల నష్టపరిహారం లభిస్తుందని తెలిపారు. అస్వస్థతకు గురై ప్రమాదం వల్ల సంభవించే గాయాలకు లక్ష రూపాయలు, మహిళల సాధారణ ప్రసూతికి రూ.35వేలు, సిజేరియన్ ఆపరేషన్‌కు రూ.50వేలు చెల్లిస్తారన్నారు. బీమాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఎన్ఆర్‌టీఎస్ రీజనల్ కో–ఆర్డినేటర్ ప్రసన్న సోమిరెడ్డి, యూఏఈ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ సయ్యద్ అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.